ఈనాడు

హైదరాబాద్ 22-10-2024 మంగళవారం సిటీ సంపుటి 51. సంచిక 72

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

విద్రోహులపై కఠిన వైఖరే

బాధితులకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్ ● అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్'

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అమరులైన పోలీసుల కుటుంబాలకు పరిహారం పెంచుతున్నట్లు ప్రకటన

ఈనాడు, హైదరాబాద్: పోలీస్ ఉద్యోగమంటే భావోద్వేగంతో కూడిన బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మెరుగైన జీవితం, జీతాన్ని కాదనుకొని ఐఐటీల్లో చదివిన, ఎంటెక్ పూర్తి చేసిన ఎంతోమంది యువత పోలీసు శాఖలో చేరటం గొప్ప పరిణామమని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం హైదరాబాద్ గోషామహల్ పోలీస్ శిక్షణ కేంద్రంలో అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఆయన నివాళులర్పించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సీఎం మాట్లాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలన్నా శాంతిభద్రతలు కీలకమని అన్నారు. శాంతియుత వాతావరణాన్ని కలుషితం చేసేలా ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే వారి విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ...మిగతా 14లో



యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ శాంతికుమారి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

పోలీస్ పాఠశాలకు సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ

- మంచిరేవులలోని గ్రేహౌండ్స్ క్యాంపస్‌లో నిర్మాణం
- స్థానికులకు 15 శాతం సీట్లు: మంత్రి శ్రీధర్‌బాబు

14లో



దక్షిణకొరియా రాజధాని సియోల్‌లోని చుంగేచాన్‌లో ప్రవహిస్తున్న మంచినీరు

సియోల్‌లో చుంగేచాన్ హొయలు

అంతరించిన ఉప నదికి 2005లో పునరుజ్జీవం

- మురుగు పారిన చోటే నేడు మంచినీటి ప్రవాహం
- సమూలంగా మారిన నగర జీవావరణం
- పరిశీలించిన రాష్ట్ర బృందం

సియోల్ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

అది దక్షిణకొరియా రాజధాని సియోల్.. సమయం సోమవారం మధ్యాహ్నం 12 గంటలు.. నగరం నడిబొడ్డున 10 కి.మీ. పొడవున్న చుంగేచాన్ ఉప నది పరీవాహక ప్రాంతం చుట్టూ వందల సంఖ్యలో ఆకాశ హర్మ్యాలతో అలరారుతోంది.. వేల మంది పర్యాటకులతో సందడి నెలకొంది.. గతంలో ఇక్కడ సహజ ప్రవాహం ఉండేది.. కాలక్రమంలో అదంతా ఒక మురికి కూపంగా, తర్వాత పది లేన్ల రహదారిగా, కాంక్రీటు జంగిల్‌గా మారిపోయింది.. ప్రస్తుతం పునరుజ్జీవం చెంది... కోటి మందికిపైగా జనాభా ఉన్న సియోల్ రూపురేఖలను సమూలంగా మార్చేసింది.. ...మిగతా 2లో

మూసీ పునరుజ్జీవ పథకానికి 'చుంగేచాన్' మార్గదర్శకం

- మంత్రులు పొంగులేటి, పొన్నం

2లో

ఉత్కంఠ నడుమ

గ్రూప్-1 మెయిన్స్ షురూ..

- తొలిరోజు ప్రశాంతంగా పరీక్ష
- 72.44% మంది హాజరు
- కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత

ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-1 ప్రధాన పరీక్షలు (మెయిన్స్) కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షలను వాయిదా వేయాలని, జీవో 29ని రద్దు చేయాలని గత వారం రోజులుగా నిరుద్యోగ అభ్యర్థుల ఆందోళనలతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించడం.. ఆ పిటిషన్ సోమవారం విచారణకు రావడం.. అదే రోజు నుంచి ప్రధాన పరీక్షలు ప్రారంభం కానుండటంతో అభ్యర్థులతో పాటు టీజీపీఎస్సీ వర్గాల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు చెప్పడంతో సమస్యకు తెరపడింది. ...మిగతా 3లో

గ్రూప్-1 వాయిదాకు సుప్రీం నిరాకరణ

3లో

విద్యుత్ అంబులెన్సులు ప్రారంభం

- గ్రేటర్ హైదరాబాద్‌లో ఎక్కడ కరెంటు సరఫరా ఆగినా తక్షణం వస్తాయి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

12లో

ఛార్జీల పెంపు ప్రతిపాదనలను తిరస్కరించాలి

- ఈఆర్‌సీకి భారాస వినతి
- ఛైర్మన్‌ను కలిసిన మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేల బృందం

14లో

భారత్-చైనా గస్తీ దోస్తీ

- సరిహద్దు ఉద్రిక్తతలపై ఒప్పందం
- ఇక ఎల్‌ఏసీ వెంబడి 2020 నాటి పరిస్థితి
- బ్రిక్స్ సదస్సు వేళ కీలక పరిణామం

11లో

కొండెక్కిన వెండి

కిలో రూ.లక్ష



లో



ఆరోగ్యం ముందు ఏదీ తులతూగదు

ఎన్ని స్థిరాస్తులు, చరాస్తులు సంపాదించినా, వాటిని మనం నిజంగా అనుభవించేది సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నంతవరకే. ఇది తెలియక యువత ఇతరులతో పోటీగా డబ్బు సంపాదన కోసం వెంపర్లాడుతూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆ తర్వాత అదే డబ్బును ఆరోగ్యం కోసమే ఖర్చు పెట్టాల్సిన పరిస్థితిని తెచ్చుకుంటున్నారు. ఆరోగ్యం అన్నింటికన్నా విలువైనదని తెలుసుకోండి.

– శ్రీరామ్ రౌత్, సీఏ

సియోల్‌లో చుంగేచాన్ హొయలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ నగరాన్ని వాణిజ్య రంగంలో తలమానికంగా నిలిపింది. ప్రపంచ నగరాల్లో నీటివనరుల పునరుజ్జీవానికి ఒక పాఠంగా మారింది. మూసీ పునరుజ్జీవం కోసం కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా ఈ తరహా ప్రాజెక్టులను అధ్యయనం చేస్తోంది. అందులో భాగంగా మంత్రులు, ఉన్నతాధికారులతో కూడిన బృందం అక్కడ పరిశీలిస్తోంది. ఈ నేపథ్యంలో సియోల్ నుంచి 'ఈనాడు ప్రత్యేక ప్రతినిధి' అందిస్తున్న కథనం...

ఆరు శతాబ్దాల చరిత్ర

దక్షిణ కొరియాలో ప్రసిద్ధ నదిగా పేరొందిన హాన్‌కు చుంగేచాన్ ఉప నది. దీనికి ఆరు శతాబ్దాల చరిత్ర ఉంది. సియోల్ నగరాన్ని వరదల నుంచి కాపాడటానికి, ప్రజలను కాపాడటానికి 600 సంవత్సరాల క్రితం నాటి రాజు దీన్ని 10.9 కి.మీ. పొడవున పటిష్ఠం చేయించారు. ఇది ఒకరకంగా పెద్ద వాగు వంటిది. సమీపంలోని సుసేంగాంగ్ వ్యాలీలో కురిసే వర్షపు నీరు చుంగేచాన్ ద్వారా హాన్ నదిలో, తర్వాత ఎల్లో సముద్రంలో కలుస్తుంది. మొదట్లో దీనికి గేచ్యోన్ అని పేరుండేది. కొరియాను జపాన్ దేశం ఆక్రమించినపుడు చుంగేచాన్‌గా మార్చేశారు. ఇది కొరియాలో నదులకు సహజంగా పెట్టే పేరు.

ఆక్రమణలతో రూపం కోల్పోయి...

కొరియా యుద్ధం(1950-53) ముగిసిన తర్వాత దక్షిణ కొరియా పారిశ్రామికాభివృద్ధిపై దృష్టి పెట్టింది. ఇదే సమయంలో సియోల్‌లోని చుంగేచాన్ ఉపనది తన స్వరూపాన్ని కోల్పోయింది. ఇందులో చెత్తాచెదారం వేయడం, మురుగునీరు వదలడంతో 1960 వచ్చే నాటికి పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయింది. గట్టున పేదలు ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకున్నారు. చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఉప నది పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది.

కనిపించే ప్రవాహం... అంతర్ధానమైంది!

పెరుగుతున్న రవాణా అవసరాలు, ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని సియోల్ నగరం మధ్యలో నుంచి వెళ్తున్న చుంగేచాన్‌పై పది లేన్ల ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించారు. దీనిపై నిత్యం దాదాపు లక్షన్నర వాహనాలు ప్రయాణించేవి. మురుగు నీరు వెళ్లేలా భూగర్భంలో కాలువను ఏర్పాటు చేశారు. అంటే కళ్లకు కనిపించే ప్రవాహం... భూగర్భంలోకి మారిపోయింది. అసలక్కడ ఒక ప్రవాహం ఉండేదనే విషయమే తెలియకుండా పోయింది. వరదలు వచ్చినప్పుడు ముంపు సమస్య మొదలైంది.

అసాధారణం... మేయర్ లీ సంకల్పం

హ్యుందాయ్ కంపెనీలో ఇంజినీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ విభాగంలో సీఈవోగా పనిచేసిన లీ మ్యుంగ్ బాక్... 2002లో సియోల్ మేయర్‌గా ఎన్నికయ్యారు. అప్పటికే నగరం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. మరోవైపు ఉత్తర, దక్షిణ నగరాల మధ్య ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి. నగరంలో ఆహ్లాదకరమైన ప్రాంతమే లేకుండా పోయింది. దాంతో నగరంలో పర్యావరణాన్ని మెరుగుపరచడం, సియోల్ డౌన్‌టౌన్‌లో జీవన పరిస్థితులను మెరుగుపర్చడం, నగర ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య అభివృద్ధిలో ఉన్న తేడాను నిర్మూలించడం, సహజ, సాంస్కృతిక వారసత్వాన్ని పునరుద్ధరించడం, కొత్త పబ్లిక్ స్పేస్‌ను సృష్టించడం, ట్రాఫిక్ భద్రత, సామర్థ్యం పెంచడం లక్ష్యంగా... ఎక్స్‌ప్రెస్ హైవే స్థానంలో చుంగేచాన్ ఉపనదిని పునరుద్ధరించాలని సంకల్పించారు.

భగ్గుమన్న వ్యాపారులు... పర్యావరణవేత్తలు

చుంగేచాన్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అత్యధిక వ్యయంతో కూడుకున్న నదీ పునరుద్ధరణ ప్రాజెక్టుగా మారుతుందని, కొత్త నిర్మాణాలతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని కొందరు పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేశారు. పది లేన్ల ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ హైవేను తొలగిస్తే రోడ్డు సామర్థ్యం తగ్గి ట్రాఫిక్ సమస్యలు పెరుగుతాయని, నగర జీవనానికి ఆటంకాలు ఏర్పడతాయని హెచ్చరించారు. వ్యాపారులూ తీవ్రంగా వ్యతిరేకించారు. తాము ఇళ్లను కోల్పోతామని స్థానికులూ వాపోయారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టకుండా పునరుజ్జీవ పథకమేంటని వాదించారు. ఎందరు వ్యతిరేకించినా మేయర్ లీ మాత్రం పర్యావరణానికే మొదటి ప్రాధాన్యమని తేల్చిచెప్పారు. ఈ ప్రాజెక్టు చాలా వ్యయంతో కూడుకున్నదైనా, ప్రజలు ప్రతిరోజూ స్వచ్ఛమైన నీటిని చూస్తారని, సియోల్ విదేశీ పెట్టుబడులకు కేంద్రంగా మారుతుందని నమ్మకంగా ప్రకటించారు. నాలుగేళ్లలోనే హైవేను నదీ ప్రాంతంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేశారు. సియోల్‌కు పరిశుభ్రమైన, ఆకర్షణీయమైన అంతర్జాతీయ నగరంగా గుర్తింపు తెచ్చారు.

బాధిత ప్రాంతాల్లో 4వేల సార్లు పర్యటన

ఉప నదిని ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకున్న, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొంటున్న 3వేల కుటుంబాలు తాము నిరాశ్రయులం అవుతామంటూ ఆందోళనకు దిగాయి. దాంతో నిర్వాసితులకు సరైన పునరావాసం కల్పిస్తామని మేయర్ లీ హామీ ఇచ్చారు. వారికి భరోసా కల్పించడానికి స్వయంగా నాలుగు వేలసార్లు ఆ ప్రాంతంలో పర్యటించారు. వారితో స్వయంగా మాట్లాడారు. 1000 మందికి తక్షణ పునరావాసం కల్పించారు. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిరసనలు, ఆందోళనలు చేసిన వారందరినీ పనులు ప్రారంభమయ్యే 15 రోజుల ముందు మేయర్ ఒప్పించారని దీనిపై అధ్యయనం చేసిన ఓ పరిశోధకుడు వివరించారు.

రెండున్నరేళ్లలోనే నది పునరుద్ధరణ

మేయర్ లీ ఈ ప్రాజెక్టుకు ఆరు నెలల్లో డిజైన్లు పూర్తిచేయించారు. పది లేన్ల రహదారి, నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ ఇలా... మొత్తం 14లేన్ల హైవే, దాని కింద భారీ మురుగునీటి వ్యవస్థను తొలగించే పనులను 2003 ఫిబ్రవరిలో ప్రారంభించారు. ఏకంగా 1.70 లక్షల కార్లు, వాహనాల రాకపోకల కోసం ప్రత్యామ్నాయంగా 36 కి.మీ. పొడవున బి.ఆర్.టి. లైన్ నిర్మించారు. సుమారు 30కి పైగా వంతెనలు, దానికి రెట్టింపుగా అండర్ పాస్‌లు నిర్మించారు. నడకకు పూర్తి అనుకూలంగా మార్చేశారు. మొత్తంగా అంతర్ధానమైన ఉపనదిని 2005 సెప్టెంబరులో మళ్లీ కనిపించేలా చేశారు. ఇందుకోసం 281 మిలియన్ డాలర్లు అంటే... భారతీయ కరెన్సీలో రూ.2,362 కోట్లు ఖర్చు చేశారు. దీనికి అనుబంధంగా చేపట్టిన పనులతో మరింత వ్యయమైనట్లు అంచనా. చుంగేచాన్‌లో నీటిని నింపేందుకు హాన్‌నది నుంచి రోజుకు 90 వేల క్యూబిక్ మీటర్లు ఎత్తిపోశారు. ఇందులోని మురుగునీటిని శుద్ధిచేసిన తర్వాతే అతి కొద్ది మోతాదులో వదులుతున్నారు. ప్రస్తుతం అర్బన్ స్ట్రీమ్‌గా రూపుదాల్చిన ఈ మంచినీటి ఉపనదీ పరీవాహకమంతా వివిధ రకాల పక్షులతో జీవ వైవిధ్యానికి కేంద్రంగా మారింది. ప్రస్తుతం సియోల్ ఆకర్షణీయ నగరంగా తయారైంది.



చుంగేచాన్ పరీవాహక ప్రాంతం

పునరుజ్జీవ ప్రక్రియకు సాక్షిని నేను

ఒకప్పుడు ఈ ఉపనది మురికినీరు, చెత్తా చెదారం, వ్యర్థాలతో అధ్వానంగా, కళావిహీనంగా ఉండేది. పునరుజ్జీవం తర్వాత దీని స్వరూపమే మారిపోయింది. పర్యాటక కేంద్రంగా, కాలుష్య రహితంగా మారింది. ఈ ప్రాంతం ఎంతో అద్భుతంగా తయారైంది. సియోల్ వాణిజ్య రంగంలో రాణించడంలో కీలకంగా మారింది. ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం, తొలగింపు, ఉపనది పునరుద్ధరణ అంతా నా కళ్లముందే జరిగింది.

– లీ కెవిన్, షిప్పింగ్ ఏజెన్సీ నిర్వాహకుడు

ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులో ఐదుగురు మావోయిస్టుల మృతి

చర్ల, న్యూస్‌టుడే: నారాయణపుర్-దంతెవాడ సరిహద్దులో భద్రతా బలగాల కాల్పుల్లో 36 మంది మావోయిస్టులు మృతిచెందిన ఘటన జరిగి నెలైనా గడవక ముందే.. తాజాగా ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులో చోటు చేసుకున్న ఎదురుకాల్పుల్లో మరో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. మహారాష్ట్రలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మావోయిస్టులు విధ్వంసాలకు ప్రణాళిక చేస్తున్నారని నిఘావర్గాలకు సమాచారం అందింది. దీంతో సోమవారం ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులోని గడ్చిరోలితోపాటు భామ్రగఢ్ అటవీ ప్రాంతానికి సీ-60కి చెందిన 22 యూనిట్లు, సీఆర్పీఎఫ్‌కు చెందిన 2క్యూఏటీ బలగాలు కూంబింగ్‌కు వెళ్లాయి. భామ్రగఢ్‌లో మావోయిస్టులు ఎదురుపడటంతో ఒక్కసారిగా ఇరు వైపులా కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందగా.. ఒక జవానుకు గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం హెలికాప్టర్‌లో నాగ్‌పుర్‌కు తరలించారు. మృతదేహాలను మరో హెలికాప్టర్‌లో గడ్చిరోలికి తీసుకొచ్చారు. వారి వివరాలను గుర్తించాల్సి ఉందని, ఘటనా స్థలంలో భారీగా ఆయుధ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని పోలీసు అధికారులు వెల్లడించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ముగ్గురి లొంగుబాటు..

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో సోమవారం ముగ్గురు మావోయిస్టులు లొంగిపోయారు. అక్కడి ప్రభుత్వం, పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన లోన్ వరాటు(ఇంటికి తిరిగిరా) కార్యక్రమంలో భాగంగా దర్భా డివిజన్‌లోని మలంగర్ ఏరియా కమిటీలో ప్లాటూన్ నంబరు-24లో పనిచేస్తున్న నందు మాద్వి, హిద్మా మాద్విలతోపాటు హేమ్లా ఉన్నారు. నందు, హిద్మాలపై రూ.2 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఖమ్మంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వరంగల్‌లో మంత్రి కొండా సురేఖ వీటిని ప్రారంభించారు. రాష్ట్రంలో మొత్తం 351 కొనుగోలు కేంద్రాలకు గాను 322 చోట్ల కేంద్రాల ఏర్పాటుకు జిన్నింగ్, కాటన్ మిల్లుల యాజమాన్యాలతో సీసీఐ ఒప్పందం చేసుకుంది. వీటిలో సోమవారం 260 కేంద్రాలు ఏర్పాటయ్యాయని మార్కెటింగ్ శాఖ అదనపు సంచాలకుడు లక్ష్మణుడు తెలిపారు. వారం రోజుల్లో మిగిలిన కేంద్రాలు ప్రారంభమవుతాయని తెలిపారు. వానాకాలం సీజన్‌లో రైతులు రాష్ట్రంలో 42.23 లక్షల ఎకరాల్లో పత్తి పంట వేయగా.. ఈ సారి 25.33 లక్షల టన్నుల మేర ఉత్పత్తిని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం క్వింటాలు పత్తికి రూ.7,521ను మద్దతు ధరగా ప్రకటించింది. రైతులకు పత్తి మార్కెట్లు, ధరల సమాచారాన్ని వాట్సప్ ద్వారా అందించేందుకు, విక్రయాలు జరిపిన వెంటనే ఆ మేరకు మొత్తం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా మార్కెటింగ్ శాఖ ఏర్పాట్లు చేసింది.

మూసీ పునరుజ్జీవ పథకానికి 'చుంగేచాన్' మార్గదర్శకం

- రాష్ట్ర మంత్రులు పొంగులేటి, పొన్నం
- సియోల్‌లో ఉపనది పరిసరాలను పరిశీలించిన మంత్రులు, అధికారులు
- వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తిపై అధ్యయనం

సియోల్ నుంచి 'ఈనాడు ప్రత్యేక ప్రతినిధి': ఒకప్పుడు మురికికూపంలా ఉన్న చుంగేచాన్ ఉపనదిలో ఇప్పుడు శుభ్రమైన నీరు ప్రవహిస్తోందని, ఇదే తీరులో హైదరాబాద్‌లోని మూసీని పునరుజ్జీవం చేయాల్సిన అవసరముందని రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు స్పష్టంచేశారు. మూసీ పునరుజ్జీవ పథకంలో భాగంగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో తెలంగాణ బృందం దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో పర్యటిస్తోంది. సోమవారం అక్కడి చుంగేచాన్ తీరాన్ని, వ్యర్థాల నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్న కేంద్రాలను బృందం సందర్శించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలత, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, మూసీ పరీవాహక అభివృద్ధి సంస్థ జేఎండీ గౌతమి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు తదితరులు ఈ పర్యటనలో ఉన్నారు.

2 లక్షల టన్నుల వ్యర్థాల నుంచి పునర్ వినియోగశక్తి

వేస్ట్ టు ఎనర్జీ విధానంలో భాగంగా సియోల్ పశ్చిమ భాగంలో 2005లో ఏర్పాటు చేసిన మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను మంత్రులు, అధికారుల బృందం సందర్శించింది. ఇక్కడ ఏడాదికి 2 లక్షల టన్నుల వ్యర్థాలను వేరుచేసి విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్న తీరుపై అధ్యయనం చేశారు. ఇక్కడ ఉత్పత్తి చేస్తున్న కరెంటును కొరియా ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్‌కు విక్రయిస్తున్నారు. సెమీ డ్రై రియాక్టర్, సెలెక్టివ్ క్యాటలిటిక్ రిడక్షన్ టవర్‌లను సైతం పరిశీలించారు.



సియోల్‌లోని మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను సందర్శించిన పొన్నం ప్రభాకర్, వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి, దానకిశోర్ తదితరులు

సియోల్‌కు హైదరాబాద్‌తో దగ్గరి పోలికలు: పొంగులేటి

దక్షిణ కొరియా రాజధాని సియోల్‌కు భౌగోళికంగా, జనాభా పరంగానూ హైదరాబాద్‌తో చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి. మూసీ మాదిరిగానే చుంగేచాన్ ఉపనది సైతం ఒకప్పుడు అత్యంత దుర్భరంగా ఉండేది. ఇక్కడి రివర్ బెడ్‌ను మట్టితో నింపి ఫ్లైఓవర్ నిర్మించారు. ఒకప్పుడు పరిశ్రమలతో నిండిపోయిన ప్రాంతాన్ని పూర్తిగా మార్చేశారు. నదిలో పరిశుభ్రమైన నీటితోపాటు శుద్ధి చేసిన నీటిని వదులుతున్నారు. చుంగేచాన్ తీరం సియోల్‌లోనే అత్యధిక భూముల ధరలున్న ప్రాంతంగా మారింది. హైదరాబాద్‌లోని మూసీ తీరాన్ని కూడా ఇక్కడిలా ఎందుకు మార్చకూడదన్న ఆలోచన సీఎం రేవంత్‌రెడ్డికి వచ్చింది. మూసీ ఒడ్డున సామాన్యులు, నిరుపేదలు మురికికూపంలో నివసిస్తున్నారు. వారిని సురక్షిత ప్రాంతానికి మార్చాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. మా బృందంలో అనుభవజ్ఞులు లేరని ప్రతిపక్షాలు అంటున్నాయి. కామన్‌సెన్స్ ఉంటే చాలదా...? మంత్రులుగా అనుభవమున్న కేటీఆర్, హరీశ్‌రావులు సలహాలు ఇవ్వొచ్చు. మాజీ సీఎం కేసీఆర్ తన అనుభవంతో కాళేశ్వరం కడితే ఎలా ఉందో అర్థమవుతోంది కదా...! భారాస పదేళ్ల పాలనలో మూసీ తీరు ఎలా ఉన్నదో వారు ఆత్మపరిశీలన చేసుకోవాలి.

ఎవరికీ నష్టం లేకుండా మూసీ పునరుజ్జీవం: పొన్నం

హైదరాబాద్‌లో మూసీ నది పునరుజ్జీవం విషయంలో అందరిలో మార్పు రావాలి. సియోల్‌లోని చుంగేచాన్ ఉపనది పునరుద్ధరణ సమయంలో ఇక్కడి ప్రభుత్వం స్థానికులకు సాయం చేసింది. ఇదే తరహా విధానాన్ని మా ప్రభుత్వం అనుసరిస్తోంది. పునరుజ్జీవం ప్రాజెక్టు కారణంగా సియోల్‌లో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ఎవరికీ నష్టం జరగకుండా మూసీని పునరుజ్జీవం చేసుకుందాం.

సియోల్ మాదిరి నిర్వహణ అవసరం: దానకిశోర్

సియోల్... హైదరాబాద్ నమూనా దాదాపు ఒకే తీరులో ఉన్నాయి. ఒకప్పుడు చుంగేచాన్ ఉపనదిలో కాలుష్యం పెరగడంతో ప్రవాహాన్ని పూర్తిగా కప్పేశారు. అనంతరం పునరుద్ధరించారు. ఈ నగరంలో 10 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు విడుదలవుతుండగా ఐదు వేర్వేరు ప్రాంతాలకు తరలించి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఇప్పుడు హైదరాబాద్‌లో విడుదలవుతున్న ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను ఒకేచోటికి తరలిస్తున్నాం. నగరం నలుదిక్కులా చెత్తను తరలించి, విద్యుత్తును ఉత్పత్తి చేయాలన్న సీఎం ఆదేశాలతో సంగారెడ్డి జిల్లాలో 50 ఎకరాలు, శంషాబాద్‌లో 50, యాదాద్రి వైపు 200 ఎకరాలను గుర్తించాం. మనకూ సియోల్ మాదిరి వ్యర్థాల నిర్వహణ అవసరం.

పెండింగ్ డీఏలపై నిర్ణయం తీసుకోవాలి

తెలంగాణ ఉద్యోగుల ఐకాస అధ్యక్షుడు లచ్చిరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: సుదీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఐదు కరవు భత్యాలపై మంత్రివర్గం దృష్టి సారించి మంజూరు చేయాలని తెలంగాణ ఉద్యోగుల ఐకాస అధ్యక్షుడు లచ్చిరెడ్డి కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ కలెక్టర్ల సంఘం కార్యాలయంలో జరిగిన ఐకాస సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జీవో 317తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు సత్వరమే న్యాయం చేయాలి. ఈ విషయంలో మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఇవ్వడాన్ని ఆహ్వానిస్తున్నాం. నగదు రహిత వైద్యసేవలు అందే విధంగా కొత్త హెల్త్ స్కీంను అమలు చేయాలి. రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలులోకి తేవాలి. ఈ నెల 26న జరిగే మంత్రి మండలి సమావేశంలో ఈ అంశాలపై చర్చించి ఉద్యోగులకు న్యాయం చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి' అని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు కె.రామకృష్ణ, డా.జి.నిర్మల్, దర్శన్‌గౌడ్, రవికుమార్, హనుమంతరావు, రాములు, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రహం అనుగ్రహం

22–10–2024 మంగళవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం
పంచమి: ఉ. 7-28 తదుపరి షష్ఠి
మృగశిర: ఉ. 11-30 తదుపరి ఆర్ద్ర
వర్జ్యం: రా. 7-49 నుంచి 9-24 వరకు
అమృత ఘడియలు: రా. 1-21 నుంచి 2-56 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-16 నుంచి 9-03 వరకు
తిరిగి రా. 10-30 నుంచి 11-20 వరకు
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ. 5.58; సూర్యాస్తమయం: సా.5.32

రైస్ మిల్లర్ల ఆస్తుల జప్తు వివాదంపై

హైకోర్టులో ప్రభుత్వం అప్పీళ్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం అప్పగించిన ధాన్యం ఆధారంగా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను పౌరసరఫరాల సంస్థకు అప్పగించనందుకు మిల్లర్ల ఆస్తులను జప్తు చేయడం చెల్లదంటూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం అప్పీళ్లు దాఖలు చేసింది. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు పంపిందని, కొంత బియ్యాన్ని వారు ప్రభుత్వానికి సరఫరా చేశారన్నారు. ఈ ధాన్యానికి అనుగుణంగా బియ్యం వారి వద్ద లేదని కలెక్టర్ల తనిఖీలో తేలిందన్నారు. మిల్లర్ల నుంచి రూ.70 కోట్ల నుంచి రూ.90 కోట్ల దాకా రావాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ రికవరీ చట్టం కింద ఆస్తులను జప్తు చేసినట్లు తెలిపారు. రావాల్సిన మొత్తాన్ని రికవరీ చేసుకోవడానికి నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. మిల్లర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ రెవెన్యూ రికవరీ చట్టం కింద ఎలాంటి నోటీసులు జారీ చేయలేదన్నారు. కంపెనీలకు చెందిన వ్యవహారంలో డైరెక్టర్ల ఆస్తులను జప్తు చేయడం చెల్లదన్నారు. అంతేకాకుండా ఒప్పందంలో ఆర్బిట్రేషన్ నిబంధన ఉన్నపుడు రెవెన్యూ రికవరీ చట్టాన్ని వినియోగించజాలదన్నారు. ధాన్యం సరఫరాకు సంబంధించి మిల్లర్లకు, పౌరసరఫరాల సంస్థకు ఒప్పందం కుదిరిందని, అందులోని రెండో పార్టీ ఒక్కటే తప్పు జరిగిందని నిర్ణయించజాలదన్నారు. వివాదాన్ని స్వతంత్ర సంస్థ పరిష్కరించాల్సి ఉందని చెప్పారు. ఏజీ జోక్యం చేసుకుంటూ నోటీసులు జారీచేశారో లేదో వివరణ ఇవ్వడానికి గడువు కావాలని కోరడంతో ధర్మాసనం అనుమతిస్తూ విచారణను నవంబరు 5కి వాయిదా వేసింది. ఈలోగా స్థిరాస్తులను అన్యాక్రాంతం చేయవద్దంటూ మిల్లర్లను ఆదేశించింది.

నేతన్నల సబ్సిడీ పథకానికి రూ.37 కోట్ల మంజూరు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో నేత కార్మికులకు ఇన్‌పుట్ సబ్సిడీ పథకానికి రూ.37.49 కోట్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం కింద కార్మికులకు నూలు, రంగులు, రసాయనాల కొనుగోలులో 40 శాతం మేరకు సబ్సిడీని ఇవ్వనుంది. మొత్తం 45 కోట్లను ఈ పథకానికి కేటాయించగా... ఇందులో రూ.37.49 కోట్లను మొదటి విడతగా మంజూరు చేసింది.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ	ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	37.0	24.0	హనుమకొండ	33.0	23.5
ఖమ్మం	35.5	24.0	కరీంనగర్	33.0	23.0
నరసాపురం	34.2	25.2	రామగుండం	32.8	25.4
నెల్లూరు	34.1	25.5	ఆదిలాబాద్	32.8	24.2
నిజామాబాద్	34.1	24.8	తిరుపతి	32.7	25.6
విశాఖపట్నం	33.8	25.2	కర్నూలు	32.5	23.4
అనంతపురం	33.6	24.5	మెదక్	32.2	21.3
సూర్యాపేట	33.5	26.0	విజయనగరం	32.0	26.0
విజయవాడ	33.3	25.2	శ్రీకాకుళం	32.0	25.0
తాడేపల్లిగూడెం	33.0	24.2	కడప	32.0	24.0
			హైదరాబాద్	31.6	23.1
			ఒంగోలు	31.3	26.0
			నల్గొండ	31.0	24.0
			మహబూబ్‌నగర్	29.5	23.5

పదేళ్లు.. 406 ప్రాణాలు



- వరదలతో రాష్ట్రంలో సంభవించిన ప్రాణ నష్టం ఇది
- పంటలు, ఇతర నష్టాలు.. రూ.12 వేల కోట్ల పైమాటే
- వరద నిర్వహణ ప్రణాళికపై ఎట్టకేలకు రెవెన్యూశాఖ దృష్టి



ఆకస్మికంగా కురిసే కుండపోత వానలు (క్లౌడ్ బరస్ట్), వరదలు, తుపాన్లు ఏటా రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతాన్ని దెబ్బతీస్తున్నాయి. వీటి కారణంగా ఏటా పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణ విభాగం గణాంకాల ప్రకారం గత పదేళ్లలో 406 మంది ప్రాణాలు కోల్పోయారు. రూ.12,173 కోట్ల ఆస్తి, పంట నష్టాలు సంభవించాయి. ఇందులో రూ.10 వేల కోట్ల ఆస్తి నష్టం ఈ ఏడాదే సంభవించింది. రాష్ట్రానికి ప్రత్యేకంగా విపత్తు నిర్వహణ విధానం లేకపోవడంతో.. ఆయా సమయాల్లో మరణాల నివారణ, ఆస్తుల నష్టాలు తగ్గించే కార్యాచరణ కొరవడుతోంది.

అన్ని జిల్లాలకూ ముప్పు..

గత పదేళ్లలో 2015, 2018, 2022 సంవత్సరాలు మినహా.. రాష్ట్రంలో పదికిపైగా జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించాయి. ప్రత్యేకించి 2016, 2023, 2024లలో 30కి పైగా జిల్లాలు, 2017లో 20 జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. లక్షకు పైగా వివిధ రకాల పశువులు, జీవాలు, మేకలను రైతులు నష్టపోయారు. ఈ ఏడాదిలో వచ్చిన వరదలకు రోడ్లు, వంతెనలు, పంటలు, భవనాలు, గృహాలు తదితరాలు కలిపి. . రూ.10,320.72 కోట్లు నష్టం వాటిల్లింది. హైదరాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 2022లో 93 మంది మరణించారు. నగరంలో వరద నీటి ప్రవాహానికి ప్రత్యేకంగా డ్రైన్లు లేవు. దీంతో 5 సెం.మీ.పైన వర్షం కురిస్తే చాలు రహదారులు ఏర్లుగా మారుతున్నాయి. నగరంలో డ్రైనేజీ గుంతల్లో పడి కొట్టుకుపోతూ అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

విపత్తు నిర్వహణ విధానం లేకనే

రాష్ట్రానికి ప్రత్యేకంగా విపత్తు నిర్వహణ విధానం లేదు. 2018లో అప్పటి విపత్తు నిర్వహణ శాఖ కమిషనర్ చంద్రవదన్ దీనిపై ఓ ప్రణాళిక రూపొందించినా.. ప్రభుత్వ ఆమోదం లభించలేదు. మరోవైపు అత్యంత భారీ వర్షాలు, వరదలు, తుపాన్లు పరిపాటిగా మారాయి. గతంలో గోదావరి పరీవాహకంలో మాత్రమే వరదల ప్రభావం ఉండేది. ఇప్పుడు మున్నేరులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఏక కాలంలో అనేక జిల్లాలు విపత్తుల్లో చిక్కుకుంటున్నాయి. ఒకేసారి అన్ని ప్రాంతాలకు విపత్తు స్పందన బృందాలు, సామగ్రి పంపేందుకు తగినన్ని ఏర్పాట్లు లేవు. పిడుగుపాట్లను ముందుగా గుర్తించే వ్యవస్థ కూడా లేదు. ఈ క్రమంలో విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తాజాగా వరద నిర్వహణ ప్రణాళిక-2024కు గత నెలలో శ్రీకారం చుట్టారు. 14 శాఖలు, అన్ని జిల్లాల కలెక్టర్లతో చర్చలు నిర్వహిస్తున్నారు. నవంబరు నాటికి ముసాయిదా ప్రణాళిక రూపకల్పనకు కృషి చేస్తున్నారు.

- ఈనాడు, హైదరాబాద్

వర్షాలు, వరదలతో సంభవించిన నష్టాలు..

	ప్రభావిత జిల్లాలు	మరణాలు	ఇతర నష్టాలు (రూ.కోట్లలో)
2015	9	5	
2016 సెప్టెంబరు	31	49	238.41
2017 సెప్టెంబరు	20	3	25.25
2018 అక్టోబరు	8	23	227.38
2019 ఆగస్టు	12	61	30.34
2020 అక్టోబరు	11	93	500
2021 సెప్టెంబరు	12	62	29.25
2022 జులై	9	19	42.45
2023 జులై	33	50	759.44
2024 మార్చి/జులై	33	41	10,320.72
మొత్తం		406	12,173.24

గ్రూప్-1పై సుప్రీం తీర్పు శుభపరిణామం

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

ఈనాడు, న్యూస్‌టుడే- హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షలు వాయిదా వేయాలంటూ పలువురు దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించడంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ హర్షం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు తీర్పు శుభ పరిణామమని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ యువతకు ఉన్నత ఉద్యోగాలు ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను హైకోర్టు, సుప్రీంకోర్టులు సమర్థించాయన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. "బీసీ బిడ్డగా మరోసారి హామీ ఇస్తున్నా. జీఓ 29తో రిజర్వేషన్ల అభ్యర్థులకు ఎలాంటి అన్యాయం జరగదు" అని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

అందరికీ న్యాయం: మంత్రి కోమటిరెడ్డి


సామాజిక న్యాయానికి కట్టుబడిన పార్టీ కాంగ్రెస్ అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. అధికారంలో ఉన్న గత పదేళ్ల పాటు పరీక్షలు సరిగా నిర్వహించని పార్టీ ఇప్పుడు రాజకీయ దురుద్దేశంతో చేపట్టే కార్యక్రమాల్లో నిరుద్యోగులు చిక్కుకోకూడదని విజ్ఞప్తి చేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. అందరికీ న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగుతుందన్నారు.

కేటీఆర్ గృహ నిర్బంధం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: గ్రూప్ 1 పరీక్షల వ్యవహారంలో ఆందోళన నిర్వహిస్తారనే అనుమానంతో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను సోమవారం హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. బంజారాహిల్స్ పోలీసులు పెద్ద ఎత్తున అక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం సుప్రీంకోర్టు తీర్పు అనంతరం పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

గ్రూప్-1 వాయిదాకు సుప్రీంకోర్టు నిరాకరణ

- ఈ పరిస్థితుల్లో జోక్యం చేసుకుంటే గందరగోళం నెలకొంటుందని వ్యాఖ్య
- నవంబరు 20న ఈ కేసుపై తుది నిర్ణయం వెలువరించాలని హైకోర్టుకు సూచన
- విషయాన్ని అక్కడే తేల్చుకోవాలని పిటిషనర్లకు స్పష్టీకరణ



ఈనాడు, దిల్లీ: తెలంగాణ గ్రూప్-1 పరీక్షల వాయిదాకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీనికి సంబంధించి దాఖలైన పిటిషన్‌పై నవంబరు 20వ తేదీన తుది నిర్ణయం వెలువరించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని హైకోర్టుకు సూచించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 8న రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 29ని అనుసరించి నిర్వహిస్తున్న గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ కొందరు అభ్యర్థులు దాఖలుచేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టి ఈమేరకు ఉత్తర్వులు జారీచేసింది. అభ్యర్థులంతా ఇప్పటికే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నందున ఈ పరిస్థితుల్లో వాయిదా వేయడం సాధ్యంకాదని స్పష్టంచేసింది. ఈ పరీక్ష తుది ఫలితాలు, నియామకాలు తమ తుది తీర్పునకు లోబడి ఉండాలని ఇప్పటికే హైకోర్టు డివిజన్ బెంచ్ చెప్పినందున విషయాన్ని అక్కడే తేల్చుకోవాలని పిటిషనర్లకు స్పష్టంచేసింది. ఈ వ్యాజ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది (వైకాపా ఎంపీ) నిరంజన్‌రెడ్డి, పిటిషనర్ల తరఫున మరో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు.

వేలమంది విద్యార్థులను తొలగించినందున (ఎక్స్‌క్లూడ్) వాయిదా వేయాలని సిబల్ కోరారు. అందులో ఎస్సీ, ఎస్టీలు కూడా ఉన్నట్లు చెప్పారు. ఇది దీపేందర్ యాదవ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని పేర్కొన్నారు. వాయిదా వేయలేకపోతే.. మెయిన్స్ రాయకుండా తొలగింపునకు గురైన అభ్యర్థులను పరీక్ష రాయడానికైనా అనుమతించాలని కోరారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ జోక్యం చేసుకుంటూ "తదుపరి తీసుకోబోయే చర్యలన్నీ ఈ కోర్టు జారీచేసే ఉత్తర్వులకు లోబడే ఉండాలని చెబుతాం" అని సిబల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

> ఇప్పటికే అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు ఎలా ఇబ్బందులు సృష్టించగలుగుతాం. ఈ తరుణంలో మేం జోక్యం చేసుకుంటే గందరగోళం నెలకొంటుంది.
>
> - సీజేఐ

రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది బదులిస్తూ ఇప్పటికే హైకోర్టు అదే విషయాన్ని చెబుతూ, ఈ కేసు తుది విచారణను వచ్చే నెల 20వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. ఆ వాదనల పట్ల కపిల్‌సిబల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. అప్పటికల్లా పరీక్షలు అయిపోతాయని, దానివల్ల తమకొచ్చే ప్రయోజనం ఏమీ ఉండదని పేర్కొన్నారు. ఈ కేసును ఈరోజే వినండని ధర్మాసనాన్ని కోరారు. ఆ వాదనలతో జస్టిస్ జేబీ పార్దీవాలా విభేదించారు. ఇప్పటికే హైకోర్టు ఉత్తర్వులు జారీచేసినందున ఫలితాల వెల్లడిపై దాని ప్రభావం ఉంటుందని గుర్తుచేశారు. పిటిషనర్లలో కొందర్ని పరీక్ష రాయడానికి అనుమతించలేదని, ఒకవేళ హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇస్తే.. పరీక్ష రాయలేని వారికి ఇబ్బంది అవుతుందని సిబల్ తెలిపారు. కనీసం ఈ అభ్యర్థులను పరీక్ష రాయడానికైనా అనుమతివ్వాలని కోరారు. "మీరు అడుగుతున్న వయో పరిమితి మినహాయింపులపై హైకోర్టును పరిశీలించనివ్వండి. ఆ విషయాన్ని హైకోర్టుకు విజ్ఞప్తి చేసుకోవచ్చు' ' అని సూచిస్తూ సీజేఐ విచారణ ముగించారు.

కోర్టు తుది నిర్ణయం వెలువరించే వరకు వాయిదా వేయాలి: పిటిషనర్లు

రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉందని, పరీక్ష కొనసాగించడానికి అనుమతిస్తే ఈ అభ్యర్థులంతా విస్మరణకు గురవుతారని సిబల్ వాదనలు వినిపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తర్వాత నిర్వహిస్తున్న గ్రూప్-1 పోస్టుల భర్తీ పూర్తయితే మళ్లీ వాటిని భర్తీచేసే పరిస్థితి రాదని, తద్వారా పిటిషనర్లంతా శాశ్వతంగా అవకాశాన్ని కోల్పోతారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. తాము ఈ పరీక్షలను శాశ్వతంగా రద్దుచేయాలని కోరడం లేదని, కోర్టు తుది నిర్ణయం వెలువరించే వరకు వాయిదా వేయాలని కోరుతున్నామని, దానివల్ల తాము శాశ్వతంగా అవకాశం కోల్పోయే ప్రమాదం ఉండదని పేర్కొన్నారు. ఆ వాదనలతో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఏకీభవించలేదు. "పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను ఎలా వాయిదా వేయగలుగుతాం. అది చాలా అసాధారణం'' అని వ్యాఖ్యానించారు.

సింగరేణిలో బదిలీ వర్కర్‌లను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణిలో పనిచేస్తున్న బదిలీవర్కర్‌లను క్రమబద్ధీకరిస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. సింగరేణి వ్యాప్తంగా 2,349 మందిని జనరల్ మజ్దూర్‌లుగా నిర్ణయించింది. 190/240 మస్టర్లు పూర్తిచేసిన బదిలీవర్కర్‌లకు పదోన్నతి కల్పించింది. వీరిని సెప్టెంబరు 1 నుంచి జనరల్ మజ్దూర్‌లుగా గుర్తించనుంది. సింగరేణిలో కొత్తగా ఉద్యోగంలో చేరిన కార్మికులకు ముందుగా బదిలీ వర్కర్‌లుగా విధులు కల్పిస్తారు. వారి పని విధానం ఆధారంగా జనరల్ మజ్దూర్‌లుగా క్రమబద్ధీకరిస్తారు. అర్హత సాధించిన బదిలీవర్కర్లకు పదోన్నతులు కల్పించాలని గత కొంత కాలంగా కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే భూగర్భ బొగ్గుగనుల్లో 190, ఉపరితల గనులు, విభాగాల్లో 240 మస్టర్లు పూర్తి చేసిన బదిలీ వర్కర్‌లందరినీ యాజమాన్యం క్రమబద్ధీకరించింది.




షేక్‌పేట నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాల వద్ద క్యూలైన్లో అభ్యర్థులు ★సికింద్రాబాద్ పీజీ కళాశాల పరీక్ష కేంద్రంలో 'ఆల్‌ది బెస్ట్' బోర్డులతో పోలీసులు

ఉత్కంఠ నడుమ గ్రూప్-1 మెయిన్స్ షురూ..

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 563 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీకాగా.. ప్రధాన పరీక్షలకు 31,403 మంది అర్హులయ్యారు. వీరంతా ఈ నెల 21 నుంచి 27 వరకు వివిధ సబ్జెక్టుల్లో పరీక్షలు రాయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పరీక్షకు.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే ఏర్పాటు చేసిన 46 కేంద్రాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తొలిరోజు పరీక్ష నిర్వహించారు. అభ్యర్థుల వెంట ఎలక్ట్రానిక్ వస్తువులు, చేతి గడియారాలతో పాటు బెల్టులను కూడా పరీక్ష గదుల్లోకి అనుమతించలేదు. అన్ని కేంద్రాల వద్ద మధ్యాహ్నం 1.30కే ప్రధాన ద్వారాలు మూసేశారు. సోమవారం జనరల్ ఇంగ్లిష్ పరీక్షకు 22,744 మంది (72.44 శాతం) హాజరయ్యారని అధికారులు తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, కె.శశాంక, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తాలు వారి పరిధిలోని పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు సీవీ ఆనంద్, అవినాష్ మహంతి, జి.సుధీర్‌బాబులు ఎప్పటికప్పుడు కేంద్రాల వద్ద పరిస్థితులను తెలుసుకున్నారు.

తొలిరోజు పరీక్షకు హాజరైన అభ్యర్థులు..

జిల్లా	పరీక్షా కేంద్రాలు	అభ్యర్థులు	హాజరైనవారు	శాతం
హైదరాబాద్	08	5,613	4,890	87.23
రంగారెడ్డి	11	8,011	5,854	73.07
మేడ్చల్	27	17,779	12,000	67.50
మొత్తం	**46**	**31,403**	**22,744**	**72.44**

పటిష్ఠ భద్రత ఏర్పాట్లు

అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో పరీక్షల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. వ్యూహాత్మకంగా మేడ్చల్ జిల్లాలోనే అత్యధికంగా 27 కేంద్రాలను ఎంపికచేసింది. నిరసన వ్యక్తం చేసేందుకు ఎవరైనా వస్తే వెంటనే గుర్తించి చర్యలు చేపట్టేందుకు వీలుగా పోలీస్ అధికారులు కార్యాచరణ రూపొందించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో సాయుధ పోలీసులను నియమించారు. కేంద్రాలకు దూరంగా కొందరు పోలీసులు మఫ్టీలో విధులు నిర్వహించారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సునూ అందుబాటులో ఉంచారు.

ఆఖరి నిమిషంలో హడావుడి

పరీక్షా కేంద్రం లోపలికి మధ్యాహ్నం 1.30 కల్లా చేరుకోవాలని అధికారులు స్పష్టంగా తెలిపినా.. కొన్నిచోట్ల ఆఖరి నిమిషంలో అభ్యర్థులు కేంద్రాలకు చేరుకున్నారు. మరికొందరు ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నా ఒకే ప్రాంగణంలోని కళాశాలలను గుర్తించలేకపోయారు. దీంతో అక్కడున్న పోలీసులు వారిని తమ వాహనాల్లో కేంద్రాలను తరలించారు. ఇద్దరు మహిళా అభ్యర్థులు సమయం దాటాక రావడంతో వారిని అనుమతించలేదు. కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వద్ద ఓ మహిళా అభ్యర్థి గేటు మూశాక వచ్చారు. అధికారులు అనుమతించకపోవడంతో ఆమె అక్కడే రోదించారు. మరో కేంద్రంలో ఓ మహిళా అభ్యర్థి తన మూడేళ్ల కుమారుడితో చేరుకున్నారు. లోపలికి అనుమతించకపోవడంతో ఆమె రోదిస్తూ స్పృహతప్పి పడిపోయారు. పోలీసులు వెంటనే స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలించారు. జనరల్ ఇంగ్లిష్ పరీక్ష పేపరు మధ్యస్తంగా ఉందని పలువురు అభ్యర్థులు వివరించారు.

జీవో 29ని రద్దు చేయండి

గవర్నర్‌కు బీసీ మేధావుల ఫోరం వినతి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్‌తో పాటు జీవో 29తో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీసీ మేధావుల ఫోరం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ జీవోని రద్దు చేయాలని కోరుతూ ఫోరం ప్రతినిధులు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, విశ్రాంత ఐఏఎస్ అధికారి డా.చిరంజీవులు, బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేష్‌చారి, డా.చెరుకు సుధాకర్ తదితరులు సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "రాష్ట్రంలో బీసీలు ఉన్నత ర్యాంకులు సాధించినా ఉద్యోగాలు రావడంలేదు. రెండు శాతం లేని అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారు. ఇప్పుడు జరుగుతున్న రిక్రూట్‌మెంట్ విధానంలో మొత్తం అగ్రవర్ణాలే ఎంపికయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం భేషజాలకు పోకుండా గ్రూప్-1 పరీక్షలు రద్దు చేయాలి" అని డిమాండ్ చేశారు.


కొత్తగా 18 పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలు

మరో తొమ్మిదింటి విస్తరణకు నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా 18 పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ(అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే తొమ్మిది పట్టణాభివృద్ధి సంస్థలు పనిచేస్తున్న నేపథ్యంలో వాటి పరిధిని విస్తరించనుంది. టౌన్ ప్లానింగ్ కార్యకలాపాల విస్తరణ, మౌలిక వసతుల పరంగా అభివృద్ధి, కేంద్రం నుంచి ఎక్కువ మొత్తంలో నిధులు వచ్చే అవకాశాలు ఉండటంతో కొత్తగా ప్రాధికార సంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్రం మొగ్గుచూపుతోంది. దీంతోపాటు పట్టణ ప్రాంతాల విస్తరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి అథారిటీలు దోహదపడతాయని భావిస్తోంది. వీటికి సంబంధించిన జీవోలను త్వరలోనే విడుదల చేసే అవకాశాలు ఉంది.

వ్యవసాయ కమిషన్‌కు ఏడుగురు సభ్యులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌కు ప్రభుత్వం ఏడుగురు సభ్యులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్‌తో పాటు ఎం.సునీల్‌కుమార్(హైదరాబాద్), రాంరెడ్డి గోపాల్‌రెడ్డి(ఖమ్మం జిల్లా), గడుగు గంగాధర్(నిజామాబాద్ జిల్లా), కేవీ నరసింహారెడ్డి(నాగర్‌కర్నూల్ జిల్లా), చెవిటి వెంకన్నయాదవ్(సూర్యాపేట జిల్లా), మరికంటి భవానీరెడ్డి(సిద్దిపేట జిల్లా) నియమితులయ్యారు. ఛైర్మన్‌తో పాటు వీరి పదవీకాలం రెండేళ్లు ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మొదట్లో కమిషన్‌కు ఛైర్మన్, మరో ఆరుగురు సభ్యుల నియామకంపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా సభ్యుల సంఖ్యను ఏడుకు పెంచింది. ఈ మేరకు ఉత్తర్వులను సవరించి, సభ్యులను నియమించింది.



పిల్లలకు మీరిచ్చే అత్యుత్తమ బహుమతి అదే..

పిల్లలు విద్యపరంగా ఉత్తమ ప్రతిభ కనబర్చడంలో అత్యంత కీలక పాత్ర పోషించేది వారు పుస్తక పఠనానికి వెచ్చించే సమయం. మీ పిల్లలకు మీరిచ్చే అత్యుత్తమ బహుమతి ఏంటంటే వారితో కలసి కూర్చొని వారికి చదివి వినిపించడం. వారికి సరదాగా కథ చెబుతున్నట్లు, అందులోని పాత్రల గొంతులను, నేపథ్య శబ్దాలను అనుకరిస్తూ చదవండి. పదాలను వారితో పలికించడంతోపాటు బొమ్మలను గుర్తుపట్టమని అడగండి. అలా గడిపిన సమయం మీ ఇద్దరికీ ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

– పేటీ.బి, ఆరోగ్యకర జీవనశైలి ప్రచారకర్త

వినికిడి లోపం ఉన్నవారు గుసగుసలూ వినొచ్చు!

బుల్లి 'స్టెతస్కోప్'ను రూపొందించిన ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ విద్యార్థులు

ఈనాడు, హైదరాబాద్: ఎదుటివారు ఏం చెబుతున్నారో అర్థం కాదు.. మంచి పాటలు, శ్రావ్యమైన సంగీతం, ఇతర శబ్దాలు కూడా వినిపించవు.. ఇలాంటి వినికిడి సమస్యలతో బాధపడుతున్నవారికి ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ పీహెచ్‌డీ విద్యార్థులు నీల్‌షా, నేహ సాహిబ్‌జాన్, విశాల్ తంబ్రహళ్లి శుభవార్త వినిపించారు. పక్కనున్నవారి గుసగుసలు సైతం వినిపించేలా ఓ బుల్లి పరికరానికి రూపకల్పన చేశారు. చిన్న స్టెతస్కోప్‌లాంటి దీన్ని చెవి వెనుక అమర్చుకుని మొబైల్‌లో బ్లూటూత్‌ను ఆన్‌చేస్తే చాలు. వినూత్నమైన ఈ పరికరం తయారీపై 'స్టెతోస్పీచ్.. స్పీచ్ జనరేషన్ త్రూ క్లినికల్ స్టెతస్కోప్ అటాచ్డ్ టు స్కిన్' పేరుతో పరిశోధనపత్రాన్ని రూపొందించారు. మెల్‌బోర్న్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సదస్సులో దీన్ని ప్రదర్శించారు. వినికిడి లోపం ఉన్నవారు ఈ వైర్‌లెస్ స్టెతస్కోప్‌ను అమర్చుకుంటే ఎదుటివారు చిన్నగా మాట్లాడినా ఇబ్బంది లేకుండా వినపడుతుందని నీల్‌షా వివరించారు. రాక్ సంగీత కచేరీల్లో భారీ శబ్దాలున్నా సరే ఈ పరికరం పనిచేసినట్లు తెలిపారు. విశ్వవ్యాప్తంగా పేరొందిన శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ స్ఫూర్తితో దీన్ని రూపొందించినట్లు విద్యార్థుల పర్యవేక్షకుడు, ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ వినీత్ గాంధీ తెలిపారు. సాధారణ స్టెతస్కోప్ పరిజ్ఞానానికి ఆధునిక సాంకేతికతను జోడించి.. 'విస్పర్-స్పీచ్‌డేటా'ను అనుసంధానించినట్లు వివరించారు. ఈ స్టెతస్కోప్‌ను ఎక్కడైనా పెట్టుకోవచ్చని.. శబ్దగ్రహణ సంకేతాల ద్వారా చుట్టుపక్కల సంభాషణలు సరళంగా వినేందుకు అవకాశాలున్నాయని తెలిపారు. దీనిద్వారా ఇష్టమైన మాటలు, శబ్దాలనూ వినొచ్చని చెప్పారు. ప్రస్తుతం వినియోగిస్తున్న వినికిడి మిషన్ల కన్నా ఇది వందల రెట్లు అత్యాధునికంగా ఉంటుందని వెల్లడించారు. ఈ పరికరం ఓ 'గేమ్ ఛేంజర్'గా మారుతుందని.. ఎదుటివారు ఏం మాట్లాడుతున్నారో తెలియనిస్థితిలో ఉన్న వ్యక్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

ఈనాడు

అడుగడుగునా గండాలే!

స్త్రీ లేకుంటే సృష్టే లేదు... మానవ జాతి మనుగడే సాధ్యం కాదు. ఈ విషయాన్ని మరచిపోతున్న ఎన్నో కుటుంబాలు ఇంకా మగపిల్లల కోసమే పరితపిస్తున్నాయి. లింగవివక్ష కారణంగా 2020 నాటికి దేశీయంగా నాలుగున్నర కోట్ల మంది ఆడపిల్లలు అమ్మ గర్భంలోనో, పుట్టిన కొన్నాళ్లకో కడతేరిపోయారు. ఈ మేరకు ఐరాస జనాభా నిధి సంస్థ నివేదిక లోగడ దిగ్భ్రాంతికర అంశాలను వెల్లడించింది. నిషేధం అమలులో ఉన్నప్పటికీ కాసుల కక్కుర్తితో పలు ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబులు నేటికీ విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాయి. పుట్టబోయేది ఆడపిల్ల అని తెలిస్తే- తల్లి కడుపులోనే అంతమొందించడానికి వెనకాడని కర్కశులకు అవి కొమ్ము కాస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు నిత్యం వెలుగు చూస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో లింగ పరీక్షలను చట్టబద్ధం చేయాలంటున్న భారతీయ వైద్య సంఘం(ఐఎంఏ) అధ్యక్షుడి వ్యాఖ్యలు విస్మయానికి గురిచేస్తున్నాయి. లింగ నిర్ధారణ పరీక్షలపై నిషేధం తొలగిస్తే- భ్రూణహత్యలు ఇక విచ్చలవిడి కావా? ఆడపిల్లల జీవించే హక్కును కాపాడాలంటే- అక్రమ స్కానింగ్ దందాలపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలి!

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంటే, రంగమేదైనా దూసుకుపోగలమని నేటి మహిళలు నిరూపిస్తున్నారు. అదే సమయంలో పేదరికం, బూజుపట్టిన పితృస్వామ్య భావజాలం మూలంగా ఎంతోమంది ఆడపిల్లలు చిన్నవయసులోనే బలవంతంగా పెళ్లిపీటలెక్కుతున్నారు. ఆ తరవాత మానసికంగా, శారీరకంగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి నిమిషం ముగ్గురు బాలికలు సంసార ఊబిలో కూరుకుపోతున్నట్లు భారతీయ శిశు సంరక్షణ పరిశోధక బృందం అధ్యయనం ఇటీవలే చేదు వాస్తవాలను ప్రకటించింది. బాల్యవివాహాలకు అడ్డుకట్ట పడాలంటే- తాజాగా సుప్రీంకోర్టు ఉద్ఘాటించినట్లు, పాలకులు బహుముఖ కార్యాచరణకు సిద్ధం కావాలి. న్యాయపాలిక ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలో ప్రత్యేక అధికారిని నియమించి చిన్నారి పెళ్లికూతుళ్లను కాపాడాలి. దేశీయంగా చదువులకు దూరమైన 11.5 లక్షల మంది చిన్నారులు వైవాహిక పంజరంలో బందీలయ్యే ప్రమాదముందని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరించింది. ఇలాంటి వారందరినీ బడిబాట పట్టించి జీవితంలో కుదురుకునేలా ప్రభుత్వాలు శ్రద్ధ వహించాలి. అనేక దురాచారాలకు తల్లివేరు అవుతున్న పేదరిక నిర్మూలనకూ చిత్తశుద్ధితో కృషి చేయాలి!

అమ్మ కడుపులో పడినప్పటి నుంచి ఆడపిల్లలకు అడుగడుగునా గండాలెన్నో పొంచి ఉంటున్నాయి. అపహరణలు, అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులతో స్త్రీలకు ఎక్కడా భద్రత లేకుండా పోతోంది. కోల్‌కతాలో వైద్య విద్యార్థిని విషాద ఉదంతం యావత్ దేశాన్నీ కన్నీటి పర్యంతం చేసింది. తాజాగా వైఎస్ఆర్ జిల్లాలో ఇంటర్ విద్యార్థినిని ఒక కిరాతకుడు అగ్నికి ఆహుతి చేశాడు. కామాంధుల కర్కశత్వానికి ముక్కుపచ్చలారని చిన్నారులూ బలవుతున్నారు. ఇంటర్నెట్‌ను ముంచెత్తుతున్న అశ్లీల వీడియోలు, మత్తు పదార్థాలు మనుషులను రాక్షసుల్లా మారుస్తున్నాయి. కేసుల పరిష్కారంలో ఎడతెగని ఆలస్యం అసుర సంతతికి అయాచిత వరమవుతోంది. మైనర్లు సైతం అత్యాచారాలకు పాల్పడుతుండటం తీవ్రంగా కలవరపరుస్తోంది. పాఠశాల దశ నుంచే నైతికవిద్యను బోధిస్తూ, మత్తుమందుల కోరల్లోంచి సమాజాన్ని రక్షించాలి. విచారణలను వేగవంతం చేసి, స్త్రీలపై దాష్టీకాలకు పాల్పడే వారికి కఠిన దండనలను విధించాలి. ఆ మేరకు పాలకుల చొరవే మహిళా సాధికారతకు మేలిమి బాటలు పరుస్తుంది!



అన్ని ప్రభుత్వ విభాగాల్లోనూ అధికార దుర్వినియోగముంది కానీ, పోలీసు శాఖలో అది ఇంకా ఎక్కువ. అందుకు కారణం- ప్రజల జీవితాలమీద, స్వేచ్ఛమీద వాళ్లకు మితి మీరిన అధికారం ఉండటమే. పోలీసుల విధినిర్వహణలో వివిధ దశల్లో విచక్షణాధికారాన్ని వాడాల్సి రావటంతో అది వారిని పక్కదారి పట్టిస్తోంది.

– ఎస్.ఆర్.శంకరన్

వ్యర్థాలే ఇంధన వనరులు



పోటెత్తుతున్న ఘన, ద్రవ వ్యర్థాలు పర్యావరణానికి పెను శాపంగా మారాయి. వాటి కారణంగా గాలి, నీరు, నేల కాలుష్యం బారిన పడుతున్నాయి. ప్రభుత్వాలు సరైన దృష్టి సారిస్తే వ్యర్థాలతో విద్యుత్తు, ఎరువులు తదితరాలను ఉత్పత్తి చేయవచ్చు.

కొన్నేళ్లుగా పట్టణీకరణ, పారిశ్రామికీకరణ ఊపందుకొన్నాయి. ప్రజల జీవన విధానంలో ఎన్నో మార్పులొచ్చాయి. దాంతో వ్యర్థాలు గుట్టలుగా పుట్టుకొస్తున్నాయి. ఇంట్లో వంట చేసేటప్పుడు వ్యర్థాలు వెలువడతాయి. తినగా మిగిలిన ఆహారం చెత్తబుట్ట పాలవుతుంది. ఇంకా పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, దుస్తులు, వ్యాపార సముదాయాల్లో కాగితాలు, ప్యాకింగ్ అట్టముక్కలు, చెక్కలు, కూరగాయలు తదితరాలన్నింటినీ చాలా చోట్ల ఇష్టారీతిగా పడేస్తున్నారు. దానివల్ల పర్యావరణం పాడవుతోంది. జన సముదాయాల్లో చేరిన చెత్తను స్థానిక సంస్థలు సేకరించి ఊరి బయట డంపింగ్ యార్డులకు తరలిస్తున్నాయి. అవి గుట్టలుగా పేరుకుపోయి భారీ స్థలాన్ని ఆక్రమిస్తున్నాయి. ఆ వ్యర్థాలు కుళ్లి తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. వర్షం కురిసినప్పుడు వాటి నుంచి మురుగు నీరు చెరువులు, నదుల్లో కలుస్తోంది. పరిశ్రమల నుంచి వెలువడే ఘన, ద్రవ, వాయు వ్యర్థాలు సైతం పర్యావరణ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. సాంకేతికతను వినియోగించుకొని కొన్ని ఘన, ద్రవ, ఇతర వ్యర్థాల ద్వారా బయోగ్యాస్ తయారు చేయవచ్చు. దాన్ని బాయిలర్లతో మండించడం ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు. తద్వారా వ్యర్థాల నుంచి ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. వ్యర్థాల నిర్వహణ ఖర్చు సైతం తగ్గుతుంది. ముఖ్యంగా పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుంది.

అన్నీ పనికొచ్చేవే!

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం దేశంలో పట్టణ, పారిశ్రామిక వ్యర్థాల రీసైక్లింగ్ ద్వారా 5690 మెగావాట్ల విద్యుదుత్పత్తి సాధించవచ్చు. దేశీయంగా పురపాలికల నుంచి రోజుకు 1.52 లక్షల మెట్రిక్ టన్నుల ఘన వ్యర్థాలు వెలువడుతున్నాయి. సేకరించిన చెత్తను కొన్ని చోట్ల విభజించి తడి చెత్తతో కంపోస్ట్ ఎరువులు, గ్యాస్ తయారు చేస్తున్నారు. పొడి చెత్తను బాయిలర్‌లో మండించడం ద్వారా ఉద్భవించే ఆవిరితో టర్బైన్లను నడిపి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఇలా మున్సిపాలిటీల ఘన, ద్రవ వ్యర్థాలతో 1622 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. చెత్త నుంచి కరెంటును తయారు చేసే కేంద్రాన్ని మొదటిసారి దిల్లీలోని తిమార్‌పుర్ ప్రాంతంలో 1987లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇలాంటివి దేశీయంగా దాదాపు పద్నాలుగు ఉన్నాయి. తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో 19 మెగావాట్ల కేంద్రాన్ని స్థాపించారు. రాష్ట్రంలో మరో నాలుగు నిర్మాణంలో ఉన్నాయి.

మార్కెట్లో ప్రతిరోజూ విక్రయించగా మిగిలిన, పాడైపోయిన వేల టన్నుల కూరగాయల నిర్వహణ పెద్ద సమస్యగా మారింది. వాటికి ప్రత్యేక రసాయనాలు జోడించి రూపొందించిన బయోగ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. లేదా ఆ గ్యాస్‌ను వంటకు వాడుకోవచ్చు. ఆ తరవాత వెలువడే వ్యర్థాలను సైతం పొలాలకు ఎరువుగా వినియోగించుకోవచ్చు. ఈ తరహా విద్యుదుత్పత్తి కేంద్రం సికింద్రాబాద్‌లోని బోయినపల్లి కూరగాయల మార్కెట్ దగ్గర వినియోగంలో ఉంది. దేశవ్యాప్తంగా మరో 14 ప్రాంతాల్లో ఇలాంటివి నడుస్తున్నాయి. ఇలా వినియోగానికి పనికిరాని కూరగాయలు, పండ్లతో 795 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఇంకా జంతు కళేబరాలు, మాంసం దుకాణాల వ్యర్థాల నుంచి మరో 633 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు. మరోవైపు, దేశంలో నిత్యం 7,236 కోట్ల లీటర్ల మురుగునీరు వెలువడుతుండగా కేవలం 20-30శాతమే పునర్వినియోగంలోకి వస్తోంది. మిగిలింది ఆరుబయట భూముల్లోకి లేదా జలవనరుల్లోకి చేరుతోంది. మురుగునీటికీ ప్రత్యేక రసాయనాలు జోడించి బయోమిథనాల్ లాంటివి ఉత్పత్తి చేస్తున్నారు. వాటిని నేరుగా అనేక పరిశ్రమల్లో వినియోగిస్తున్నారు. ఆ వాయువులను మండించీ విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవచ్చు. ఇప్పటికే దిల్లీలో ఇలాంటివి పని చేస్తున్నాయి. కోళ్లు, పశువుల పెంపకం, మద్యం తయారీ కేంద్రాలు, పామాయిల్, చెరకు దుకాణాలు, చిన్న మధ్య తరహా పరిశ్రమల్లోంచి వెలువడే వ్యర్థాల నుంచీ కరెంటును ఉత్పత్తి చేయవచ్చు.

ప్రత్యేక నిధులూ రాయితీలు...

బొగ్గుతో పోలిస్తే చెత్తను మండించినప్పుడు తక్కువ వేడి ఉద్భవిస్తుంది. వర్షాకాలంలో చెత్త సేకరణకు ఇబ్బందులు ఎదురవుతాయి. దాంతో థర్మల్ ప్లాంట్లతో పోలిస్తే చెత్తతో నడిచే కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి వ్యయం రెట్టింపు అవుతుంది. దాంతో పెట్టుబడి తిరిగి రావడానికి సుమారు 13 సంవత్సరాలు పడుతుంది. మరోవైపు, నివాసాల మధ్య ఇలాంటి వాటిని ఏర్పాటు చేయడం వల్ల ప్రజల నుంచి వ్యతిరేకతా వ్యక్తమవుతుంది. సరైన ప్రణాళిక లేకుండా స్థాపించిన కొన్ని కేంద్రాలు తరవాత మూతపడ్డాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని పటిష్ఠ ప్రణాళికతో విద్యుదుత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్, జాతీయ జల మిషన్, 'వ్యర్థం నుంచి అర్థం' లాంటి కార్యక్రమాలు ప్రవేశపెట్టింది. వాటికి ప్రత్యేక నిధులు కేటాయిస్తోంది. వ్యర్థాలతో విద్యుదుత్పత్తి కేంద్రాలు స్థాపించే వారికి పెట్టుబడిలో మెగావాట్‌కు రూ.75 లక్షల మేర రాయితీలు ఇస్తోంది. కస్టమ్స్ సుంకాలనూ మినహాయిస్తోంది. వాటిలో తయారైన విద్యుత్తును ఉత్పత్తి ధరకు కొనాలని, సరఫరా రుసుము విధించకూడదని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండళ్లు, పంపిణీ సంస్థలను ఆదేశించింది. పట్టణాలు, నగరాల్లో రోజువారీ వ్యర్థాలను స్థానిక సంస్థలు సమర్థంగా సేకరించి విద్యుదుత్పత్తి చేయవచ్చు. దీనివల్ల వ్యక్తులు, సంస్థలకు ఆదాయం సమకూరుతుంది. ముఖ్యంగా కాలుష్యం బెడద తగ్గి పర్యావరణం తేటపడుతుంది.



ఇనుగుర్తి శ్రీనివాసాచారి

విద్యుత్, ఇంధన రంగ నిపుణులు



పుల్లటి జ్ఞాపకం

దెయ్యాలన్నీ మర్రిచెట్ల ఊడలమీదనే ఉన్నట్టు రచయితలు తెగ రాసేస్తుంటారు గానీ... అసలు ఈ ఘోస్ట్ రేసులో చింత చెట్లే ముందుంటాయని ఎవరినడిగినా చెబుతారు. ఎంతసేపు 'ఊరి చివరి మర్రిచెట్టు...' అనుకుంటూ అందరూ దెయ్యాల కథలు మొదలుపెట్టడంతో చింతచెట్ల చింత అంతా ఇంతా కాదంటే నమ్మండి! చింత చిగురును చూసి 'అబ్బ పప్పులోకి ఎంత బాగుంటుందో' అని నోరూరించుకుంటూ పగలంతా ఆ చెట్టు చుట్టూరా తిరిగినా రాత్రుళ్లు అసలా చింతచెట్టు పరిసరాల్లోకి వెళ్లాలంటే గుండెలు జారిపోయిన సీన్లు ఎన్నో చిన్నప్పుడు! గుబురుగా, గుంభనంగా ఉంటూ చిటారుకొమ్మన చాక్లెట్ల లాంటి కాయలతో భలే తమాషాగా కనిపించేది. పుల్ల పుల్లగా తియ్యతియ్యగా చక్కటి చింతకాయలిస్తూ, ఆ కాయల కోసం వచ్చిపడే రాళ్ల దెబ్బలన్నీ ఓపిగ్గా కాస్తూ, ఎర్రటి ఎండలోనూ చల్లటి నీడలో ఆడుకునే ఆనందాన్ని ఇచ్చిన చింతచెట్టు రుణం ఎలా తీర్చుకోగలం?

రుణం అంటే గుర్తొచ్చింది... చింత చచ్చినా పులుపు చావలేదు అని సామెత. దాంతో అంతో ఇంతో అప్పుడప్పుడైనా చింతచెట్టును గుర్తుచేసుకుంటున్నాం కానీ... ఆ సామెత కాస్తా పొగరుబోతులను వర్ణించడానికి వాడేది కావడంతో ఇక్కడ కూడా దానికి అన్యాయమే జరుగుతోంది. అయినా ఏం, చింత చచ్చినంత మాత్రాన పులుపు కూడా వెంటనే చావాలా? ఆ మాత్రం జీవించే హక్కు దానికి లేదా అని ఎవ్వరూ ప్రశ్నించరే! అసలు చింతకో గొంతుక ఇవ్వడానికి అర్జెంటుగా 'అంతర్జాతీయ చింత అభిమాన సంఘం' పెట్టాలన్న ఆలోచన ఇప్పటివరకూ ఎవరికీ రాలేదన్న చింత తీరేదెప్పుడో..!

గిరిజనులు అడవుల్లో కొండల్లో తిరిగి, కష్టపడి సేకరించి, మైదాన ప్రాంతాలకు తెచ్చి, మణుగుల లెక్కన - తట్టల చొప్పున అమ్మే చింతపండు రుచి ఓ అద్భుతం! ఎటువంటి కల్తీలకూ తావు లేని ఆ సరకు, దాన్ని అమ్మే వారి నిష్కల్మషమైన చిరునవ్వు, ఆ చింతపండు కొనుగోలు సమయంలో పెద్దల హడావుడి.. కచ్చితంగా ఓ అందమైన 'మన్యం సంత' జ్ఞాపకం. కిలోల కొద్దీ పండు కొనుక్కుని, మధ్యమధ్యలో కాస్త నోట్లో వేసుకుని చప్పరిస్తూ ఇంటికి మోసుకొచ్చేవాళ్లం. ఆ తరవాత కొన్ని రోజులపాటు కుటుంబసభ్యులంతా వరండాలో చేరి కబుర్లాడుకుంటూ పిక్కలు తీసేవాళ్లు. శుభ్రంగా చింతపండును వేరుచేసి పెద్దపెద్ద మట్టి కుండల్లో ఏడాదికి సరిపడా సర్దుతూ, అక్కడక్కడా ఉప్పుచల్లుతూ... ఎంచక్కా నిల్వపెడితే, నెల తిరిగేసరికల్లా నల్లగా అయిపోయేది! ఇక అక్కడి నుంచి చారు నలుపు, సాంబారు నలుపు, పప్పు పులుసు నలుపు, ప్రతి పులుసూ నలుపే! రంగు నలుపైనా దాని రుచి మాత్రం పుల్లటి పులుపు.. దాన్ని ఎంతో ప్రేమగా వండిపెట్టే అమ్మ మనసేమో తెల్లని తెలుపు!!

– మౌళిక

క్షమాపుష్పం

భగవంతుడికి ఇష్టమైన పుష్పాలు ఎనిమిది. అవి అహింస, ఇంద్రియ నిగ్రహం, దయ, క్షమ, శాంతి, తపం, ధ్యానం, సత్యం. వీటిల్లో క్షమాపుష్పం భగవంతుడికి అత్యంత ప్రీతికరమైంది. క్షమ అనేది దైవీగుణం. ఇది ఉన్నవారిని సమాజం గౌరవిస్తుంది. చర్యకు ప్రతిచర్య, ఆరోపణలకు ప్రత్యారోపణ సామాన్యుల లక్షణం. ఎంతటి ఘోర అవమానాన్ని అయినా సహించడం, ఎలాంటి తప్పులు చేసిన వాళ్లనైనా క్షమించడం జ్ఞానవంతుల లక్షణం. క్షమాగుణం కొందరు భావించినట్లు బలహీనతకు సంకేతం కాదు. అది బలానికి గుర్తు. ఈ గుణం వల్లే ప్రేమతత్వం మనిషిలో వృద్ధిచెందుతుంది. క్షమను కోల్పోయిన వాళ్లు ఎన్ని అవస్థలకు గురవుతారో ఇతిహాసాలు నిరూపించాయి.

ఎవరినైనా ప్రేమిస్తే ఆ ప్రేమను తిరిగి పొందుతాం. ద్వేషిస్తే ద్వేషాన్నే పొందుతాం. గుండెలో పగను దాచుకోవడం అంటే పామున్న ఇంటిలో ఉండటమే అని భారతం బోధించింది. ఈ పగ, ప్రతీకారం అనే విషచక్రం నుంచి బయటపడాలంటే 'క్షమించడం' ఒక్కటే మార్గం. దీనివల్ల క్షమించేవారు ఆదర్శ వ్యక్తులుగా పేరు తెచ్చుకుంటారు. క్షమను పొందేవారు తమ జీవితాలను సరిదిద్దుకుంటారు. బంధువులైనా, జీవిత భాగస్వాములైనా, స్నేహితులైనా, సంతానమైనా... అందరి మధ్యా అనురాగాన్ని పండించేది ప్రేమ అయితే దాన్ని నిలబెట్టేది క్షమాగుణం. ఏది జరిగినా మన మంచికే అనే భావన ఉంటే క్షమ వృద్ధి చెందుతుంది.



అంతర్యామి

క్షమాగుణం అత్యున్నతమైన ధర్మం. ఇది మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది. ఎనలేని కీర్తిని అందిస్తుంది. మనకు అపకారం చేసినవారిని కూడా దండించే ఆలోచన లేకపోవడం, ఇతరుల అపరాధాల్ని మరిచిపోవడం గొప్ప క్షమాగుణానికి నిదర్శనం.

రామాయణంలో విభీషణుడు సోదరుడైన రావణుని ధిక్కరించి 'రామా! నేను నీవాడను' అని శరణువేడాడు. రాముడు అభయమిచ్చాడు. కాని అక్కడే ఉన్న లక్ష్మణుడు, సుగ్రీవుడు 'స్వామీ... అతడు మన విరోధి. అభయమివ్వడం మంచిది కాదు' అన్నారు. అప్పుడు రాముడు 'ఎవ్వరైనా సరే నేను నీవాడను అని శరణువేడితే వారిని రక్షిస్తాన'ని చెప్పి క్షమయే రామతత్త్వం అని నిరూపించాడు.

భారతంలో అశ్వత్థామ నిద్రపోతున్న ఉప పాండవుల గొంతులు కోసినప్పుడు, అతణ్ని బంధించి ద్రౌపది ముందు నిలబెడతాడు అర్జునుడు. అశ్వత్థామను దండించబోయిన అర్జునుడితో 'నేను బిడ్డల్ని పోగొట్టుకొని దుఃఖిస్తున్నాను. మీరు అశ్వత్థామను శిక్షిస్తే అతని తల్లి కూడా నాలాగే దుఃఖిస్తుంది. అతణ్ని క్షమించి ప్రాణాలతో వదిలిపెట్టండి' అంటుంది ద్రౌపది. మూర్తీభవించిన క్షమకు ప్రతీకగా నిలుస్తుంది.


క్షమాగుణం అత్యంత పవిత్రమైంది. అది అనేక దుర్మార్గాలను నివారిస్తుంది. క్షమను సాధించిన వ్యక్తులు జీవితంలో ఎన్నో విజయాలను సాధించారు. అయితే, ఒక్క దైవ చింతనవల్లే క్షమా గుణాన్ని సాధించడం వీలవుతుంది. అందుకే ప్రతి మనిషి సద్భావనలతో దైవానుగ్రహాన్ని పొందడానికి ప్రయత్నించాలి. అప్పుడే అందరినీ ప్రేమిస్తూ సమభావన కలిగి ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతాం.

– విశ్వనాథ రమ



పాపం పసివాళ్లు!


చాలీచాలని ఆదాయాలతో అనేక కుటుంబాలు అల్లాడుతున్నాయి. పోషకాహారానికీ నోచుకోలేకపోతున్నాయి. ఫలితంగా ఆ కుటుంబాల్లోని పిల్లలు ఎదుగుదల లోపాల బారినపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎత్తుకు తగిన బరువు లేని పిల్లలు అత్యధికంగా ఉన్నది ఇండియాలోనే. అలాంటి చిన్నారులు ఏ దేశంలో ఎంత శాతం మేరకు ఉన్నారంటే...



(ఆధారం: గ్లోబల్ హంగర్ ఇండెక్స్ - 2024)

లంకలో పెత్తనమెవరిది?

సిలోన్ (నేటి శ్రీలంక) 1948లో బ్రిటిష్ వలస పాలన నుంచి స్వాతంత్ర్యం పొందింది. రాజప్రతినిధిగా గవర్నర్ జనరల్, ప్రభుత్వ నాయకుడిగా ప్రధానమంత్రి వ్యవహరించే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అక్కడ ఏర్పడింది. 1972లో కొత్త గణతంత్ర రాజ్యాంగాన్ని తెచ్చి సిలోన్ పేరును శ్రీలంకగా మార్చారు. అలంకార ప్రాయమైన దేశాధ్యక్ష పదవితో పార్లమెంటరీ రిపబ్లిక్‌గా శ్రీలంక నిలిచింది. పాలనాధికారాలు ప్రధానమంత్రి చేతిలోనే ఉండేవి. 1978లో రెండో రాజ్యాంగ సవరణ ద్వారా లంకలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో పాక్షిక అధ్యక్ష పాలనా వ్యవస్థను తీసుకొచ్చారు. ఫలితంగా అధ్యక్షుడే గణతంత్ర రాజ్యాధిపతిగా, ప్రభుత్వ నాయకుడిగా, సర్వసైన్యాధ్యక్షుడిగా వ్యవహరించసాగారు. పార్లమెంటును రద్దు చేసే అధికారమూ అధ్యక్షుడికి దఖలుపడింది. ప్రధాని పదవి దేశాధ్యక్షుడి సహాయక పాత్రకు పరిమితమైంది.



శ్రీలంక నూతన అధ్యక్షుడిగా ఇటీవల అనుర కుమార దిసనాయకే ఎన్నికయ్యారు. ఆయన సభ్యుడిగా ఉన్న పాలక నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) కూటమి తన ఎన్నికల ప్రణాళికలో కార్యనిర్వాహక అధ్యక్ష పదవిని రద్దు చేస్తామని చెప్పింది. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా కొత్త రాజ్యాంగాన్ని రూపొందిస్తామని హామీ ఇచ్చింది. దాన్ని అది నిలబెట్టుకుంటుందా?

మళ్లీ మొదటికి...

ఆర్థిక అనిశ్చితి, సింహళ-తమిళ కలహాల నేపథ్యంలో శ్రీలంకలో సుస్థిరత నెలకొల్పడానికి 1978లో జేఆర్ జయవర్ధనే నేతృత్వంలోని యునైటెడ్ నేషనల్ పార్టీ (యూఎన్‌పీ) ప్రభుత్వం కార్యనిర్వాహక అధ్యక్ష పదవిని ప్రవేశపెట్టింది. పత్రికల గొంతు నొక్కడం, ప్రతిపక్షాలను అణచివేయడం, ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేయడం వంటి పెడ ధోరణులు పెరిగాయి. పార్లమెంటు ప్రాముఖ్యం తగ్గింది. కార్యనిర్వాహక అధ్యక్షులు ఇష్టారాజ్యంగా అధికారాన్ని చలాయించడంతో సింహళ-తమిళ జాతి ఘర్షణలు పేట్రేగాయి. న్యాయమూర్తుల నియామకం కూడా అధ్యక్షుడి చేతిలో ఉండటం న్యాయ వ్యవస్థ నిష్పాక్షికతను దెబ్బతీసింది. కుటుంబ సభ్యులు, బంధువులు, అంతేవాసులు, మిత్రపక్షాల ప్రతినిధులకు పదవులు, విలువైన కాంట్రాక్టులు కట్టబెట్టడం ఎక్కువైపోయింది. ఫలితంగా కార్యనిర్వాహక అధ్యక్ష పెత్తనానికి స్వస్తి పలకాలనే భావన మొదలైంది. కార్యనిర్వాహక అధ్యక్ష పదవిని రద్దు చేస్తేనే పార్లమెంటు పూర్వ ఔన్నత్యాన్ని పొందగలుగుతుందని, పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని ప్రజాస్వామ్యవాదులు నినదించారు. ఈ క్రమంలో 2001లో 17వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉన్నత స్థాయి న్యాయమూర్తులు, ఎన్నికల సంఘం, అవినీతి నిరోధక కమిషన్ వంటి స్వతంత్ర సంఘాలకు నియామకాలు జరపడంలో కార్యనిర్వాహక అధ్యక్షుడి అధికారాలను తగ్గించారు. అయితే, అధ్యక్ష పదవిని రెండుసార్లకు మించి చేపట్టకూడదనే నిబంధనను తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనికోసం 2010లో మహింద రాజపక్స 18వ రాజ్యాంగ సవరణ తెచ్చారు. అలా 2015లో మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయగలిగారు. కానీ, ఆ ఎన్నికలో ఆయన మైత్రిపాల సిరిసేన చేతిలో ఓడిపోయారు. సిరిసేన ప్రభుత్వం 2019లో రాజ్యాంగ సవరణ చేసి అధ్యక్ష పదవికి రెండుసార్లకు మించి పోటీ చేయకూడదనే నిబంధనను పునరుద్ధరించింది. దేశాధ్యక్షుడి పదవీకాలాన్ని ఆరేళ్ల నుంచి అయిదేళ్లకు కుదించింది. అధ్యక్షుడి చేతిలో కేంద్రీకృతమైన అధికారాల్లో కొన్నింటిని పార్లమెంటుకూ, స్వతంత్ర కమిషన్లకు మళ్లీ బదిలీ చేసింది. కానీ, 2020లో అధ్యక్షుడు గొటబాయ రాజపక్స రాజ్యాంగ సవరణ తెచ్చి అధ్యక్షుడి అధికారాలను పునరుద్ధరించి, పదవీ కాలంపై ఆంక్షలను తొలగించారు. దాంతో కథ మళ్లీ మొదటికొచ్చింది.

మెజారిటీ సాధిస్తే...


శ్రీలంక 2022లో ఆర్థిక సంక్షోభంలోకి జారిపోవడం రాజకీయ ఉద్యమానికి దారితీసింది. అధ్యక్షుడి అధికారాలకు కత్తెర వేయాలని ఉద్యమకారులు పట్టుపట్టారు. చివరకు గొటబాయ రాజీనామా చేయడంతో కొత్త అధ్యక్షుడిగా రణిల్ విక్రమసింఘేను పార్లమెంటు ఎన్నుకుంది. అధ్యక్షుడికన్నా పార్లమెంటే ఉన్నతమంటూ 2022 అక్టోబరులో రాజ్యాంగ సవరణ తెచ్చారు. ఇటీవల దిసనాయకే అధ్యక్షుడయ్యాక తన పార్టీ జనతా విముక్తి పెరమున (జేవీపీ)కి చెందిన హరిణి జయసూర్యను ప్రధానమంత్రిగా నియమించారు. మార్క్సిస్టు పార్టీ అయిన జేవీపీ- పాలక ఎన్‌పీపీ సంకీర్ణంలో భాగస్వామిగా ఉంది. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఎన్‌పీపీ మెజారిటీ సాధిస్తే, ముందే వాగ్దానం చేసిన ప్రకారం కొత్త రాజ్యాంగ రచనకు ఉపక్రమించవచ్చు. కార్యనిర్వాహక అధ్యక్ష పదవిని రద్దు చేయవచ్చు. ఒకవేళ ఇతర పార్టీ లేదా కూటమి గెలిస్తే కార్యనిర్వాహక అధ్యక్ష పదవిని కొనసాగిస్తుందా లేదా అన్నది ఆసక్తికరమైన అంశం.

– అరుణిమ్ భుయాన్

ప్రాణమున్న రాళ్లు!

హాయ్! బుజ్జీ!!

రోమేనియాలోని ఓ కుగ్రామమైన కోస్టెస్టిలో కనిపించే ఈ రాళ్లను 'ట్రోవాంట్స్' అంటారు. పెరుగుతున్న రాయి అని రోమేనియన్ భాషలో ఈ పదానికి అర్థం. ఈ రాళ్లు పెరగడంతో పాటు, కదులుతాయట కూడా! నిజానికి ఈ మాయకు కారణం ఖనిజాలు. ఈ ట్రోవాంట్లు ఇసుక పొరతో కప్పి ఉంటాయి. ఇవి వాన నీటిలో ఉండే.. కాల్షియం కార్బొనేట్, ఇతర ఖనిజాలను గ్రహిస్తాయి. అవి రాయిపైన పొరలు పొరలుగా సిమెంట్‌లా ఏర్పడతాయి. ఇలా ఈ లివింగ్ స్టోన్స్ పెరుగుతుంటాయి. కానీ ఈ పెరుగుదల రేటు చాలా చాలా నెమ్మదిగా ఉంటుంది. వెయ్యి సంవత్సరాల్లో కేవలం 4 నుంచి 5 సెంటీమీటర్ల వరకు




మాత్రమే పెరుగుతాయి. ఇక ఈ రాళ్ల కదలిక విషయానికి వస్తే... ఈ వేగం కూడా చాలా తక్కువగా ఉంటుంది. కొంతమంది శాస్త్రవేత్తలు ఈ విషయంలో మాత్రం కాస్త సందేహం వ్యక్తం చేశారు. వాతావరణం కారణంగా మట్టి వేడెక్కడం, చల్లబడటం వల్ల రాళ్ల మధ్య కదలిక వచ్చే అవకాశం ఉండొచ్చని చివరికి ఓ అభిప్రాయానికి వచ్చారు.

ఈ రాళ్లు కూడా అన్నీ ఒకే ఆకారంలో ఉండవు. కొన్ని పుట్టగొడుగుల్లా ఉంటే, మరికొన్ని పలు జంతువుల రూపాల్లో ఉంటాయి. వీటిని మధ్యలోకి పగలగొట్టినప్పుడు అచ్చం చెట్టు కాండంలో ఉండే వలయాల్లాంటి నిర్మాణాలు శాస్త్రవేత్తలకు కనిపించాయి. రాళ్ల వయసు దాదాపు ఆరు మిలియన్ సంవత్సరాలు ఉండొచ్చని తేల్చారు. వీటికి యునెస్కో గుర్తింపూ దక్కింది. మరో విషయం ఏంటంటే.. ఇలాంటి ట్రోవాంట్లు కొన్ని రష్యా, టర్కీ, అమెరికాలాంటి దేశాల్లోనూ అక్కడక్కడా కనిపిస్తాయట. నేస్తాలూ! మొత్తానికి ఇవీ ఈ జీవశిలల విశేషాలు. భలే ఉన్నాయి కదూ!

పదవలయం

కింద ఇచ్చిన ఆధారాలతో వచ్చే పదాలను కనిపెట్టండి. అన్ని పదాలు 'వి' అక్షరంతోనే ప్రారంభం అవుతాయి.



1. విధేయతలాంటిది! 2. గెలుపు 3. శత్రువును ఇలా కూడా అనొచ్చు 4. విశ్రాంతి మరోలా.. 5. ఓ ప్రయాణ సాధనం 6. ధర 7.తీవ్రమైన బాధ 8.ఆనందం, సంబరం


అభ్యర్థిని తనిఖీ చేస్తున్న పోలీసు


ఎల్బీనగర్‌లో గేట్లు మూసేయడంతో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు చెందిన వినీత్ కంటతడిపెడుతూ వెనుదిరిగారు


కోఠి ఉమెన్స్ కళాశాలలో పరీక్షకు హాజరైన అభ్యర్థులు, తల్లిదండ్రులు


పోలీసులతో మాట్లాడుతున్న యువకుడు


గోడ దూకి వెళ్లేందుకు యత్నం

రసూల్‌పుర, న్యూస్‌టుడే: ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన మహ్మద్ సిరాజ్ ప్రభాత్ పీజీ కళాశాలలోని పరీక్ష కేంద్రానికి రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చాడు. దీంతో పోలీసులు అతన్ని లోనికి అనుమతించలేదు. వారిని బతిమిలాడినా.. ఫలితం లేకపోవడంతో పరీక్ష కేంద్రం గోడ దూకి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని బేగంపేట ఠాణాకు తరలించారు.


షేక్‌పేట నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాల వద్ద పరుగులు పెడుతున్న అభ్యర్థి

కట్టుదిట్టం.. పరీక్ష ప్రశాంతం

గ్రూప్-1 ప్రధాన పరీక్షలు మొదటిరోజైన సోమవారం ప్రశాంతంగా జరిగాయి. జీవో నంబరు 29 రద్దు చేయాలనే డిమాండ్‌తో జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రభుత్వం ముందస్తుగా పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించలేదు. -న్యూస్‌టుడే బృందం



కంటతడి పెట్టి.. స్పృహ తప్పి

బేగంపేట: జోగులాంబ గద్వాల్ జిల్లా దారూర్‌కు చెందిన లతమ్మ బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని సెంటర్‌లో పరీక్ష రాసేందుకు భర్త బుచ్చన్నతో కలిసి వచ్చారు. ఏడు నిమిషాలు ఆలస్యంగా చేరుకోవడంతో పోలీసులు అనుమతించలేదు. దీంతో ఆ దంపతులు బోరున విలపించారు. చివరికి లతమ్మ స్పృహ తప్పి పడిపోవడంతో అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

దివ్యాంగులకు ధైర్యంగా

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి పరిధిలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివ్యాంగులకు ప్రత్యేకంగా కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులు వారి కుటుంబీకులు, సహాయకులతో కేంద్రానికి చేరుకున్నారు. వారికి ధైర్యం చెప్పి కేంద్రంలోకి పంపించారు.


కుమారుడికి చదివి వినిపిస్తున్న తండ్రి


పరీక్ష ఎలా రాయాలని సూచనలు చేస్తున్న తల్లి

నిషేధిత జాబితాలో వందలాది లేఅవుట్లు

- హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో వివరాలు
- ఎల్‌ఆర్‌ఎస్‌కు సైతం అడ్డంకిగా మారిన వైనం
- లెక్క తేల్చాలని కమిషనర్ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ పరిధిలో వందలాది పంచాయతీ లేఅవుట్లు నిషేధిత జాబితాలో చేర్చడంపై తీవ్ర చర్చనీయాంశమవుతోంది. కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో ఈ జాబితా చక్కర్లు కొడుతోంది. దీనిపై రకరకాలుగా వదంతులు షికార్లు చేస్తుండటంతో ఆయా లేఅవుట్ల యజమానులు బెంబేలెత్తుతున్నారు. హెచ్‌ఎండీఏ కార్యాలయానికి పరుగులు పెడుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ జాబితాపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మంగళవారం డైరెక్టర్లతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. హెచ్‌ఎండీఏ ఏర్పడకముందు గతంలో వందలాది పంచాయతీ లేఅవుట్లు వెలశాయి. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలోని గుర్రంగూడ, నాదర్‌గుల్, బాలాపూర్, రాగన్నగూడ, తుర్కయాంజిల్, కమ్మగూడ, మన్నెగూడ, అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట్, ఆదిభట్ల, మంగల్‌పల్లి తదితర ప్రాంతాల్లో వందలాది పంచాయతీ లేఅవుట్లు వేసి విక్రయించారు. హెచ్‌ఎండీఏ వచ్చిన తర్వాత ఈ లేఅవుట్లలో కొన్ని క్రమబద్ధీకరించారు. ఇందులో పెద్దపెద్ద బహుళ అంతస్తుల భవనాలు వెలశాయి. ఇవన్నీ ప్రస్తుతం నగరానికి సమీపంలో ఉన్నాయి. ఇక్కడ భూముల ధరలు సైతం భారీగా ఉన్నాయి. అయితే ఇంకా కొన్ని లేఅవుట్లను క్రమబద్ధీకరించలేదు. దీంతో గతంలో చాలామంది రూ.1000 చెల్లించి అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) కోసం దరఖాస్తు చేశారు. ఇంతలోనే అకస్మాత్తుగా ఈ నిషేధిత జాబితా తెరపైకి రావడంతో దరఖాస్తుదారులు అవాక్కవుతున్నారు.



ఆందోళనలో యజమానులు..: ఈ పంచాయతీ లేఅవుట్లని ఏపీ రిజిస్ట్రేషన్ చట్టం 2007 నంబరు 19, సెక్షన్ 22ఎ(1)(ఈ) కింద నిషేధిత జాబితాలో పెట్టడంతో దరఖాస్తుదారులంతా హెచ్‌ఎండీఏ అధికారులను సంప్రదిస్తున్నారు. భూముల క్రయవిక్రయాల సమయంలో ఈ భూములను రిజిస్ట్రేషన్ చేయరు. ప్రభుత్వ, ఇతర వివాదాలున్న వాటిని ఈ జాబితాలో సర్వే నంబర్లతో సహా చేర్చుతున్నారు. ఆయా సర్వే నంబర్లలోని ఆస్తిని ఎవరైనా రిజిస్ట్రేషన్‌కు ముందుకు వస్తే వెంటనే అధికారులు అడ్డుకోవడానికి వెసులుబాటు కల్పించారు. తాజాగా పంచాయతీ లేఅవుట్లు ఈ జాబితాలో కనిపించడంతో ఆయా భూముల యజమానులంతా బెంబేలెత్తుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కింద క్రమబద్ధీకరణ చేసుకోవడానికి తిరస్కరించే అవకాశముంది.

ప్రజావాణికి హెచ్‌వోడీలు తప్పనిసరిగా రావాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

ఈనాడు డిజిటల్,హైదరాబాద్: నగరంలో అక్రమ నిర్మాణాలను నియంత్రించడంపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశించారు. జీహెచ్‌ఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమానికి హెచ్‌వోడీలు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో ఎక్కువగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందిన ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అక్రమ నిర్మాణాలను పూర్తిగా నియంత్రించేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కోర్టు కేసులన్నింటినీ సమీక్షించాలని లీగల్ అధికారికి సూచించారు. ఆరోగ్య విభాగానికి సంబంధించిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఇతర అన్ని అంశాలను రెగ్యులర్‌గా సమీక్షించాలని సీఎంహెచ్‌వోను ఆదేశించారు.


అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

వినతులు 202: జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 51 అర్జీలు రాగా, ఆరు జోన్లకు సంబంధించి 151 అర్జీలు వచ్చాయి. అందులో టౌన్‌ప్లానింగ్ 22, పన్నుల విభాగానికి 9 చొప్పున ఫిర్యాదులు అందాయి. శేరిలింగంపల్లి జోన్‌కు 21, ఎల్బీనగర్ 35, చార్మినార్ 13, కూకట్‌పల్లి 55, సికింద్రాబాద్ జోన్‌వి 23, ఫోన్‌ఇన్ ద్వారా 6 ఫిర్యాదులు అందాయి.

అపవాదు తొలగించుకుందాం.. నగర సమస్యలు పరిష్కరిద్దాం..

- నాలాలు-ట్రాఫిక్‌పై హైడ్రా ప్రధాన దృష్టి
- చెరువుల సుందరీకరణ-పార్కుల ఆక్రమణలపై కార్యాచరణ

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: నగరంలోని సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని హైడ్రా నిర్ణయించింది. నెల రోజులుగా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివిధ రంగాల నిపుణులతో సమావేశాలు నిర్వహిసూ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కూల్చివేతల కోసమే హైడ్రా ఏర్పడిందన్న ముద్రను చెరిపివేసుకోవాలన్న భావనతో అధికారులున్నారు. దీంతో కూల్చివేతలు తాత్కాలికంగా ఆపేయాలని నిర్ణయించారు. ఈలోగా నగర సమస్యలపై దృషిసారించనున్నారు.



విపత్తుల నిర్వహణపై శిక్షణ

గత ప్రభుత్వ హయాంలో నగరంలో భారీ వర్షాలు కురిసినా, ఇతర ఉపద్రవాలు వచ్చినా తక్షణ చర్యలకు కార్యాచరణ రూపొందించారు. సుమారు వెయ్యి మంది ఉద్యోగులను తీసుకున్నారు. ఈ విభాగం నగర అవసరాలకు పెద్దగా ఉపయోగపడకపోవడంతో ప్రస్తుతం హైడ్రాలో విలీనం చేశారు. వీరు విపత్తుల సమయంలో పోలీసులతో కలిసి పని చేసేలా శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించారు. వర్షాలకు రోడ్లపై చేరిన నీటిని నాలాల్లోకి మళ్లించడం, ట్రాఫిక్ నియంత్రణలో వీరి సేవలు వినియోగించుకుంటారు.

ట్రాఫిక్‌పై విద్యార్థులతో సర్వే

రాజధానిలో నిత్యం 50 లక్షలకు పైగా వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా గంటల తరబడి రోడ్లపైనే ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసు, బల్దియా అధికారులతో కలిసి దీనికో పరిష్కారించాలని భావిస్తున్నారు. ఇందుకోసం రెండు విద్యా సంస్థలకు సర్వే బాధ్యతలు అప్పగించారు. పరిష్కారాలపై సీఎం రేవంత్‌రెడ్డికి ఓ నివేదిక సమర్పించి.. చర్యలు తీసుకోవాలనుకుంటున్నారు.

ఉన్న చెరువు రక్షించి..

నేషనల్ రిమోట్ సెన్సింగ్ విభాగం తీసిన ఫొటోలు, మ్యాప్‌లతో చెరువు వాస్తవ విస్తీర్ణం, మొత్తం చరిత్రను తీసి నిక్షిప్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. చెరువులపై ఉన్న ఆక్రమణల్లో దాదాపు 85 శాతం నిర్మాణాలకు అనుమతులున్నాయి. వీటిని కూల్చడం సాధ్యం కాదని, ఉన్న చెరువును పరిరక్షించాలని హైడ్రా నిర్ణయించింది. కొన్ని చెరువుల సుందరీకరణను నవంబరులో మొదలుపెట్టాలని చూస్తున్నారు.

నాలాల విస్తరణ.. ముంపునకు అడ్డుకట్ట

నగరంలో సుమారు 1200 కి.మీ.ల మేర నాలాలు ఉన్నాయి. వీటిపై సుమారు 15 వేల నిర్మాణాలున్నాయని గతంలో అధికారులు లెక్కతేల్చారు. వీటిని కూల్చడం సర్కార్‌కు అసాధ్యం. చాలావాటికి బల్దియా అనుమతులున్నాయి. బాధితులకు పరిహారం ఇవ్వాలంటే రూ.వేల కోట్లు కావాలి. పెద్ద నాలాల పరిధిలో సుమారు 1400 చోట్ల మూడొంతులు ఆక్రమణకు గురై వర్షం నీరు కిందికి వెళ్లడం లేదు. వీటిని తొలగించి నాలాలను విస్తరిస్తే ముంపు సమస్య ఉండదు. బల్దియాతో కలిసి దశలవారీగా ఈ పనులు చేపట్టడానికి హైడ్రా సిద్ధమైంది.

కాలనీ సంఘాలకే బాధ్యత

నగరంలో వందలాది పార్కులు ఆక్రమణలకు గురయ్యాయి. వీటి తొలగింపునకు కార్యాచరణను రూపొందిస్తున్నారు. పార్కుల నిర్వహణ బాధ్యతను స్థానిక కాలనీ సంఘాలకే అప్పగించాలని అనుకుంటున్నారు.

డొక్కు వాహనాలకు చెల్లు

✷ సాకారం కానున్న ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ కేంద్రాలు ✷ గ్రేటర్‌లో 4 ప్రాంతాల్లో ఏర్పాటుకు సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్: వాహనాల ఫిట్‌నెస్‌లో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. ప్రయాణికుల ప్రాణాలకు భరోసా దక్కనుంది. గ్రేటర్‌లో ప్రజా, సరకు రవాణా వాహనాల తనిఖీలకు ఆటోమేటెడ్ వాహన ఫిట్‌నెస్ కేంద్రాలు అందుబాటులో రానున్నాయి. తాజాగా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించిన నేపథ్యంలో ఈ కేంద్రాల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. గతంలో ప్రతిపాదనల వద్ద ఆగిన వీటికి కార్యాచరణ సిద్ధం కానుంది.



నగరం నలువైపులా..

- గ్రేటర్ పరిధిలో నలువైపులా నాలుగు కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు. ఒక్కో కేంద్రానికి రూ.8 కోట్ల వరకు వెచ్చించనున్నారు.
- గ్రేటర్‌వ్యాప్తంగా 80 లక్షల వాహనాలున్నాయి. ఇందులో ఆటోలు, బస్సులు, మినీ బస్సులు, ట్రావెల్ బస్సులు, ఇతర రవాణా వాహనాలు ఏటా ఫిట్‌నెస్ ధ్రువీకరణ తీసుకోవాలి. అప్పుడే రోడ్లపైకి అనుమతించనున్నారు.
- ప్రస్తుతం ఈ తనిఖీలు మాన్యువల్‌గా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు చేస్తుండగా.. సక్రమంగా సాగడం లేదనే ఆరోపణలున్నాయి. కొన్నిసార్లు వాహనాలకు ఫిట్‌నెస్ లేకున్నా సరే. . చూసీచూడనట్లు ఉంటున్నారు.
- తూతూ మంత్రంగా తనిఖీలు చేసి ధ్రువీకరణ జారీ చేస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు.
- పాఠశాలల బస్సులకు సైతం సక్రమంగా ఫిట్‌నెస్ ధ్రువీకరణ జరగడం లేదు. డొక్కు బస్సులు, వ్యాన్ల వల్ల విద్యార్థుల ప్రాణాలు గాల్లో దీపంలా మారుతున్నాయి.
- టైర్ల నుంచి బ్రేకుల వరకు ఆటోమేటెడ్ కేంద్రాల్లో పరిశీలించనున్నారు.
- సికింద్రాబాద్, నాగోలు, ఉప్పల్, కొండాపూర్ ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా నలువైపులా అందరికి అందుబాటులో ఉంటాయని భావిస్తున్నారు. ఆటోమొబైల్ రీసెర్చ్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్‌ఏఐ) నిబంధనలకు అనుగుణంగా ఈ కేంద్రాలను తీర్చిదిద్దనున్నారు.

ఇక నుంచి తనిఖీలిలా..

- కంప్యూటర్లే వాహనాలను పూర్తిగా విశ్లేషిస్తాయి. ఇంజిన్ సామర్థ్యం, బ్రేకులు, టైర్లు కీలకమైన భాగాలతోపాటు వైపర్లు, సైడ్ మిర్రర్‌లు, షాక్ అబ్జర్వర్లు, డైనమో, బ్యాటరీ తదితర 40 అంశాలను అన్ని కోణాల్లో పరిశీలిస్తాయి. ఎలక్ట్రికల్, మెకానికల్ లోపాలు ఇట్టే తెలిసిపోతాయి.
- వాహనాల నుంచి వెలువడిన పొగలో కాలుష్య కారకాలను గుర్తించి పొల్యూషన్ అండ్ కంట్రోల్(పీయూసీ) ధ్రువీకరణ అర్హత ఉన్నది లేనిదీ ఆటోమేషన్‌లోనే గుర్తించి నివేదిక ఇస్తాయి.
- గంటలో ఒక్కో కేంద్రంలో 25-30 వాహనాల వరకు తనిఖీలు నిర్వహించేలా తీర్చిదిద్దుతున్నారు. పూర్తి స్థాయిలో కంప్యూటరీకరించిన ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు.
- తనిఖీలు తర్వాత వాహన ఫిట్‌నెస్‌పై కంప్యూటర్లే ఆటోమేటిక్‌గా స్కోరు అందిస్తాయి. ఇంజిన్, టైర్లు ఇతర లోపాలుంటే కొత్త విడి భాగాలను బిగించి మళ్లీ ఫిట్‌నెస్ నిర్వహించనున్నారు.
- ప్రస్తుతం మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు నిర్వహించే ఫిట్‌నెస్ తనిఖీల్లో శాస్త్రీయత ఉండటం లేదు. కాలం చెల్లిన డొక్కు వాహనాలకూ ఫిట్‌నెస్ ఉన్నట్లు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. తర్వాత ఇవే ప్రమాదాలకు కారణమవుతున్నాయి.
- ఆటోమేటెడ్ వాహన ఫిట్‌నెస్ కేంద్రాల ధ్రువీకరణతో డొక్కు వాహనాలకు ఇక కాలం చెల్లినట్లే.

ముందస్తు దీపావళి.. చిన్నారుల ఆనంద కేళి



మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో టీచ్ ఫర్ ఛేంజ్ నిర్వాహకులు, నటి మంచు లక్ష్మి ముందస్తు దీపావళి సంబరాలు చేసుకున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



వెలుగుల వేడుకకు వేళాయె

దీపాల పండగకు నగరం సిద్ధమవుతోంది. బొమ్మల కొలువుకు అవసరమైన సామగ్రితో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వివిధ డిజైన్లలో ప్రమిదల కొనుగోళ్లు పెరిగాయి.

పక్కాగా నీటి లెక్క



రిజర్వాయర్ల వద్ద ఫ్లో మీటర్లకు యోచన

ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా భారీ ఎత్తున జరుగుతున్న నీటి పంపిణీ నష్టాలకు అడ్డుకట్ట వేసేందుకు జలమండలి ప్రణాళిక సిద్ధం చేస్తోంది. లీకేజీలతోపాటు నీటి బిల్లులు చెల్లించకపోవడంతో జలమండలి పెద్దఎత్తున రెవెన్యూ నష్టాలను మూటగట్టుకుంటోంది. బిల్లుల ఎగవేత నష్టాలకు తోడు 10-15 శాతం లీకేజీలు సైతం తోడవుతున్నాయి. వీటిని అరికట్టేందుకు జలమండలి తాగునీటి ఆడిట్ చేపట్టేందుకు సిద్ధమవుతోంది. త్వరలో అందుబాటులోకి రానున్న ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టులో భాగంగా ఈ ఆడిట్‌ను చేపట్టనున్నారు. తొలుత ప్యాకేజీ-2లోని ఉస్మాన్‌నగర్‌లో నిర్మిస్తున్న 4 మిలియన్ లీటర్లు, రెండు మిలియన్ లీటర్లు సామర్థ్యం ఉన్న జంట రిజర్వాయర్ల పరిధిలో అమలు చేయనున్నారు.

ఎలా చేస్తారంటే...

- ప్రస్తుతం అవుటర్ రింగ్ రోడ్డు వరకు జలమండలి తాగునీటిని సరఫరా చేస్తోంది. దాదాపు 13 లక్షల నల్లాలకు రోజు విడిచి రోజు నీటిని అందిస్తోంది. దీనికోసం దాదాపు 9 వేల కిలోమీటర్ల తాగునీటి సరఫరా వ్యవస్థ ఉంది. నగరం చుట్టూ 225 వరకు సర్వీసు రిజర్వాయర్లు అందుబాటులో ఉన్నాయి.
- పాత పైపులైన్ల వ్యవస్థ, అక్రమ నల్లాలు ఇతరత్రా కారణాలతో చాలా ప్రాంతాల్లో లీకేజీలు అవుతున్నాయి. కొన్నిసార్లు చాలామంది బిల్లులు చెల్లించడం లేదు. వీటిని రెవెన్యూ నష్టాలుగా జలమండలి పరిగణిస్తోంది.
- ఇప్పటివరకు ఆడిట్ లేకపోవడంతో నీటి వృథా ఎంతవుతుందో లెక్క తేలడం లేదు. దీన్ని కనిపెట్టేందుకు ప్రతి రిజర్వాయర్‌తోపాటు వినియోదారులకు సరఫరా చేసే డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలో చివరి పాయింట్ వద్ద ఫ్లో మీటర్లు ఏర్పాటు చేయనున్నారు.
- రిజర్వాయర్ నుంచి ఎంత నీళ్లు బయటకు వస్తున్నాయి. ఇంటి వరకు ఎంత నీళ్లు సరఫరా అవుతున్నాయో ఇవి లెక్కకడతాయి. ఫలితంగా లీకేజీలను ఇట్టే గుర్తించే వెసులుబాటు కలగనుంది.
- లీకేజీల రూపంలో ఎక్కువ నీళ్లు వృథా అవుతున్నట్లు గురిస్తే...ఆయా ప్రాంతాల్లో లీకేజీలు అరికట్టడం లేదంటే పాత పైపులు స్థానంలో కొత్త పైపులు ఏర్పాటు చేస్తారు.

24, 25 తేదీల్లో నీటి సరఫరా బంద్

ఈనాడు, హైదరాబాద్: నగరానికి తాగునీటిని అందించే కృష్ణా ఫేజ్-3లో 2375 ఎంఎం వ్యాసం ఉన్న పంపింగ్ మెయిన్‌కు భారీ చిల్లులు ఏర్పడినట్లు తెలుస్తోంది. మరమ్మతులు చేసేందుకు ఈ నెల 24, 25 తేదీల్లో ఫేజ్-3 వ్యవస్థను షట్‌డౌన్ చేయనున్నారు. ఫలితంగా నగరంలోని పలు ప్రాంతాల్లో రెండు రోజులు నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు జలమండలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఫలితంగా శాస్త్రిపురం, బండ్లగూడ, భోజగుట్ట, ఫిలింనగర్, ప్రశాసన్‌నగర్, తట్టిఖానా, లాలాపేట్, సాహెబ్‌నగర్, ఆటోనగర్, సరూర్‌నగర్, వాసవి రిజర్వాయర్ల ప్రాంతం, సైనిక్‌పురి, మౌలాలి, గచ్చిబౌలి, మాదాపూర్, అయ్యప్పసొసైటి, కావూరిహిల్స్, స్నేహపురి, కైలాసగిరి, దేవేంద్రనగర్, మధుబన్, దుర్గానగర్, బుద్వేల్, సులేమాన్‌నగర్, గోల్డెన్‌హైట్స్, 9 నంబర్, కిస్మత్‌పూర్, గంధంగూడ, బోడుప్పల్, మల్లికార్జునగర్, మాణిక్‌చంద్, చెంగిచర్ల, భరత్‌నగర్, షిర్డాదిగూడ, పెద్దఅంబర్‌పేట్, ధర్మసాయి(శంషాబాద్)ల్లో సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొంది.

రూ.30వేలు చెల్లించండి

పార్కింగ్ నిర్వాహకులు, హెచ్‌ఎండీఏను ఆదేశించిన కమిషన్

ఈనాడు, హైదరాబాద్: కూకట్‌పల్లి గాయత్రినగర్‌కు చెందిన హరిక్రిష్ణ 2022 అక్టోబర్ 8న తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను రూ.20లు చెల్లించి పార్కింగ్‌లో ఉంచి కుటుంబంతో ఎన్టీఆర్ గార్డెన్‌కి వెళ్లి వచ్చేలోగా బండి కనిపించలేదు. సైఫాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. రెండు నెలల తర్వాత వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని అప్పగించగా అప్పటికే అది పూర్తిగా పాడైపోయింది. మరమ్మతులకు ఫిర్యాదీకి రూ.28వేలు ఖర్చయ్యాయి. పార్కింగ్ నిర్వహణదారు, లైసెన్స్ ఇచ్చిన హెచ్‌ఎండీఏ నిర్లక్ష్యం కారణంగానే తన వాహనం పోయిందని, పైగా మరమ్మతులతో నష్టపోయానంటూ రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు, సాక్ష్యాధారాలు పరిశీలించిన కమిషన్.. ఫిర్యాదీ మానసిక వేదనకు పరిహారం రూ.25వేలు, కేసు ఖర్చులు రూ.5వేలు చెల్లించాలని ఆదేశించింది.

రూ.3 కోట్ల విలువైన గంజాయి.. డ్రగ్స్ దహనం

ఎక్సైజ్ శాఖ అధికారుల సమక్షంలో నిప్పు

అబిడ్స్, నందిగామ, న్యూస్‌టుడే: ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని ఏడు ఎక్సైజ్ స్టేషన్లలో నమోదైన 219 కేసుల్లో పట్టుబడిన రూ.3 కోట్ల విలువ చేసే గంజాయి, డ్రగ్స్‌ను సోమవారం దహనం చేశారు. హైదరాబాద్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఛైర్మన్ కేఏబీ శాస్త్రి ఆదేశాల మేరకు ఏఈఎస్ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో ధూల్‌పేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన 104 కేసులు, జూబ్లీహిల్స్‌లో నమోదైన 24, కాచిగూడ 6, మలక్‌పేట 5, సికింద్రాబాద్ 35, నారాయణగూడ 23, ముషీరాబాద్ 22 కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను రంగారెడ్డి జిల్లా నందిగామ ఈదులపల్లిలో జీకే మల్టికేవ్ ఇండియా ప్రైవేట్ కంపెనీలో కాల్చివేశారు. 756.356 కిలోల గంజాయి, 1.315కిలోల ఎండు గంజాయి, 8 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, 1235.06 కేజీల పాపిస్ట, 6 గంజాయి మొక్కలను, ఇతర రకాలుగా పట్టుబడిన 10 కిలోల హ్యాష్ ఆయిల్, కొకైన్, గంజాయి చాక్లెట్లను ధ్వంసం చేసినట్లు అధికారులు వెల్లడించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎన్‌డీపీఎస్ కింద పట్టుబడిన ఈ గంజాయి డ్రగ్స్‌ను ఎక్సైజ్ శాఖ కమిషనరు ఇ.శ్రీధర్, డైరెక్టరు కమలాసన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కేఏబీ శాస్త్రి, సహాయ కమిషనర్ అనీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.


నందిగామ పరిశ్రమలో దహనం చేయడానికి తీసుకొచ్చిన గంజాయి, డ్రగ్స్‌తో ఆబ్కారీ అధికారులు

హెచ్‌ఎస్‌బీసీలో 'హెల్పింగ్ హ్యాండ్స్ మేళా'



గీతా భాస్కర్‌తో బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగంగా హెచ్‌ఎస్‌బీసీ ఏటా నిర్వహించే 'హెల్పింగ్ హ్యాండ్స్ మేళా'ను సోమాజిగూడలోని బ్యాంక్ కార్యాలయంలో సోమవారం ప్రముఖ నటి గీతా భాస్కర్ ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా చేతివృత్తిదారులకు సహకారం అందించేందుకు మేళా నిర్వహించడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. బ్యాంక్ మేనేజర్ సంతోష్, ఉపాధ్యక్షురాలు సౌమ్య, సేల్స్ హెడ్ ప్రవళిక తదితరులు మాట్లాడుతూ.. మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో వివిధ రకాల చేనేత ఉత్పత్తులు కొనుగోలు చేయడం ద్వారా కళాకారులకు మేలు చేకూరుతుందన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని హెచ్‌ఎస్‌బీసీ బ్యాంక్ శాఖల్లో మేళా జరుగుతుందని వివరించారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

ఎంఎస్‌మక్తాకు దారి లేక ఇక్కట్లు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న బస్తీ అధ్యక్షుడు షరీఫ్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్ ప్రాంతం మొత్తం రైల్వే చక్రబంధంలో ఉందని, రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని బస్తీ అధ్యక్షుడు ఎస్‌కే షరీఫ్ అన్నారు. ఎంఎస్‌మక్తా బస్తీ వాసులకు ఉన్న మార్గాలను మూసివేస్తూ రైల్వే క్రాసింగ్‌లు ఉన్నాయని, కొన్నాళ్ల క్రితం ఆంజనేయ ఆలయం వద్ద పట్టాల మీదుగా దాటకుండా గోడ కట్టారని, తాజాగా నెక్లెస్ రోడ్డు ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌కు కేవలం నడిచి వెళ్లే దారిని మూసివేశారని తెలిపారు. ఈ గోడ తొలగించాలని, లదా బస్తీ నుంచి రాజ్‌భవన్ రోడ్డుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుచేయాలని కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్‌లకు వినతి పత్రాలు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట వరకు

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

ఖైరతాబాద్, న్యూస్‌టుడే:

? జూబ్లీహిల్స్ జర్నలిస్టు కాలనీ-బి పేజ్‌లో పార్కులను సుందరీకరించి రెండేళ్లు అవుతోంది. ఇప్పటి వరకు తెరవలేదు. స్థానిక రోడ్డు నంబరు 92లోని ఐలాండ్ కొంత కాలంగా పనిచేయడం లేదు. దాంతో అక్కడ మురుగు చేరుతోంది.

– డా.హరిప్రసాద్, జర్నలిస్టు కాలనీ

✓ త్వరలో పార్కు అందుబాటులోకి తెస్తాం. ఐలాండ్‌ను పరిశీలిస్తాం.

– బాగయ్య, యూబీడీ అధికారి

సర్కారు వైద్యం.. అంతంతమాత్రం

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత
- విధుల్లోకి ఉన్న వారికి పనిభారం

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పలు సమస్యలతో సతమతమవుతున్నాయి. ప్రధానంగా వైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. బంజారాహిల్స్ రోడ్డు నం.7లోని యూపీహెచ్‌సీలో ప్రస్తుతం వైద్యుడు, పీహెచ్‌ఎన్ (ప్రైమరీ హెల్త్‌నర్స్), ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఒక ఎంపీహెచ్‌ఏ (మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్), డాటా ఎంట్రీ ఆపరేటర్, ఆయా, సహాయకుడు మాత్రమే ఉన్నారు. ఆస్పత్రికి కావాల్సిన ఇద్దరు స్టాఫ్‌నర్సులు, అయిదుగురు ఏఎన్‌ఎంలు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ లేరు. ఇక్కడ ఓపీ సగటున 130- 150 ఉంటుంది. వీరందరికీ వైద్యం అందించడంతో పాటు ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, వీవీఐపీ జోన్ కావడంతో ఐఏఎస్ అధికారుల నివాసాలకు వైద్యసిబ్బంది వెళ్లి సేవలు అందించడం వంటి వాటితో ఉన్న సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

షౌకత్‌నగర్ బస్తీలో..

బంజారాహిల్స్ రోడ్డు నం.3 షౌకత్‌నగర్ బస్తీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం 10కి పైగా బస్తీల ప్రజలకు సేవలు అందిస్తోంది. ఇక్కడ తెలంగాణ డయాగ్నొస్టిక్స్ సైతం ప్రజలకు అందుబాటులో ఉంది. ఓపీలో రోజుకు 100 వరకు ఉంటుంది. వైద్యుడు బదిలీపై వెళ్లిపోవడంతో డిప్యూటేషన్‌పై నియమించిన వైద్యుడు తన మాతృ విభాగం పనులు చూస్తూ అప్పుడప్పుడూ వస్తున్నారు. ఇలాంటప్పుడు ఉన్నతాధికారులు బస్తీ దవాఖానాలకు చెందిన వైద్యులను పంపిస్తున్నా పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. ఆస్పత్రిలో పీహెచ్‌ఎన్, స్టాఫ్ నర్సులు లేరు. నలుగురు ఏఎన్‌ఎంలు కావాల్సి ఉండగా ఇద్దరే ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ బస్తీ దవాఖానాల నుంచి వారంలో మూడురోజుల పాటు అందుబాటులో ఉంటున్నారు. దీంతో రోగులు అయోమయానికి గురవుతున్నారు.



బంజారాహిల్స్ రోడ్డు నం.7 ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యుడ్ని ఫార్మసిస్టు

'పది' నాణేలపై అపోహలు వద్దు



నాణేలు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు రాజేశ్వర్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రావు, స్వర్ణ

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తీసుకొచ్చిన పది రూపాయల నాణేలు చట్టబద్ధమైనవని, అపోహలు పక్కన పెట్టి రోజువారీ లావాదేవీల్లో ఉపయోగించుకోవాలని ఇండియన్ బ్యాంక్ ఎఫ్ జీఎం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయంలో ఆర్‌బీఐ ఉత్తర్వుల మేరకు తెలుగు రాష్ట్రాల్లోని 480 శాఖల్లో రెండు రోజుల పాటు పది నాణేలపై అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.10 నాణేలు చట్టబద్ధమైనవేనని తెలియజేస్తూ రిజర్వు బ్యాంక్ ముద్రించిన స్టిక్కర్లను ఆటోలు, బస్సులు, రైల్వే, మార్కెట్లలో అతికించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్‌రావు, ఏజీఎం స్వర్ణ తదితరులున్నారు.

25 నుంచి నారెడ్కో ప్రాపర్టీ షో

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: నగరంలో స్థిరాస్తి రంగ అభివృద్ధిపై ఆందోళన వద్దని, భవిష్యత్తులో ఈ రంగానికి వచ్చే అడ్డంకులు ఏమీ లేవని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) తెలంగాణ అధ్యక్షుడు విజయసాయి అన్నారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో హైటెక్స్‌లో 14వ నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో- 2024 జరగనుంది. ఈ సందర్భంగా సోమవారం బంజారాహిల్స్‌లోని తాజ్‌డెక్కన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నారెడ్కో రాష్ట్ర సెక్రటరీ జనరల్ కె.శ్రీధర్‌రెడ్డి, ప్రతినిధులు ఆర్. వెంకటేశ్వరరావు, వై.కిరణ్ పాల్గొన్నారు.

తాగునీరు, సీవరేజీ సమస్యలు పరిష్కరించండి

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఏర్పడిన మంచినీటి, సీవరేజీ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జలమండలి జీఎం హరిశంకర్‌కు స్థానిక కార్పొరేటర్ మన్నె కవితా రెడ్డి విన్నవించారు. సోమవారం ఎస్‌ఆర్‌నగర్‌లోని జీఎం కార్యాలయానికి వెళ్లిన ఆమె ఈ మేరకు వినతిపత్రం అందించారు.

పెండింగ్ పనులపై చర్చ

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలో పెండింగ్ పనులను వెంటనే చేపట్టాలని కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. యూసుఫ్‌గూడలోని సర్కిల్-19 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఏఎంసీ బాలరాజు, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపి కృష్ణవేణితో ఆయన చర్చించారు.

జూబ్లీహిల్స్‌లో మావూరీస్ స్టోర్ ప్రారంభం



జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్ రోడ్ నం.55లో 'మావూరీస్'-ఆర్టిసన్స్ వీవ్స్ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను సోమవారం ప్రారంభించారు. కాంచీపురం, బనారసీ, మైసూర్, బెంగాల్, జామ్దానీ, పటాన్ పటోలా, కలంకారి, బగల్‌పూర్, పైథానీ, ఇకత్, ఖాదీ తదితర రకాల వస్త్రశ్రేణిని ఇక్కడ అందుబాటులో ఉంచారు. రూ.5వేల నుంచి మొదలుకొని రూ.5లక్షల వరకు చీరలు స్టోర్‌లో ఉంటాయన్నారు. మావూరీస్ ఆర్టిసన్స్ వీవ్స్ నిర్వాహకురాలు హారిక మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రాడక్ట్(ఓడీఓపీ) సర్టిఫికేషన్ కింద ఇక్కడ చీరలను ఏర్పాటు చేశామన్నారు. ప్రారంభోత్సవంలో సినీనటుడు ప్రకాశ్‌రాజ్ సతీమణి పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



వెంగళరావునగర్: గురుద్వార్ గల్లీలోని గురుద్వార్ ఆధ్వర్యంలో గురు రామ్‌దాస్‌జీ మహరాజ్ 490వ జయంతి ఘనంగా నిర్వహించారు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు నుంచి అమీర్‌పేట్ గురుద్వార్ వరకు శోభాయాత్ర నిర్వహించారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఇద్దరు పేద విద్యార్థులకు తెలంగాణ ఎస్సీ ఎస్టీ, ఎంప్లాయిస్ హెల్పింగ్ హ్యాండ్ సంఘం (టీఎస్సీఎస్టీఇహెచ్‌హెచ్‌ఏ) సోమవారం ఆర్థిక సాయం అందజేసింది. నల్గొండకు చెందిన సీహెచ్ పవన్ తేజ్‌కు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చినా, మహబూబాబాద్ జిల్లాకు చెందిన శ్రీకాంత్‌కు నిజాం కళాశాలలో పీజీ సీటు లభించినా కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా హాస్టల్ ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్నారు. దీంతో తమకు సహాయం చేయాలంటూ సచివాలయంలో టీఎస్సీఎస్టీఇహెచ్‌హెచ్‌ఏను ఆశ్రయించారు. సంఘం అధ్యక్షుడు గయక్వాడ్ తులసీదాస్ మాంగ్ వైద్య విద్యార్థికి రూ.25 వేలు, పీజీ విద్యార్థికి రూ.8 వేలు చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జె.దేవేందర్, కోశాధికారి బి.గుణవంత్, సంయుక్త కార్యదర్శి జి.ప్రశాంత్‌కుమార్, సభ్యులు బి.సోమన్న, కె.పరశురామ్, కె.స్వామి తదితరులున్నారు.

సమాజ సేవకు మించినది లేదు



సత్కార గ్రహీతలతో రమణాచారి, కొండలరావు, లక్ష్మీనారాయణ, అశోక్

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ప్రార్థించే పెదవుల కన్నా, సాయం చేసే చేతులు మిన్నా అని ప్రభుత్వ మాజీ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డా.కె.వి.రమణాచారి అన్నారు. సోమవారం రాత్రి రవీంద్రభారతిలో సర్వకళాకారుల సంక్షేమ వేదిక తృతీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అవసరార్థులకు సేవ చేయడమే నిజమైన మాధవ సేవ అన్నారు. సభకు డా.అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు అధ్యక్షత వహించారు. ఎల్‌ఐసీ అధికారి వి.సుబ్రమణ్యం, చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ రామచంద్రరావు, న్యాయశాఖ అదనపు కార్యదర్శి యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, మాక్స్‌ఫోర్డ్ ల్యాబ్స్ డైరెక్టర్ జి.మల్లికార్జున్ మాట్లాడారు. కొండలరావు పేద కళాకారుల వేదికకు రూ.50 వేలు విరాళంగా ప్రకటించారు. వేదిక అధ్యక్షుడు అశోక్ పవార్, కార్యదర్శి జి.కె.రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి ఎ.జి.సతీష్‌బాబు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కథక్, జానపద నృత్యదర్శకుడు అభిమన్యు, సంగీత గురువు మంజుల శ్రీనివాస్‌లను సత్కరించారు.

లాఠీఛార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోండి

సోమాజిగూడ, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ ముత్యాలమ్మ దేవాలయం వద్ద లాఠీ చార్జి చేసిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ గవర్నర్‌ను కోరింది. ఈ మేరకు వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి నేతృత్వంలోని ప్రతినిధులు సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి వినతిపత్రం వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముత్యాలమ్మ ఆలయం వద్ద జరిగిన లాఠీచార్జి అక్రమమని, దానికి బాధ్యులైన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో వీహెచ్‌పీ మఠ మందిర్ అఖిల భారత ప్రముఖ్ రామరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.సునీతారెడ్డి, డా.రాంసింగ్, అర్చక పురోహిత్ ప్రముఖ్ మధుసూదన్, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ యు.శివరాములు, సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ కిషోర్ కుమార్, నాయకులు అనిల్ ఉన్నారు.

జీవీపీలను తొలగించి చెత్తరహిత సర్కిళ్లుగా మార్చండి



ఎస్‌టీపీ వద్ద పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఇలంబర్తి, ఇతర అధికారులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: గార్బేజ్ వాల్నరబుల్ పాయింట్స్(జీవీపీ)లను తొలగించి ఆయా ప్రాంతాలను చెత్తరహిత సర్కిళ్లుగా మార్చాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి సోమవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ ఉద్యానవనం, శ్రీరాంనగర్‌బస్తీ, జూబ్లీహిల్స్ రోడ్ నం.35, యూసుఫ్‌గూడ, కమలాపురి కాలనీ ప్రాంతాల్లో శానిటేషన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. జీవీపీ రహిత సర్కిళ్లుగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ ఆటోలు ఇంటింటికీ వెళ్లి వంద శాతం చెత్త సేకరణ చేయాలని ఏఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. యూసుఫ్‌గూడ ఎస్‌టీపీ పరిశీలించి 25 టన్నులకు వాహన సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీరాంనగర్ బస్తీలో రోజూ చెత్త సేకరణ సమయంలో నియమిత పని తీరు పాటించాలన్నారు. కేబీఆర్ ఉద్యానవనం వద్ద విద్యుత్తు దీపాల ఆన్‌ఆఫ్ స్విచ్‌లను పరిశీలించారు. సహాయ వైద్యాధికారి భార్గవ్ నారాయణ, ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి: దానం



సూచనలిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బల్దియా, జలమండలి, విద్యుత్ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే మంజూరైన నిధులు, చేపట్టాల్సిన అభివృద్ధి నిర్మాణ పనుల గురించి ఆరా తీశారు. ప్రతిపాదనలు పూర్తయినప్పటికి మంజూరు కాని పనుల గురించి తెలుసుకున్నారు. ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని సూచించారు. హిమయత్‌నగర్ డివిజన్‌లో వీధి కుక్కల బెడద, వీధి దీపాల సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీకుటీర్, విఠల్‌వాడీ, గౌరీశంకర్‌కాలనీ, సింగాడిబస్తీ ప్రాంతాల్లో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారని వివరించారు. బంజారాహిల్స్ ఉదయ్‌నగర్, ఖైరతాబాద్ ఎంఎస్ మక్తాలో ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. నియోజకవర్గంలో మొత్తం 30 ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం హరిశంకర్, బల్దియా ఈఈ విజయ్‌కుమార్, డీపీవో రజిత, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీ రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాగంటి గృహ నిర్బంధం



పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను సోమవారం మాదాపూర్ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. గ్రూప్-1 పరీక్షల నేపథ్యంలో మాగంటిని మాదాపూర్‌లో ఆయన ఇంటివద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సీఎం ఇంటి వద్ద ఆందోళనకు యత్నం

క్రైమ్ కార్నర్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఎస్టీలకు మంత్రిపదవి ఇవ్వాలంటూ గిరిజన విద్యార్థి సంఘం(జీవీఎస్) ఆధ్వర్యంలో సోమవారం ముఖ్యమంత్రి నివాసం సమీపంలో ఆందోళన నిర్వహించారు. జీవీఎస్ నాయకులు సీఎం నివాసం సమీపంలోకి ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ వచ్చారు. అక్కడే ఉన్న జూబ్లీహిల్స్ పోలీసులు వారిని అరెస్ట్ చేసి ఠాణాకు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై వదిలివేశారు. రాజ్‌కుమార్‌నాయక్, ఇందాల్ రాథోడ్, వెంకట్ బంజారా, కోట్యానాయక్, సరోజిని బాయి తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు. ః జీవో నం.81, 85 ప్రకారం 61 సంవత్సరాలకు పైబడి మిగిలిన 3797 వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలివ్వాలని కోరుతూ పలువురు అభ్యర్థులు సైతం సీఎం ఇంటి వద్దకు తరలివచ్చారు. వీరిని సైతం పోలీసులు అక్కడి నుంచి తిప్పి పంపారు.

ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: అప్పుల కారణంగా ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. హెచ్.ఎఫ్.నగర్‌కు చెందిన ఎం.డి.రైజ్(45) ప్రైవేటు ఉద్యోగి. కుటుంబ పోషణకు డబ్బులు సరిపోక అప్పులు చేశాడు. చేసిన అప్పులు భారంగా మారడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

టాస్ పబ్ నిర్వాహకులు అరెస్ట్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: పబ్‌ను డ్యాన్స్‌బార్‌లా మార్చిన టాస్(టేల్స్ ఓవర్ స్పిరిట్స్) పబ్ నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. టాస్ పబ్‌పై నిర్వహించిన దాడుల్లో భాగంగా పోలీసులు మొత్తం 149 మందిని అదుపులోకి తీసుకొని అందులో 17 మందిపై కేసులు నమోదు చేసిన విషయం విదితమే. ఈ కేసులో నిందితులుగా ఉన్న పబ్ యజమానులైన ఉప్పల్‌కు చెందిన బింగి బలరాం గౌడ్, జగద్గిరిగుట్టకు చెందిన బింగి శ్రీనివాస్‌గౌడ్‌లు పరారీలో ఉండగా వారిని అదుపులోకి తీసుకొనేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులిద్దరిని ఆదివారం రాత్రి పోలీసులు ఉప్పల్ ప్రాంతంలో అరెస్ట్ చేశారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా న్యాయమూర్తి ఇద్దరికి బెయిలు మంజూరు చేసింది. అంతకముందు అరెస్టు అయిన 15 మందికి సైతం బెయిలు లభించింది.

క్రెడిట్ కార్డుతో రూ.94 వేలు డ్రా

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: క్రెడిట్ కార్డుతో ఆగంతుకులు నగదు విత్‌డ్రా చేసిన ఘటన ఇది. బోరబండ పోలీసులు కథనం ప్రకారం బోరబండకు చెందిన అబ్దుల్ నదీమ్ క్రెడిట్ కార్డు నుంచి ఈ నెల 9న గుర్తు తెలియని వ్యక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.94 వేలు డ్రా చేశారు. చరవాణికి సందేశం రావడంతో బాధితుడు ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అసభ్య ప్రవర్తన.. ఒకరి రిమాండ్

ఫిల్మ్‌నగర్: మహిళల ముందు అసభ్యంగా ప్రవర్తిస్తున్న ప్రబుద్ధుడ్ని ఫిల్మ్‌నగర్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం, శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన భూత్కూరి రమేష్ కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం నగరానికి కుటుంబంతో వలస వచ్చాడు. షేక్‌పేట కోహినూర్‌కాలనీలో నివసిస్తూ ఓ చోట చెఫ్ పనిచేస్తున్నాడు. తరచూ భార్యతో గొడవ పడుతుండటంతో ఆరు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఒంటరిగా ఉంటున్న రమేష్ తన ఫోన్‌లో అశ్లీల వీడియోలకు అలవాటుపడ్డారు. మహిళలు ఒంటరిగా ఉన్న ప్రదేశాలకు వెళ్లి వారితో అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఈనెల 16న టోలిచౌకిలోని ఓ బస్టాప్ వద్దకు వచ్చిన రమేష్. అక్కడ రోడ్డు పక్కన నిలబడిన మహిళల ముందుకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడు రమేష్‌ను గుర్తించారు. సోమవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆరు నెలలుగా తాను ఇదే తరహాలో మహిళలున్న ప్రాంతాలకు వెళ్లి చేస్తున్నట్లు పోలీసుల ముందు అంగీకరించాడు.

మద్యం మత్తులో దూషణ.. కేసు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: మద్యం మత్తులో అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం... యాదగిరినగర్‌కు చెందిన మహేశ్వర్ ఈ నెల 19న రాత్రి తన ఇంట్లో బంధువులకు, సమీప మిత్రులకు విందు భోజనం ఏర్పాటు చేశాడు. ఇంట్లో భోజనాలు ముగిసిన అనంతరం మహేశ్వర్ బంధువులు తేజస్వినీ, అన్షుమాన్, మాధవ్, చక్రధర్, తదితరులు వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా, అదే వీధిలో నివాసముండే మోహన్‌కుమార్ అనే వ్యక్తి మద్యం మత్తులో వీరందరినీ అసభ్య పదజాలతో దూషిస్తూ వెంబడించాడు. మహేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రొ.కేశవరావు జాదవ్ స్మారక చిహ్నాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న దిలీప్‌కుమార్, చిత్రంలో సోగ్రాబేగం, ప్రొ.లక్ష్మణ్‌రావు, హనుమాండ్లు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ తొలి, మలి ఉద్యమాలకు నాయకత్వం వహించిన ప్రొ.కేశవరాజు జాదవ్ స్మారక చిహ్నాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (టఫ్) ప్రభుత్వాన్ని కోరింది. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన టఫ్ ప్రతినిధుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, విమలక్క, తోట హనుమాండ్లు, ప్రొ.లక్ష్మణ్ రావు తదితరులు మాట్లాడుతూ.. తెలంగాణ భావజాల వ్యాప్తికి ఆయన పుస్తకాలతో ప్రచారం చేశారని, 2001లో వరంగల్‌లో లక్ష మందితో ర్యాలీ నిర్వహించారని గుర్తు చేశారు. చరిత్రలో ఆయనకు స్థానం లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోఠి మహిళా వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టినట్టే జాదవ్ పనిచేసిన ఇంజినీరింగ్ కళాశాలకు ఆయన పేరు పెట్టాలని, ఆయన జన్మించిన హుస్సేనీ ఆలం, ట్యాంక్‌బండ్‌పై ఆయన స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. కేబీఆర్ పార్కు వద్ద కేశవరావు జాదవ్ విగ్రహం ఏర్పాటుచేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తామన్నారు. జాదవ్ జయంతి (జనవరి 27న)లోపు నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో పాశం యాదగిరి, చంద్రశేఖర్, సోగ్రాబేగం, స్నేహారెడ్డి, రాజు, భార్గవ, ఉదయానంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీనగర్‌కాలనీ ఏటీఎం కూడలి సమీపంలో



లక్ష్మీనరసింహనగర్‌లోని

స్తంభాలు తొలగించి... దిమ్మెలు మరిచి..

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: నిరుపయోగంగా మారిన వీధి దీపాల స్తంభాలను తొలగించిన అధికారులు వాటి దిమ్మెలను మాత్రం పూర్తిగా తొలగించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీనగర్‌కాలనీ ఏటీఎం కూడలి సమీపంలో, లక్ష్మీనరసింహనగర్‌లో ఇలాంటి సమస్యలు నెలకొన్నాయి.

సంక్షిప్త సమాచారం

ఫ్యామిలీ మెడిసిన్‌ను ప్రత్యేక రంగంగా గుర్తించాలి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: దేశంలో ఫ్యామిలీ మెడిసిన్‌ను అధికారికంగా ప్రత్యేక రంగంగా గుర్తించాలని, క్షేత్రస్థాయిలోనే వ్యాధుల నివారణ, అనారోగ్య సమస్యలకు సమగ్ర వైద్యసేవలన్నీ అందించాలని ఆపి(అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్) కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాను కోరింది. జూబ్లీహిల్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆపి అధ్యక్షుడు డాక్టర్ సతీష్ కత్తుల మాట్లాడుతూ దిల్లీలో మూడు రోజుల పాటు ఎయిమ్స్‌లో జరిగిన 18వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ద్వారా నిపుణులు అనేక విషయాలను వెల్లడించారన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

జూబ్లీహిల్స్: డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి చెందిన పది ఎకరాల స్థలాన్ని జేఎన్‌ఏఎఫ్‌ఏయూకి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర, ఉద్యోగ సంఘాల నేతలు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వర్సిటీ ప్రాంగణంలో సోమవారం భోజన విరామ సమయంలో పరిపాలన భవనం ముందు నినాదాలు చేశారు.

అర్హులకే ఇళ్లు కేటాయించాలి

బోరబండ: ఎస్పీఆర్ హిల్స్ కమలానగర్‌లో నిర్మించిన ఇళ్లను అర్హులకే కేటాయించాలని పలువురు లబ్ధిదారులు కోరారు. కొంతమంది అనర్హులకు ఇళ్లు దక్కేలా ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఖైరతాబాద్ తహసీల్దార్ ఎండీ నయీముద్దీన్‌ను కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న నరహరి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: బీసీలకు రాజ్యాధికారంతోనే ఆ వర్గాలకు అభివృద్ధి, ఆత్మగౌరవం లభిస్తుందని బీసీ కులాల ఐక్య వేదిక గౌరవ అధ్యక్షుడు నరహరి అన్నారు. ఆర్థిక సమానత్వం, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో బీసీలు సమున్నతంగా జీవించాలన్నారు. తెలంగాణ బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండు యాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ విద్యావంతులు, విద్యార్థులు, యువకులు, సాధారణ ప్రజలకు దక్కాల్సిన అవకాశాల విషయంలో పాలక వర్గాలు ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోవడంలేదన్నారు. త్వరలో అన్ని జిల్లాల్లోనూ కమిటీలు ఏర్పాటుచేసి, అవగాహనా సదస్సులు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో వేదిక సలహాదారు డా.పి.వినయ్‌కుమార్, బీసీ సంఘాల నాయకులు యర్ర సత్యనారాయణ, డి.శంకర్, బాబుగౌడ్, జగన్మోహన్, నిమ్మల వీరన్న, సంధ్యారాణి, దుర్గా ప్రసాద్, దేవేందర్, వేదిక ఉపాధ్యక్షులు విజయ్ మహేంద్ర, కాశీనాథ్, కోశాధికారి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.37 వేల మోసం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ట్రేడింగ్ పేరుతో ఓ విద్యార్థినిని సైబర్ మోసగాళ్లు బురిడీ కొట్టించి రూ.37 వేలను తస్కరించారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం... నిజామాబాద్‌కు చెందిన వేదిక విద్యార్థిని. మధురానగర్‌లోని విజయలక్ష్మీ లేడీస్ హాస్టల్‌లో ఉంటుంది. ఈ నెల 18న ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రంజల్ శర్మ ఐడీ పేరుతో సైబర్ మోసగాడు పరిచయమయ్యాడు. ట్రేడింగ్ వ్యాపారం చేస్తే అధిక ఆదాయం ఆర్జించవచ్చని నమ్మించాడు. అతడి సూచన మేరకు పలు దఫాలుగా రూ.37 వేలను ఆన్‌లైన్‌లో ఫోన్‌పే ద్వారా బదిలీచేసింది. మరో 26 వేల రూపాయలను చెల్లిస్తే మొత్తం డబ్బులు వస్తాయని చెప్పడంతో అనుమానం వచ్చి తాను కట్టిన మొత్తం రూ.37 వేలను తిరిగి పంపాలని అడగడంతో సైబర్ మోసగాడు సమాధానం ఇవ్వలేదు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం సోమవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నకిలీ ఖాతాలతో సైబర్ మోసం

సోషల్ మీడియాలో జాగ్రత్తలు అవసరం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: సోషల్ మీడియాకు తీవ్ర డిమాండ్ ఉంది. చాలామంది దాదాపు అన్ని విషయాలను అప్‌లోడ్ చేస్తున్నారు. రీల్స్ రూపంలో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తున్నారు. ఈ తరుణంలో నకిలీ ఖాతాలు కూడా ఎక్కువగా నమోదవుతున్నాయి. బాధితులకు తెలియకుండానే వారి డీపీ, పేరుతో కొత్త ఖాతాను సృష్టించి వారికి తెలిసిన వారిని సైబర్ కేటుగాళ్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ లెక్క.. ● సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో అత్యధికంగా 2.3 బిలియన్ మంది ఎక్కువగా యాక్టివ్‌గా ఉంటున్నారని ఇటీవల ఇన్‌స్టా సంస్థ వెల్లడించింది. ● 71 శాతం మంది 18 నుంచి 29 మధ్య వయసున్న వారే ఎక్కువగా వాడుతున్నారని తెలిపింది.

గుర్తించడం ఇలా..

◆ ఇన్‌స్టాలో వచ్చే ప్రతి ఫ్రెండ్ రిక్వెస్టును ఫాలో చేయకుండా ఉంటే మంచిది. ఒక వేళ అలా వచ్చినా అది నిజమైనదేనా ..? కాదా..? అని తెలుసుకుంటే సరి.

◆ ఖాతా డీపీ భాగంలో ఫొటోతో పాటు న్యూనీలి రంగులో ఉంటుంది. కొత్తగా కనిపించగానే అది నకిలీ ఖాతా అని గుర్తించాలి.

◆ అలాగే సెట్టింగ్‌లో ఉన్న హెల్ప్ సెంటర్‌లో రిపోర్ట్ చేసి ఆ అకౌంట్‌ను బ్లాక్ చేయాలి.

◆ అనేక మంది తమ వ్యక్తిగత వివరాలు, విజయాలను సోషల్ మీడియాలో పంచుకోవడానికి చాలా ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు.

ఖాతాలో రూ.20 లక్షలు ఖాళీ

హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రయివేటు ఉద్యోగి అదనంగా డబ్బు సంపాదించేందుకుక ఇన్‌స్టాలో వర్క్ ఫ్రం హోం జాబ్ అంటూ ఇన్‌స్టాలో వచ్చిన వీడియోలకు లైక్‌లు, షేర్‌లు చేసి తీవ్రంగా నష్టపోయారు. నెలకు రూ.5 వేలు సంపాదించవచ్చని సైబర్ మోసగాళ్లు పంపిన ఓ లింక్‌ను ఓపెన్ చేయగానే అతని ఖాతాలో రూ.20 లక్షలు ఖాళీ అయ్యాయి.

కాల్పుల ఘటనలో పోలీసులకు కీలక సమాచారం

★ అదుపులో షికారీపాలెం ముఠా సభ్యుడు

ధర్మవరం, న్యూస్‌టుడే: ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన తుపాకీ కాల్పుల ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాల్పుల ఘటనలో పాల్గొన్న, పరారైన వారిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా కీలక సమాచారం తెలిసింది. అతను అన్నమయ్య జిల్లా షికారీపాలెం చెందిన బంగారీగా గుర్తించారు. షికారీపాలెం చెందిన ఐదుగురు యువకులు ఓ ముఠాగా ఏర్పడి గుప్తనిధులు దొరికాయని, తమ వద్ద బంగారు నాణేలు ఉన్నాయని, వాటిని తక్కువ ధరకే ఇస్తామని ఎరవేసి, నకిలీ నాణేలు ఇచ్చి నగదు తీసుకుని మోసం చేస్తున్నట్లు విచారణలో తెలిసింది.

బంగారం ముక్క ఎరవేసి.. ఆ ముఠా సభ్యులకు హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. తక్కువ ధరకే తమ వద్ద ఉన్న బంగారు నాణేలు ఇస్తామని చెప్పారు. కదిరికి రప్పించి బంగారు నాణేల కోసం రూ.10 లక్షలు ఇవ్వాలని బేరం పెట్టారు. కొంత ముక్క ఇచ్చి పరీక్షించుకోవాలన్నారు. దాన్ని తీసుకెళ్లిన హైదరాబాద్ వ్యక్తి మళ్లీ రాకపోవడంతో వారు అతనికి ఫోన్ చేసి రూ.4 లక్షలకే నాణేలిస్తామని చెప్పారు. అతను ఆసక్తి చూపకపోవడంతో రూ.2 లక్షలకే ఇస్తామని మరోసారి ఫోన్ చేశారు. దీంతో హైదరాబాద్ వాసి నాణెం ముక్క పరీక్ష చేయించగా అసలు బంగారమని తేలింది.

కాల్పులు హైదరాబాద్ ప్రాంతం వారి పనే..?

దీంతో అతను తనకు తెలిసిన కొందరు హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. నకిలీ బంగారు నాణేలు కట్టబెట్టి డబ్బు తీసుకెళ్లేందుకు షికారీపాలెం ముఠా పథకం వేసిందనే విషయాన్ని అతనికి వారు అవగాహన కల్పించారు. హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల్లో పలువురు ఆ ముఠా సభ్యుల చేతుల్లో మోసపోయినట్లు తెలిసింది. దీంతో సైబర్ క్రైం పోలీసులు ముఠా సభ్యులను పట్టుకోవాలని పథకం రచించారు. ఒప్పందం కుదుర్చుకున్న మేరకు హైదరాబాద్ వ్యక్తికి బంగారు నాణేలు ఇచ్చేందుకు ఆదివారం ముఠా సభ్యులు బత్తలపల్లి మండలం రామాపురం వద్దకు వచ్చారు. కారులో వచ్చిన హైదరాబాద్ వ్యక్తితో ముఠా సభ్యులు మాట్లాడుతుండగా మరో వాహనంలో వచ్చిన ముగ్గురు తుపాకులతో గాల్లో కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు పట్టుకునేందుకు వచ్చారని భావించి ముఠా సభ్యులు తమ వద్ద ఉన్న నకిలీ బంగారు నాణేల సంచి అక్కడే పడేసి బైకులపై పారిపోయారు. ముఠా సభ్యుడు బంగారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన పోలీసులు షికారీపాలెం ముఠాను పట్టుకునేందుకు వచ్చినట్లు తెలిసింది. బంగారీ నుంచి వివరాలు రాబడుతున్నామని ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులు పేర్కొన్నారు.



'క్లీన్ అప్ హైదరాబాద్' వాహనంతో సిబ్బంది

వాహనాల కొరత.. ఎక్కడి చెత్త అక్కడే

◆ నగరంలో 'క్లీనప్ హైదరాబాద్'

ఈనాడు, హైదరాబాద్: రహదారులు, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేస్తామంటూ చేపట్టిన 'క్లీనప్ హైదరాబాద్' ముక్కుబడిగా మారింది. క్షేత్రస్థాయిలో అలాంటి కార్యక్రమాలు నామమాత్రంగా కనిపించాయి. వాహనాలు లేక వ్యర్థాలను ఎలా ఊడ్చుతారని కార్పొరేటర్లు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు.

వాహనాల్లేకుండా తరలిస్తున్నారా..?

డివిజన వారీగా చెత్తను తొలగించేందుకు ఓ వాహనం, నిర్మాణ వ్యర్థాలకు మరో వాహనాన్ని కేటాయించాలని కేంద్ర కార్యాలయం జడ్సీలను ఆదేశించింది. కేంద్ర కార్యాలయం మొదటిదశ ప్రత్యేక కార్యక్రమాన్ని 16న ప్రారంభించింది. తర్వాతి మూడు రోజుల్లో కూకట్‌పల్లి జోన్‌లోని మూసాపేట, కూకట్‌పల్లి, ఆల్విన్ సర్కిళ్లలో, శేరిలింగంపల్లిలోని యూసుఫ్‌గూడ, శేరిలింగంపల్లి, చందానగర్, ఆర్సీపురం సర్కిళ్లలో, ఎల్బీనగర్ జోన్‌లోని కాప్రా సర్కిల్‌లో, సికింద్రాబాద్ జోన్‌లోని మల్కాజిగిరి, సికింద్రాబాద్, బేగంపేట సర్కిళ్లలో పనులు మొదలైనట్లు అధికారులు ప్రకటించారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ప్రత్యేక డ్రైవ్ సంబంధించిన వాహనాలు పూర్తిస్థాయిలో కనిపించలేదు.

ఆపేసిన కార్పొరేటర్లు..

మియాపూర్ డివిజన్‌లో క్లీనప్ హైదరాబాద్ కార్యక్రమానికి ఒకే వాహనాన్ని కేటాయించారని, అది కూడా బ్రేక్ డౌన్‌తో సరిగా పనిచేయలేదని, అధికారులు మాత్రం పనులు చేపట్టినట్లు రికార్డులు నమోదు చేస్తున్నారని ఓ కార్పొరేటర్ ఆందోళన వ్యక్తం చేశారు. అవకతవకలు జరుగుతుండటంతో పనులను అడ్డుకున్నామని ఆయన 'ఈనాడు'తో తెలిపారు. ఎల్బీనగర్, శేరిలింగంపల్లి జోన్లలోనూ అరకొర వాహనాలతో పరిమితమవుతోన్న పారిశుద్ధ్య కార్యక్రమాలను నేతలు అడ్డుకున్నారు. ఇళ్లలో వ్యర్థాలను ఇవ్వాల్సిందిగా పౌరులకు సమాచారం ఇవ్వాలని కార్పొరేటర్లు సూచించారు. మొక్కుబడి కార్యక్రమంతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయొద్దన్నారు.

పైవంతెనలున్నా.. పాదచారులకు తిప్పలు

● ఎఫ్ఓబీల వద్ద అపరిశుభ్రత

● లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేయని వైనం

ఈనాడు, హైదరాబాద్: నగరంలోని ఎఫ్ఓబీలు(ఫుట్ ఓవర్ బ్రిడ్జి) నిరుపయోగంగా మారుతున్నాయి. లిఫ్టులు పనిచేయడం లేదు. కొన్ని మాత్రమే సవ్యంగా పనిచేస్తున్నాయి. ఎస్కలేటర్లు ఆగిపోయాయి. శుభ్రం చేసే వారు లేక చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. మెట్ల మార్గం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, చిన్న పిల్లలు ఎఫ్ఓబీలు ఎక్కలేకపోతున్నారు. రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఎఫ్ఓబీలను జీహెచ్ఎంసీ నిర్వహణ చేపట్టడంలేదు. కనీస నిర్వహణ విస్మరించింది. నిధులను ఖర్చు చేశాం.. నిర్మాణాన్ని పూర్తి చేశాం.. అన్నట్లుగా అధికారులు చేతులెత్తేశారు.



పంజాగుట్ట ఎఫ్ఓబీ దుస్థితి

లిఫ్టులు పనిచేయక వెతలు

ఈఎస్ఐ ఆసుపత్రి, కేపీహెచ్‌బీ, మదీనాగూడ దీప్తి శ్రీనగర్, సికింద్రాబాద్ సెయింట్ ఆన్స్ పాఠశాల, చాంద్రాయణగుట్ట ఓవర్ హోటల్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఎఫ్ఓబీల్లోనూ లిఫ్టులు పని చేయడం లేదు. పంజాగుట్ట రాజా వద్ద ఎఫ్ఓబీది అదే పరిస్థితి. ఆధునిక హంగులతో రోడ్డుకు ఇరువైపులా 2 లిఫ్టులు, 2 ఎస్కలేటర్లను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం మెట్ల మార్గం, లిఫ్ట్ వద్ద నిరాశ్రయులు ఆశ్రయం పొందుతున్నారు.

నత్తనడకన పనులు..

బంజారాహిల్స్ జీవీకే మాల్ ఎదురుగా, అమీర్‌పేట, హయత్‌నగర్, రాజేంద్రనగర్ నుంచి నేషనల్ పోలీస్ అకాడమీ వైపు వెళ్లే రోడ్డు, తదితర ప్రాంతాల్లో చేపట్టిన ఎఫ్ఓబీల నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు.◆ ఎఫ్ఓబీలను ఎక్కి, రోడ్డును దాటాలంటే నగరవాసులు ఆసక్తి చూపడం లేదు. నేటి తరానికి తగినట్టుగా నిర్మాణాలను చేపట్టలేదని జీహెచ్ఎంసీ 2016లో 52 ఎఫ్ఓబీల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసింది.◆ పనులు మాత్రం 22 చోట్ల మాత్రమే మొదలయ్యాయి. అందులోనూ కొన్ని ప్రతిపాదనలు తదనంతరం రద్దయ్యాయి.◆ 14 నిర్మాణాలను చేపట్టగా దాదాపు 90 శాతం అందుబాటులోకి వచ్చినట్లు యంత్రాంగం చెబుతోంది. వాటిని సవ్యంగా నిర్వహించక పోవడంతో పాదచారులు వాటిని ఉపయోగించేందుకు ఆసక్తి చూపడం లేదు.



లాజిస్టిక్ పార్కు ఆవరణలో కొనసాగుతున్న పండ్ల మార్కెట్

పండ్ల మార్కెట్ నిర్మిస్తే తలమానికమే

గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీకి సవాళ్లు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలోని పండ్ల మార్కెట్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో ఏర్పాటై తాజాగా బాటసింగారంలోని లాజిస్టిక్ పార్కు ఆవరణలోకి చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నూతన పాలకవర్గాన్ని నియమించింది. ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన చిలుక మధుసూదన్‌రెడ్డి మార్కెట్‌ను తలమానికంగా తీర్చిదిద్దేందుకు సంకల్పించారు.

ఊతమిస్తే అత్యుత్తమంగా..

ఏటా రూ.1500 టర్నోవర్‌తో మార్కెట్ కమిటీకి రూ.15 కోట్ల ఆదాయం వస్తోంది. నూతన మార్కెట్ నిర్మాణం జరిగితే టర్నోవర్ రూ.5 వేల కోట్లకు చేరుతుంది. 199 ఎకరాల్లో రూ.399 కోట్లతో ఆసియాలోనే అత్యుత్తమ మార్కెట్ నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధమై ప్రభుత్వ ఆమోదం కోసం సీఎం రేవంత్‌రెడ్డి చెంతకు చేరినట్లు తెలుస్తోంది. కోహెడలో నిర్మాణానికి గతంలోనే 65 మార్కెట్‌ల నుంచి రూ.314 కోట్లు రుణం రూపంలో సమీకరించారు.

రైతుల సంక్షేమం, మార్కెట్ నిర్మాణమే లక్ష్యం

– చిలుక మధుసూదన్‌రెడ్డి, ఛైర్మన్, మార్కెట్ కమిటీ



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే సహకారంతో ఆధునిక పండ్ల మార్కెట్ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతాం. మా హయాంలో మార్కెట్ నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం. గత ప్రభుత్వ తప్పిదాలతో ప్రస్తుతం మార్కెట్‌కు సమకూరుతున్న ఆదాయంలో నెలకు సుమారు రూ.70 లక్షలు అద్దె రూపంలో చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటివరకు రూ.20 కోట్లకుపైగా అద్దె రూపంలో చెల్లింపులు జరిగాయి. నూతన మార్కెట్ నిర్మాణమే లక్ష్యంగా మా పాలకవర్గం పనిచేస్తుంది.

మేమున్నాం.. ట్రాఫికర్ ఏల?



కోఠి మహిళా విశ్వవిద్యాలయం వద్ద ఓ ఆటో ట్రాలీ రోడ్డుపై నిలిచిపోవడంతో అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు దాన్ని పక్కకు నెట్టి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేశారు

అమర వీరులకు జోహార్లు



సైబరాబాద్ పరేడ్ మైదానంలో స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ అవినాశ్ మహంతి



అంబర్‌పేట సీపీఎల్‌లో రక్తదాన శిబిరంలో పాల్గొన్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధుల్లో పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. ఉన్నతాధికారులు.. పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.



అమీర్‌పేటలో ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద ఏసీపీ వెంకటరమణ, ఉమేష్ చంద్ర తండ్రి వేణుగోపాలరావు, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, తదితరులు

కూల్‌డ్రింక్ అనుకుని క్రిమిసంహారక మందు తాగిన చిన్నారులు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఘట్‌కేసర్: దసరా పండగకు మేనమామ ఇంటికి వచ్చిన ఇద్దరు పిల్లలు శీతలపానీయం సీసాలోని పురుగు మందు తాగి అస్వస్థతకు గురయ్యారు. అందులో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘట్‌కేసర్ పోలీసుల వివరాల ప్రకారం..ఘనపూర్‌లోని బానోత్ శ్రీధర్ ఇంటికి అతని చెల్లెలు ఇద్దరు పిల్లలతో వచ్చింది. ఈనెల 15న ఇంట్లో చిన్నారులు కార్తీక్(6) కీర్తి(4) ఓ కూల్ డ్రింక్ సీసా చూసి అందులోని ద్రవాన్ని తాగారు. అందులో క్రిమిసంహారక మందు ఉండడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి కీర్తి మృతి చెందినట్లు మేనమామ బానోత్ శ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కార్తీక్ ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

విగ్రహ విధ్వంసం కేసు దర్యాప్తు ముమ్మరం

రెజిమెంటల్‌బజార్: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం కేసులో ఉత్తరమండలం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. స్థానికుల దాడిలో గాయపడిన నిందితుడు (30) నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నాడు. పూర్తి స్పృహలోకి రాగానే అరెస్ట్ చేస్తామన్నారు. ముంబయికి చెందిన నిందితుడి గురించి పూర్తి వివరాలు సేకరించేందుకు, హైదరాబాద్ వచ్చేందుకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక బృందాలు ముంబయి చేరాయి. వ్యక్తిత్వ వికాస తరగతుల ముసుగులో యువతలో విద్వేషాన్ని నింపుతున్న మున్వర్‌జామా కోసం గాలిస్తున్నారు. కుమ్మరిగూడ ఆలయం వద్దకు నిత్యం రాజకీయ నాయకులు, హిందూ ధార్మిక సంఘాల నేతలు వచ్చిపోతుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ ఘటనాస్థలంలో పరిస్థితి సమీక్షిస్తున్నారు. సిటీ బస్సులపై రాళ్లదాడికి పాల్పడిన ఆందోళనకారుల వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకూ 15 మందిని అదుపులోకి తీసుకున్నారు.

మద్యం మత్తులో గొంతు కోసుకుని వ్యక్తి మృతి

గౌతంనగర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి గొంతు కోసుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్కాజిగిరి సీఐ సత్యనారాయణ సోమవారం తెలిపిన వివరాల మేరకు విష్ణుపురికాలనీలో ఉండే శ్రీను(55) మద్యానికి బానిసై పదేళ్లుగా కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. ఈనెల 20న ఇంట్లో ఎవరూ లేనపుడు కత్తితో గొంతు కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో శ్రీనును గాంధీ ఆసుపత్రికి తరలించగా.. సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి



వెంగళరావునగర్‌లోని శిశు సంక్షేమశాఖ కమిషనరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మినీ అంగన్వాడీలు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: మినీ అంగన్వాడీ టీచర్స్‌కి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. పదోన్నతి పొందిన మినీ అంగన్వాడీ టీచర్స్ గౌరవ వేతనాలు 5 నెలలు నుంచి ఇవ్వకపోవడంతో వెంగరావునగర్‌లోని మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ కమిషనరేట్ ఎదుట అన్ని జిల్లాల నుంచి వచ్చిన అంగన్వాడీలు సోమవారం నిరసన తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క మినీ అంగన్వాడీ కేంద్రాలను ఏకకాలంలో అప్ గ్రేడ్ చేసి, రూ.7800 ఉన్న వేతనాలను రూ.13,650కి పెంచుతూ.. తొలిసంతకం చేశారని తెలిపారు. పదోన్నతిచ్చి 5 నెలలు అవుతున్నా పెంచిన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ వచ్చి వారితో మాట్లాడారు.

ఉపాధి నిమిత్తం వచ్చి.. పట్టాల మధ్య ప్రాణాలు విడిచి

రెజిమెంటల్‌బజార్: ఏడాది క్రితం వివాహం జరిగింది. భార్య 3 నెలల గర్భిణి. ఊళ్లో ఉపాధి లేక 15 రోజులు క్రితమే నగరానికి వచ్చాడు. ఆరోగ్యం సరిగాలేక మరుసటి రోజు సొంతూరుకు వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్నాడు. ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృత్యువాత పడ్డాడు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. యూపీ గోరఖ్‌పూర్‌కు చెందిన అలహాపాల్(28)కు మతిస్థిమితం సరిగా ఉండేది కాదు. వైద్యం చేయించగా కొంత మెరుగయ్యాడు. దీంతో ఏడాది క్రితం అతనికి వివాహం చేశారు. నగరంలో ఉంటున్న సోదరుడి వద్దకు వచ్చి కాప్రాలో ఉంటూ పెయింటింగ్‌కు వెళ్తున్నాడు. మందులు సరిగా వాడక ఆరోగ్యం దెబ్బతింది. అతన్ని సొంతూరు పంపించేందుకు సోదరుడు మంగళవారానికి టిక్కెట్ బుక్ చేశాడు. సోమవారం ఉదయం 6 గంటలకు బయటకు వెళ్లిన అలహాపాల్ మౌలాలి- చర్లపల్లి మధ్య పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా నాగవల్లి ఎక్స్‌ప్రెస్ అతడిని ఢీకొట్టింది.

పరస్పర సహకారంతో ప్రగతికి బాటలు

జపాన్ సైన్స్ టెక్నాలజీ ఏజెన్సీ అధ్యక్షుడు కజుహితో హాషిమోటో

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: పరస్పర సహకారంతో ప్రగతికి బాటలు పడతాయని జపాన్ సైన్స్ టెక్నాలజీ(జేఎస్టీ) ఏజెన్సీ అధ్యక్షులు కజుహితో హాషిమోటో పేర్కొన్నారు. జపాన్ అకడమిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'జపాన్ నెల' పేరుతో రెండు రోజుల కార్యక్రమాన్ని ఆయన ఐఐటీ హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభించి మాట్లాడారు. దీనికి తమ దేశానికి చెందిన 72 విద్యాసంస్థల ప్రతినిధులు హాజరైనట్లు వివరించారు. జేఎస్టీ ఆధ్వర్యంలో ఇండియాకు చెందిన యువ శాస్త్రవేత్తలకు జపాన్‌లో పర్యటించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. జపాన్‌లో చదివేందుకు వస్తున్న భారతీయుల్లో 5 శాతం ఐఐటీహెచ్‌కు చెందిన వారేనన్నారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ జపాన్‌తో ఐఐటీహెచ్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయని, ఇది రెండు దేశాలకు ప్రయోజనమని పేర్కొన్నారు.



జపాన్ ప్రతినిధులు, ఐఐటీహెచ్ డైరెక్టర్

రెండు పడక గదుల ఇళ్లిప్పిస్తానని రూ.1.4 కోట్లు వసూలు



వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: రెండు పడక గదుల ఇళ్లు ఇప్పిస్తానని అక్రమంగా డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. ఎస్పీఆర్‌హిల్స్‌కి చెందిన **జి.నర్సింహరాజు** వివిధ బస్తీలకు చెందిన ప్రజలు నుంచి రెండు పడక గదుల ఇళ్లు ఇప్పిస్తానని నమ్మించి సుమారు రూ.1.4 కోట్లు వసూలు చేశారు. ఈ విషయంపై కొంత కాలంగా తప్పించుకొని తిరుగుతున్న నరసింహరాజుపై బాధితుడు రవీందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కుల గణన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

జియాగూడ: రాష్ట్రంలో కులగణన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి బీసీలకు న్యాయం చేయాలని బీసీ సంఘాల నేతలు కోరారు. సోమవారం బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు భూపేష్‌సాగర్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కులగణనతో రాష్ట్రంలో 54శాతం ఉన్న 120 బీసీ కులాలవారీగా జనాభా లెక్కలు తేలుతాయన్నారు. రిజర్వేషన్ల కేటాయింపు, సంక్షేమ పథకాల అమలు సాధ్యమవుతుందన్నారు.



నిరంజన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజేందర్, రాజ్‌కుమార్, భూపేష్‌సాగర్

'పేదలను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం'

బర్కత్‌పుర, న్యూస్‌డే: మూసీ ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతంరావు విమర్శించారు. సోమవారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో భాజపా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ బాధితులకు భాజపా అండగా నిలుస్తుందన్నారు. ఈ నెల 22న గోల్నాక డివిజన్‌లోని తులసిరాంనగర్ లంక వద్ద నుంచి భాజపా నేతల పర్యటన ప్రారంభమౌతుందని, మూసీ బాధితులను కలుస్తామని వెల్లడించారు. ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే రామారావు పాటిల్ హాజరు కానున్నారని చెప్పారు. కార్పొరేటర్ అమృత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతంరావు



పరుపు పడకుండా..

ఆటోపైన 10 పరుపులను ఒకదానిపై ఒకటిగా పేర్చి అవి పడిపోకుండా తాడుతో కట్టాల్సింది పోయి ఇద్దరు వ్యక్తులు ఆటోకు అటు, ఇటు ప్రమాదకరంగా నిల్చుని పరుపులను పట్టుకున్నారు. పట్టు తప్పితే వారికే కాదు. ఇతర వాహనదారులకూ ప్రమాదమే. హిమాయత్‌నగర్‌లో కనిపించిందీ చిత్రం

కూల్చిన ఇళ్ల వ్యర్థాల తరలింపు షురూ

పూర్తవగానే చెరువులకు పునరుజ్జీవం అంటోన్న హైడ్రా



ఈనాడు, హైదరాబాద్: నేలమట్టం చేసిన అక్రమ నిర్మాణాల వ్యర్థాలను తొలగించడంపై హైడ్రా దృష్టి పెట్టింది. చెరువులకు ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి, వాటికి పునరుజ్జీవం కల్పించేందుకు నడుం బిగించింది. అందులో భాగంగా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ సోమవారం నిజాంపేటలోని ఎర్రకుంట చెరువులో వ్యర్థాల తరలింపు పనులను ప్రారంభించారు. ఈ చెరువులోని మూడు భవన సముదాయాలను ఆగస్టు 14న హైడ్రా నేలమట్టం చేసింది. కొన్ని రోజులకు శిథిలాల్లోని ఇనుము, ఇతరత్రా వస్తువులను నిర్మాణదారు తీసుకెళ్లారని హైడ్రా తెలిపింది. ఎందుకూ పనికిరాని ఇటుక, సిమెంటు వ్యర్థాలను అక్కడే వదిలేశారని వెల్లడించింది. మొదటి దశలో నాలుగు చెరువులకు పునరుజ్జీవం కల్పించాలని హైడ్రా నిర్ణయించగా, వాటిలో ఎర్రకుంట ఒకటి. మరోవైపు స్థానికులు కూడా వ్యర్థాలను తొలగించాలని హైడ్రాను కోరారు. ఈ నేపథ్యంలో నిర్మాణదారుకు నోటీసులిచ్చి.. వ్యర్థాల తరలింపునకు శ్రీకారం చుట్టామని హైడ్రా అధికారులు తెలిపారు. అందుకయ్యే ఖర్చును అక్రమ నిర్మాణాల యజమాని నుంచి వసూలు చేస్తామన్నారు. ఇదే మాదిరి.. మిగిలిన చెరువుల్లోని నిర్మాణ వ్యర్థాలను, పూడికను తొలగించి.. జలవనరులకు జీవం పోస్తామన్నారు. వ్యర్థాల తరలింపు పనులను చేపట్టడంపై ప్రగతినగర్ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

భద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి

ద.మ. రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: సురక్షితమైన రైల్వే కార్యకలాపాల నిర్వహణకు కచ్చితమైన భద్రతా విధానాలను పాటించాలని ద.మ. రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు జీఎం నీరజ్ అగర్వాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ మొత్తం 6 డివిజన్‌లకు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సంఘవిద్రోహ కార్యకలాపాలపై ఆర్పీఎఫ్ అప్రమత్తంగా ఉండాలన్నారు. జనం పట్టాల క్రాసింగ్ సమస్యను అధిగమించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. సరకు రవాణా లోడింగ్ మెరుగుకు వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా ద.మ. రైల్వే, ఆర్పీఎఫ్ అభివృద్ధి చేసిన 'లూకర్' స్టూడియోను ప్రారంభించారు. భద్రత, సురక్షిత ప్రయాణంపై ప్రజలకు, రైల్వే సిబ్బందికి అవగాహన పెంపొందించడానికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి దుర్మరణం

కంటోన్మెంట్: పని చేస్తున్న చోటే విద్యుదాఘాతంతో ఓ బాలుడు కుప్పకూలిపోయాడు. మారేడుపల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ ఘోరఖ్‌పూర్ జిల్లా దుమారికాస్ గ్రామానికి చెందిన వినయ్ నిషాద్ (17) రెండేళ్ల క్రితం నగరానికి వచ్చాడు. హఫీజ్‌పేట్ ఆదిత్యనగర్‌లో ఉంటూ కాంట్రాక్టర్ దేనేశ్ లుంగానీ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. రోజులాగే సోమవారం ఉదయం వినయ్ వెస్ట్ మారేడుపల్లిలోని చింజరిక స్కాలర్ అపార్ట్‌మెంటులో పనిచేయడానికి వచ్చాడు. ఈ క్రమంలోనే ఇనుప కుర్చీ మీద నిలబడి పనిచేస్తున్న అతను విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. బాలుడి మృతదేహాన్ని కాంట్రాక్టర్ దినేశ్ గుట్టుచప్పుడు కాకుండా తరలించేందుకు యత్నించాడని స్థానికులు ఆరోపించారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి, దినేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00	డ్రెస్డ్	213–00
రిటైల్	147–00	స్కిన్‌లెస్	243–00

ఆలయాల పరిరక్షణ అందరి బాధ్యత



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, గౌతంరావు, క్షీరసాగర్, ఉమారాణి తదితరులు

కాచిగూడ, న్యూస్‌టుడే: సనాతన హిందూ ధర్మం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన దేవాలయాల పరిరక్షణ అందరి బాధ్యత అని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. సోమవారం వప్పల్‌బజార్‌లో ఈడమ్మ ఆలయ ప్రాంగణంలో సందర్భంగా భాజపా జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణితో కలిసి ఆయన మాట్లాడారు. ఆలయాలపై దాడుల నిరోధానికి ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు నేతలు కాసం వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు ఐక్యత అవసరం



మోహన్‌రావును సత్కరిస్తున్న సుధాకర్‌శర్మ

బాలాపూర్, న్యూస్‌టుడే: బ్రాహ్మణులు ఐక్యంగా ముందుకు సాగడం ద్వారానే హక్కులు సాధించుకోవచ్చని బ్రాహ్మణ సంఘాల నేతలు తెలిపారు. బడంగ్‌పేటలో బ్రాహ్మణ సేవా సమితి సమావేశంతో నూతన కార్యవర్గానికి సత్కార కార్యక్రమం జరిగింది. బడంగ్‌పేట సేవా సమతి అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఏఎన్ఎస్.మూర్తి, వేణుగోపాల్ శర్మ, శ్రీనాథ్ శర్మ, సాయి అనూష, సుగుణ, జ్యోతితో పాటు ఎన్నికైన ఇతర సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో భాజపా మీడియా కమిటీ రాష్ట్ర సమన్వయకర్త వి.సుధాకర్‌శర్మ, వైదిక బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్ శర్మ, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం, గాయత్రి సేవా ట్రస్ట్ ఛైర్మన్ రమకాంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం సుసంపన్నం కావాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



గవర్నర్‌తో భేటీ అయిన వీసీ జానయ్య

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయం సుసంపన్నం కావాలని, దాని కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖతో పాటు విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. రైతులకు అన్ని విధాలా సాయం అందించి, సమస్యలు పరిష్కరించాలన్నారు. సోమవారం వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి అల్దాస్ జానయ్య రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆయనతో వ్యవసాయ విశ్వవిద్యాలయ స్థితిగతులు, రాష్ట్రంలో వ్యవసాయ తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు.

విశ్వవిద్యాలయ ప్రక్షాళన..భారీగా బదిలీలు.. వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రక్షాళనలో భాగంగా కొత్త వీసీ జానయ్య భారీ ఎత్తున బదిలీలు చేపట్టారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా సంయుక్త రిజిస్ట్రార్ డి.శివాజీని నియమించారు. పీజీ విభాగం డీన్ అని తను వ్యవసాయ కళాశాల ఎంటమాలజీ ప్రొఫెసర్‌గా బదిలీ చేశారు. పీ అండ్ ఎంసెల్ సంచాలకుడు ఎం.శ్రీధర్‌ను వ్యవసాయ కళాశాల జెనెటిక్స్ ప్రొఫెసర్‌గా బదిలీ చేశారు.

అమరవీరుల పోరాట స్ఫూర్తితో ముందుకుసాగాలి



ఉద్యమ చరిత్రను ఆవిష్కరిస్తున్న వక్తలు

లాలాపేట, న్యూస్‌టుడే: విద్యార్థి అమరవీరుల పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పలువురు వక్తలు అన్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం పీడీఎస్‌యూ 50 వసంతాల మేఘ గర్జన సభ ఆ సంఘం జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సభకు ప్రొఫెసర్ కాశీం, ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, పీడీఎస్‌యూ నాయకుడు, న్యాయవాది జితేందర్ బాబు, డాక్టర్ నలిగంటి శరత్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు అశోక్‌గాయల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ యూనివర్సిటీల్లో వేలాది పోస్టుల భర్తీని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం పీడీఎస్‌యూ 50 సంవత్సరాల ఉద్యమ చరిత్రను ఆవిష్కరించారు. సభలో ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షులు ఆరేళ్లి కృష్ణ, నున్న అప్పారావు, వెంకట్‌రెడ్డి, సాంబ, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సరళ, పీడీఎస్‌యూ ఏపీ ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమ్ శంకర్ పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్య విలువలకు భాజపా కట్టుబడి పనిచేస్తోంది'



పార్టీ నేతలతో గీతామూర్తి తదితరులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: భాజపా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేస్తుందని పార్టీ తెలంగాణ సంస్థాగత ఎన్నికల రాష్ట్ర కోరిటర్నింగ్ అధికారిణి గీతామూర్తి తెలిపారు. 10 కోట్ల మంది క్రియాశీల సభ్యులతో భాజపా దేశంలోనే అతిపెద్ద పార్టీ అన్నారు. భాజపా సంస్థాగత ఎన్నికల రాష్ట్ర కోరిటర్నింగ్ అధికారిణిగా నియమితులైన ఆమె శిక్షణ నిమిత్తం దిల్లీకి బయలుదేరిన సందర్భంగా సోమవారం మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

సామాజిక సేవకు ముందుకు రావాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జస్మత్‌పటేల్, రితీష్ జాగిర్దార్, హితేన్ సంగోయ్

గోల్నాక, న్యూస్‌టుడే: యువత సామాజిక సేవకు ముందుకు రావాలని అఖిల భారత గుజరాతీ సమాజ్ జాతీయ అధ్యక్షుడు జస్మత్‌భాయ్ పటేల్ పిలుపునిచ్చారు. సమాజంలోని పేదలకు అన్ని రకాలుగా చేయూతను అందించాలన్నారు. సోమవారం కాచిగూడలో ఇంటింటికి వెళ్లి బట్టలు, ఆట వస్తువులు తదితర వాటిని సేకరించే కార్యక్రమాన్ని జైన్ మైనార్టీ కౌన్సిల్ రాష్ట్ర కన్వీనర్ రితీష్ జాగిర్దార్, హితేన్ సంగోయ్‌తో కలిసి ప్రారంభించారు. మహిళా వాలంటీర్లు హీనా, జ్యోతి, భావన, శ్రేయ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా సుధీర్‌కుమార్



సుధీర్‌కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న పొన్నం అశోక్‌గౌడ్, టీపీసీసీ ప్రతినిధులు

సనత్‌నగర్, న్యూస్‌టుడే: టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా హైకోర్టు సీనియర్ న్యాయవాది, సనత్‌నగర్‌కు చెందిన సి.హెచ్.సుధీర్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ లీగల్, హ్యూమన్‌రైట్స్, ఆర్‌టీఐ ఛైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నియామక పత్రాన్ని సుధీర్‌కుమార్‌కు అందజేశారు. అనంతరం సనత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.



గ్రూప్‌-I పరీక్షలు నిర్వహిస్తున్న మొయినాబాద్ మండలంలోని కేంద్రాలను రంగారెడ్డి కలెక్టర్ శశాంక పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. -న్యూస్‌టుడే, రాజేంద్రనగర్, మొయినాబాద్



కోఠిలోని టీఎంవీ పరీక్షా కేంద్రంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి -న్యూస్‌టుడే, సుల్తాన్‌బజార్





అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికాగుప్తాలు రామంతాపూర్‌లోని మేఘా మహిళా డిగ్రీ కళాశాల, చింతల్‌లోని రెయిన్ బో డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. -న్యూస్‌టుడే, మేడ్చల్ కలెక్టరేట్

మహా నగరంలో కల్తీ దందా

- మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక నుంచి అక్రమ రవాణా
- ప్రముఖ బ్రాండ్ల లేబుళ్లతో దర్జాగా దందా




టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ సామగ్రి

ఈనాడు, హైదరాబాద్-న్యూస్‌టుడే, బేగంబజార్: నగరం కేంద్రంగా భారీఎత్తున సాగుతున్న నకిలీ దందా ఆందోళనకు గురిచేస్తోంది. సబ్బుబిళ్ల.. కొబ్బరినూనె.. తేయాకు పొడి.. లిప్‌స్టిక్ బామ్.. కావేవీ కల్తీకి అనర్హం అన్నట్లుగా మారాయి. ఒడిశా నుంచి వచ్చిన ఓ వ్యాపారి నాసిరకం తేయాకు పొడిని తెప్పించి అందులో ప్రమాదకరమైన రసాయనాలు.. కొబ్బరి పీచుతో కొత్త బ్రాండ్ టీ పొడి తయారు చేస్తూ పట్టుబడ్డాడు. కర్ణాటక నుంచి నగరానికి చేరుతున్న కాలం చెల్లిన పాలపొడిని హోటళ్లకు సరఫరా చేస్తున్న నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద 5,280 కిలోల పాలపొడిని స్వాధీనం చేసుకున్నారు. జంతువుల కొవ్వుతో నూనెలు.. కుళ్లిపోయిన టమాటతో సాస్. అల్లం. వెల్లుల్లితో పేస్టు తయారు చేసి మార్కెట్‌కు చేరవేస్తున్న ముఠాలు వందల సంఖ్యలో ఉంటాయని అంచనా. 9 నెలల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 19 కేసుల్లో సుమారు 25 మంది నిందితులను అరెస్టు చేశారు.

పలు చోట్ల.. సికింద్రాబాద్, బేగంబజార్, షాహినాయత్‌గంజ్, సుల్తాన్‌బజార్, అఫ్జల్‌గంజ్, అంబర్‌పేట, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో హోల్‌సేల్ మార్కెట్లు ఉన్నాయి. ఇంటిని శుభ్రపరిచే ద్రావకాలు, దోమల నివారణ కాయిల్స్, సబ్బులు, లిప్‌స్టిక్, లిప్‌బామ్, విద్యుత్తు తీగలు, బిస్కెట్లు, చాక్లెట్లు, వంటనూనెలు, తినుబండారాలను స్థానికంగా తయారు చేసి ప్రముఖ కంపెనీల లేబుల్స్‌ను అతికించి మార్కెట్‌లో పంపుతున్నారని టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఒకరు వివరించారు. కల్తీ సామగ్రిని నిర్ధారించేందుకు ఆయా కంపెనీల ప్రతినిధులు, నిపుణులతో పరీక్షించేందుకు సమయం పడుతోందని తెలిపారు.

ఉదంతాలు ఇవిగో..


- కాచిగూడకు చెందిన శ్యామ్‌భాటి, కమల్ భాటి ప్రముఖ బ్రాండ్ల స్టిక్కర్లతో మసాలా దినుసులు, సబ్బులు, టీపొడి, కొబ్బరినూనె వంటి 30 రకాల నిత్యావసర వస్తువులను హోల్‌సేల్, రిటైల్‌గా సరఫరా చేస్తున్నారు. పోలీసులు వీరి వద్ద రూ.2 కోట్ల విలువైన కల్తీ సరకు స్వాధీనం చేసుకున్నారు.
- ఫతేనగర్‌కు చెందిన జగన్నాథ్, ప్రదాన్, శివాస్విన్ పరిదా వ్యాపారులు. వీరు సాగిస్తున్న కల్తీ టీపొడి దందా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. వీరు నిత్యం సుమారు 500 కిలోల టీపొడి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.
- అఫ్జల్‌గంజ్‌కు చెందిన దయారామ్ చౌదరి అనే వ్యాపారి దిల్లీ, గుజరాత్ నుంచి నాసిరకం సామగ్రిని సరఫరా చేసుకొని ప్రముఖ బ్రాండ్ల పేరిట నిర్మాణ రంగ సంస్థలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఇతనిని అరెస్టు చేసి రూ.77 లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.



జీవ వైవిధ్యం.. నగరానికి అందం

ఆయా ప్రాంతాల ఔన్నత్యాన్ని ప్రస్ఫుటించేలా నగరంలో కూడళ్లను సుందరీకరిస్తున్నారు జీహెచ్ఎంసీ అధికారులు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని బయోడైవర్సిటీ కూడలిలో వంతెన కింద పలు రకాల జంతువులు, పక్షుల బొమ్మలు ఏర్పాటు చేస్తున్నారు.

రైతుల వద్దకు పరిశోధన ఫలాలు: వీసీ



దండా రాజిరెడ్డి

ములుగు, న్యూస్‌టుడే: ఉద్యాన పంటలు, నూతన వంగడాలపై చేసిన పరిశోధనల ఫలితంగా వచ్చిన ఫలాలను రైతులకు అందేలా చేస్తామని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ) దండా రాజిరెడ్డి అన్నారు. కొత్త వీసీగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను రైతులు సాగు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ వీసీ నీరజ ప్రభాకర్, రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు రాజశేఖర్, విజయ, నటరాజన్ శ్రీనివాసన్, లక్ష్మి నారాయణ, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

స్థిర వ్యూహాలతో పట్టణీకరణ సవాళ్లకు పరిష్కారం



మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ సౌమ్యముఖర్జీ, పక్కన డాక్టర్ షా తదితరులు

శామీర్‌పేట, న్యూస్‌టుడే: వేగవంతమైన పట్టణీకరణతో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించేందుకు నగర నీటి నిర్వహణపై వినూత్న స్థిరమైన వ్యూహాలకు సిద్ధం కావాలని భారత ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు డాక్టర్ షా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సోమవారం బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్ పిలానీ) హైదరాబాద్ క్యాంపస్‌లో అలిఘర్ ముస్లిం విశ్వ విద్యాలయం, కోయంబత్తూర్ అమృత విశ్వ విద్యా పీఠం సంయుక్త ఆధ్వర్యంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న పట్టణీకరణపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వర్గాలకు నీటి వనరులను అందించే క్రమంలో సహకారం అవసరమని తెలిపారు. బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ సౌమ్యముఖర్జీ మాట్లాడుతూ, గ్లోబల్ సౌత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల ప్రకృతి దృశ్యాలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెర్లిన్ యూనివర్శిటీ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ ఎలిసబెత్ గ్రోష్మన్, పారాస్కుల్ ఇంక్ సీఈవో డాక్టర మనీష్ శర్మ, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా బర్కిలీ ప్రొఫెసర్ గోరాదత్తా, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ టి.శశిధర్, ఐఐటీ రూర్కి డాక్టర్ మిత్తల్ లాల్ కన్సల్ తదితరులు పాల్గొన్నారు.

భయం.. అత్యాశ..

ఫోన్ చేసి ఖాతాలు ఖాళీ చేస్తున్న వైనం

ఇదే సైబర్ మోసగాళ్ల పెట్టుబడి



నారాయణగూడ, న్యూస్‌టుడే: జనం అత్యాశ.. భయం.. ఈ రెండే సైబర్ మోసగాళ్లకు పెట్టుబడిగా మారుతున్నాయి. భయపడేవాళ్లలో ఎక్కువగా విద్యావంతులు, ఉన్నతవర్గాలవారు ఉంటున్నారు. ఇలాంటి నమ్మాల్సిన పనిలేదంటున్నారు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు రాణా ఏసీపీ ఆర్.జి.శివమారుతి.

మానసికంగా దెబ్బతీసి.. ఆగంతుకులు ఫోన్ చేసి.. ఫలానా అమ్మాయి/ అబ్బాయి మీ పిల్లలేనా? వాళ్లు ఇప్పుడు ఎక్కడున్నారో చెప్పగలరా? అని ప్రశ్నిస్తున్నారు. పిల్లల పేర్లు, చెప్పి మానసికంగా ఆందోళనకు గురి చేస్తారు. వాళ్లని కిడ్నాప్ చేశాం. మా దగ్గరే ఉన్నారంటూ.. ఏడుస్తున్న శబ్దాన్ని వినిపిస్తారు. డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తారు.

పార్శిల్ మోసాలు... ఫెడెక్స్ కొరియర్ పేరిట ఫోన్ చేసి.. 'మీ ఆధార్, పాన్ నంబరుతో బుక్ అయిన పార్శిల్‌లో నిషేధిత వస్తువు ఉన్నాయి. ముంబయి/దిల్లీ పోలీసులు, కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మనీలాండరింగ్ కేసులో మీరు దోషులుగా ఉన్నారు. అంటూ భయపెడతారు. ఆతర్వాత స్కైప్ వీడియో కాల్ చేసి పోలీసు యూనిఫారంలో ఉన్న ఉన్న వ్యక్తి వచ్చి కేసు దర్యాప్తు, విచారణ అంటూ హడావుడి చేస్తాడు. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని నిబంధన పెడతారు. చెబితే వారినీ అరెస్టు చేస్తాం అంటారు. గదిలోంచి బయటకు వచ్చినా, ఫోన్ కట్ చేసినా.. ఇంటి బయటే ఉన్న పోలీసులు వెంటనే మిమ్మల్ని, కుటుంబ సభ్యులనూ అరెస్టు చేస్తారంటూ హెచ్చరిస్తారు. ఎఫ్ఐఆర్‌తో పాటు సుప్రీంకోర్టు, హైకోర్టు వారెంట్లు అంటూ పత్రాలు చూపిస్తారు. ఆన్‌లైన్‌లోనే అరెస్టు చేస్తామంటారు. కేసు పోవాలంటే మూడో వంతు డబ్బు ఆర్‌బీఐ ఖాతాలో జమ చేయాలని హుకుం జారీ చేస్తారు. 24 గంటల్లో ఆ డబ్బు తిరిగి వస్తాయంటారు. ఈ బెదిరింపులకు లొంగిపోతే మన ఖాతాలు ఖాళీ అయినట్లే.

అంతా సెట్టింగే... స్కైప్ వీడియో కాల్‌లో కనిపించే పోలీసుల వెనుక మహారాష్ట్ర లేదా ఇతర రాష్ట్రాలకు సంబంధించి లోగోలు కనిపిస్తాయి. ఇందంతా సైబర్ నేరగాళ్లు ఏర్పాటు చేసుకున్న సెట్టింగ్. ఇలాంటి కాల్స్ వస్తే వెంటనే ఫోన్ కట్ చేసి నంబరు బ్లాక్ చేయాలి. 1930 నంబరుకు లేదా www.cyber-crime.gov.in లో మోసగాళ్ల ఫోన్ నంబరులతో ఫిర్యాదు చేస్తే వాటిని వెంటనే బ్లాక్ చేస్తారు

ఆశపెట్టి... ఆన్‌లైన్‌లో హోటళ్లకు రేటింగ్‌లు, సమీక్షలు రాయడం, పంపించిన వీడియోలకు లైక్‌లు, ట్రేడింగ్‌లో లాభాలు అంటూ ఆశ పెట్టి దోచేస్తుంటారు కొందరు. ట్రేడింగ్‌లో శిక్షణ ఇస్తామని చెప్పి వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూప్‌లలో సభ్యత్వం చేర్చుకుంటారు. అక్కడ జరిగే చర్చను చూసి అధిక లాభాలు వస్తాయని చాలా మంది పెట్టుబడులు పెడతారు. తర్వాత మోసపోయామని గ్రహిస్తారు. * ప్రధానంగా టెలిగ్రామ్, ఇతర సామాజిక మాధ్యమ వేదికల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు, షేర్ మార్కెట్‌లో 200, 300 శాతం లాభాలంటే అంటే మోసమని గ్రహించాలి.

ఇవి గమనించాలి... వాస్తవానికి పోలీసులకు ఫలానా చోట నిందితుడు ఉన్నాడని సమాచారం అందితే ఒకటి రెండుసార్లు నిర్ధారించుకున్న తరువాత మాటు వేసి పట్టుకుంటారు. అంతేగానీ మిమ్మల్ని అరెస్టు చేస్తామని వీడియో కాల్ చేసి చెప్పరు. డిజిటల్ అరెస్టు అనేది ఏమీ ఉండదు.

బిల్లులు.. కేవైసీలు... కరెంట్ బిల్లు కట్టాలని, అలాగే క్రెడిట్, డెబిట్, బ్యాంక్ ఖాతాలను కేవైసీ అప్‌డేట్ చేసుకోండి లేదంటే మీ సేవలు నిలిచిపోతాయంటూ మరికొందరు మోసాలకు పాల్పడుతుంటారు. వారు పంపించే ఏపీకే ఫైల్స్ (లింక్)పై క్లిక్ చేయవద్దు. ఇటీవల జాతీయ బ్యాంకుల లోగోలతో లింక్ పంపించి బురిడీ కొట్టిస్తున్నారు. దానిపై క్లిక్ చేయవద్దు.

వసుంధర

vasundhara@eenadu.in

పోషకాల నీళ్లు...

ఉదయాన్నే ఓ గ్లాసు గోరువెచ్చని నీళ్లు తాగితే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలుంటాయని తెలిసిందే. అయితే, అలా వట్టి నీళ్లు కాకుండా అందులో పండ్లు, మూలికలు, కూరగాయలు లాంటివి వేసిన 'ఇన్ఫ్యూజ్‌డ్' నీటిని తాగడం కొందరు అమ్మాయిలకు అలవాటు. ఇవి ఆరోగ్యానికి మంచిదే అయినా కొన్ని జాగ్రత్తలూ తీసుకోవాలంటున్నారు నిపుణులు. అవేంటంటే...



జ్ఞాపకశక్తి పెంచే నెయ్యి...

గోరువెచ్చని నీళ్లలో ఓ టీస్పూన్ నెయ్యి వేసుకుని పరగడుపున తీసుకుంటే మెటబాలిజం మెరుగుపడుతుంది. శరీరం డిటాక్స్ అవుతుంది. హార్మోన్లు సమతుల్యం అయ్యి, పీరియడ్స్ క్రమం తప్పకుండా వస్తాయి. వయసు పైబడేకొద్దీ మహిళల్లో ఎముకల సాంద్రత తగ్గిపోతుంటుంది. కాబట్టి, నెయ్యిని రోజూ తీసుకోవడం వల్ల ఎముకలు బలపడతాయి. గుండె ఆరోగ్యం, జ్ఞాపకశక్తి ఏకాగ్రత పెరుగుతాయి. అయితే, రోజుకి ఒకటి లేదా రెండు టీస్పూన్ల కంటే ఎక్కువగా తీసుకోవద్దు అంటున్నారు న్యూట్రిషనిస్టులు. నెయ్యిని అధికంగా తీసుకుంటే బరువు పెరిగే అవకాశం ఉందట. అది కూడా ఖాళీ కడుపుతో తీసుకునేటప్పుడు శరీరం ఎలా ప్రతిస్పందిస్తోందో గమనించుకుని కొనసాగించాలట.

మెరిపించే మునగ..

మెరిసే చర్మం కోరుకోని ఆడవాళ్లు ఎవరు? అందుకే, మునగాకుని నీళ్లలో వేసుకుని తాగుతుంటారు. ఇందులో ఉండే విటమిన్ ఎ, సి, ఈ, కాల్షియం, పొటాషియంలు చేసే మేలెంతో. మునగ రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రిస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలోనూ, గర్భధారణ సమయంలో వచ్చే భావోద్వేగాలను అదుపులో ఉంచడంలోనూ దీని పాత్ర కీలకం. తల్లుల్లో పాల ఉత్పత్తినీ పెంచుతుంది. అందుకే, దీన్ని 'పోషకాల గని' అంటారు. అయితే, మునగ నీళ్ల వల్ల కొంతమందిలో జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందట. ముఖ్యంగా అధిక మొత్తంలో తీసుకుంటే విరేచనాలు, కడుపునొప్పి, వికారం లాంటివి వస్తాయంటున్నారు నిపుణులు.

బ్యాక్టీరియాను అరికట్టే ఉప్పు...

కొంతమంది గోరువెచ్చని నీటిలో కాస్తంత ఉప్పు వేసుకుని తాగుతుంటారు. దీనివల్ల శరీరానికి ఎలక్ట్రోలైట్‌లు అంది నరాల పనితీరు మెరుగుపడుతుంది. ఆ నీటితో పుక్కిలిస్తే, నోట్లో ఉండే చెడు బ్యాక్టీరియా నశించి, నోటి ఆరోగ్యమూ బాగుంటుంది. అయితే, రోజుకి 5గ్రాములు(టీస్పూన్) కంటే అధికంగా ఉప్పు తినొద్దని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. మోతాదు ఎక్కువైతే వాంతులు, అధిక రక్తపోటు... లాంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందట. కాబట్టి, వీటన్నింటి వల్ల ప్రయోజనాలు ఉన్నప్పటికీ, జాగ్రత్తలూ తప్పనిసరి అంటున్నారు నిపుణులు.


దాయాది దేశం పేరు వింటే కోపగించుకునేవారు కొందరైతే... వణికిపోయేవారు ఇంకొందరు. అలాంటిది కొన్నేళ్లు ఆ దేశంలో జీవించాల్సి వస్తే? ప్రతి నిమిషం నిఘా నీడలో గడపాల్సి వస్తే... ఎలా ఉంటుంది? అయిన వాళ్లకు దూరంగా... మన అనుకునేవాళ్లు లేనిచోట ఎలా జీవించారో రుచి ఘనశ్యామ్ పంచుకున్నారు. ఇంతకీ ఎవరీమె? ఆ సంగతులేంటి అంటే...



రుచి

పాకిస్థాన్‌లో... ప్రాణాలు గుప్పెట్లో..!

సైకాలజీలో ఎంఏ చేశాక సివిల్స్‌పై దృష్టిపెట్టారు రుచి. ఈమెది భోపాల్. 22 ఏళ్ల వయసులో ఐఎఫ్‌ఎస్ (ఇండియన్ ఫారెన్ సర్వీసెస్) సాధించారు. నలభై ఏళ్ల కెరియర్‌లో దౌత్యవేత్తగా ఎనిమిది దేశాల్లో పనిచేశారీమె. అయితే 1997-2000 మధ్య పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో పనిచేయడం మాత్రం సవాలే! అక్కడ పనిచేసిన తొలి భారత మహిళ కూడా రుచినే. ఆ అనుభవాలను 'యాన్ ఇండియన్ ఉమన్ ఇన్ ఇస్లామాబాద్' అనే పుస్తక రూపంలో తీసుకొచ్చారు.



'ఇస్లామాబాద్ హైకమిషన్‌లో ఇలా చేరానంతే. ఎక్కడికి వెళ్లినా కనీసం ఇద్దరు ఐఎస్ఐ ఏజెంట్లు నా కారును అనుసరించేవారు. అక్కడ మీ కదలికలు గమనిస్తున్నామనే కాదు... ఎవరినీ మాతో మాట్లాడొద్దు అన్న సంకేతమిస్తున్నట్లే అనిపించేది. స్నేహితులు, తెలిసిన వాళ్ల ఇంటికి వెళుతున్నా వాళ్ల తీరంతే. మేమేం మాట్లాడుకుంటున్నామో వినేవారు. హైకమిషన్‌లో పనిచేసే బంట్రోతు, తోటమాలిని సైతం 'ప్రశ్నించడం' పేరుతో తీసుకెళ్లేవారు. ఫోన్ ట్యాపింగ్, ఇంట్లో తెలియకుండా మైక్స్ ఉండుండొచ్చు. పనిచేసేవారికీ సీక్రెట్ మైక్‌లుండే అవకాశముంది. ఒకసారి అది బయటపడింది కూడా. వ్యక్తిగతమన్న దానికే అవకాశమిచ్చేవారు కాదు. చాలా కోపమొచ్చేది. అయితే భయం లేదు. అప్పటికి నాకు 37ఏళ్లే. కానీ సిరియా, నేపాల్, బెల్జియం వంటి చోట్ల 15ఏళ్లు పనిచేసిన అనుభవం సాయపడింది. నాతోపాటు మావారు ఏఆర్ ఘనశ్యామ్, ఇద్దర బ్బాయిలు అనికేత్, అనంత్‌లూ వచ్చారు. పిల్లలకు 11, 8 ఏళ్లే! వాళ్లని అక్కడ కుదురుకునేలా చేయడం పెద్ద సవాలుగానే తోచింది. టీచర్ భారత్‌కి వ్యతిరేకంగా ఏదైనా చెప్పడం ఆలస్యం... తరగతిలో లేచి నిల్చొని వాదనకు దిగేవారు. పాకిస్థాన్‌పై భారత్ ఓడిపోలేదని చెప్పాన్నేను. కానీ అక్కడ 1965 యుద్ధంలో భారత్ ఓడిందని టీచర్ చెప్పారు. ఇది తప్పంటారు వాళ్లు. దీంతో టీచర్ల నుంచి ఫిర్యాదు. నిజానికి చరిత్రను మార్చి పాఠాలు చెప్పేవారక్కడ. వివాదాలకు వెళ్లకుండా ఆ విషయాన్ని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పడం కష్టమనిపించేది.

ఇదంతా ఒకెత్తయితే, మేమక్కడ ఉన్నప్పుడే కార్గిల్ యుద్ధం జరిగింది. దీనికితోడు 1998లో భారత్ 'ఆపరేషన్ శక్తి' పేరుతో అణుపరీక్ష నిర్వహించింది. పాకిస్థాన్ దీన్ని వ్యతిరేకించింది. పోటీగా అణుపరీక్షలూ నిర్వహించింది. అయినా కోపం చల్లారక భారత ఎంబసీలో ఉద్యోగులపై దాడికి దిగారు. ఒకతను తీవ్రగాయాల పాలయ్యారు. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ఉన్న సందర్భాలివి. 1999 డిసెంబరులో మన విమానాన్ని ఉగ్రవాదులు హైజాక్ చేశారు. 191మంది ప్రయాణికుల్ని విడిచిపెట్టాలంటే డబ్బుతోపాటు 36మంది పాకిస్థాన్ ఖైదీలను అప్పగించాలని షరతు పెట్టారు. మావారు ట్రేడ్ అండ్ ఎకానమీ విభాగంలో పనిచేస్తున్నారు. భారత్ నుంచి బృందం వచ్చేలోగా మధ్యవర్తిత్వం నిర్వహించాలని ఆయన్ని పంపారు. భయానికి గురిచేసే సంఘటనే. కానీ ఇంటెలిజెన్స్ ఆఫీసర్లు రంగంలోకి దిగాక ముగ్గురు పాకిస్థాన్ ఖైదీలను అప్పగించి, మన వాళ్లందరినీ సురక్షితంగా తీసుకురాగలిగారు' అని గుర్తుచేసుకుంటారు రుచి.

పాకిస్థాన్ తరవాత న్యూయార్క్, ఘనా, దక్షిణాఫ్రికాతోపాటు యూకేల్లో పనిచేసి 2020లో పదవీ విరమణ పొందారామె. 'ప్రతిచోటా ఇబ్బందులున్నా ఇస్లామాబాద్‌లో పని మాత్రం సవాళ్లతో కూడుకున్నదట. అలాగని ఆ దేశమంతా శత్రువులే అంటే ఒప్పుకోరామె 'ఒక టైలర్ ఎప్పుడు దుస్తులు కుట్టమన్నా ఆలస్యంగా ఇచ్చేవాడు. అందుకు పరిహారంగా ప్రతిసారీ ఒక సల్వార్ కమీజ్ బహుమతిగా ఇచ్చేవాడు. రాయబార కార్యాలయం ద్వారా ఇక్కడికొచ్చాక కూడా డ్రెస్‌ని బహుమతిగా పంపాడు. మా ఇంటి ఓనరైతే మా భద్రత కోసమని తన గన్‌మేన్‌లని ఇంటి ముందు నియమించేవారు. దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకూ సరిహద్దుల్లో ఘర్షణలకు పాకిస్థాన్ వాళ్లు కారణమవుతున్నారన్నది సత్యమే! అయితే అక్కడి ప్రజలు అందించే ప్రేమ, ఆప్యాయతలనీ మర్చిపోలేం' అంటారు రుచి.

అమ్మానాన్నలకు డబ్బు పంపనివ్వడం లేదు...!

రెండేళ్ల క్రితం నాకు పెళ్లయ్యింది. పెళ్లిచూపుల్లోనే అమ్మానాన్నల్ని చూసుకోవాల్సిన బాధ్యత నాదేనని భర్త, అత్తమామలకు చెప్పా. అందుకు ఒప్పుకొన్నారు కానీ ఇందుకోసం అగ్రిమెంట్లు ఏమీ రాసుకోలేదు. ఇప్పుడు మాత్రం నా జీతం, ఖర్చులు అన్నింటి మీద ఆంక్షలు విధిస్తున్నారు. పుట్టింటి వారికి ఏ విధంగానూ సాయం చేయనివ్వడం లేదు. పైగా అందరిలోనూ మా వాళ్లను నామీద ఆధారపడి బతుకుతున్నారంటూ హేళన చేస్తున్నారు. ఇది నాకు నచ్చడం లేదు. ఆడపిల్లలకు తల్లిదండ్రులు చూసుకునే బాధ్యత లేదా? – ఓ సోదరి

వివాహిత సొంతంగా సంపాదించిన ఆస్తి ఆమెకు మాత్రమే చెందుతుంది. అయితే మన హిందూ సంప్రదాయంలో భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తున్నప్పుడు ఇంటి పోషణ భారం ఇద్దరూ కలిసి చూసుకోవాలనే ఒప్పందంతో నడుస్తున్నారు. ఒకరి సంపాదన సరిపోనప్పుడు రెండో వారి ఆదాయం మీద ఆధారపడుతున్నారు. అదంతా భవిష్యత్తు భద్రత కోసం జరుగుతోంది. కుటుంబ అవసరాల్లో నేడు ఏసీలు, ఫ్రిజ్... అన్ని భాగమయ్యాయి. అవి తలకు మించిన భారమై ఇద్దరి సంపాదన కూడా సరిపోని పరిస్థితుల్ని కల్పిస్తున్నాయి. ఇవే దంపతుల మధ్య తగాదాలకూ కారణం అవుతున్నాయి. హిందూ అడాప్షన్స్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ లోని సెక్షన్ 25 ప్రకారం వయసు మళ్లిన తల్లిదండ్రుల పోషణ బాధ్యత వారి సంతతిదే. ఇందులో కూతురు, కొడుకు అనే భేదం లేదు. కొడుకు లేని పక్షంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని సెక్షన్144 ప్రకారం కూతురు సంపాదనపరురాలైతే ఆమె దగ్గర నుంచి కూడా మెయింటెనెన్స్ పొందవచ్చు. ఒకవేళ బిడ్డలు మరణిస్తే.... వారి సంతానం (మనవలు, మనవరాళ్లు), కోడలి నుంచీ మెయింటెనెన్స్ కోరవచ్చు. ఇక, మీ విషయానికి వస్తే అమ్మానాన్నలను చూసుకోవడానికి అగ్రిమెంట్స్ అవసరం లేదు. బాధ్యత మాత్రమే ఉండాలి. అది మీలో కనిపిస్తోంది. మీ సమస్యను అత్తమామలకు చెప్పి, వారికి ఇంత ఇవ్వదలుచుకున్నాను అని స్పష్టంగా చెప్పండి. కుదరదంటే పెద్ద మనుషులతో మాట్లాడించండి. మీ అక్కను కూడా కొంత బాధ్యత తీసుకోమనండి. లేకపోతే అమ్మానాన్నలతో మీ ఇద్దరి మీద మెయింటెనెన్స్ కేసు వేయించండి. కోర్టు ఆర్డర్ ఉంటే తప్పకుండా ఇవ్వాల్సిందే కదా! ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

డియర్... వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

నీ వెంట నీరెండలా..!

హాస్టల్, కాలేజీలో పరిచయమైనవారితో క్షణాల్లో స్నేహం చేస్తుంది రేష్మ, అయితే అంతే వేగంగా నచ్చలేదంటూ దూరం పెడుతుంది. అయితే స్నేహితులను ఎంపిక చేసుకునేటప్పుడు మధ్యాహ్నపుటెండలా అప్పటికప్పుడే పెరిగిపోయేలా కాకుండా, సాయంకాలపు నీరెండలా నెమ్మదిగా అర్థం చేసుకుంటూ ఏర్పరుచుకునే బంధం ఏదైనా... ఎక్కువకాలం నిలబడుతుందట.



స్నేహంలో...

పరిచయమైనప్పుడే కొందరు మనకు తగిన స్నేహితులా కాదా అని ముందుగానే అర్థమవుతుంది. మరికొందరు తమ అలవాట్లు, అభిప్రాయాలను వ్యక్తీకరించకపోవడంతో మొదటిసారి కలిసినప్పుడు వాళ్లను అంచనా వేయలేం. ముభావంగా ఉండే వారి స్వభావంవల్ల అర్థం చేసుకోవడం కష్టతరమవుతుంది. అలాగే తక్కువగా మాట్లాడేవారి గురించి కూడా మొదటి పరిచయంలో తెలుసుకోలేం. తరచూ పలకరించడంవల్ల అవతలివారి మనస్తత్వంపై కొంతవరకు అవగాహన తెచ్చుకోవచ్చు. అలాగే కష్టసమయాల్లో చేయూతగా నిలబడి, నిరాశకు గురైనప్పుడు సాయంగా నేనున్నాననే భరోసా ఇచ్చే వాళ్లతో చేసే స్నేహం కలకాలం నిలుస్తుంది.

వైవాహిక బంధంలో...

జీవితభాగస్వామితో కలకాలం కలిసి బతకాలి. అలాగని భాగస్వామిని ఒక్కసారే అర్థం చేసుకోవడం కూడా కష్టం. నిలకడగానే తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. భార్యాభర్తల మధ్య నిజమైన బంధం ఏర్పడాలంటే ఇరువురూ ఎదుటివారి కోసం సమయాన్ని వెచ్చించాలి. తమ బలాలు, బలహీనతలను అవతలివారితో పంచుకోవాలి. భాగస్వామి అలవాట్లను సహనంతో అడిగి తెలుసుకోవాలి. ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించాలి. ఇలా నెమ్మదిగా ఒకరినొకరు అర్థం చేసుకోవడంతో మొదలయ్యే బంధం ఇరువురిలో నమ్మకాన్ని పెంచుతుంది. జీవితాంతం కలిసి బతకడానికి కావాల్సినంత భరోసాను అందిస్తుంది.



బంగారం-వెండి

21న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ.లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	7,300	7,280
వెండి (గ్రా)	109.00	107.00

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం (24క్యా)	80,340	80,120	78,015	77,300	80,450	79,500	80,640	80,600	79,350	79,130
ఆర్నమెంట్	73,800	73,600	73,100	72,800	74,500	73,620	74,200	74,150	73,000	72,800
వెండి (కిలో)	99,399	97,570	100,400	99,300	98,000	96,500	99,000	95,000	100,000	99,000

ఇవ్వడం నేర్పుతున్నారా!

స్నేహితుల పుట్టినరోజులకు ఏదైనా కానుక ఇవ్వాలనే కొడుకును రాజీ మందలించి పంపుతుంటుంది. ఇది పిల్లల్లో స్వార్థాన్ని పెంచుతుంది. అవతలివారి నుంచి తీసుకున్నప్పుడు మనం కూడా ఎంతోకొంత తిరిగి ఇవ్వాలనే అలవాటు నేర్పించాలి. క్రమేపీ అది పిల్లల్లో సమాజానికీ తమవంతుగా ఏదో ఒకటి చేయాలనే ఆలోచన బీజంగా మారుతుంది.



ఎదుటివారికి కానుక ఇవ్వడంవల్ల కలిగే సంతోషం ఎలా ఉంటుందో చిన్నప్పటి నుంచి తెలిసేలా చేయాలి. తోబుట్టువులు, స్నేహితులు, బంధువుల పుట్టినరోజులకు చిన్నచిన్న గిఫ్ట్‌లు ఇవ్వడం నేర్పించాలి. పుట్టినరోజు తేదీలను క్యాలెండర్‌లో నోట్ చేసుకోవడం, ఆ సందర్భం వచ్చేసరికి ఏమివ్వాలో సలహా ఇవ్వడం చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపుతుంది. ఆ కానుకలను కూడా పెద్దవాళ్లు తమ నగదుతో కాకుండా, వాళ్లకిచ్చే పాకెట్‌మనీని పొదుపు చేయడమెలాగో నేర్పించి వాటితో కొనిపించడం అలవాటు చేయాలి. అప్పుడే ఇతరులకు ఇవ్వడమనేది బాధ్యతగానూ మార్చుకుంటారు. అందులో దక్కే సంతోషాన్నీ పిల్లలు అనుభవిస్తారు. ఈ అలవాటు క్రమేపీ వారితోపాటు పెరిగి పెద్దదవుతుంది. వాళ్లలో సామాజిక బంధాలు మెరుగవుతాయి. తోటివారిని ప్రేమించడం నేర్చుకుంటారు. స్నేహబంధాలు పెరుగుతాయి.

స్వయంగా...

బంధువు, తమ మనసుకు నచ్చిన స్నేహితులు దూరాన ఉన్నప్పుడు పుట్టినరోజు లేదా పండగకు అభినందనలను పోస్టులో ఎలా పంపాలో పిల్లలకు నేర్పించాలి. ఆ గ్రీటింగ్ కార్డులను స్వయంగా తయారుచేయడంలోనూ శిక్షణనిస్తే వారి సృజనాత్మకత బయటపడుతుంది. అలాగే బొమ్మలు, గ్రీటింగ్ కార్డులే కాకుండా ఎదుటివారికి నచ్చేలా కథల పుస్తకం, క్విజ్ వంటివీ ఎంపిక చేసేలా ప్రోత్సహించాలి. దగ్గర్లో ఉన్న స్నేహితులకు మొక్కను బహుమతిగా ఇప్పించాలి. అంతేకాదు, స్నేహితులు, బంధువులకు మాత్రమే అని కాకుండా తల్లిదండ్రుల్లేని చిన్నారులూ... ఉన్నారని చెప్పాలి. నెలవుదినాల్లో సమీపంలోని ఏదైనా అనాథాశ్రమానికి తీసుకెళ్లి అక్కడి వాళ్లను పరిచయం చేయాలి. చాకొలెట్లు, బిస్కట్లు ఇప్పించాలి. పుట్టినరోజు వంటి ప్రత్యేకమైన రోజుల్లో అనాథలందరికీ భోజనం పెట్టించడంలో పిల్లలను భాగస్వాములను చేయాలి. తమ బొమ్మలు, పుస్తకాలు, దుస్తులువంటివాటిని పిల్లలతో ఆ అనాథ చిన్నారులకు అందించేలా చేయాలి. వీటన్నింటితో బాల్యం నుంచి ఇతరులపట్ల ప్రేమతో మెలగడమెలాగో పిల్లలకు తెలుస్తుంది. సమాజానికి తమ వంతుగా ఏదైనా సాయపడాలనే ఆలోచన, ఆశయాన్ని పెంచుతుంది.



యువతను మెప్పిస్తోన్న నీలం...

నగా నట్రా

నవరత్నాల్లో ఒకటిగా పిలిచే నీలం రాయికి వజ్రానికంటే విలువెక్కువ. ఈ బ్లూ సాఫైర్‌ని ఇంద్రనీలం, నీలమణి అని కూడా పిలుస్తారు. శతాబ్దాలుగా వీటికి ప్రత్యేక గుర్తింపు ఉంది. వీటిని ధరించడం శక్తికి ప్రతీకగా, రాచరికపు హోదాగా భావిస్తారు. మధ్యయుగాల్లో ఈ నీలమణికి ఔషధ గుణాలున్నాయని నమ్మేవారట. వీటికి ఉన్న ప్రత్యేక లక్షణాల వల్లేనేమో బ్రిటన్ రాణి డయానా, కేట్ మిడిల్ టన్... నిశ్చితార్థపు ఉంగరాలు, బ్రిటిష్ క్రౌన్ జ్యువెలరీల్లోనూ నీలం రాళ్లే ఎక్కువట. కంటిని ఆకట్టుకునే రంగు... తరగని మెరుపుతో ఉండే ఇవి ఈతరం అమ్మాయిలకు భలేగా నచ్చేస్తున్నాయి. అందుకే స్టడ్స్, పెండెంట్స్ వంటి వాటికే పరిమితం కాకుండా హారాలు, నెక్లెస్లు వంటివి కూడా ఎంచుకుంటున్నారు. అలాంటివే ఈ డిజైన్లన్నీ.... ఓసారి ఇటు చూడండి. మీకూ నచ్చేస్తాయి.





ఉద్యోగం వదిలి... రూ.8 కోట్ల సంపాదన!

రెండు కోట్ల రూపాయల వార్షికాదాయం! పదేళ్ల అనుభవం. అలాంటి కెరియర్‌ని ఎవరైనా వదిలేస్తారా? నిషా షా వదిలేయడమే కాదు, ఏమాత్రం సంబంధం లేని కొత్త రంగంలోకి ప్రవేశించింది. యూట్యూబర్‌గా మారింది. ఆ తరవాత? మీరే చదివేయండి.



నిషా

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా అది తొమ్మిదో సంవత్సరం. కొత్త సవాళ్లు ఎదురవలేదు. సాధించాలన్న లక్ష్యాలూ కనిపించలేదు. అలాంటప్పుడు ఈ ఉద్యోగమెందుకు? అనిపించిందట నిషాకి. తనకేం కావాలి అన్న స్పష్టత వచ్చాక ఉద్యోగానికి రాజీనామా చేసి, 'నిషా' పేరుతో 2021లో యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించింది. ఈమె పుట్టింది యూకేలో. తల్లిదండ్రులది భారత్. ఈమె పుట్టకముందే వాళ్లు యూకేలో స్థిరపడ్డారు. ఫైనాన్స్, అకౌంటింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌ల్లో చదువు పూర్తిచేశాక నిషా పలు ప్రముఖ సంస్థల్లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా పనిచేసింది. బడా సంస్థలకు సాయపడటం కాదు, సామాన్యులకు ఆర్థిక అంశాల్లో తోడ్పాటు ఇవ్వాలి అనుకున్నాక ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఫైనాన్స్, సెల్ఫ్ డెవలప్‌మెంట్, చిన్న వ్యాపారస్థులు గమనించుకోవాల్సిన అంశాలపై ఎన్నో వీడియోలు చేసింది. కానీ వెయ్యిమంది సబ్‌స్క్రైబర్లు రావడానికి 11 నెలలు పట్టింది. 'మిమ్మల్ని పేదవాళ్లగానే ఉంచే అలవాట్లు', 'తొలి రూ.వెయ్యిని ఎలా ఇన్వెస్ట్ చేయాలి' వంటి వీడియోలకు ఆదరణ వచ్చింది దీంతో రెండు నెలల్లోనే అనుసరించే వారి సంఖ్య లక్షకు చేరింది. అలా పెరుగుతూ పెరుగుతూ 11 లక్షలకు చేరింది. గత వార్షిక సంవత్సరం ఆమె సంపాదనెంతో తెలుసా? ఏకంగా రూ. 8 కోట్లు. 'సామాన్యులకు సాయపడేలా ఆర్థిక చిట్కాలు ఇవ్వాలన్నదే నా ఉద్దేశం. సరైన సమాచారం ఇస్తే ఎవరైనా అనుసరిస్తారు. నేను చేసింది అదే! నా పరిజ్ఞానం ఇంతమందికి సాయపడటం ఆనందంగా ఉంది' అంటోంది నిషా. ఆమె ప్రయత్నాన్ని అభినందించకుండా ఉండగలమా?



ఉండేదెవరు.. వెళ్లేదెవరు?

శ్రీలంక చేతిలో చిత్తయి భారత్‌లో అడుగు పెట్టిన న్యూజిలాండ్ రోహిత్ సేన ముందు ఏం నిలుస్తుందిలే అనుకున్నారు అభిమానులు. కానీ బెంగళూరులో సంచలన ప్రదర్శనతో టెస్టు మ్యాచ్ గెలిచి సిరీస్‌లో శుభారంభం చేసింది ప్రత్యర్థి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ దిశగా దూసుకెళ్తున్న భారత జట్టుకు ఈ ఓటమి శరాఘాతమే. దీంతో తప్పెక్కడ జరిగిందో విశ్లేషించుకుని తర్వాతి మ్యాచ్‌కు సర్దుబాట్లు చేసుకునే పనిలో పడింది టీమ్‌ఇండియా. ఈ నేపథ్యంలో జట్టులో కొన్ని మార్పులు తప్పకపోవచ్చని తెలుస్తోంది.

పుణె

విదేశీ పేస్ పిచ్‌లపై రాణించినట్లు స్వదేశీ వికెట్లపై సత్తా చాటలేకపోతున్న హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌పై వేటు వేయాలన్న డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. భారత గడ్డపై 13 టెస్టులాడిన సిరాజ్ 19 వికెట్లు మాత్రమే పడగొట్టాడు. విదేశాల్లో అతను 17 టెస్టుల్లోనే 61 వికెట్లు తీయడం విశేషం. ఇటీవల భారత పిచ్‌లు కొంత పేస్‌కు అనుకూలిస్తున్నా సిరాజ్ రాణించలేకపోతున్నాడు. కివీస్‌తో తొలి టెస్టులో అతను 2 వికెట్లే తీశాడు. అనుభవం దృష్ట్యా సిరాజ్‌కే అవకాశమిస్తున్నప్పటికీ.. ఫామ్ ప్రకారం చూస్తే ఆకాశ్‌దీప్‌కు ఛాన్స్ ఇవ్వాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆడిన మూడు టెస్టుల్లో ఆకాశ్ 23.12 సగటుతో 8 వికెట్లు పడగొట్టాడు. ఈ మూడు మ్యాచ్‌లూ స్వదేశంలో ఆడినవే. పుణెలోనూ ఇద్దరు పేసర్లకే పరిమితమవ్వాలనుకుంటే బుమ్రాకు తోడుగా సిరాజ్ స్థానంలో ఆకాశ్‌ను ఆడించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. జట్టు యాజమాన్యం కూడా ఇందుకు సుముఖంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఇక బ్యాటింగ్‌లో కూడా మార్పులు అనివార్యంగా కనిపిస్తున్నాయి. మెడ నొప్పితో తొలి టెస్టుకు దూరమైన యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ రెండో టెస్టుకు అందుబాటులోకి వస్తున్నాడు. మంచి ఫామ్‌లో ఉన్న అతడికి తుది జట్టులో చోటివ్వాల్సిందే. కానీ శుభ్‌మన్ స్థానంలో బెంగళూరు టెస్టులో ఆడి రెండో ఇన్నింగ్స్‌లో అద్భుత శతకం (150) సాధించిన సర్ఫరాజ్ ఖాన్‌ను పక్కన పెట్టే పరిస్థితి ఎంత మాత్రం లేదు. మరి ఈ ఇద్దరూ ఆడితే ఎవరు స్థానాన్ని త్యాగం చేయాలనే ప్రశ్న తలెత్తుతుంది. బెంగళూరులో పేలవ ప్రదర్శన చేసిన కేఎల్ రాహుల్ వైపే అన్ని వేళ్లూ చూపిస్తాయనడంలో సందేహం లేదు. అయితే పుణెలో రాహుల్‌కు మరో అవకాశం దక్కే సంకేతాలు కనిపిస్తున్నాయి. తొలి టెస్టులో మోకాలి గాయంతో రోజున్నర పాటు ఆటకు దూరంగా ఉన్న రిషబ్ పంత్, తర్వాత కష్టపడి బ్యాటింగ్ అయితే చేశాడు కానీ.. మోకాలి నొప్పి అతణ్ని ఇబ్బంది పెట్టింది. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయంతో శస్త్రచికిత్స జరిగిన కాలికే ఇప్పుడు మళ్లీ గాయమైన నేపథ్యంలో పంత్‌ను రెండో టెస్టుకు దూరంగా ఉంచే అవకాశాలున్నాయి. పంత్ ఆడకపోతే శుభ్‌మన్ జట్టులోకి రావడం.. రాహుల్, సర్ఫరాజ్ కొనసాగడం ఖాయం. పంత్ ఆడేట్లయితే మాత్రం రాహుల్‌పై వేటు పడొచ్చు.


సిరాజ్


శుభ్‌మన్ గిల్


రాహుల్

దీపికకు రజతం


దీపిక కుమారి

ట్లాకలా (మెక్సికో): ప్రపంచకప్ ఆర్చరీ కప్ ఫైనల్‌లో భారత స్టార్ ఆర్చర్ దీపిక కుమారి సత్తా చాటింది. మహిళల రికర్వ్ సింగిల్స్‌లో ఆమె రజతంతో మెరిసింది. సోమవారం తుది పోరులో 0-6తో లీ జియామన్ (చైనా) చేతిలో ఓడింది. మూడేళ్ల విరామం తర్వాత ఈ టోర్నీలో ఆడిన దీపిక.. టోర్నీ ఆసాంతం జోరు ప్రదర్శించింది. కానీ తుదిపోరులో ఒత్తిడికి గురై రజతంతో సరిపెట్టుకుంది. ప్రపంచకప్ ఫైనల్‌లో ఆమె రజతం సాధించడం ఇది అయిదోసారి. మరోవైపు పురుషుల రికర్వ్ విభాగంలో తెలుగుతేజం బొమ్మదేవర ధీరజ్ నిరాశ పరిచాడు. అతడు తొలి రౌండ్లో 4-6తో లీవూ సెక్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడాడు. ఒక దశలో 4-2తో ఆధిక్యంలో నిలిచిన ధీరజ్.. తర్వాత తడబడి మ్యాచ్ కోల్పోయాడు. కాంపౌండ్ విభాగంలో జ్యోతి సురేఖ, ప్రథమేశ్ పతకం తేవడంలో విఫలమైన సంగతి తెలిసిందే.

భారత్-ఎ జట్టులో నితీశ్, రికీ


నితీశ్

దిల్లీ: ఆంధ్ర యువ క్రికెటర్లు నితీశ్ కుమార్ రెడ్డి, రికీ భుయ్ ఆస్ట్రేలియాలో పర్యటించే భారత్-ఎ జట్టులో చోటు దక్కించుకున్నారు. మహారాష్ట్ర ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ ఈ జట్టుకు సారథ్యం వహిస్తాడు. నితీశ్ ఇటీవలే బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌లో అంతర్జాతీయ అరంగేట్రం చేసి సత్తా చాటాడు. రికీ భుయ్ రంజీల్లో రాణిస్తున్నాడు. కొన్ని నెలలుగా భారత జట్టు ఛాయల్లోకి రాని యువ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌కు కూడా భారత్-ఎ జట్టులో చోటు దక్కింది. అభిమన్యు ఈశ్వరన్, సాయిసుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్ లాంటి కుర్రాళ్లు ఈ జట్టులో ఉన్నారు. ఆస్ట్రేలియా-ఎతో ఈ జట్టు రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడుతుంది. తర్వాత పెర్త్‌లో టీమ్ఇండియా ఆటగాళ్లతో కలిసి అంతర్గత ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతుంది. ఆస్ట్రేలియాలో భారత పర్యటన నవంబరు 22న మొదలు కానున్న సంగతి తెలిసిందే. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా రెండు జట్లు అయిదు టెస్టులు ఆడతాయి. 'ఎ' జట్టులో సత్తా చాటే ఆటగాళ్లు కొందరికి టీమ్ఇండియాలో కూడా అవకాశం దక్కొచ్చు.


పుణెరి, పట్నా మ్యాచ్‌లో...

పుణెరి జోరు

ఈనాడు, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-11లో పుణెరి పల్టాన్ జోరు కొనసాగించింది. సోమవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో 40-25తో పట్నా పైరేట్స్‌ను ఓడించింది. ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన పుణెరి.. విరామ సమయానికి 20-10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. బ్రేక్ తర్వాతా అదే జోరు కొనసాగించి విజయాన్ని అందుకుంది. అస్లామ్ (9), మోహిత్ (8), గౌరవ్ (6), అమన్ (6) పుణెరిని గెలిపించారు. పట్నాలో దేవాంక్ (6), అయాన్ (5) పోరాడినా ఫలితం లేకపోయింది. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 28-23తో దబంగ్ దిల్లీపై గెలిచింది. బ్రేక్ సమయానికి 12-11తో స్వల్ప ఆధిక్యంలో ఉన్న యూపీ.. విరామం తర్వాత అటాకింగ్ గేమ్ ఆడింది. ఆఖర్లో దిల్లీ పుంజుకున్నా.. ఓటమిని తప్పించుకోలేకపోయింది. యూపీ జట్టులో భవానీ రాజ్‌పుత్ (7), సురేందర్ (4), సాహుల్ (5) రాణించారు.

ప్రొ కబడ్డీలో ఈనాడు: తెలుగు టైటాన్స్ × జైపూర్, రా.8 నుంచి; యూపీ × బెంగళూరు, రా.9 నుంచి

యోయో ఎందుకు..


గావస్కర్

ముంబయి: న్యూజిలాండ్‌తో తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఎటాకింగ్ ఆటతో 150 పరుగులు చేసిన బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌పై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ప్రశంసల జల్లు కురిపించాడు. "దేశవాళీ క్రికెట్లో పరుగుల వరద పారించినప్పటికీ సర్ఫరాజ్‌కు కొన్నేళ్లపాటు భారత జట్టులో చోటు దక్కలేదు. అంతర్జాతీయ క్రికెట్‌కు అవసరమైనంత సన్నటి నడుము అతడికి లేదని నిర్ణయాలు తీసుకునే స్థితిలో ఉన్నవారు భావించడమే అందుకు కారణం. మైదానంలో బ్యాటుతో సర్ఫరాజ్ రాబడుతున్న ఫలితాలు అతడి చుట్టుకొలత కన్నా మిన్నగా ఉన్నాయి" అని గావస్కర్ అన్నాడు. "ఫిట్‌నెస్‌కు విపరీత ప్రాధాన్యమిచ్చే వాళ్లు కోరుకునే సన్నటి నడుము రిషబ్ పంత్‌కు కూడా లేదు. కానీ అతడు ఎంతో ప్రభావం చూపించే ఆటగాడు. దయచేసి ఈ యోయో పరీక్షలను పక్కన పెట్టండి. దాని బదులు ఓ ఆటగాడు మానసికంగా ఎంత బలంగా ఉన్నాడో అంచనా వేయండి. అదే ఆటగాడి ఫిట్‌నెస్‌కు నిజమైన సూచిక" అని గావస్కర్ చెప్పాడు.

సెమీఫైనల్లో భారత్

- యూఏఈపై ఘనవిజయం
- టీ20 వర్ధమాన జట్ల ఆసియాకప్




అల్ అమరత్: వరుసగా రెండో విజయంతో టీ20 వర్ధమాన జట్ల ఆసియా కప్‌లో భారత్-ఎ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. అన్ని విభాగాల్లోనూ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించిన ఆ జట్టు.. సోమవారం ఏకపక్షంగా సాగిన గ్రూప్-బి మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో యూఏఈని చిత్తుగా ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యూఏఈ.. భారత బౌలర్ల ధాటికి తేలిపోయింది. 16.5 ఓవర్లలో 107 పరుగులకే కుప్పకూలింది. రాహుల్ చోప్రా (50; 50 బంతుల్లో 2×4, 3×6) ఒక్కడు పోరాడడంతో ఆ జట్టు వంద దాటగలిగింది. అతడు కాకుండా బసిల్ హమీద్ (22), మయాంక్ కుమార్ (10) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. రసిఖ్ సలామ్ (3/15), రమణ్‌దీప్ సింగ్ (2/7) యూఏఈని దెబ్బతీశారు. అన్షుల్ కాంబోజ్, వైభవ్ అరోరా, అభిషేక్, నేహాల్ తలో వికెట్ పడగొట్టారు. అభిషేక్ శర్మ (58; 24 బంతుల్లో 6×4, 4×6) చెలరేగడంతో స్వల్ప లక్ష్యాన్ని భారత్-ఎ 10.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. తిలక్‌వర్మ 21 పరుగులు చేశాడు. భారత్ తన తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ షహీన్స్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. రెండు విజయాలతో భారత్ (4 పాయింట్లు) గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉంది. ఒక్కో మ్యాచ్‌లో గెలిచిన పాకిస్థాన్, యూఏఈ బుధవారం పోటీపడతాయి. ఆ మ్యాచ్‌లో గెలిచిన జట్టు సెమీస్‌లో అడుగుపెడుతుంది. భారత్ తన ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో బుధవారం ఒమన్‌ను ఢీకొంటుంది. ఒమన్ రెండు మ్యాచ్‌ల్లో ఓడింది. గ్రూప్-ఎలో శ్రీలంక నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఒక్కో గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్ చేరతాయి.

యూఏఈ: 107 (రాహుల్ చోప్రా 150, బాసిల్ అహ్మద్ 22; రసిఖ్ సలామ్ 3/15, రమణ్‌దీప్ సింగ్ 2/7)

భారత్-ఎ: 10.5 ఓవర్లలో 111/3 (అభిషేక్ శర్మ 58, తిలక్ వర్మ 21, బదోని 12 నాటౌట్; విష్ణు 1/10)

బంగ్లా 106.. దక్షిణాఫ్రికా 140/6


రబాడ 3/26

మీర్పుర్: బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్టులో బౌలర్లు పండగ చేసుకుంటున్నారు. తొలి రోజు, సోమవారం ఏకంగా 16 వికెట్లు పడగొట్టారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆతిథ్య బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 40.1 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది. మహ్మదుల్ హసన్ (30) టాప్ స్కోరర్. సఫారీ బౌలర్లు కాగిసో రబాడ (3/26), వియాన్ ముల్డర్ (3/22), కేశవ్ మహరాజ్ (3/34) విజృంభించి బంగ్లా బ్యాటర్ల పనిపట్టారు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 41 ఓవర్లలో 6 వికెట్లకు 140 పరుగులు సాధించింది. బంగ్లా ఎడమచేతి వాటం స్పిన్నర్ తైజుల్ ఇస్లాం (5/49) దెబ్బకు దక్షిణాఫ్రికా టాప్ ఆర్డర్ పెవిలియన్ చేరుకుంది. టోనీ జోర్జి (30), ట్రిస్టియన్ స్టబ్స్ (23), ర్యాన్ రికెల్టన్ (27) క్రీజులో కుదురుకున్నా పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడలేకపోయారు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా 34 పరుగుల ఆధిక్యంలో ఉండగా.. కైల్ వీరెన్ (18 బ్యాటింగ్), ముల్డర్ (17 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

- రబాడ టెస్టుల్లో 300 వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో చోటు సంపాదించాడు. రబాడ 65 టెస్టుల్లో ఈ ఘనత సాధించగా.. అత్యంత వేగంగా ఈ క్లబ్‌లో అడుగుపెట్టిన (54 టెస్టులు) రికార్డు భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ పేరిట ఉంది. బంతుల పరంగా అత్యంత వేగంగా రబాడ (11,817) ఈ ఘనత అందుకున్నాడు. రబాడ తర్వాత వరుసగా వకార్ యూనిస్ (12,602), డేల్ స్టెయిన్ (12,605), అలన్ డొనాల్డ్ (13,672), మాల్కమ్ మార్షల్ (13,728) ఉన్నారు.

హైదరాబాద్, ఆంధ్ర పరాజయం

డెహ్రాడూన్: రంజీ ట్రోఫీ గ్రూప్-బిలో హైదరాబాద్, ఆంధ్ర జట్లకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. ఉత్తరాఖండ్ 78 పరుగుల తేడాతో హైదరాబాద్‌పై విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 189/5తో నాలుగో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఉత్తరాఖండ్ 235 పరుగులకు ఆలౌటైంది. బౌలర్లు సి.వి.మిలింద్ (3/31), తనయ్ త్యాగరాజన్ (2/62), రోహిత్ రాయుడు (2/27) రాణించారు. 269 పరుగుల లక్ష్య ఛేదనలో హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 190 పరుగులకు ఆలౌటైంది. తన్మయ్ అగర్వాల్ (38), అభిరథ్‌రెడ్డి (35), రోహిత్ రాయుడు (47 నాటౌట్) కాసేపు పోరాడారు. స్పిన్నర్ స్వప్నిల్ సింగ్ (6/59) విజృంభించి ఉత్తరాఖండ్‌కు విజయాన్ని అందించాడు. అహ్మదాబాద్‌లో ఉత్కంఠభరితంగా ముగిసిన గ్రూపు-బి మ్యాచ్‌లో ఆంధ్రపై గుజరాత్ ఒక్క వికెట్ తేడాతో నెగ్గింది. ఓవర్‌నైట్ స్కోరు 203/4తో సోమవారం ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 297 పరుగులకు ఆలౌటైంది. ఎడమచేతి వాటం పేసర్ అర్జాన్ నగ్వాస్‌వాలా (4/40), సిద్ధార్థ్ దేశాయ్ (3/93), రవి బిష్ణోయ్ (3/92) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆంధ్రను నిలువరించారు. అనంతరం 144 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన గుజరాత్‌కు ఆంధ్ర ఎడమచేతి వాటం స్పిన్నర్ లలిత్ మోహన్ (7/76) చుక్కలు చూపించాడు. అయితే జయ్‌మీత్ పటేల్ (32), చింతన్ గజ (30), అర్జాన్ (16 నాటౌట్) రాణించడంతో గుజరాత్ రెండో ఇన్నింగ్స్‌లో 50.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. తొలి ఇన్నింగ్స్‌లోనూ టెయిలెండర్ అర్జాన్ (82 నాటౌట్) పోరాటం గుజరాత్‌కు కలిసొచ్చింది.

ఫిట్‌నెస్ నిరూపించుకున్నాకే..

ఆస్ట్రేలియా పర్యటనపై షమి


షమి

గురుగ్రామ్: గత ఏడాది వన్డే ప్రపంచకప్ ఆడాక మళ్లీ మైదానంలో కనిపించలేదు మహ్మద్ షమి. చీలమండ గాయంతో అతను ఆటకు దూరంగా ఉన్నాడు. శస్త్రచికిత్స చేయించుకుని కోలుకున్నట్లే కనిపించిన అతడికి మళ్లీ నొప్పి తిరగబెట్టడంతో జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లోనే కొనసాగుతున్నాడు. షమి పూర్తిగా కోలుకోని నేపథ్యంలో అతడిని ఆస్ట్రేలియా పర్యటనకు తీసుకెళ్లడం కష్టమేనని చెప్పాడు కెప్టెన్ రోహిత్ శర్మ. అయితే షమి మాత్రం ఆస్ట్రేలియాకు వెళ్లడంపై ఆశాభావం వ్యక్తం చేశాడు. తనకు ప్రస్తుతం గాయం తాలూకు నొప్పేమీ లేదని, కాకపోతే దేశవాళీల్లో ఆడి ఫిట్‌నెస్ చాటుకోవాల్సి ఉందని అతనన్నాడు. "నేను నిన్ననే బౌలింగ్ చేశా. అందుకు సంతోషంగా ఉంది. సాధారణ రనప్‌లో సగమే తీసుకుని బంతులేశా. ఎందుకంటే అధిక ఒత్తిడి పడితే ఇబ్బంది అవుతుంది. ప్రస్తుతానికి అంతా బాగానే ఉంది. వంద శాతం నొప్పి తగ్గిపోయింది. నేను ఇంత సుదీర్ఘ కాలం మైదానానికి దూరం కావడంపై చాలామంది ఆశ్చర్యపోతున్నారు. ఆస్ట్రేలియాకు వెళ్తానా లేదా అని చూస్తున్నారు. అందుకు ఇంకా సమయం ఉంది. నేను పూర్తిగా కోలుకోకుండా అక్కడికి వెళ్లి ఇబ్బంది పడాలనుకోవట్లేదు. ఒకట్రెండు దేశవాళీ మ్యాచ్‌లు ఆడి ఫిట్‌నెస్ చాటుకోవాలి" అని షమి పేర్కొన్నాడు.

ఐసీసీ ప్రపంచకప్ జట్టులో హర్మన్


హర్మన్‌ప్రీత్

దుబాయ్: మహిళల టీ20 ప్రపంచకప్‌లో ప్రదర్శన ఆధారంగా ఐసీసీ ప్రకటించిన జట్టులో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చోటు దక్కించుకుంది. ఈ టోర్నీలో టీమ్ఇండియా సెమీఫైనల్ చేరడంలో విఫలమైనా.. హర్మన్‌ప్రీత్ 4 ఇన్నింగ్స్‌ల్లో 150 పరుగులు సాధించింది. ఇందులో శ్రీలంకపై (27 బంతుల్లో 52) ఆడిన మెరుపు ఇన్నింగ్స్ కూడా ఉంది. ప్రపంచకప్ గెలిచిన న్యూజిలాండ్ జట్టులో ముగ్గురు ప్లేయర్లకు ఈ జట్టులో చోటు దక్కింది. దక్షిణాఫ్రికా తార లారా వోల్వార్ట్ సారథిగా ఎంపికైంది. బ్రిట్స్, ఎంలబా (దక్షిణాఫ్రికా), డాని వ్యాట్ (ఇంగ్లాండ్), అమేలియా కెర్, రోజ్‌మేరీ (న్యూజిలాండ్), డెండ్రా డాటిన్, అఫీ ఫ్లెచర్ (వెస్టిండీస్), మెగాన్ షట్ (ఆస్ట్రేలియా), నిగర్ సుల్తానా (బంగ్లాదేశ్) మిగిలిన సభ్యులు. ఈడెన్ కార్సన్ (న్యూజిలాండ్) పన్నెండో ప్లేయర్.

ఒక్కో ప్లేయర్‌కి రూ.కోటి 30 లక్షలు

వెల్లింగ్టన్: దక్షిణాఫ్రికాపై గెలిచి టీ20 ప్రపంచకప్ కైవసం చేసుకున్న న్యూజిలాండ్ మహిళల జట్టుకు ట్రోఫీతో పాటు రూ.19 కోట్ల 33 లక్షలు నగదు బహుమతిగా లభించాయి. ఈ ప్రైజ్‌మనీని పంచుకుంటే జట్టులో ఒక్కో ప్లేయర్‌కి రూ.కోటి 30 లక్షలు చొప్పున దక్కనున్నాయి. ఎన్నో ఏళ్లుగా క్రికెట్ ఆడుతున్నా పురుషుల జట్టుతో సమానంగా ప్రైజ్‌మనీ పొందలేకపోతున్న కివీస్ మహిళల జట్టుకు తాజాగా లభిస్తున్న మొత్తం ఎంతో సంతోషాన్ని కలిగించేదే. "కప్పు గెలిచామంటే నమ్మబుద్ధి కావట్లేదు. ఈ టోర్నీకి ముందు పరిస్థితులేం మాకు అనుకూలంగా లేవు. టీ20ల్లో వరుస ఓటములు ఎదురయ్యాయి. ఒకరిపై ఒకరు నమ్మకముంచి విజేతలుగా నిలిచాం" అని జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించిన రోజ్‌మేరీ మైర్ చెప్పింది. 2000లో వన్డే ప్రపంచకప్ గెలిచిన కివీస్ మహిళల జట్టు.. తొలిసారి టీ20 ప్రపంచకప్‌ను కూడా కైవసం చేసుకుంది.

పుజారా డబుల్ సెంచరీ

రాజ్‌కోట్: భారత టెస్టు జట్టుకు దూరమైన చెతేశ్వర్ పుజారా రంజీ ట్రోఫీలో సత్తా చాటాడు. ఛత్తీస్‌గఢ్‌తో రంజీ ట్రోఫీ గ్రూపు-డి మ్యాచ్‌లో పుజారా (234; 383 బంతుల్లో 25×4, 1×6) డబుల్ సెంచరీతో మెరిశాడు. ఇరు జట్లు తొలి ఇన్నింగ్స్‌లలో భారీ స్కోర్లు నమోదు చేయడంతో సోమవారం ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 177/2తో ఆట కొనసాగించిన సౌరాష్ట్ర రోజంతా బ్యాటింగ్ చేసింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 478 పరుగులు రాబట్టింది. పుజారా డబుల్ సెంచరీ సాధించగా.. షెల్డన్ జాక్సన్ (62), అర్పిత్ (73) రాణించారు. ఛత్తీస్‌గఢ్ 578/7 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

సబలెంకా నంబర్‌వన్

సెయింట్ పీటర్స్‌బర్గ్: యుఎస్ ఓపెన్ ఛాంపియన్ అర్యానా సబలెంకా ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఇటీవలే వూహాన్ ఓపెన్ కైవసం చేసుకున్న ఈ బెలారస్ స్టార్ (9706 పాయింట్లు).. సోమవారం ప్రకటించిన డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో ఇగా స్వైటెక్ (పోలెండ్, 9665)ను రెండో స్థానానికి నెట్టి నంబర్‌వన్ స్థానాన్ని దక్కించుకుంది. అగ్రస్థానం సాధించడం సబలెంకాకు ఇది రెండోసారి. గతేడాది సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు ఆమె అగ్రస్థానంలో ఉంది. 11 నెలలు ఈ స్థానంలో కొనసాగిన స్వైటెక్ మళ్లీ నంబర్‌వన్ కావాలంటే వచ్చే నెలలో రియాద్‌లో జరిగే డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో సత్తా చాటాల్సి ఉంటుంది. మరోవైపు ఏటీపీ పురుషుల ర్యాంకింగ్స్‌లో యానెక్ సినర్ (ఇటలీ), అల్కరాస్ (స్పెయిన్) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. జ్వెరెవ్ (జర్మనీ) మూడు.. సెర్బియా దిగ్గజం జకోవిచ్ నాలుగో స్థానాల్లో ఉన్నారు.

ఐసీసీ ఛైర్మన్ పదవీ కాలంలో మార్పు

దుబాయ్: బీసీసీఐ కార్యదర్శి జై షా.. ఐసీసీ ఛైర్మన్ పదవి చేపట్టబోతున్న వేళ ఓ కీలక మార్పు చోటు చేసుకుంది. ఛైర్మన్ పదవీ కాలం మూడేళ్లకు పెరగనుంది. ప్రస్తుతం అది రెండేళ్లే. బోర్డు ఆమోదంతో ఇంకో రెండు పర్యాయాలు ఆ పదవిలో కొనసాగవచ్చు. ఇకపై మూడేళ్ల చొప్పున రెండు పర్యాయాలు పదవిలో కొనసాగేలా ఐసీసీ రాజ్యాంగాన్ని మార్చారు. ఈ ప్రతిపాదనకు ఐసీసీ బోర్డు ఆమోదం కూడా తెలిపింది. డిసెంబరు 1న జై షా ఐసీసీ ఛైర్మన్ కాబోతున్న సంగతి తెలిసిందే. తన పదవీ కాలం 2027 చివర్లో ముగుస్తుంది. షా కోరుకుంటే అక్కడ్నుంచి ఇంకో మూడేళ్లు ఛైర్మన్‌గా కొనసాగవచ్చు. బీసీసీఐ కార్యదర్శిగా కొనసాగి ఉంటే వచ్చే ఏడాది సెప్టెంబరులో తన పదవీ కాలం ముగిసేది. తర్వాత మూడేళ్లు అతను తప్పనిసరి విరామం తీసుకోవాలి. మళ్లీ 2028లో బీసీసీఐ కార్యవర్గంలోకి తిరిగి రావచ్చు. ఐసీసీ ఛైర్మన్‌గా షా పదవీ కాలం 2027 చివర్లో ముగుస్తుంది

గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల నుంచి హాకీ ఔట్?

మెల్‌బోర్న్: గ్లాస్గోలో జరిగే 2026 కామన్వెల్త్ క్రీడల నుంచి హాకీని తప్పించనున్నారు. ఖర్చు తగ్గించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్), కామన్వెల్త్ క్రీడల సమాఖ్య (సీజీఎఫ్) ఇంకా స్పష్టత ఇవ్వలేదు. హాకీ 1998లో సీడబ్ల్యూజీలో అరంగేట్రం చేసింది. అప్పటి నుంచి ప్రతిసారీ కామన్వెల్త్ క్రీడల్లో ఉంది. నిర్వహణ వ్యయం పెరగడంతో హాకీతో పాటు నెట్‌బాల్, రోడ్ రేసింగ్‌ను షెడ్యూలు నుంచి తప్పించాలని నిర్వాహకులు భావిస్తున్నారు. నిజానికి 2026 క్రీడలు ఆస్ట్రేలియాలోని విక్టోరియాలో జరగాల్సింది. కానీ ఖర్చులు పెరగడంతో విక్టోరియా ఆతిథ్య హక్కులను వదులుకుంది. గ్లాస్గోలో కామన్వెల్త్ గేమ్స్ 2026 జులై 23 నుంచి ఆగస్టు 2 వరకు జరుగుతాయి.



తేల్చేది 5.3 శాతం ఓటర్లే!

- అమెరికా ఎన్నికల్లో తటస్థులే కీలకం
- వారి మొగ్గు ఎటువైపన్న దానిపై ఉత్కంఠ
- ఇప్పటికే 2.1% ఆధిక్యంలో హారిస్

అమెరికా అధ్యక్ష ఎన్నికలు దగ్గరపడ్డాయి. పోలింగ్‌కు 2 వారాలే ఉండటంతో అధ్యక్ష అభ్యర్థులిద్దరూ హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. 5.3 శాతం ఉన్న తటస్థ ఓటర్ల కోసం రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ చెమటోడుస్తున్నారు. ప్రస్తుతానికి అన్ని పోల్స్‌లోనూ హారిస్‌కు 2.1 శాతం మొగ్గు కనిపిస్తోంది. అయితే 5.3 శాతం ఓటర్లు ఎటు మొగ్గుతారనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.


- 538 పోల్ ట్రాకర్ రోజువారీ అంచనాల ప్రకారం శనివారం (అక్టోబరు 19) నాటికి ట్రంప్‌పై హారిస్ 2.1శాతం ఆధిక్యంలో ఉన్నారు.



పోల్స్‌లో నిజమెంత?

శాంపిల్ ఓటర్ల ద్వారా పోల్ సంస్థలు ఒక అంచనాకు వస్తాయి. ఫోన్ ద్వారాగానీ, ఆన్‌లైన్‌లోగానీ, పోస్టల్ ద్వారాగానీ ఆయా సంస్థలు పోల్‌లను నిర్వహిస్తాయి. ఇందులోనూ శాంపిల్ సైజు, సంస్థ విశ్వసనీయత వంటి వాటిని పరిగణనలోకి తీసుకుంటారు.

- పోల్స్ ఎప్పుడూ 100 శాతం నిజం కావు. 2016, 2020లలో రిపబ్లికన్ అభ్యర్థిని తక్కువగా అంచనా వేశాయి. 2016లో ట్రంప్ గెలిచారు.. 2020లో గట్టి పోటీ ఇచ్చారు.
- ఈసారి జరుగుతున్న అన్ని పోల్స్‌లోనూ అంచనాలకు అనుకూలంగా వస్తున్నాయి. ఈ రెండు ట్రెండ్ ఏమైనా జరగొచ్చు అనేది అంచనా.



ఫలితాల్లో టై అయితే..

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో 538 ఎలక్టోరల్ ఓట్లు ఉంటాయి. అధ్యక్షుడిగా విజయం సాధించాలంటే 270 ఓట్లు రావాలి. ఒకవేళ ఇద్దరికీ 269 చొప్పున ఓట్లు వస్తే ఫలితం టై అవుతుంది. అలాంటి సందర్భాల్లో ప్రతినిధుల సభ విజేతను నిర్ణయిస్తుంది. దేశంలోని 50 రాష్ట్రాలకు ఒక్కో ఓటు ఉంటుంది. ఇందులో 26 సాధించిన అభ్యర్థి అధ్యక్ష పదవిని చేపడతారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

కొందరు హైకోర్టు జడ్జీల తీరు బాధాకరం: సుప్రీం

దిల్లీ: దేశంలోని కొందరు హైకోర్టు జడ్జీల ఆలోచనా ధోరణులపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వారి తీరువల్ల న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠ దిగజారుతోందని అభిప్రాయపడింది. 'అత్యున్నత న్యాయస్థానం పదే పదే గుర్తు చేస్తున్నా కొందరు హైకోర్టు జడ్జీలు పెద్దగా పట్టించుకోవడం లేదు. వారిపై మా సూచనలు ప్రభావం చూపడం లేదు' అని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ పి.కె.మిశ్రలతో కూడిన ధర్మాసనం సోమవారం ఆవేదన వ్యక్తం చేసింది. గుజరాత్ హైకోర్టులో 2023 మార్చి 1న ఓ న్యాయవాది వాదనలను వినిపించారు. ఆ తర్వాత జడ్జి దానిపై ఆదేశాలివ్వలేదు. హైకోర్టు ఐటీ సెల్ ఈ ఏడాది ఏప్రిల్ 30న రీజన్డ్ ఆదేశాల సాఫ్ట్ కాపీని పిటిషనరుకు ఇచ్చింది. దీనికి ఏడాదికిపైగా సమయం పట్టింది. దీంతో పిటిషనరు సుప్రీంను ఆశ్రయించారు. 'ఒక జడ్జి నిర్దేశించిన ప్రమాణాలను పాటించకపోవడమంటే దేశం అతడిపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయడమే. కక్షిదారుల కేసులను పరిష్కరించడంలో జడ్జీలు జాగ్రత్తగా, బాధ్యతగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నాం' అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది.



అనిశ్చితికి సిద్ధంగా ఉండండి

మీరు ఏ రంగంలో ఉన్నా పరిస్థితులు ఎప్పుడు ఎలా మారుతాయో ఎవ్వరికీ తెలియదు. కాబట్టి అనిశ్చితికి సిద్ధంగా ఉండండి. అనిశ్చితి నుంచే మార్పు మొదలవుతుంది. ధైర్యం, భవిష్యత్తు దృష్టి ఉన్నవారే పరిస్థితులను అనుకూలంగా మార్చుకొని మార్పును తీసుకొస్తారు. ఆ రెండు లక్షణాలను అందిపుచ్చుకోవడంపై దృష్టిపెట్టండి.

– కెన్నెత్ టాడ్, ఆన్‌లైన్ బిజినెస్ మెంటార్

భారత్- చైనా గస్తీ దోస్తీ

- సరిహద్దు ఉద్రిక్తతలపై కీలక ఒప్పందం
- ఇక ఎల్‌ఏసీ వెంబడి 2020 నాటి పరిస్థితి

దిల్లీ: భారత్-చైనా సంబంధాలను ప్రభావితం చేసే కీలక పరిణామం సోమవారం చోటు చేసుకుంది. వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ ఇరుదేశాలు కీలక గస్తీ ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్‌ఏసీ వెంబడి ఇక కొనసాగనుంది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఈ విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సోమవారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. "వాస్తవాధీన రేఖ వెంబడి గస్తీ పునఃప్రారంభంపై ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. గత



కొన్ని వారాలుగా దౌత్య, సైనిక సంధానకర్తలు జరుపుతున్న చర్చల ఫలితంగా ఈ పురోగతి చోటుచేసుకుంది" అని ఆయన తెలిపారు. రష్యాలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు మంగళవారం ప్రధాని మోదీ బయల్దేరనున్న తరుణంలో ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రకటన వెలువడటం గమనార్హం. సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశాలున్నాయని దౌత్య వర్గాలు పేర్కొంటున్నాయి.

■ 2020 జూన్ 15న తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన తీవ్ర ఘర్షణ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఘర్షణలో తెలంగాణకు చెందిన కర్నల్ సంతోష్ బాబు సహా 20 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. చైనా కూడా భారీగా సైనికులను కోల్పోయింది. కానీ ఆ సంఖ్యను వెల్లడించలేదు. చాలా నెలల తర్వాత ఐదుగురు చనిపోయినట్లు అధికారికంగా అంగీకరించింది. ఘర్షణల నేపథ్యంలో ఇరు దేశాలు ఎల్‌ఏసీ వెంబడి భారీ స్థాయిలో బలగాలను మోహరించాయి. అప్పటినుంచి రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

కీలక పరిణామమిది: జైశంకర్

ఈ ఒప్పందాన్ని కీలక పరిణామంగా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ అభివర్ణించారు. ఎన్‌డీటీవీ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఉద్రిక్త ప్రాంతాల నుంచి బలగాల ఉపసంహరణపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. "సరిహద్దుల్లో గస్తీపై చైనాతో ఒప్పందానికి వచ్చాం. 2020కి ముందు పరిస్థితికి వెళ్లాం. బలగాల ఉపసంహరణ ప్రక్రియ కూడా ముగిసిందని చెప్పొచ్చు. ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడవుతాయి" అని జైశంకర్ తెలిపారు.

'సుస్థిరత'ను బలపరచిన హరియాణా ఎన్నికలు

ప్రపంచానికి ఆశాకిరణంగా భారత్ • ఎన్‌డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ

దిల్లీ: హరియాణా శాసనసభ ఎన్నికల ఫలితాలు ప్రజల సుస్థిరత సందేశాన్ని మరోసారి ప్రతిబింబించాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారం దక్కించుకోవడం దాన్నే సూచిస్తోందన్నారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ శాసనసభ ఎన్నికలకు భాజపా తరఫున ప్రచారానికి సిద్ధమవుతున్నవేళ మోదీ ఈ మేరకు పేర్కొన్నారు. దిల్లీలో సోమవారం జరిగిన ఎన్‌డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో పాల్గొని ప్రసంగించారు. తమ ప్రభుత్వం అత్యంత వేగంగా, ఉత్తమస్థాయిలో పనిచేస్తోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల సంఘర్షణలు, తిరుగుబాట్లు నెలకొన్న తరుణంలో మనదేశం ఆశాకిరణంగా మారిందన్నారు. మన దేశానికి 'డబుల్ ఏఐ' ప్రయోజనం ఉందని, 'ఆపేక్ష భారత్ శక్తి', 'కృత్రిమ మేధ' ఏకమైనప్పుడు అభివృద్ధి వేగవంతమవ్వడం సహజమంటూ పలు గణాంకాలను ఆయన ప్రస్తావించారు. సంక్షోభ సమయాల్లో ప్రపంచానికి భారత్ స్నేహితుడిలా కనిపిస్తోందని, కొవిడ్ మహమ్మారి సమయంలో అనేక దేశాలకు వ్యాక్సిన్‌లను పంపినట్లు మోదీ గుర్తుచేశారు. భారత్ అభివృద్ధిని చూసి ప్రపంచం సంతోషిస్తుందన్నారు.



విదేశీ అతిథులతో భేటీ

ఈ కార్యక్రమానికి ముందు ఆయన సదస్సులో పాల్గొనడానికి వచ్చిన విదేశీ అతిథులను కలుసుకొన్నారు. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో యూకే మాజీ ప్రధాని డేవిడ్ కామరూన్, భూటాన్ ప్రధాని దాసో త్సేరింగ్ టోబ్గే, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్, భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిత్తల్ తదితరులు పాల్గొననున్నారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

'నువ్వు మాకు రాజు కాదు'

- ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో బ్రిటన్ రాజుకు అవమానం!

కాన్‌బెర్రా: బ్రిటన్ రాజు కింగ్ ఛార్లెస్-3కు ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో చేదు అనుభవం ఎదురైంది. ఆ దేశానికి అధికారికంగా పాలకుడైన ఆయన సోమవారం పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడటం పూర్తయిన వెంటనే స్థానిక ఆదివాసీ సెనెటర్ లిడియా థోర్పే రాచరికానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. "మా భూమిని తిరిగి ఇచ్చేయండి. మా నుంచి దోచుకొన్నవి మొత్తం వాపస్ ఇవ్వండి. ఇది మీ భూమి కాదు.. మీరు మా రాజూ కాదు. ఆస్ట్రేలియా ఆదివాసీలపై ఐరోపా వలసదారులు నరమేధానికి పాల్పడ్డారు" అని ఆమె దాదాపు నిమిషం పాటు పెద్దపెద్దగా కేకలు వేశారు. వలస విధానాన్ని థోర్పే ఎప్పుడూ వ్యతిరేకిస్తారని పేరుంది.



రాచరికానికి వ్యతిరేకంగా ఆస్ట్రేలియా పార్లమెంట్ హౌస్‌లో నినాదాలు చేస్తున్న లిడియా థోర్పే


వాంగ్‌చుక్ నిరాహార దీక్ష విరమణ

దిల్లీ: పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్, ఆయన అనుచరులు సోమవారం తమ నిరాహార దీక్షను విరమించారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా, ఆరో షెడ్యూల్‌లో చేర్చాలన్న డిమాండ్లపై కేంద్ర హోంమంత్రిత్వశాఖ అధికారులు ఆయన్ను కలిసి తమ ప్రతిపాదనలు ఉంచారు. అనంతరం ఆయనకు నిమ్మరసం అందజేసి దీక్షను విరమింపజేశారు. డిసెంబరు 3న లేహ్ ఎపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్ (కేడీఏ) ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు కేంద్ర హోంశాఖ అంగీకరించడంపై వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం చేశారు.

నవంబరు 1–19 మధ్య ఎయిరిండియా

విమానాల్లో ప్రయాణించొద్దు: పన్నూ

ఇంటర్నెట్‌డెస్క్: నవంబరు 1-19 తేదీల మధ్య ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించొద్దని ఖలిస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ ఓ వీడియో సందేశంలో హెచ్చరించడం కలకలం సృష్టిస్తోంది. దేశంలో గత కొన్ని రోజులుగా విమానాలకు బాంబు బెదిరింపులు వస్తున్న వేళ పన్నూ ఇలాంటి హెచ్చరిక చేయడం గమనార్హం. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఎయిరిండియా విమానాలపై దాడి జరిగే అవకాశం ఉందని పన్నూ అన్నాడు. గత నవంబరులోనూ పన్నూ ఇలాంటి వీడియో విడుదల చేశాడు. నవంబరు 19న దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మూతపడుతుందని, దాని పేరు కూడా మార్చేస్తామని అతడు ఓ వీడియోలో హెచ్చరించాడు. 'సిఖ్స్ ఫర్ జస్టిస్' అనే వేర్పాటువాద సంస్థ వ్యవస్థాపకుల్లో పన్నూ ఒకడు. ఈ సంస్థను భారత్ 2019లోనే నిషేధించింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం కింద భారత ప్రభుత్వం అతడిని 2020లో ఉగ్రవాదిగా ప్రకటించింది. ప్రస్తుతం అతడు అమెరికాలో ఉన్నట్లు సమాచారం. పన్నూకు అగ్రరాజ్యంతో పాటు కెనడా పౌరసత్వం కూడా ఉంది.



ఉగ్రవాదంపై పోరాటం కొనసాగుతుంది

- కేంద్రమంత్రి అమిత్ షా

దిల్లీ: జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పినప్పటికీ.. ఉగ్రవాదం, చొరబాట్లు, మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించే కుట్రలపై పోరాటం కొనసాగుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం దిల్లీలోని జాతీయ పోలీసు స్మారకం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులందరికీ నివాళులు అర్పించారు. 'దేశం కోసం విధి నిర్వహణలో పోలీసులు చేసిన ప్రాణత్యాగాలు వృథా కావు. 2047 నాటికి దేశం పూర్తిగా అభివృద్ధి చెందుతుంది. గత పదేళ్లలో జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతి నెలకొంది. అయినప్పటికీ మా పోరాటం పూర్తి కాలేదు. మాదకద్రవ్యాలు, సైబర్‌నేరాలు, మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించే కుట్రలు, ఉగ్రవాదం, చొరబాట్లపై పోరాటం కొనసాగుతుంది" అని అమిత్ షా అన్నారు. దేశం కోసం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 36,438 మంది పోలీసులు తమ ప్రాణాలు అర్పించారని, అందులో గతేడాది 216 మంది ప్రాణాలు త్యాగం చేశారని వెల్లడించారు. వీరి త్యాగాలకు దేశం కృతజ్ఞతగా ఉంటుందని తెలిపారు.



అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం దిల్లీలోని జాతీయ పోలీసు స్మారకం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

..దౌత్యవేత్తల్ని అందుకే వెనక్కి రప్పించాం: జైశంకర్

దిల్లీ: పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరిందని, అందుకే మన హైకమిషనర్‌తోపాటు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించామని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. ఓ వార్తా ఛానల్ నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కెనడాతో మన సంబంధాలను ప్రస్తుతం అంచనా వేయడం కష్టమేనన్నారు. "దౌత్యవేత్తల సంక్షేమం, భద్రతకు సంబంధించి ఏం జరుగుతుందనే విషయాలను తెలుసుకోవడం కెనడాకు ఇబ్బందికరంగా మారినట్లు కనిపిస్తోంది. అదే భారత్‌లో కెనడా దౌత్యవేత్తలు మాత్రం మన సైన్యం, పోలీసుల సమాచారాన్ని స్వేచ్ఛగా సేకరించడం, నిర్దేశిత పౌరులను కెనడాలో అడ్డుకోవడంపై ఎలాంటి చర్యలుండవు. అక్కడా, ఇక్కడా వారి తీరు భిన్నంగా ఉంది. భారత్‌కు చెందిన నేతలు, దౌత్యవేత్తలను కెనడా పౌరులు బహిరంగంగా బెదిరిస్తున్నారని మనం చెబితే.. వారిది వాక్ స్వాతంత్ర్యం అంటారు. భారత హైకమిషనర్‌ను బెదిరించినా భావ ప్రకటనా స్వేచ్ఛ కింద పరిగణించాలని అంటున్నారు. అదే భారత్‌లోని కెనడా దౌత్యవేత్త సౌత్‌బ్లాక్ నుంచి కోపంతో బయటకు వచ్చారని ఓ భారత జర్నలిస్టు పేర్కొంటే మాత్రం.. విదేశీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు" అని కెనడాను ఉద్దేశిస్తూ మండిపడ్డారు. గత 20-25 ఏళ్లలో ప్రపంచంలో పాశ్చాత్యేతర దేశాల వాటా, భాగస్వామ్యం, ప్రభావం పెరిగాయని, ఈ నేపథ్యంలో వివాదాలు, ఘర్షణలు, వాదనలు సహజమేనని అన్నారు. కొన్ని దేశాల మధ్య సంబంధాలు అంత సాఫీగా ఉండవని అభిప్రాయపడ్డారు.



దేశంలోని అన్ని కోచింగ్ సెంటర్లకూ

ఏకరూప ప్రమాణాలు ఉండాలి

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: వివిధ శిక్షణ సంస్థల్లో తర్ఫీదు పొందుతున్న విద్యార్థుల భద్రతకు సంబంధించి దేశమంతటా ఏకరూప ప్రమాణాలను పాటించాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దిల్లీలోని ఓ కోచింగ్ కేంద్రంలో జులైలో నీట మునిగి ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు విచారణ జరిగింది. ఈ సందర్భంగా అమికస్ క్యూరీగా వ్యవహరిస్తోన్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే కొన్ని విషయాలను ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కోచింగ్ కేంద్రాల్లో అగ్నిప్రమాదాల నివారణ చర్యలు, రుసుముల నియంత్రణ, తరగతి గదుల విస్తీర్ణం, విద్యార్థులు-బోధకుల నిష్పత్తి, సీసీటీవీల అమరిక, వైద్య సదుపాయాలు, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, కౌన్సెలింగ్ తదితర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. అన్ని రాష్ట్రాలను ఈ కేసులో భాగస్వాములను చేయాలని సూచించారు. కోచింగ్ సెంటర్లకు సంబంధించి ఏడు రాష్ట్రాల్లో ఉన్న చట్టాలనూ అమికస్ క్యూరీ ప్రస్తావించారు. ధర్మాసనం స్పందిస్తూ... సంఘటన జరిగినప్పుడు మాత్రమే స్పందించడం కాకుండా భద్రత ప్రమాణాలను ఎల్లవేళలా పాటించేలా చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. దీని కోసం దేశవ్యాప్తంగా కోచింగ్ సెంటర్లు అన్నింటికీ ఏకరూప ప్రమాణాలు రూపొందించాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదాపడింది.



భారతీయ సమిధానిత్వను చేర్చాలన్న పిటిషన్ తిరస్కరణ

'హిందుత్వ' అనే పదం స్థానంలో 'సమిధానిత్వ'(భారతీయ రాజ్యాంగత్వం)ను ఉపయోగించేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దిల్లీ నివాసి ఎస్.ఎన్.కుంద్రా ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారణకు చేపట్టబోమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర ధర్మాసనం స్పష్టం చేసింది.

నీట్-యూజీ సంస్కరణలపై నివేదికకు

మరో 2 వారాల గడువిచ్చిన సుప్రీంకోర్టు

దిల్లీ: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్-యూజీని మరింత పారదర్శకంగా, అక్రమాలకు తావులేనివిధంగా తీర్చిదిద్దటానికి సంబంధించిన నిపుణుల కమిటీ నివేదికను సమర్పించేందుకు సుప్రీంకోర్టు మరో రెండు వారాల గడువునిచ్చింది. ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల కమిటీ...జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ (ఎన్‌టీఏ) పనితీరును సమీక్షించి నివేదికను దాదాపు సిద్ధం చేసిందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సోమవారం విచారణ సందర్భంగా తెలిపారు. ఈ విషయాన్ని నమోదు చేసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర ధర్మాసనం నివేదిక సమర్పణ గడువును పొడిగించేందుకు సమ్మతించింది. పరీక్ష పత్రాల లీకేజీని నివారించడం, ఎన్‌టీఏ లోపాలను సరిదిద్దడం, భద్రతాపరమైన లొసుగులు లేకుండా చూడటం, ఎన్‌టీఏ సిబ్బందికి శిక్షణ, ఆధునిక సాంకేతిక వినియోగం తదితరాలపై నిపుణుల కమిటీ మార్గదర్శకాలను సూచించనుంది.

మోదీ డిగ్రీపై వ్యాఖ్యలు.. కేజ్రీవాల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం

దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ప్రధానమంత్రి మోదీ డిగ్రీపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో తనపై నమోదైన పరువునష్టం కేసులో ట్రయల్‌కోర్టు జారీచేసిన సమన్లను రద్దు చేయాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఆయన క్రిమినల్ విచారణను ఎదుర్కొంటున్నారు. ప్రధానమంత్రి మోదీ డిగ్రీపై కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయనపై గుజరాత్ యూనివర్సిటీ పరువునష్టం దావా వేసిన విషయం తెలిసిందే. దీనిపై ట్రయల్ కోర్టు ఆయనకు సమన్లు జారీ చేసింది. ఈ సమన్లను కొట్టివేయాలని కేజ్రీవాల్ సుప్రీంను ఆశ్రయించారు. అయితే ట్రయల్ కోర్టు ఆదేశాలను కొట్టివేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ హృశికేష్‌రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. గతంలో ఇదే కేసులో సహానిందితుడిగా ఉన్న ఆప్ నేత సంజయ్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం కొట్టివేసినట్లు గుర్తుచేసింది. సంజయ్ సింగ్ వ్యాఖ్యలు భిన్నమైనవని కేజ్రీవాల్ తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోర్టుకు తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. గుజరాత్ యూనివర్సిటీ సంజయ్ సింగ్‌పై కూడా కేసు నమోదుచేసిందని, ఈ కేసులో ఒకే విధమైన ఆదేశాలుండాలని, అందుకే పిటిషన్‌ను స్వీకరించడంలేదని స్పష్టం చేసింది.

భారత్ లౌకిక దేశంగా ఉండాలనుకోవడంలేదా?

పిటిషనర్‌ను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ: భారత రాజ్యాంగ మౌలిక చట్రంలో లౌకికవాదం మొదటి నుంచీ విడదీయరాని అంతర్భాగంగా ఉందని సుప్రీంకోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. రాజ్యాంగ పీఠికలో లౌకిక, సోషలిస్టు అనే పదాలను చేర్చడాన్ని సవాలు చేస్తూ రాజ్యసభ మాజీ సభ్యుడు సుబ్రమణ్యం స్వామి, న్యాయవాది విష్ణు శంకర్ జైన్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పి.వి.సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్, న్యాయవాది విష్ణు శంకర్ జైన్ వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగానికి 1976లో చేపట్టిన 42వ సవరణపై పార్లమెంటులో చర్చే జరగలేదన్నారు. జస్టిస్ ఖన్నా స్పందిస్తూ.. ఈ పదాలకు వివిధ వివరణలున్నాయని, వేర్వేరుగా అన్వయించుకుంటున్నారని పేర్కొన్నారు. కోర్టులు పలుమార్లు వాటిని రాజ్యాంగంలోని ప్రాథమిక భాగాలుగా అభివర్ణించాయన్నారు. న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ తన వాదనలు వినిపిస్తూ.. ఈ సవరణ అమల్లోకి వచ్చేనాటికి అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించిన విషయాన్ని గుర్తుచేశారు. దీనిపై న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా స్పందిస్తూ "మీరు భారత్ లౌకిక దేశంగా ఉండాలనుకోవడంలేదా?" అని ప్రశ్నించారు. న్యాయవాది జైన్ బదులిస్తూ "భారత్ లౌకిక దేశంగా ఉండకూడదని మేము అనడంలేదు. ఆ సవరణను మాత్రమే సవాలు చేశాం" అని పేర్కొన్నారు. తదుపరి విచారణను నవంబరు 18కు వాయిదా వేస్తున్నట్లు సుప్రీం ధర్మాసనం ప్రకటించింది.

నేటి నుంచి రష్యాలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు

హాజరుకానున్న ప్రధాని మోదీ

బీజింగ్: 'బ్రిక్స్' కూటమి 16వ శిఖరాగ్ర సదస్సు మంగళవారం ప్రారంభం కానుంది. ఈ నెల 24 వరకూ జరిగే ఈ కార్యక్రమానికి రష్యాలోని కజన్ నగరం వేదిక కానుంది. 'ప్రపంచాభివృద్ధి, భద్రత కోసం బహుళపక్షవాదాన్ని బలోపేతం చేయడం' ఈ ఏడాది సదస్సు ప్రధాన నినాదం. ఇందులో ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇతర నేతలు పాల్గొంటారు. బాత్రూమ్‌లో పడి తలకు గాయం కావడంతో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా.. బ్రిక్స్ సదస్సుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాతో బ్రిక్స్ కూటమి ఏర్పాటైంది. ఇప్పుడు దాన్ని విస్తరించి ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలకూ సభ్యత్వం ఇచ్చారు. కూటమి విస్తరణ తర్వాత ఇదే తొలి శిఖరాగ్ర సదస్సు. ప్రధాని మోదీ రష్యా పర్యటన చేపట్టడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. బ్రిక్స్ సదస్సులో పలువురు దేశాధినేతలతో ఆయన ద్వైపాక్షిక చర్చలు నిర్వహిస్తారు.

పేలుడు ఘటనలో ఖలిస్థానీ కోణంపై దర్యాప్తు చేయండి

- టెలిగ్రామ్‌కు దిల్లీ పోలీసుల లేఖ

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని రోహిణి ప్రశాంత్ విహార్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ పాఠశాల వద్ద పేలుడుకు 'జస్టిస్ లీగ్ ఇండియా' అనే ఖలిస్థానీ అనుకూల గ్రూపు బాధ్యతను తీసుకొంది. ఖలిస్థాన్ వేర్పాటువాదులను మట్టుబెట్టడానికి భారత ఏజెంట్లు చేపట్టిన చర్యలకు ప్రతీకారంగా ఈ పేలుడు జరిపినట్లు టెలిగ్రామ్ గ్రూప్‌లో ఓ పోస్టు ప్రత్యక్షమైంది. 'కొందరు గూండాలతో భారత నిఘా ఏజెన్సీ మా సభ్యుల నోరుమూయించాలని చూస్తే. . ప్రపంచంలో వారే మూర్ఖులు. మేము వారికి ఎంత దగ్గరగా ఉన్నామో ఏమాత్రం ఊహించలేరు. ఏక్షణమైనా దాడి చేయగల సత్తా మా దగ్గర ఉంది. ఖలిస్థాన్ జిందాబాద్' అనే సందేశాన్ని 'జస్టిస్ లీగ్ ఇండియా' టెలిగ్రామ్ గ్రూప్‌లో పోస్టు చేసింది. దీంతో పేలుడు ఘటనలో ఖలిస్థానీ కోణంపై దర్యాప్తు చేయాలని టెలిగ్రామ్‌కు దిల్లీ పోలీసులు లేఖ రాశారు.



పేలుడు జరిగిన ప్రాంతంలో పోలీసుల తనిఖీలు

అనుమానితుడి గుర్తింపు..

అధికారులు సమీపంలోని సీసీటీవీ దృశ్యాలను విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే తెల్ల టీషర్ట్ ధరించిన ఓ అనుమానితుడిని గుర్తించారు. పేలుడు జరగడానికి ముందు రోజు రాత్రి ఆ ప్రదేశంలో అతడు ఏదో చేస్తున్నట్లు ఆ దృశ్యాల్లో ఉంది. పేలుడు పదార్థాలను ఒక పాలిథిన్ బ్యాగ్‌లో చుట్టి అక్కడ అడుగు గోతిలో అమర్చి.. ఆపై చెత్తతో కప్పి ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.

భర్త కోసం ఉపవాసం.. ఆపై ఆహారంలో విషం కలిపి హత్య

లఖ్‌నవూ: అనుమాన భూతం ఓ పచ్చని కాపురంలో చిచ్చు పెట్టింది. భర్త కలకాలం ఆయురారోగ్యాలతో ఉండాలని అప్పటి వరకు వ్రతం చేసిన మహిళ..అతడు మరొకరితో సన్నిహితంగా ఉంటున్నాడనే అనుమానంతో ఆహారంలో విషం కలిపి హత్య చేసింది. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం పండుగ సందర్భంగా కౌశాంబి జిల్లాలోని ఇస్మాయిల్‌పుర్ గ్రామం చెందిన సవిత అనే మహిళ ఆమె భర్త శైలేష్ కుమార్ (32) భర్త ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కోసం వ్రతం చేసింది. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించే సమయంలో వారి మధ్య వాగ్వాదం నెలకొంది. అనంతరం దంపతులిద్దరు భోజనం చేశారు. అయితే భర్తకు పెట్టిన భోజనంలో విషం కలపడంతో అతడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు శైలేష్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో బంధువుల ఫిర్యాదు మేరకు సవితను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తన భర్తకు వేరే మహిళతో అక్రమ సంబంధం ఉండటంతో తట్టుకోలేక ఆహారంలో విషం పెట్టినట్లు నిందితురాలు నేరాన్ని అంగీకరించింది.

ఖాళీలతో ముందుకు సాగని 'సర్వే'

- సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖపై సర్కారు దృష్టి
- నూతన చట్టం నేపథ్యంలో ఖాళీల వివరాల సేకరణ



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో భూ దస్త్రాల, యాజమాన్య హక్కుల చట్టం(ఆర్వోఆర్) 2024ను అమలులోకి తీసుకురావాలనుకుంటున్న ప్రభుత్వం.. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ పటిష్ఠంపైనా కసరత్తు ప్రారంభించింది. ఈ శాఖలో పెద్దసంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉండటం, ఏళ్లతరబడి బదిలీలు జరగకపోవడం వాటిపై దృష్టి సారించింది. ఆర్వోఆర్-2024 చట్టం అమల్లోకి తెస్తే భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ సమయంలో భూమి పటం తప్పనిసరి చేయనున్నారు. తద్వారా డబుల్ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్టపడనుంది. ప్రతి కమతానికి పక్కాగా పటం ఏర్పాటవుతుందని ప్రభుత్వ ప్రణాళిక. భూముల క్రయవిక్రయాల సమయంలో పటం జత చేయాలంటే తప్పనిసరిగా సర్వే చేయించాలి. ఇందుకు మండలస్థాయిలో సర్వేయర్ అవసరం. ప్రస్తుతం రాష్ట్రంలో సరిపడా సర్వేయర్లు లేరు. 612 మండలాలకు 160 మండలాల్లో ఇన్‌ఛార్జులే ఉన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో మండల వ్యవస్థ ఏర్పడిన సమయంలో నిర్ధారించిన క్యాడర్ ప్రకారమే సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలో పోస్టులు ఉన్నాయి. ప్రాజెక్టులు, రహదారులు, పరిశ్రమలు, స్థిరాస్తి రంగంలో సర్వే కీలకంగా మారింది. శాఖపై పనిఒత్తిడి పెరిగింది. ప్రతినెలా 30 వేలకుపైగా దరఖాస్తులు వస్తున్నాయి. వీటిలో వేలల్లో పెండింగ్‌లో ఉంటున్నాయి. శాఖలో అన్ని క్యాడర్ల పోస్టులు కలిపి 494 ఉన్నాయి. మండల సర్వేయర్ల పోస్టులు 153, డిప్యూటీ సర్వేయర్లవి 100 మాత్రమే ఉన్నాయి. మండల సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్ల పోస్టులు కలిపి మరో 350.. అసిస్టెంట్ డైరెక్టర్లు 33, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే 66, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పోస్టులు 33 వరకు అవసరం. అన్ని క్యాడర్లు కలిపి పోస్టుల సంఖ్యను 800 వరకు పెంచాలన్న డిమాండ్ ఉంది. కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలు ఏర్పడినా ఇన్‌ఛార్జ్ పోస్టులతోనే కొనసాగిస్తున్నారు. కొత్త జోన్లకు అనుగుణంగా క్యాడర్లలో మార్పులు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ సర్వే శాఖ సిబ్బంది ఖాళీల వివరాలను తెప్పించుకున్నారు.

ప్రాధాన్యం కోరుతున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లు

గత ప్రభుత్వం పైలట్ సర్వే చేపట్టడంతో పాటు సర్వే సంస్థలతో ప్రీబిడ్ సమావేశం నిర్వహించింది. అప్పటికే ఆ ప్రక్రియ ఆగిపోయింది. సమగ్ర భూసర్వే చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే కొత్త చట్టంలో ప్రతి ఖాతాకు భూదార్ సంఖ్య (ఆధార్ వంటిది) కేటాయించేందుకు వీలుగా సెక్షన్లు ఏర్పాటు చేశారు. మొదట తాత్కాలిక భూదార్ సంఖ్య కేటాయించి, సమగ్ర సర్వే అనంతరం శాశ్వత సంఖ్య కేటాయించేలా చట్టంలో వెసులుబాటు కల్పించారు. భూదార్ ప్రాజెక్టు చేపట్టనున్న నేపథ్యంలో తమకు ప్రాధాన్యం ఇచ్చే అంశాన్ని చట్టంలో చేర్చాలని రాష్ట్రంలో ఉన్న దాదాపు 500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు కోరుతున్నారు.

ఫోనే శిక్షణ కేంద్రం..

పోస్టులే అధ్యయన మంత్రం

- డీఎస్సీ అభ్యర్థులకు వాట్సప్ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయుడి దిశానిర్దేశం
- 35 మందికిపైగా కొలువులు



నేలకొండపల్లి, న్యూస్‌టుడే: పోటీ పరీక్షల శిక్షణకు హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లే స్తోమత లేని అభ్యర్థులు చాలా మంది ఇంటి వద్దే ఉంటూ సన్నద్ధమవుతుంటారు. ప్రతిభ ఉన్న వారిలో ఎక్కువమందికి సరైన మార్గనిర్దేశం చేసేవారు లేక విజయావకాశాలు చేజారుతున్నాయి. డీఎస్సీ-2024కు ఇలా ఇంటివద్దే ఉంటూ చదువుకున్న చాలామందికి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సామాజిక మాధ్యమాల ద్వారా శిక్షణ ఇచ్చారు. ఆయన శిక్షణ, మార్గదర్శకత్వంతో రాష్ట్ర వ్యాప్తంగా 35మందికి పైగా అభ్యర్థులు గురువుల కొలువులు సాధించటం విశేషం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం రామానుజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గోరింట్ల సురేశ్ భౌతికశాస్త్రం బోధిస్తున్నారు. నిత్యం జనరల్ నాలెడ్జ్, వర్తమాన వ్యవహారాలపై 10 ప్రశ్నలు తయారు చేసి స్థానిక వాట్సప్ గ్రూపుల్లో పోస్టు చేసేవారు. మరుసటి రోజు వాటికి సమాధానాలు అందించేవారు. ఈ క్రమంలో కొందరు అభ్యర్థులు డీఎస్సీకి సన్నద్ధమయ్యేందుకు మార్గనిర్దేశం చేయాలని కోరారు. దీంతో ఆయన పలు జిల్లాలకు చెందిన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులతో గతేడాది సెప్టెంబరులో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష విభాగానికి కావాల్సిన ప్రామాణిక పుస్తకాలను సూచించారు. తాను పుస్తకాలు కొని, వాటిల్లో రోజువారీగా చదవాల్సిన అంశాలు, పేజీలను గ్రూపులో పోస్టు చేసేవారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో కనీసం రెండు పరీక్షల్ని ఆన్‌లైన్లో నిర్వహించారు. ఆదివారం గ్రాండ్ టెస్టులు నిర్వహించేవారు. పరీక్షలు రాసిన వారికి ర్యాంకులు కేటాయించి వారి పురోగతి తెలుసుకునేలా చేసేవారు. గ్రూపు ప్రాధాన్యం తెలుసుకున్న వివిధ ప్రాంతాల అభ్యర్థుల నుంచీ వినతులు వస్తుండటంతో గ్రూపుల సంఖ్యను పెంచారు. మైడ్రీమ్ డీఎస్సీ, టార్గెట్ టెట్-డీఎస్సీ తదితర పేర్లతో 12 గ్రూపుల ద్వారా మరింత మందికి పరీక్షలు నిర్వహించారు. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా 35మందికి పైగా అభ్యర్థులకు ఉద్యోగాలు దక్కాయి. 'కొందరు అభ్యర్థులు నిర్దేశం చేయాలని కోరడంతో నా వంతుగా సాయం చేశా. ఇంతమందికి ఉద్యోగాలు రావడం ఆనందంగా ఉంది' అని ఉపాధ్యాయుడు సురేశ్ తెలిపారు.



గోరింట్ల సురేశ్

వ్యవసాయ వర్సిటీలో సెల్ఫ్ ఫైనాన్స్ కోటా పెంపు

- బీఎస్సీ(ఆనర్స్)లో మరో 200 సీట్లు
- రుసుములు భారీగా తగ్గింపు
- నాలుగేళ్లకు రూ.5 లక్షలే..



వ్యవసాయ విశ్వవిద్యాలయం



వీసీ జానయ్య

ఈనాడు, హైదరాబాద్: ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరంలో బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో సెల్ఫ్ ఫైనాన్స్ కోటా సీట్లు భారీగా పెరిగాయి. ప్రస్తుతం ఈ కోటా కింద 227 సీట్లుండగా.. మరో 200 పెంచినట్లు ఉపకులపతి(వీసీ) అల్దాస్ జానయ్య తెలిపారు. ఈ సీట్లకు ప్రవేశ, వార్షిక రుసుములను భారీగా తగ్గించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రవేశ రుసుము రూ.3 లక్షలు ఉండగా రూ.65 వేలకు, నాలుగేళ్లకు కలిపి మొత్తం రుసుము రూ.10 లక్షలు ఉండగా రూ.5 లక్షలకు తగ్గించినట్లు ఆయన వివరించారు. సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల భర్తీకి త్వరలోనే ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ వ్యవసాయ కళాశాలల్లో సీట్లకు భారీ డిమాండ్ ఉంది. రెండు లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం కన్వీనర్ కోటాలో 615 సీట్లుండగా.. సెల్ఫ్ ఫైనాన్స్ కింద 227 ఉన్నాయి. మొదటి విడత కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటాలో 98 శాతానికి పైగా సీట్లు భర్తీ అయ్యాయి. దీంతో చాలామంది సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను ఆశిస్తున్నారు. రుసుములు భారీగా ఉండడంతో పేద విద్యార్థులకు అందుబాటులో లేవనే ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు కొత్త వీసీ జానయ్య దృష్టికి తెచ్చారు. ప్రభుత్వంతో ఆయన చర్చించి సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు పెంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న 227కి అదనంగా 200 కలిపారు. దీంతో మొత్తం సీట్ల సంఖ్య 427కి చేరింది. పెరిగిన సీట్లను వ్యవసాయ కళాశాలల్లో సర్దుబాటు చేస్తారు. కన్వీనర్ కోటా సీట్ల భర్తీ అనంతరం వీటికి కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. తగ్గించిన రుసుములు ఈ విద్యా సంవత్సరం నుంచే అమలులోకి వస్తాయి. గతంలో సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద చేరిన విద్యార్థులు పాత రుసుములనే చెల్లించాల్సి ఉంటుంది.

విద్యార్థుల వెసులుబాటు కోసమే..

వ్యవసాయ కోర్సులకు ఉన్న డిమాండును దృష్టిలో పెట్టుకుని సెల్ఫ్ ఫైనాన్స్ కోటా సీట్లను పెంచామని వీసీ జానయ్య తెలిపారు. "వర్సిటీ పరిధిలో ఉన్న కొన్ని ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో రుసుములు భారీగా ఉన్నాయి. వ్యవసాయ డిగ్రీ కోర్సు నిర్వహించడానికి కావలసిన కనీస వసతులు, సిబ్బంది లేకపోయినా ఈ కోర్సులను వ్యాపారంగా మార్చుకుని దోపిడీకి పాల్పడుతున్నాయి. విద్యావ్యాపారాన్ని అరికట్టడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలను, విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి దృష్ట్యా సీట్లను పెంచాం. రుసుములను తగ్గించాం. అదనంగా పెంచుతున్న సీట్ల వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో రెండు మూడు రోజుల్లో పెడతాం. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి" అని జానయ్య సూచించారు.

విద్యుత్ అంబులెన్సులు ప్రారంభం



విద్యుత్ అంబులెన్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న భట్టి. చిత్రంలో సీఎండీలు వరుణ్‌రెడ్డి, ముషారఫ్, సందీప్‌కుమార్ సుల్తానియా తదితరులు

ఈనాడు, హైదరాబాద్: ఎక్కడైనా ఏదైనా కారణంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతే సిబ్బంది వెంటనే వచ్చి సమస్య పరిష్కరించేలా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) ద్వారా 'విద్యుత్ అంబులెన్సు'లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. సోమవారం నెక్లెస్ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ వాహనాలను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈ ప్రత్యేక వాహనాలు ప్రారంభించాం. విద్యుత్ ప్రమాదం జరిగినా లేదా సరఫరా నిలిచిపోయినా వినియోగదారులు 1912 నంబరుకు ఫోన్ చేస్తే వెంటనే అత్యవసర సేవల సిబ్బంది ఈ వాహనాల్లో వస్తారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 57 సబ్ డివిజన్‌లు ఉండగా ప్రతి డివిజన్‌కు ఒక వాహనాన్ని కేటాయించాం. అంబులెన్సులో ఒక అసిస్టెంట్ ఇంజినీరు, ముగ్గురు లైన్‌మెన్లు అవసరమైన మరమ్మతు పరికరాలతో 24 గంటలూ సిద్ధంగా ఉంటారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ఈ వాహనంలో తీసుకెళ్లగలరు' అని భట్టి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ కార్యదర్శి, ట్రాన్స్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా, డిస్కంల సీఎండీలు ముషారఫ్ అలీ, వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి మూసీ పరీవాహకానికి భాజపా



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు తదితరులు

ఈనాడు, హైదరాబాద్: మూసీ బాధితులకు అండగా నిలిచేందుకు భాజపా ప్రతిపాదించిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి భాజపా నేతలకు సూచించారు. ఈ నెల 23, 24వ తేదీల్లో మూసీ పరీవాహక ప్రాంతాల్లో భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతల బృందాలు పర్యటించనున్న నేపథ్యంలో కిషన్‌రెడ్డి భాజపా నేతలతో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు. భాజపా ముఖ్యనేత, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందర్‌రావు, ఎమ్మెల్యేలు పి.హరీశ్‌బాబు, రాకేశ్‌రెడ్డి ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 18 ప్రాంతాలను బృందాలు ప్రత్యక్షంగా సందర్శించి, మూసీ బాధితులకు అండగా నిలిచేలా కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. రాజేంద్రనగర్, కార్వాన్, బహదూర్‌పుర, చార్మినార్, గోషామహల్, మలక్‌పేట, ఉప్పల్, అంబర్‌పేట, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో పర్యటించే 18 ప్రాంతాలు అందులోని ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ముఖ్యనేతల వివరాలను ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి వెల్లడించారు. కిషన్‌రెడ్డి రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో, కేంద్రమంత్రి బండి సంజయ్ మలక్‌పేట, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఎల్బీనగర్, జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె.అరుణ బహదూర్‌పుర నియోజకవర్గంలో మూసీపరీవాహక ప్రాంతాల్లో పర్యటించనున్నారు. అక్టోబరు 25వ తేదీన భాజపా రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మూసీ బాధితులతో కలిసి మహాధర్నా కార్యక్రమాన్ని భాజపా చేపట్టనుంది.

స్కిల్స్ వర్సిటీలో అగ్రికల్చర్ కోర్సులు

రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యువభారత్ నైపుణ్య విశ్వవిద్యాలయం(యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ)లో అగ్రికల్చర్ కోర్సులు ప్రవేశపెట్టాలని వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే వీటిని అందుబాటులోకి తేవాలని కోరింది. ఈ వర్సిటీలో 20 కోర్సులు ప్రవేశపెట్టాలని ప్రభుత్వం గుర్తించగా.. ఇప్పటికే నాలుగు మొదలయ్యాయి. ఈ క్రమంలో వీటికి అదనంగా అగ్రికల్చర్ కోర్సులనూ చేర్చాలని, వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా వాటి వివరాలు సమర్పిస్తామని వెల్లడించింది.

నిజామాబాద్, నల్గొండలో వ్యవసాయ కళాశాలలు!

వ్యవసాయ కోర్సులకు డిమాండ్ దృష్ట్యా రాష్ట్రంలో కొత్తగా నిజామాబాద్, నల్గొండ ఉమ్మడి జిల్లాల పరిధిలో కొత్తగా వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేసేందుకు వ్యవసాయ శాఖ యోచిస్తోంది. దీనిపై త్వరలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించనుంది. ప్రస్తుతం పూర్వ ఉమ్మడి జిల్లాల్లో నిజామాబాద్, నల్గొండ మినహా మిగతా అన్నిచోట్ల కళాశాలలు ఉన్నాయి.

నేటి నుంచి కాళేశ్వరం మలిదశ విచారణ

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం న్యాయవిచారణ కమిషన్ విచారణ మంగళవారం నుంచి తిరిగి ప్రారంభం కానుంది. అఫిడవిట్లు దాఖలు చేసిన వారిని బహిరంగ విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ ముందుకు బుధవారం మాజీ ఈఎన్సీ వెంకటేశ్వర్లు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. గత నెలలో నిలిచిన విచారణ తిరిగి ప్రారంభించనున్నట్లు సమాచారం.

కోర్టు ఉత్తర్వు అమలు ఉద్దేశమే సర్కారుకు లేదు

- అధికారులది ప్రాథమికంగా ధిక్కరణే
- ఇంజినీరింగ్ కాలేజీల పిటిషన్‌లపై హైకోర్టు
- విద్యాశాఖ ఉన్నతాధికారులకు నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐసీటీఈ, జేఎన్‌టీయూ ఆమోదించిన సీట్ల పెంపునకు ప్రభుత్వం అనుమతించాలని, ఆ సీట్ల భర్తీకి మాప్-అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ గత నెల 9న తాము ఇచ్చిన ఉత్తర్వులను అమలుచేసే ఉద్దేశం ప్రభుత్వానికి ఉన్నట్లు లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన అప్పీలును సుప్రీంకోర్టు కొట్టివేసినా, మరోసారి దాఖలుచేసిన రివ్యూ పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు రాకపోయినా, తమ ఉత్తర్వులను అమలు చేయకపోవడాన్ని తప్పుపట్టింది. మరో రాజకీయ పార్టీకి చెందిన యాజమాన్యాలు అయినందునే ఆయా కళాశాలల్లో పెరిగిన సీట్లకు అనుమతించడంలేదన్నట్లుగా కనిపిస్తోందని ఆక్షేపించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 23తో సీట్ల భర్తీ ప్రక్రియ ముగిసిపోతున్నందున..ఆ తరువాత కాలేజీలకు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చినా ప్రయోజనం ఉండదని పేర్కొంటూ..ఏఐసీటీఈ అనుమతించిన సీట్లను భర్తీ చేసుకోవడానికి ఆయా కళాశాలలకు అనుమతించింది. సీట్ల భర్తీ ప్రక్రియలో ఎలాంటి క్యాపిటేషన్ ఫీజు వసూలు చేయరాదని కళాశాలలను ఆదేశించింది. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు శిక్ష విధించరాదో వివరణ ఇవ్వాలంటూ ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ.శ్రీదేవసేన, ఉన్నత విద్యాశాఖ కన్వీనర్ శ్రీరాం వెంకటేశ్, టీజీఈఏపీసెట్ కన్వీనర్ డాక్టర్ బి.డీన్‌కుమార్‌లకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఏఐసీటీఈ, జేఎన్‌టీయూలు ఆమోదించిన ప్రకారం కంప్యూటర్ సైన్స్ తదితర కోర్సుల్లో సీట్ల పెంపునకు అనుమతించాలని, వాటి భర్తీకి మాప్-అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలని సెప్టెంబరు 9న ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై కేఎంఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎంఎల్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎంజీఆర్, సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, చంద్రమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ, మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, విద్యాజ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ తదితర యాజమాన్యాలు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశాయి. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ కౌంటర్లు దాఖలు చేశామని, వాదనలు వినిపించడానికి గడువు కావాలని కోరారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు డి.ప్రకాశ్‌రెడ్డి, ఎస్.నిరంజన్‌రెడ్డిలు వాదనలు వినిపిస్తూ కోర్టు ధిక్కరణ చట్టం కింద ఆరు నెలల జైలు శిక్ష, జరిమానా విధించవచ్చన్నారు. కోర్టు ఉత్తర్వులను అమలుచేయకపోవడాన్ని ఎలా సమర్థించుకుంటారని ప్రభుత్వ న్యాయవాది ఎస్.రాహుల్‌రెడ్డిని ధర్మాసనం ప్రశ్నించింది. 'ఈ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీం కోర్టు సమర్థించినా అమలు చేయకుండా అక్టోబరు 1న రివ్యూ వేశామంటున్నారు. ఇప్పటికీ కోర్టు ఉత్తర్వులను అమలు చేయడానికి అంగీకరించడంలేదు. ప్రాథమికంగా ఇది కోర్టు ధిక్కరణే. ఎంత శిక్ష విధించాలన్న దానిపై వాదనలు వింటాం' అని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ న్యాయవాది జోక్యం చేసుకుంటూ ఉల్లంఘన ఉద్దేశపూర్వకంగా జరగలేదన్నారు. 'ఇప్పటికే లక్ష మందికిపైగా విద్యార్థుల ప్రవేశాలు పూర్తయ్యాయి. ఈ దశలో మాప్‌అప్ కౌన్సెలింగ్ నిర్వహించడం కష్టం' అని తెలిపారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ కేసు పూర్వాపరాల్లోకి వెళ్లడం లేదని, కోర్టు ధిక్కరణ జరిగిందా లేదా అనే దానిపైనే వాదనలు వింటామని తేల్చి చెప్పింది.

సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం: రాష్ట్ర సర్కారు

తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'సీట్లు పెంపు అంశంలో సింగిల్ జడ్జి బెంచ్ సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా తీర్పు ఇచ్చింది. అదే వారం ఇంజినీరింగ్ కళాశాలల్లో కౌన్సెలింగ్ పూర్తయింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని హైకోర్టు తీర్పుపై సుప్రీంను ఆశ్రయిస్తాం" అని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది.

బ్యాంకు పరీక్షల శిక్షణ దరఖాస్తు గడువు 27 వరకు పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: బ్యాంకు ఉద్యోగాల(ఐబీపీఎస్ క్లర్క్, ప్రొబేషనరీ అధికారులు) పోటీ పరీక్షల కోసం గిరిజన స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 60 రోజుల ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు ఈ నెల 27 వరకు పొడిగించినట్లు గిరిజన సంక్షేమశాఖ తెలిపింది. రాష్ట్రంలో అర్హులైన ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులు గిరిజన స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ studycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరింది. అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.3.5 లక్షలకు మించకూడదని తెలిపింది. మరిన్ని వివరాలకు 040-27540104 నంబరులో సంప్రదించాలని సోమవారం ఒక ప్రకటనలో సూచించింది.

ముగ్గురు హైదరాబాదీలకు స్కాల్ ఇంటర్‌నేషనల్ గుర్తింపు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ నగరానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ప్రపంచ టూరిజం అసోసియేషన్ స్కాల్ ఇంటర్‌నేషనల్ గుర్తింపు దక్కించుకున్నారు. టర్కీలో జరిగిన 83వ వరల్డ్ కాంగ్రెస్ సదస్సులో 2025 ఏడాదికి స్కాల్ ఇంటర్నేషనల్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్ఎస్ఎన్ మోహన్, డిప్యూటీ ఆడిటర్‌గా డాక్టర్ హరికిషన్ వాల్మీకి, గౌరవ సభ్యురాలిగా వాణి సుభాష్ ఎన్నికయ్యారు. 1934 పారిస్‌లో ఏర్పాటైన ఈ సంస్థ 82 దేశాలు 303 నగరాల్లో పర్యాటక, ఆతిథ్యరంగాల కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

చేయీ చేయీ కలిపి.. మిత్రుడి ఉపాధికి 'జీవం'!



బాధితుడు ఇనేష్‌కు(మధ్యలో టీషర్ట్ వేసుకున్న వ్యక్తి) జీవాలను విరాళంగా అందిస్తున్న దాతలు

సాయం చేసేందుకు కావాల్సింది ధనరాశులు కాదు.. మనసు అని నిరూపించారు ఈ సామాన్యులు. గొప్ప చదువులు చదువుకోకున్నా.. భారీగా ఆస్తులు లేకున్నా.. కష్టాన్నే నమ్ముకుని జీవిస్తున్నా.. తమలో ఒకరికి ఆపద వచ్చిందని తెలియగానే అందరూ చేయీ చేయీ కలిపి చేయూత అందించారు. అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం రాంసింగ్‌తండాకు చెందిన చవాన్ ఇనేష్ దివ్యాంగుడు. ఇద్దరు కుమారుల్లో ఒకరు మానసిక దివ్యాంగుడు. ఆయన గొర్రెలు పెంచుతూ జీవనోపాధి పొందుతున్నారు. ఇటీవల పిడుగుపాటుతో 70 జీవాలు మృతి చెందాయి. రూ.8-10 లక్షల నష్టం వాటిల్లింది. ఉన్న ఆదాయవనరు కోల్పోయి దిక్కుతోచని స్థితికి చేరారు. ఆయన దీనస్థితిని చూసిన సాటి గొర్రెల కాపరులు సాయానికి ముందుకొచ్చారు. సమీప గ్రామాలైన లింగాపూర్‌తండా, కుప్టి, దుప్యతండా, ఆదివాసిగూడ, బంద్రేవుతండా, రవీంద్రనగర్, మహవీర్‌తండా, గోండ్‌జౌళి, దయ్యాల దన్నూర్ తదితర గ్రామాలకు చెందిన వారు తమ వంతు సాయాన్ని అందించారు. సోమవారం తలా ఒక గొర్రెను బాధితుడికి విరాళంగా ఇచ్చారు. మొత్తం 40 జీవాలను అందించి ఇనేష్‌కు తిరిగి జీవనోపాధి కల్పించి మానవత్వం చాటారు.

–న్యూస్‌టుడే, సారంగాపూర్

జూనియర్ డీఈఈలకు ఈఈలుగా బాధ్యతలపై రచ్చ

ఈనాడు, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో సీనియర్లను పక్కన పెట్టి జూనియర్ డీఈఈలకు ఈఈ స్థానాలను అదనపు బాధ్యతల కింద అప్పగించడాన్ని పలు ఇంజినీర్ల సంఘాలు తప్పు పడుతున్నాయి. 2004 బ్యాచ్‌కు చెందిన డీఈఈలను కాదని 2005, 2007 బ్యాచ్‌లకు చెందిన వారికి కావాలనే శాఖలో అత్యంత కీలకమైన ఈఈ పోస్టులను ఎఫ్ఏసీల కింద అప్పగిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. నిర్మల్, ఖమ్మం, నల్గొండ ఇరిగేషన్ సర్కిళ్లలో ఇదే విధంగా జూనియర్లకు ఈఈ స్థానాలు అప్పగించారంటూ సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



అలవాటుగా మారిందేదీ కష్టంగా అనిపించదు

ఒక పనిని పదే పదే చేస్తుంటే అది అలవాటుగా మారుతుంది. ఆ విధంగానే కష్టపడి పనిచేయడం కూడా అలవాటుగా మారేవరకూ దాన్ని కొనసాగించండి. ఆ తర్వాత అది మీకు ఏ మాత్రం కష్టంగా అనిపించదు. ఎందుకంటే అలవాట్లేవీ కష్టంగా అనిపించవు కదా. అంతేకాదు.. కష్టించి పనిచేసే స్వభావం మీ వ్యక్తిత్వంగా మారిపోతుంది.

– జాక్ మెన్షా, ఆటోమొబైల్ డిజైనర్

బలహీనవర్గాలపై వ్యతిరేకతను చాటుకున్న రేవంత్

- ఆయనకు బండి సంజయ్ రహస్య స్నేహితుడు
- కేటీఆర్ ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో కౌశిక్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, బాలకిషన్, సంజయ్

ఈనాడు, హైదరాబాద్: "సీఎం రేవంత్‌రెడ్డి తన చర్యల ద్వారా బలహీన వర్గాలపై తనకున్న వ్యతిరేకతను చాటుకున్నారు. జీవో నం.29 ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను తీసే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణేతరులకు కూడా ఈ ప్రభుత్వం ప్రయోజనాలు కల్పించే కుట్ర చేస్తోంది. గ్రూప్ 1 పరీక్షల విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది" అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజమెత్తారు. గ్రూప్ 1 పరీక్ష రాసే పిల్లలకు ప్రశాంతత లేకుండా చేశారని విమర్శించారు. కోర్టు కేసు తేలేదాక తాము విద్యార్థులకు అండగా ఉంటామని చెప్పారు. జీవో నం.29 విషయంలో పిల్లల తరఫున టాప్ లాయర్‌ను పెట్టి కొట్లాడుతామని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో భారాస ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, సంజయ్, కౌశిక్‌రెడ్డి, తదితరులతో కలిసి కేటీఆర్ సోమవారం విలేకరులతో మాట్లాడారు. "ప్రభుత్వంలో ఉన్నప్పుడు భేషజాలకు పోవద్దు. ప్రజాస్వామ్యంలో ఎక్కడ తగ్గాలో.. ఎక్కడ నెగ్గాలో తెలిసి ఉండాలి. గ్రూప్ 1 విద్యార్థులు అడిగిందాంట్లో తప్పు ఏముంది? జీవో నం.29 రాజ్యాంగ విరుద్ధమని చెప్పటం తప్పా? కేసీఆర్ స్థానికులకు 95 శాతం రిజర్వేషన్లను తెచ్చారు. దాంట్లో స్థానికేతరులకు వచ్చేలా కుట్రలు చేస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన రిజర్వేషన్లకు తూట్లు పొడవడం కన్నా దుర్మార్గమైన నిర్ణయం మరొకటి లేదు. ఈ అన్ని అంశాలు తేలే వరకు ఎగ్జామ్స్ రీ షెడ్యూల్ చేయమంటే ప్రభుత్వానికి ఎందుకంత అహం" అని కేటీఆర్ ప్రశ్నించారు.

మూసీ కుంభకోణంపై మాట్లాడొద్దా?

"మా కళ్ల ముందే మూసీ పేరుతో ఇంత పెద్ద కుంభకోణం జరుగుతుంటే ప్రశ్నించొద్దా? అటు పైన దామగుండంలో రాడార్ కేంద్రానికి, ఇటు కింద అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులిచ్చి మూసీని చంపుతున్నారు. మూసీ లూటీని కప్పిపుచ్చేందుకు ప్రభుత్వం నానాతంటాలు పడుతోంది. సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ రహస్య స్నేహితుడు. రేవంత్ ప్రభుత్వాన్ని మంత్రులు కూల్చేస్తారంటూ సంజయ్ బాధపడిపోతున్నారు. పొంగులేటి ఇంటి మీద ఈడీ దాడులు జరిగి 20 రోజులైనా ఎవరూ ఎందుకు మాట్లాడడంలేదు? ఎవరికి ఎవరు దోస్తులో ప్రజలకు అన్నీ తెలుసు. ముత్యాలమ్మ గుడి ఘటనను నేను ఖండిస్తే.. శాంతిభద్రతల సమస్యంటూ నా మీద సైబర్ క్రైమ్ వాళ్లు 'ఎక్స్'కు ఫిర్యాదు చేశారు. మతఘర్షణ సంఘటనపై కూడా మేము ఖండన తెలపొద్దా? ముఖ్యమంత్రి శాంతిభద్రతలను కాపాడడంపై దృష్టిపెట్టాలి. గతంలో రాహుల్ అశోక్‌నగర్‌కు వెళ్తే.. భద్రత ఇచ్చి మేము పంపించాం. కానీ ఇప్పుడు మమ్మల్ని అరెస్ట్ చేస్తున్నారు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

విధ్వంసకర విధానాలతో ఆర్థికంగా వెనుకబాటు

తెలంగాణలో బుల్డోజర్ సంస్కృతిని తీసుకురావడంతో.. ఫలితాలు కూడా బుల్డోజర్ ఎకానమీ మాదిరిగా వస్తున్నాయని, రేవంత్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధ్వంసకర విధానాలతో జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ ఆఖరి స్థానంలో నిలిచిందని కేటీఆర్ విమర్శించారు. ఈ అంశంపై సోమవారం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. "గతేడాదితో పోల్చుకుంటే తొలిసారిగా తెలంగాణలో జీఎస్టీ వసూళ్లు 1 శాతం కంటే తక్కువకు పడిపోయాయి. జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ ఎప్పుడూ 15 శాతం వృద్ధిని సాధించేది. రాష్ట్రం ఇప్పుడు ఉత్తర్‌ప్రదేశ్ ఆర్థిక వ్యవస్థతో విజయవంతంగా పోటీపడుతోంది! కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్లే ఈ ఘనతను సాధించింది. రాష్ట్రంలో ఆబ్కారీ శాఖ మాత్రమే మంచి పనితీరుతో గొప్పగా ఫలితాలనిస్తోంది. ఈ తిరోగమన పరిస్థితిపై సీఎం సమాధానం చెబుతారని ఆశిస్తున్నా" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

బాలుడి వైద్యానికి ఎమ్మెల్సీ చేయూత

'ఈనాడు' కథనానికి స్పందన



బాలుడి తల్లిదండ్రులకు రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న కేటీఆర్. చిత్రంలో తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటకు చెందిన కుంబోజు మహేశ్వర్ కుమారుడు మాధవన్(5) గౌచర్ డిసీజ్-1 వ్యాధితో బాధపడుతుండగా చికిత్స కోసం ఎమ్మెల్సీ ఆర్థిక సాయం అందించారు. బాలుడికి కుటుంబం చికిత్స చేయించలేని దయనీయ స్థితిపై 'ఈనాడు'లో ఆగస్టు 27న 'తింటే అరగదు.. వదిలేస్తే ప్రాణం నిలవదు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రి వైద్యులు శాశ్వత చికిత్స చేయాలంటే 'బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్' చేయాలని.. ఇందుకు రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. ఈ మేరకు ఎమ్మెల్సీ సోమవారం హైదరాబాద్‌లో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేతులమీదుగా అందించారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, జఫర్‌గఢ్

నేడు సామాజిక న్యాయశాఖ దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సమీక్ష సమావేశం

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర సామాజిక న్యాయశాఖ పరిధిలో అమలవుతున్న పథకాలపై సమీక్షతో పాటు పలు సమస్యల పరిష్కారానికి దక్షిణాది రాష్ట్రాల కేంద్ర సామాజిక న్యాయశాఖ ప్రాంతీయ సమీక్ష సమావేశం మంగళవారం హైదరాబాద్‌లో జరగనుంది. ఈ సమీక్షలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలు పాల్గొననున్నాయి. కేంద్ర సామాజిక న్యాయశాఖ కార్యదర్శి అమిత్ యాదవ్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమావేశాన్ని ప్రారంభిస్తారు. ఉదయం జరిగే సమావేశంలో ఎస్సీ విద్యార్థుల పోస్టు, ప్రీమెట్రిక్ ఉపకారవేతనాలు, పీఎం అజయ్, ఎస్సీ ఎస్టీ వేధింపుల చట్టం, పౌరహక్కుల అమలుపై సమీక్ష ఉంటుంది. మధ్యాహ్నం ఓబీసీ, ఈబీసీ, సంచారజాతుల విద్యార్థులకు పీఎం యశస్విపై సమీక్ష జరుగుతుంది. ఈ సందర్భంగా డ్రగ్స్ నిర్మూలనపై జాతీయ కార్యాచరణ ప్రణాళిక, వయో అభ్యుదయ యోజన పథకాల అమలు పరిశీలిస్తారు.

రోడ్లు, భవనాలశాఖలో ఇంజినీరింగ్, సబార్డినేట్ నిబంధనలు

ఈనాడు, హైదరాబాద్: రోడ్లు, భవనాల శాఖలో ఇంజినీరింగ్ సర్వీసు, సబార్డినేట్ సర్వీసు నిబంధనలు-2024పై సోమవారం రాష్ట్ర ప్రభుత్వం విడివిడిగా రెండు ఉత్తర్వులు జారీ చేసింది. ఇంజినీరింగ్ సర్వీస్ రూల్స్‌లో క్లాస్-ఎ సివిల్ ఇంజినీరింగ్‌లో ఆరు కేటగిరీల పోస్టులు, క్లాస్-బిలో ఆర్కిటెక్చర్‌లో నాలుగు, ఎలక్ట్రికల్‌లో ఐదు స్థాయిల పోస్టులను.. అలాగే సబార్డినేట్ రూల్స్‌లో క్లాస్-ఎ సివిల్ ఇంజినీరింగ్‌లో ఐదు కేటగిరీలు, క్లాస్-బి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో మూడు కేటగిరీల పోస్టులను నిర్ధారించింది. వారి నియామకాల విధానం, నియామక సంస్థ, అర్హతలు, శిక్షణ, రిజర్వేషన్లు తదితర అంశాలను పేర్కొంది.

డైట్ ఛార్జీలు 40 శాతం పెంచాలి

- కాస్మెటిక్ ఛార్జీలనూ సవరించాలి
- ఉన్నతాధికారుల కమిటీ ప్రతిపాదనలు
- డిప్యూటీ సీఎం విక్రమార్కకు నివేదిక

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లోని 7.65 లక్షల మంది విద్యార్థులకు కాస్మెటిక్, డైట్ ఛార్జీలను పెంచాలని ఉన్నతాధికారుల కమిటీ ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న డైట్ ఛార్జీలను కనీసం 40 శాతం పెంచాలని కోరింది. దాదాపు 16 ఏళ్లగా పెంపుదలకు నోచుకోని కాస్మెటిక్ ఛార్జీలను.. బాలికలు, బాలురకు వేర్వేరుగా.. తరగతుల వారీగా పెంచాలని సూచించింది. విద్యార్థుల పోషకాహారం, ఆరోగ్యానికి సంబంధించిన ఈ రెండు బిల్లులను ప్రతినెలా చెల్లించేలా గ్రీన్ ఛానెల్‌లో చేర్చాలని కోరింది. డైట్, కాస్మెటిక్ ఛార్జీల పెంపుపై ప్రభుత్వం నియమించిన ఉన్నతాధికారుల కమిటీ.. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు నివేదిక సోమవారం అందజేసింది. గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం తదితరులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం విక్రమార్కలకు ఇటీవల విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం అధ్యక్షతన ఉన్నతాధికారుల కమిటీని నియమించింది. ఇందులో సభ్యులుగా సంక్షేమశాఖల ఉన్నతాధికారులు శ్రీధర్, శరత్, శ్రీదేవి, తఫ్సీర్ ఇక్బాల్, అలగు వర్షిణి, సైదులు, సర్వేశ్వర్‌రెడ్డిలతో పాటు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉన్నారు.



పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని...

సంక్షేమ గురుకులాల్లో డైట్ ఛార్జీలు చివరిసారిగా 2017లో పెరిగాయి. ఈ నేపథ్యంలో ఛార్జీల పెంపుపై ఉన్నతాధికారుల కమిటీ కసరత్తు చేసింది. గత ఏడేళ్లుగా 20 రకాల నిత్యావసర వస్తువుల ధరలు ఎలా పెరిగాయి? ద్రవ్యోల్బణం, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నవోదయ విద్యాలయాల్లో ఎంత చెల్లిస్తున్నారు? తదితర వివరాలను కమిటీ పరిగణనలోకి తీసుకుంది. కాస్మెటిక్ ఛార్జీల విషయంలో 2022లో మహిళా శిశు సంక్షేమశాఖ జారీచేసిన ఉత్తర్వులను పరిశీలించింది. ప్రస్తుత ఛార్జీల కన్నా 40 శాతం పెంచాలని నివేదికలో పేర్కొంది.

2008 తరువాత పెరగని కాస్మెటిక్ ఛార్జీలు..

గురుకులాలు, వసతి గృహాల్లోని విద్యార్థుల వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత కోసం కాస్మెటిక్ ఛార్జీలను ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే 2008లో చివరిసారిగా ఛార్జీలను పెంచగా.. అవే 16 ఏళ్లుగా అమలవుతున్నాయి. వీటిని పెంచాలని గతంలో పలు మార్లు సంక్షేమశాఖలు విజ్ఞప్తి చేసినా లాభం లేకపోయింది. బాలురకు హెయిర్‌కట్‌కు రూ.12 మాత్రమే ఇస్తున్నారు. కాస్మెటిక్ ఛార్జీల కింద ఇస్తున్న డబ్బుతో సబ్బులు కొనుక్కోవడం కూడా కష్టమే. బాలికలకు నెలకు ఇచ్చే రూ.75తోనే సబ్బులు, పౌడర్, రిబ్బన్ కొనుక్కోవాలి. నెలసరి సమయంలో శానిటరీ నాప్కిన్లు కొనేందుకు సొమ్ము లేక తరగతులకు డుమ్మాకొట్టే పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు కాస్మెటిక్ ఛార్జీలు భారీగా పెంచాలని ఉన్నతాధికారుల కమిటీ సిఫారసు చేసింది. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కాస్మెటిక్, డైట్ ఛార్జీల పెంపుపై తదుపరి చర్యలకు సంక్షేమ శాఖల నోడల్ విభాగమైన ఎస్సీ సంక్షేమశాఖ సిద్ధమైంది.

ఉన్నతాధికారుల కమిటీ ప్రతిపాదించిన ఛార్జీలు(రూపాయల్లో)

తరగతులు	ప్రస్తుతం	ప్రతిపాదన
డైట్ ఛార్జీలు..		
3-7	950	1330
8-10	1,100	1,540
ఇంటర్, ఆపైన	1,500	2,100
కాస్మెటిక్ ఛార్జీలు (బాలికలు)		
3-7	55	175
8-10	75	275
కాస్మెటిక్ ఛార్జీలు (బాలురు)		
3-7	62	150
8-10	62	200



గవర్నర్‌ను కలిసిన బీసీ కమిషన్

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు నిర్ణయించేందుకు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8 వరకు ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ విచారణ చేయనున్నట్లు బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి బీసీ కమిషన్ ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమగ్ర సర్వే షెడ్యూలుకు సంబంధించిన వివరాలను అందజేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, ఇతర అధికారులు ఉన్నారు.

-ఈనాడు, హైదరాబాద్



సభలో మాట్లాడుతున్న ప్రొ.హరగోపాల్. వేదికపై రాఘవచారి, వేణుగోపాల్, ప్రొ.లక్ష్మణ్, వసంత, మంజీర, మీనా కందస్వామి

ప్రొ.సాయిబాబా సమాజానికి నడక నేర్పారు

సంస్మరణ సభలో వక్తలు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ఆదివాసీలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ప్రొ.సాయిబాబా పాటుపడ్డారని, ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో ప్రజా సంఘాలు, సాయిబాబా బంధు, మిత్రుల ఆధ్వర్యంలో సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ.హరగోపాల్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, ప్రారంభోపన్యాసం చేశారు. సాయిబాబా నడవలేకున్నా సమాజానికి నడక నేర్పారన్నారు. మావోయిస్టులకు మద్దతు పలుకుతున్నారనే నెపంతో అమాయక ఆదివాసీలను పోలీసులు పొట్టనబెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా ఆదివాసీల హక్కుల కోసం న్యాయ పోరాటం చేయడాన్ని సహించలేకే ఆయన మృతికి రాజ్యం కారణమైందని ఆరోపించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ప్రముఖ రచయిత్రి మీనా కందస్వామి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొ.లక్ష్మణ్, విరసం సభ్యుడు పాణి మాట్లాడుతూ.. బెయిల్ అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అయినా సాయిబాబాకు ఏళ్ల తరబడి మంజూరు చేయకుండా జైల్లోనే ఉంచారన్నారు. సమాజానికి అవసరమైన మేధావులను, ప్రశ్నించే వారిని భాజపా సర్కారు లక్ష్యంగా చేసుకుంటోందని విమర్శించారు. అనేక మంది తీవ్రమైన నేరాలు చేసి విదేశాల్లో విలాసవంతమైన జీవితాలు గడుపుతుంటే.. ఏ తప్పు చేయని సాయిబాబాను సర్కారు 10 ఏళ్ల పాటు జైల్లో వేసిందన్నారు. దీనికి నష్టపరిహారం ఏమిటని ప్రశ్నించారు. ఆయన విశాల ఐక్య ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం సాయిబాబా జైలులో రాసిన 'నేను చావును అంగీకరించను' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కోదండరాం, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి, సాయిబాబా సతీమణి వసంత, కుమార్తె మంజీర తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులను పట్టించుకోని ప్రభుత్వం!

- నిరసనలు తెలిపేవారిపై కేసులు పెడుతున్నారు
- గవర్నర్‌కు భాజపా నేతల ఫిర్యాదు
- కాంగ్రెస్ ఓట్ల రాజకీయం చేస్తే సహించేది లేదు: ఈటల

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు భాజపా ఫిర్యాదు చేసింది. హైదరాబాద్‌లో గత రెండు మూడు నెలలుగా బయటనుంచి వచ్చిన కొంతమంది ఆలయాలపై దాడులు చేసి ధ్వంసం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని భాజపా నేతలు గవర్నర్‌కు తెలిపారు. సోమవారం ఆ పార్టీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, శాసనసభాపక్షనేత ఎ.మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, నేతలు ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు తదితరులు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయాలపై దాడులు చేస్తున్నవారిని వదిలేసి.. నిరసనలు తెలియజేస్తున్నవారిపై అక్రమ కేసులు పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. గవర్నర్‌ను కలిసిన అనంతరం ఈటల విలేకరులతో మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల రాజకీయం చేస్తే సహించేది లేదు. వాస్తవ సమాచారాన్ని ప్రజలకు అందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి మీద దాడిచేసిన వ్యక్తులు పక్కనేఉన్న హోటల్లో శిక్షణ పొందారు. ఉదయం 4 గంటల సమయంలో ఆలయం మీద దాడిచేయగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అయితే పోలీసులు మతిస్థిమితం లేని వాడని ముద్రవేసి తప్పించే ప్రయత్నం చేస్తున్నారు. హైదరాబాద్ ఇలాంటి శిక్షణలకు కేంద్రంగా మారింది. ఇలాంటి 15 బృందాలు శిక్షణ పొంది హిందువుల మనోభావాలు దెబ్బతీసే కుట్రలు చేస్తున్నాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం జరుగుతోందని తెలిసినా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వం స్పందించాలని ధర్నాచేసి, శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే పోలీసులు పాశవికంగా వ్యవహరించారు. ఇప్పుడిప్పుడే హైదరాబాద్‌లో ప్రశాంత వాతావరణం నెలకొంటుంటే మళ్లీ అలాంటి కుట్రలకి తెరలేపే అవకాశం ఉందని గవర్నర్‌కు వివరించాం. హోటల్‌లో జరిగిన మీటింగ్ సమాచారం తెలుసుకోలేకపోవడం రాష్ట్ర ఇంటెలిజెన్స్ వైఫల్యం. సమగ్రమైన విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలి" అని డిమాండ్ చేశారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీలు ఈటల, విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు. చిత్రంలో భాజపా నేతలు కె.ఎస్.రత్నం, ప్రకాశ్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, పాల్వాయి హరీశ్, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కాసం వెంకటేశ్వర్లు, మహేశ్వర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, కృష్ణ యాదవ్, గూడూరు నారాయణరెడ్డి, వంశతిలక్

వైటీపీఎస్‌లో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాలు: సబ్ కలెక్టర్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలోని వీర్లపాలెం యాదాద్రి థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం (వైటీపీఎస్) నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తెలిపారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 169 మంది తమ ఇళ్లు కోల్పోగా.. వారిని ప్రభుత్వం పునరావాసకేంద్రాలకు తరలించిందన్నారు. వారికి రూ.5లక్షల పరిహారం కానీ, ఇంటికో ఉద్యోగం కానీ ఇస్తామని ప్రకటించగా.. 133మంది ఉద్యోగం కావాలని కోరినట్లు తెలిపారు. ఈనెల 22 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నామన్నారు.

25న ఫ్రాన్స్ విదేశీ విద్యాసదస్సు

ఈనాడు, హైదరాబాద్: ఫ్రాన్స్‌లో చదవాలనే ఆసక్తి ఉన్న వారికి అక్కడి విద్యపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 25న మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు హైదరాబాద్ మాదాపూర్‌లోని నోవాటెల్ కన్వెన్షన్ కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నారు. ముంబయి, చండీగఢ్‌లో పూర్తికాగా.. ఈ నెల 23న దిల్లీ, 25న హైదరాబాద్, 27న బెంగళూరులో నిర్వహిస్తున్నారు.

సీఎం కాన్వాయ్ వెళ్లేదారిలో ఇతర వాహనాలకూ అనుమతి

ఎస్కార్ట్ వాహనాల తొలగింపు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఎప్పుడూ సమస్యాత్మకమే. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత తాను ప్రయాణించే సమయంలో ట్రాఫిక్‌ను ఆపొద్దని, సాధారణ వాహనాలతో పాటు తన వాహనాలను అనుమతించాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. పోలీసులు కొద్దిరోజులపాటు ఈ విధానాన్ని అమలు చేశారు. ఈ క్రమంలో అంబులెన్స్‌కు సైతం కాన్వాయ్ దారిఇచ్చిన సందర్భాలున్నాయి. అయితే భద్రతా చర్యల దృష్ట్యా పోలీసుశాఖ కొద్దిరోజులకే ఈ విధానాన్ని ఎత్తివేసింది. సీఎం వచ్చే సమయంలో అపసవ్య దిశతో పాటు ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గంలోనూ వాహనాలను నిలిపేస్తున్నారు. జూబ్లీహిల్స్‌లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతోపాటు సీఎం నివాసం ఇదే ప్రాంతంలో ఉండటంతో ట్రాఫిక్‌పై ఎక్కువగా ప్రభావం పడుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం.. ట్రాఫిక్ సమస్యలపై దృష్టి పెట్టాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించడంతో పలు మార్పులు చేర్పులు చేశారు. గతంలో సీఎంతో కూడిన కాన్వాయ్ ప్రయాణించే సమయంలో ఆ దారిలో వాహనాలను నిలవనిచ్చేవారు కాదు. ఇప్పుడు ఆయన ప్రయాణించే మార్గంలో ముఖ్యమంత్రి వాహనం ఆగకుండా వెళ్లేలా సాధారణ వాహనాలను వీలున్నంతమేర అనుమతిస్తున్నారు. కాన్వాయ్ ప్రయాణించే మార్గానికి అపసవ్య దిశలో (డివైడర్‌కు మరోవైపు) వాహనాలను అనుమతిస్తున్నారు. టీ-జంక్షన్ ఉన్న ప్రాంతాల్లో ఒకవైపు వాహనాలను నిలిపివేస్తున్నారు. గతంలో సీఎం కాన్వాయ్‌కు ముందు శాంతిభద్రతల విభాగం ఠాణాలకు చెందిన ముఖ్యఅధికారులు ఎస్కార్ట్ వాహనాల్లో వెళ్తుండేవారు. ఈ పద్ధతి వద్దని అధికారులు తేల్చిచెప్పినట్లు సమాచారం.



సాధారణ వాహనాల పక్క నుంచి వెళ్తున్న సీఎం కాన్వాయ్

పటిష్ఠంగా జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలు

మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఆరోగ్య పథకాన్ని పటిష్ఠంగా అమలుచేస్తామని, ఈ విషయంలో రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ నేతృత్వంలోని బృందం సభ్యులు మంత్రిని కలిశారు. జర్నలిస్టుల ఆరోగ్య పథకం సక్రమంగా అమలుకాక ఎంతో మంది జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా గానీ థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా గానీ నిర్వహించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు.

ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

గాంధీభవన్ ఎదుట డీఎస్సీ 2024 అభ్యర్థుల నిరసన

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లోని బ్యాక్‌లాగ్ పోస్టులను ఓపెన్ కేటగిరీలోకి మార్చి భర్తీ చేయాలని డీఎస్సీ 2024 ఉర్దూ మీడియం అభ్యర్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పోస్టులను భర్తీ చేయకపోవడంపై వారు సోమవారం గాంధీభవన్ ఎదుట నిరసన తెలిపారు. అభ్యర్థులు మాట్లాడుతూ..డీఎస్సీ 2024కు సంబంధించిన పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీకి నోచుకోలేదన్నారు. ఖాళీల కారణంగా ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో బోధన కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గాంధీభవన్ ఇన్‌ఛార్జి, పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు టి.కుమార్‌రావుకు వినతిపత్రం సమర్పించారు.



అలాంటివారు ఎన్నటికీ విజేతలు కాలేరు

విజయం ఎవరెస్టును అధిరోహించడం లాంటిది. చాలా మందికి దాన్ని ఎక్కాలన్న ఆలోచన కూడా రాదు. తమలాంటి వారికి అది సాధ్యం కాదని వారు తమ శక్తిని తక్కువ అంచనా వేసుకుంటుంటారు. మరికొందరికి ఎక్కాలన్న కోరిక ఉన్నా, పైకి చేరుకునే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను తలచుకుని ప్రయత్నాన్ని విరమించుకుంటారు. కానీ కొందరు మాత్రమే ఒక్కో అడుగు వేస్తూ శిఖరాన్ని చేరుకుంటారు. తమ శక్తిసామర్థ్యాలపై విశ్వాసం లేనివారు, అవాంతరాలకు భయపడేవారు ఎన్నటికీ విజేతలు కాలేరు.

– చార్ల్ స్వానెపోయెల్,
డిజిటల్ మార్కెటింగ్ కన్సల్టెంట్

థర్మల్ ప్లాంట్లలో బ్యాక్‘డౌన్’!

- పడిపోయిన విద్యుదుత్పత్తి
- గతేడాదికన్నా 12% తగ్గుదల

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో కరెంటు ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి అర్ధభాగంలో ఏకంగా 12% ఉత్పత్తి తగ్గిపోయింది. ప్రతి ప్లాంటు స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యంలో ఉత్పత్తి శాతం (పీఎల్ఎఫ్ - ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) కనీసం 85 ఉండాలని కేంద్ర విద్యుత్‌శాఖ, 80-85% ఉండాలని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఉత్తర్వులున్నాయి. కానీ 'బ్యాక్‌డౌన్' పేరుతో ప్లాంట్లను రోజూ ఏదోఒక సమయంలో నిలిపివేస్తుండటంతో పీఎల్ఎఫ్ 66.29 శాతానికి తగ్గిపోయింది. నాలుగేళ్లలో ఇంత తక్కువగా పీఎల్ఎఫ్ నమోదవడం ఇదే తొలిసారి. తగినంత డిమాండ్ లేదని ఉత్పత్తిని నిలిపివేయడాన్ని 'బ్యాక్‌డౌన్' అంటారు.

బ్యాక్‌డౌన్ ఎందుకు?

ఈ ఏడాది వానాకాలంలో వరదలు రావడంవల్ల జల విద్యుదుత్పత్తి పెరగడం.. పగటిపూట సౌర విద్యుదుత్పత్తి వల్ల థర్మల్‌ప్లాంట్లను ఎక్కువగా బ్యాక్‌డౌన్ చేసినట్లు రాష్ట్ర జెన్‌కో వర్గాలు చెబుతున్నాయి. కానీ ప్లాంట్ల నిర్వహణలో లోపాలు, ఉత్పత్తి వ్యయంకన్నా బయట.. భారత ఇంధన ఎక్స్ఛేంజీ (ఐఈఎక్స్)లో తక్కువ ధరకే కరెంటు లభిస్తున్నందున వీటిని బ్యాక్‌డౌన్ చేస్తున్నట్లు సమాచారం. ఉదాహరణకు ఈ ఏడాది ఆగస్టులో ఏకంగా రూ.వెయ్యి కోట్లు వెచ్చించి ఐఈఎక్స్‌లో కరెంటును తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు కొన్నాయి. గత ఏప్రిల్ నుంచి ఇంతవరకూ ఇలా ఐఈఎక్స్‌లో రోజువారీ కొనుగోళ్లకు రూ.3 వేల కోట్ల వరకూ వెచ్చించాయి. సింగరేణి బొగ్గు అందుబాటులోఉన్నా థర్మల్‌ప్లాంట్లలో ఉత్పత్తి పెంచకుండా ఐఈఎక్స్‌లో అధికంగా కొనడానికి అక్కడ తక్కువ రేట్లకు కరెంటు లభిస్తుండటమే కారణమని అధికారులు వివరిస్తున్నారు. అయితే భద్రాద్రి థర్మల్ ప్లాంటులో 270 మెగావాట్ల యూనిట్‌లో 'జనరేషన్ ట్రాన్స్‌ఫార్మర్ (జీటీ)' కాలిపోతే వెంటనే అమర్చలేకపోవడం వల్ల 2 నెలలుగా రోజుకు 3 కోట్ల యూనిట్ల ఉత్పత్తి నిలిచిపోయింది. దీని వల్లే 'భద్రాద్రి' పీఎల్ఎఫ్ 60 శాతానికే పరిమితమైనట్లు సమాచారం. అలాగే భూపాలపల్లిలో 500 మెగావాట్ల ఒకటో ప్లాంటులో మరమ్మతుల జాప్యం వల్ల 59.93 శాతమే పీఎల్ఎఫ్ ఉంది. కొత్తగూడెం ఐదోదశ ప్లాంటులో అతి తక్కువగా 57 శాతానికే పరిమితమైంది.



ఆర్థికంగా నష్టం..

థర్మల్ ప్లాంట్లలో ఉత్పత్తి 80% కన్నా తగ్గితే ఆర్థికంగా నష్టం వాటిల్లుతుంది. ఉదాహరణకు ఈ ఏడాది భూపాలపల్లి ఒకటో ప్లాంటుకు కనీసం రూ.416.40 కోట్ల 'స్థిరఛార్జీ'ని డిస్కంలు చెల్లించాల్సి ఉంది. దీని పీఎల్ఎఫ్ 59.93 శాతమే ఉంది. అలాగే భద్రాద్రి ప్లాంటుకు రూ.1,723 కోట్లు చెల్లించాలి. ఈ సొమ్ము కాకుండా రోజువారీ కరెంటు ఉత్పత్తికయ్యే 'చలనఛార్జీ'ని అదనంగా చెల్లించాలి. కొత్తగూడెం 5వ దశ ప్లాంటులో ఒక యూనిట్ కరెంటు ఉత్పత్తికి చలనఛార్జీ రూ.4.19 చొప్పున డిస్కంలు ఈ ఏడాది చెల్లించాల్సి ఉంటుందని జెన్‌కో ఈఆర్‌సీకి వివరించింది. ఇదికాకుండా ఈ ఏడాది మరో రూ.426 కోట్లు స్థిరఛార్జీని చెల్లించాలి. ఇవన్నీ కలిపితే ఒక యూనిట్ ఉత్పత్తి వ్యయం రూ.5.50 దాకా అవుతోంది. ఇంతకన్నా తక్కువ ధరకే ఐఈఎక్స్‌లో లభిస్తున్నందున ఈ ప్లాంటును ఎక్కువగా బ్యాక్‌డౌన్ చేయడంతో 57 శాతానికే ఉత్పత్తి పరిమితమైంది. సాంకేతిక సమస్యలను వేగంగా పరిష్కరించడంలో జాప్యం జరుగుతున్నందున కూడా పీఎల్ఎఫ్ తగ్గుతున్నట్లు సీనియర్ ఇంజినీర్ ఒకరు చెప్పారు. జెన్‌కోకు 9 నెలలుగా రెగ్యులర్ సీఎండీ లేకపోవడం, డైరెక్టర్లను తొలగిస్తున్నట్లు ఉత్తర్వులిచ్చి పాతవారిని తాత్కాలికంగా కొనసాగమనడంతో ప్లాంట్లపై పర్యవేక్షణ అంతంతమాత్రంగా ఉందని ఆయన వివరించారు.

థర్మల్ కేంద్రాల్లో నాలుగేళ్లలో ఉత్పత్తి శాతం

2021-22	73.87
2022-23	71.84
2023-24	79.64
2024-25 (తొలి అర్ధభాగం)	66.29

అమరావతిలోనే తొలి అడుగు

- దేశాన్ని డ్రోన్ హబ్‌గా మార్చడమే లక్ష్యం: ఏపీ సీఎం చంద్రబాబు
- నేటి నుంచి రెండు రోజులపాటు మంగళగిరిలో జాతీయ డ్రోన్ సదస్సు

ఈనాడు, అమరావతి: దేశాన్ని డ్రోన్ హబ్‌గా మార్చేందుకు తొలి అడుగు అమరావతి నుంచే పడనుంది. ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లు.. భవిష్యత్ అవకాశాలు.. రోడ్ మ్యాప్ గురించి నిపుణులు మేధోమథనం చేయనున్నారు. రెండు రోజులపాటు జాతీయ స్థాయిలో నిర్వహించనున్న 'అమరావతి డ్రోన్ సమ్మిట్-2024' ఇందుకు వేదిక కానుంది. ఏపీలోని మంగళగిరిలో సీకే కన్వెన్షన్‌లో మంగళవారం ప్రారంభంకానున్న సదస్సులో తొమ్మిది ప్యానల్ డిస్కషన్లు, 50 స్టాళ్లలో డ్రోన్ల ప్రదర్శన, రాష్ట్ర ముసాయిదా డ్రోన్ పాలసీ పత్రం ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. డ్రోన్ల రంగంలో రాష్ట్రానికి దేశంలోనే మొదటి స్థానానికి చేర్చేందుకు ఈ సదస్సు తొలి అడుగుగా మారుతుందని భావిస్తున్న ప్రభుత్వం.. దీన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటి వరకు దిల్లీ మినహా దేశంలో మరెక్కడా జాతీయ డ్రోన్ల సదస్సు జరగలేదని అధికారులు పేర్కొంటున్నారు. రెండు రోజుల సదస్సును తొమ్మిది సెషన్లలో నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభోపన్యాసం చేస్తారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, మరో ముగ్గురు కీలక ప్రసంగాలు చేయనున్నారు. కృష్ణా తీరంలో మంగళవారం సాయంత్రం 5,500 డ్రోన్లతో ప్రదర్శన అద్భుతాన్ని ఆవిష్కరించనుంది. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇది దేశంలోనే అతి పెద్ద డ్రోన్ల ప్రదర్శన కానుంది.



విజయవాడలో డ్రోన్ షో కోసం బుల్లి విహంగాలతో ట్రయల్ రన్

డ్రోన్ రంగం అభివృద్ధికి దిశానిర్దేశం చేసేలా సదస్సు: చంద్రబాబు

ఏపీలో డ్రోన్ రంగ అభివృద్ధికి దిశా నిర్దేశం చేసేలా అమరావతి డ్రోన్ సదస్సు నిర్వహించాలని ఏపీ సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సదస్సు ఏర్పాట్లపై సచివాలయంలో సోమవారం ఆయన సమీక్షించారు. 'డ్రోన్ సమ్మిట్‌లో యువత, విద్యార్థులు ఎక్కువ మందిని భాగస్వామ్యం చేయాలి. ప్రదర్శన స్టాళ్లను విద్యార్థులు ఎక్కువ మంది తిలకించేలా ఏర్పాట్లు ఉండాలి' అని అధికారులకు బాబు సూచించారు.

పారామెడికల్ కోర్సుల పేరిట మెడికల్ ఇన్‌స్టిట్యూట్ మోసం

డబ్బు వసూలు చేసి బోర్డు తిప్పేసిన వైనం

పంజాగుట్ట, న్యూస్‌టుడే: పారామెడికల్ కోర్సుల పేరిట అడ్మిషన్లు ఇచ్చి కోట్లలో డబ్బు దండుకున్న ఓ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌పై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట, ఎల్లారెడ్డిగూడ సమీపంలోని అమృత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ మెడికల్ సైన్సెస్‌లో వివిధ పారామెడికల్ కోర్సులు అభ్యసించేందుకు విద్యార్థులు ప్రవేశం పొందారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని వెంకటేశ్వర యూనివర్సిటీ అనుబంధ కళాశాలగా చెప్పుకొన్న నిర్వాహకులు సుమారు 500 మంది విద్యార్థుల నుంచి రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర చొప్పున ఫీజులు వసూలు చేశారు. కోర్సులు పూర్తయిన తరువాత నకిలీ ధ్రువపత్రాలు జారీ చేశారు. దీంతో అనుమానం వచ్చిన విద్యార్థులు ఆరా తీయగా అమృత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ మెడికల్ సైన్స్ సంస్థ నకిలీదని తేలింది. తాము తీవ్రంగా నష్టపోయామంటూ విద్యార్థులు సోమవారం కళాశాల ముందుకు ధర్నాకు దిగారు. కళాశాల యాజమాన్యం స్పందించకపోవడంతో పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కళాశాల ఎండీ ఆకాశ్, మాజీ ప్రిన్సిపల్ ప్రసాద్‌లపై మోసం కేసును నమోదు చేశారు.

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కు కోర్టు సమన్లు

ఈనాడు, హైదరాబాద్: తిరుమల శ్రీవారి లడ్డూ అంశంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన ఆరోపణలపై తాను పిటిషన్ వేయగా సిటీ సివిల్ కోర్టు పవన్‌కు సమన్లు జారీ చేసినట్లు న్యాయవాది ఇమ్మనేని రామారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుమల లడ్డూ విషయంలో పవన్ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేశారని పిటిషనర్ పేర్కొన్నారు.

కొట్టుకుపోయిన కష్టం



సిద్దిపేట జిల్లాలో పలుచోట్ల సోమవారం సాయంత్రం కురిసిన వాన రైతులను నిలువునా ముంచేసింది. మధ్యాహ్నం వరకు ఎండ అధికంగా ఉండటంతో జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పలువురు రైతులు ధాన్యం ఆరబోసుకున్నారు. హఠాత్తుగా మొదలైన భారీ వర్షం గంటపాటు కొనసాగడం, కాపాడుకునే సమయం కూడా లేకపోవడంతో ఆరబోసిన ధాన్యం, మక్కలు కొట్టుకుపోయాయని అన్నదాతలు కన్నీటి పర్యంతమయ్యారు.

– న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

ఖనిజ తవ్వకాల ప్రాంతాల్లో స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

- ఉత్పత్తి సంస్థలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచన



ఈనాడు, దిల్లీ: ఖనిజ తవ్వకాలు జరిపే ప్రాంతాల్లో గనుల నిర్వాహకులు స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. పర్మినెంట్ ఉద్యోగాలిస్తారా? కాంట్రాక్ట్‌వి ఇస్తారా? అన్నది మైన్ డెవలప్‌మెంట్ ఆపరేటర్స్(ఎండీఓ) ఇష్టమని, కానీ మానవత్వంతో స్థానికులకు ఉపాధి తప్పకుండా కల్పించాలని పేర్కొన్నారు. సోమవారం ఇక్కడి స్కోప్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా ఖనిజ తవ్వకాలు జరుపుతున్న ఎండీఓలకు 'స్టార్‌రేటింగ్స్' అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. "డిమాండ్‌కు తగ్గట్టు బొగ్గు ఉత్పత్తిని పెంచే దిశగా మరింత కృషి చేయాలి. క్షేత్రస్థాయిలో పనిచేసే కార్మికులు, గనులకోసం భూములు వదిలిపెట్టిన ప్రజల సంక్షేమం గురించి ఆలోచించాలి. బొగ్గు తవ్వకాలు జరిపే ప్రాంతాల్లో కాలుష్యం విస్తరించకుండా అడవుల విస్తరణపై దృష్టిపెట్టాలి. వచ్చే ఏడాది కోల్ ఇండియా స్వర్ణోత్సవాలు జరుపుకోబోతోంది. అందువల్ల ఈ 50 ఏళ్లలో ఈ సంస్థ ఉన్నతికి పనిచేసిన వారందర్నీ గుర్తుచేసుకొని ఏదైనా ఉత్సవాలు జరుపుకోవాలి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం సులభ వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకొంటోంది. అవసరమైన చోట నిబంధనలు మార్చాల్సివస్తే దానికోసం సిద్ధంగా ఉంది. అందువల్ల ప్రధాని ఆలోచనలకు అనుగుణంగా దేశీయంగా బొగ్గు ఉత్పత్తి పెంపునకు దృష్టిసారించి వీలైనంతగా దిగుమతులను తగ్గించడానికి మైన్ డెవలప్‌మెంట్ ఆపరేటర్స్ సహకారం అందించాలి. కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలు జరిగితే మేం పారదర్శకంగా గనులు వేలం వేస్తున్నాం" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో బొగ్గు, గనులశాఖ సహాయమంత్రి సతీష్ చంద్ర దూబే, కోల్ ఇండియా ఛైర్మన్ పీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్రోహులపై కఠిన వైఖరే

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల కుమ్మరిగూడ ముత్యాలమ్మ గుడిలో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ ప్రజల్లో విభేదాలను సృష్టించేందుకు యత్నించే సంఘ విద్రోహ శక్తులను నియంత్రించటంలో పోలీసులకు ప్రభుత్వ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ కేవలం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు మాత్రమేనని, నేరగాళ్ల విషయంలో కఠిన వైఖరి అవలంబించాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబాలకు పరిహారం పెంచుతున్నట్టు ప్రకటించారు. ఇటీవల మరణించిన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ రాజీవ్ రతన్ కుమారుడికి గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్, మరో అధికారి కుమారుడిని డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించినట్టు గుర్తుచేశారు. దేశానికే తెలంగాణ పోలీసులు ఆదర్శమన్నారు. టీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరును కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రశంసించారన్నారు. సైబర్ నేరాలు పెరగడంపై ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలో పదేళ్లుగా మత్తుపదార్థాల సరఫరా, వినియోగం పెరిగిందన్నారు. యువతను బానిసలుగా మారుస్తున్న డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకు డీజీ స్థాయి అధికారిని నియమించనున్నట్టు తెలిపారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, నిబంధనలను ఉల్లంఘించేవారిని కట్టడి చేసేందుకు కృత్రిమ మేధ(ఏఐ)ను వినియోగించుకోవాలని డీజీపీ, నగర సీపీలను ముఖ్యమంత్రి ఆదేశించారు. హోంగార్డు నుంచి డీజీపీ పిల్లల వరకూ ఒకేచోట చదువుకొనేలా అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్' ప్రారంభిస్తున్నట్టు చెప్పారు.

అమరుల కుటుంబాలను ఆదుకునేలా..

శాంతిభద్రతల పరిరక్షణలో భాగమై విధినిర్వహణలో మరణించిన, శాశ్వత అంగవైకల్యం సంభవించిన సందర్భాల్లో బాధిత కుటుంబాలకు పరిహారం భారీగా పెంచుతున్నట్టు సీఎం ప్రకటించారు. అమరులైన కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.కోటి, ఎస్సై, సీఐలైతే రూ.1.25 కోట్లు, డీఎస్పీ, ఏఎస్పీలైతే రూ.1.50 కోట్లు, ఎస్పీ, ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ.2 కోట్లు, శాశ్వత అంగవైకల్యం పొందిన సందర్భాల్లో కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.50 లక్షలు, ఎస్సై, సీఐ, డీఎస్పీలకు రూ.60 లక్షలు, ఐపీఎస్‌లు, ఎస్పీల కుటుంబాలకు రూ.కోటి చొప్పున అందజేస్తామన్నారు. డీజీపీ డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించినవారి త్యాగాలను స్మరించుకోవటం మన బాధ్యతని అన్నారు. ఈ ఏడాది విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా 214 మంది పోలీసులు అమరులయ్యారని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన ఒక పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోయినట్టు తెలిపారు. ఇప్పటివరకు సైబర్ నేరగాళ్ల కాజేసిన సొమ్ములో రూ.150 కోట్లు రీఫండ్ చేశామన్నారు. కార్యక్రమంలో నగర సీపీ సీవీ ఆనంద్, టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, అదనపు డీజీ మహేశ్ భగవత్, మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ, ఐపీఎస్ అధికారులు, విశ్రాంత ఐపీఎస్‌లు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో నగర సీపీ సీవీ ఆనంద్, డీజీపీ జితేందర్

★ టీజీఎస్‌పీ 15వ బెటాలియన్ (గ్రేహౌండ్స్) విభాగంలో జూనియర్ కమాండో అయిన ప్రవీణ్ గత ఫిబ్రవరిలో జయశంకర్ జిల్లాలో కూంబింగ్ చేస్తూ విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా కార్యక్రమానికి ప్రవీణ్ సతీమణి రాథోడ్ లత, కుమారులు హర్ష, వివాన్ రాగా.. వారితో సీఎం రేవంత్‌రెడ్డి కొద్దిసేపు మాట్లాడారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

పోలీస్ పాఠశాలకు సీఎం భూమిపూజ

ఈనాడు-హైదరాబాద్, నార్సింగి-న్యూస్‌టుడే: పోలీసులు, ఇతర యూనిఫాం సర్వీసు ఉద్యోగుల పిల్లల కోసం ఏర్పాటు చేయనున్న 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్' భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. హైదరాబాద్ శివారు గండిపేట మండలం మంచిరేవులలోని గ్రేహౌండ్స్ క్యాంపస్‌లో 50 ఎకరాల్లో ఈ పాఠశాల నిర్మించనున్నారు. సోమవారం సాయంత్రం క్యాంప్‌లో రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో స్థానికులకు ప్రభుత్వం 15 శాతం సీట్లు కేటాయిస్తుందని శ్రీధర్‌బాబు ప్రకటించారు. అంతకుముందు భాజపా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ స్కూల్‌లో స్థానికులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరగా మంత్రి స్పందించారు. హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, (గ్రేహౌండ్స్) అదనపు డీజీ స్టీఫెన్ రవీంద్ర, శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్ పాల్గొన్నారు. 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్' నిర్మాణానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. డీజీపీ జితేందర్ పంపిన ప్రతిపాదనల్ని ఆమోదిస్తున్నట్లు తెలిపింది.



మీది కళ్ల మీనాలు..!

చూసిన వారెవరైనా 'కళ్ల'ప్పగించి చూసేలా వింతగా ఉన్న ఈ చేపలు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల కృష్ణాతీరంలోని పుష్కరఘాట్ల వద్ద కనిపించాయి. సాధారణంగా చేపలకు తలకు ఇరుపక్కల మొప్పల పక్కన కళ్లుంటే.. వీటికి మాత్రం తలపై కనుగుడ్లు బయటకు పొడుచుకొచ్చినట్లు ఉన్నాయి. ఈ చేపల శాస్త్రీయ నామం 'రైనోముగిల్ కోర్సుల'. స్థానికంగా మీది కళ్ల, రాకెట్ చేప అని పిలుస్తారు. ఈ మీనాలు రుచికరంగానూ ఉండటంతో మార్కెట్లో మంచి ధర పలుకుతాయి. నీటి ఉపరితలంపై ప్రవాహానికి ఎదురీదుతూ వేగంగా దూసుకెళ్లే ఈ చేపలు వలలకు అంత సులువుగా చిక్కవని వనపర్తి జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకుడు డా.బి.లక్ష్మప్ప తెలిపారు.

– ఈనాడు, మహబూబ్‌నగర్



శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమలలో శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తిని దర్శనం చేయించారు.

– న్యూస్‌టుడే, తిరుమల

ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచండి

- మంత్రి దామోదర్ రాజనర్సింహ



ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మరింత నమ్మకం పెంచాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. వాటి బ్రాండ్ ఇమేజ్ పెంచాలన్నారు. వైద్య కళాశాలల అనుబంధ బోధనాసుపత్రుల పనితీరుపై మంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, డీఎంఈ ఎన్.వాణి, వివిధ బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. బోధనాసుపత్రుల్లో సమస్యలుంటే వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వైద్య పరికరాలు దెబ్బతింటే వెంటనే బాగు చేయించాలని, మరమ్మతుల సాకుతో రోగులను బయటకు పంపవద్దని స్పష్టంచేశారు. రోగుల సంఖ్యకు తగినట్లు పరికరాలు ఉండాలని, అవసరమైన ఆసుపత్రులకు కొత్తవి మంజూరు చేయాలని కార్యదర్శికి సూచించారు. కొన్ని మాతా, శిశు ఆరోగ్య కేంద్రాల్లో(ఎంసీహెచ్) స్కానింగ్ కోసం ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తోందని.. అవసరమైతే స్కానింగ్ యంత్రాల సంఖ్య పెంచాలన్నారు. ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, భద్రత విషయంలో కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. నిజామాబాద్ ఆసుపత్రి నుంచి బాలుడి కిడ్నాప్ ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రుల్లో రాత్రిపూట భద్రతను మరింత పటిష్ఠం చేయాలన్నారు. నిర్మల్ ప్రభుత్వ దవాఖానాలో అగ్ని ప్రమాదంపై మంత్రి ఆరా తీశారు.

ఆధార్, పాన్‌కార్డుల్లోని ఫొటోలు మార్ఫ్ చేసి రూ.20 లక్షల రుణం తీసుకున్నారు

- జగిత్యాల కలెక్టర్‌కు ఓ రైతు ఫిర్యాదు

జగిత్యాల, న్యూస్‌టుడే: ఆధార్, పాన్‌కార్డుల్లోని తన ఫొటోలను మార్ఫింగ్ చేసి కొంతమంది బ్యాంకులో రూ.20 లక్షల రుణం తీసుకున్నారని ఓ బాధితుడు సోమవారం జగిత్యాల జిల్లా ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బుగ్గారం మండలం మద్దునూరు గ్రామానికి చెందిన రైతు ముంజాల నారాయణ జగిత్యాలలోని ఓ బ్యాంకులో పంట రుణం కోసం వెళ్లారు. బ్యాంకు అధికారులు మీ పేరు మీద హైదరాబాద్‌లో ఏడు ప్రైవేటు బ్యాంకుల్లో సుమారు రూ.20 లక్షల రుణం ఉన్నట్లు చెప్పడంతో అవాక్కయ్యారు. ఆయా బ్యాంకులకు వెళ్లి ఆరా తీయగా.. తన ఆధార్, పాన్‌కార్డుల్లోని ఫొటోలను మార్చి రుణం తీసుకున్నట్లు తేలింది. ఈ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బాధితుడు కలెక్టర్ సత్యప్రసాద్‌ను కోరారు.

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కుటుంబీకులకు నోటీసులు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కుటుంబసభ్యులు, బంధువులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సోమవారం నోటీసులు జారీచేసింది. ఆర్మూర్‌లోని జీవన్‌రెడ్డి మాల్‌కు చెందిన విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్ ప్రైవేటు సంస్థ రూ.45.46 కోట్లు చెల్లించాల్సి ఉందని.. యజమాని అయిన జీవన్‌రెడ్డి భార్య రజితారెడ్డికి గతంలోనూ నోటీసులు ఇచ్చామని పేర్కొంది. పూచీకత్తుగా ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించిన భూముల వద్ద అధికారులు నోటీసులు అతికించారు. ఆర్టీసీ అద్దె బకాయిలు చెల్లించలేదని, ఏపీఎస్ఎఫ్‌సీ రుణం చెల్లింపులు జరగడం లేదని అధికారులు జీవన్‌మాల్‌ను గతంలో స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.



అప్పటివరకూ మీరు ఓడిపోరు

ప్రయత్నించడం ఆపనంతవరకూ మీరు ఓడిపోవడమంటూ ఉండదు. మీ ప్రయాణం నెమ్మదిగానే సాగుతున్నా మీరు ఎంతో కొంత పురోగతి సాధిస్తున్నారని, మీ పరిస్థితి ఆశాజనకంగానే ఉందని గుర్తుంచుకోండి. రోజులు గడిచేకొద్దీ మీరు తప్పకుండా మరింత మెరుగవుతారు. కానీ ఒక్కటి మాత్రం తప్పకుండా పాటించండి. ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా మీరు బరిలోనే ఉండండి.

– స్టీఫెన్ హిచ్‌కాక్, మైండ్‌సెట్ కోచ్

విద్యుత్ ఛార్జీల పెంపును తిరస్కరించాలి

- ఈఆర్‌సీకి భారాస వినతి

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ ఛార్జీలు పెంచేందుకు అనుమతి ఇవ్వాలంటూ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు దాఖలు చేసిన ప్రతిపాదనలను తిరస్కరించాలని భారాస డిమాండ్ చేసింది. సోమవారం రాష్ట్ర జెన్‌కో బహుళ వార్షిక టారిఫ్ ప్రతిపాదనలపై తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) హైదరాబాద్‌లోని కార్యాలయంలో బహిరంగ విచారణ నిర్వహించింది. దీనికి పలు వర్గాల వారు హాజరై అభ్యంతరాలు, సూచనలు ఇచ్చారు. విచారణ ముగిసిన తరవాత మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, భారాస ఎమ్మెల్యేలు, ఇతర నేతలతో కలిసి పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండలి కార్యాలయానికి వచ్చి ఈఆర్‌సీ ఛైర్మన్ శ్రీరంగారావుకు వినతిపత్రం అందజేశారు. అనేక వర్గాలకు ఉచిత విద్యుత్ అందిస్తామంటూ చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలపై రూ.18,500 కోట్ల మేర వివిధ పేర్లతో ఛార్జీల భారాన్ని మోపేందుకు సిద్ధమైందని కేటీఆర్ ఆరోపించారు. ఈఆర్‌సీకి విద్యుత్ సంస్థలు సమర్పించిన 9 ప్రతిపాదనలను పక్కన పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇళ్లకు వినియోగించే కరెంటు నెలకు 300 యూనిట్లు దాటితే కిలోవాట్‌కు స్థిరఛార్జీని రూ.10 నుంచి రూ.50కి పెంచాలని డిస్కంలు కోరాయన్నారు. దీంతోపాటు పరిశ్రమల కరెంటు ఛార్జీలను ఒకే కేటగిరీ కిందకు తేవాలంటూ చేసిన ప్రతిపాదనలు ఏమాత్రం ఆమోదయోగ్యం కావని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు రాష్ట్ర ప్రగతికి గొడ్డలి పెట్టుగా మారుతుందని, ఇప్పటికే ప్రభుత్వ అసంబద్ధ విధానాలతో పారిశ్రామిక ప్రగతి మందగించి అనేక రంగాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని పేర్కొన్నారు.



ఈఆర్‌సీ ఛైర్మన్ శ్రీరంగారావుకు వినతిపత్రం అందజేస్తున్న కేటీఆర్, జగదీశ్‌రెడ్డి. చిత్రంలో బాల్క సుమన్, కౌశిక్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, కోవా లక్ష్మి, మాగంటి గోపీనాథ్, డా.సంజయ్ తదితరులు

ఎలా అనుమతిస్తారు..!?

2022-23 సంవత్సరానికి ఖర్చులు బాగా పెరిగాయని ట్రూఅప్ పేరుతో రూ.830 కోట్ల అదనపు వసూలు కోసం జెన్‌కో ఇచ్చిన ప్రతిపాదనలను ఎలా అనుమతిస్తారని ఈఆర్‌సీని విద్యుత్ రంగ నిపుణులు వేణుగోపాలరావు, తెలంగాణ పరిశ్రమల ప్రతినిధులు ప్రశ్నించారు. 2024-29 కాలానికి జెన్‌కో ప్రతిపాదించిన 'బహుళ వార్షిక టారిఫ్' ప్రతిపాదనలు కూడా ఎక్కువగా ఉన్నాయని పలువురు తెలిపారు. డిస్కంల ప్రతిపాదనలపై ఈ నెల 23న హైదరాబాద్‌లో, 24న నిజామాబాద్‌లో ఈఆర్‌సీ విచారణ జరపనుంది.

దేశంలో త్రిశూల పాలనను తిప్పికొడతాం: బృందా కారాట్




కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) త్రిశూలమని సీపీఎం జాతీయ నాయకురాలు బృందా కారాట్ ఆరోపించారు. త్రిశూలంలోని ఒక శూలం పెట్టుబడిదారులకు, రెండోది మతోన్మాదం, మూడోది మనువాదానికి కాపు కాస్తోందని ధ్వజమెత్తారు. మూడ్రోజుల పాటు జరగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర మహాసభలు కొత్తగూడెంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో కారాట్ ప్రసంగిస్తూ.. దేశంలో త్రిశూల పాలనను తిప్పికొడతామని, పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

హైదరాబాద్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో మరణించిన వీఆర్ఏ, వీఆర్వోల వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని బాధితులు సోమవారం గాంధీభవన్ ఎదుట నిరసన తెలిపారు. గత ప్రభుత్వం జీవో నంబర్లు 81, 85 ప్రకారం కొందరు వీఆర్ఏ, వీఆర్వో వారసులకు ఉద్యోగాలు ఇచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వం మిగిలిన వారికి ఉద్యోగాలను కేటాయించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమ కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగాలపై రేవంత్‌వి పచ్చి అబద్ధాలు

- హరీశ్‌రావు మండిపాటు



ఈనాడు, హైదరాబాద్: గత పదేళ్లలో భారాస ప్రభుత్వం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి తప్పుడు ప్రకటన చేయడం హాస్యాస్పదమని, ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని భారాస సీనియర్ నేత హరీశ్‌రావు ఓ ప్రకటనలో విమర్శించారు. "భారాస ప్రభుత్వం 1.61 లక్షల పోస్టులు భర్తీ చేసిన మాట వాస్తవం కాదా? పోలీసు శాఖలోనే 30,731 ఉద్యోగాలు భర్తీచేశాం. మరో 16,337 పోస్టులకు రాత పరీక్ష కూడా నిర్వహించాం. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేశాం. ఎన్నికల కోడ్.. నియామక పత్రాలు ఇచ్చేందుకు అడ్డంకిగా మారింది. వెంటనే అధికారంలోకి వచ్చిన మీరు... మేమే భర్తీ చేసినట్లు గోబెల్స్ ప్రచారం మొదలుపెట్టారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో పోలీసులకు ఈ వాస్తవం తెలియదనుకుంటున్నారా? 90 రోజుల్లో మొత్తం 30వేల ఉద్యోగ నియామకాలు చేపట్టామని అవాస్తవాలు మాట్లాడుతున్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపిన మీ మోసపూరిత వైఖరిని యువత మర్చిపోదు. గ్రూప్ 1 విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఆకాంక్షలను కాలరాస్తూ... కర్కశంగా వ్యవహరిస్తున్న మిమ్మల్ని సమాజం క్షమించదు" అని హరీశ్‌రావు మండిపడ్డారు.

మూసీపై సీఎం పూటకో మాట

మూసీ నది పునరుజ్జీవంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. 'ఎక్స్' వేదికగా ఈ అంశంపై సోమవారం ఆయన స్పందించారు. "మూసీ పరీవాహక అభివృద్ధి కోసం ఐదేళ్లలో రూ.1.50 లక్షల కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జులై 20న ప్రకటించారు. సెప్టెంబర్ 6న సీఎం చేతుల మీదుగా విడుదల చేసిన 'తెలంగాణ గ్రోత్ స్టోరీ ద రోడ్ టు వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ' విజన్ డాక్యుమెంట్‌లోనూ.. ఇదే ఖర్చును ప్రస్తావించారు. మొన్న విలేకరుల సమావేశంలో మాత్రం రూ.1.50 లక్షల కోట్లు ఎవరన్నారంటూ ఆవేశంతో ఊగిపోయారు. పూటకో తీరుగా మాట్లాడుతున్న మిమ్మల్ని చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది. డీపీఆర్ లేకుండా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చవుతాయని చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లుతుంది. మీ కుట్రలను బట్టబయలు చేస్తాం. తెలంగాణ ప్రజల తరఫున నిలదీస్తాం" అని సీఎంను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

రేవంత్ పాలనలో ఆర్థికంగా కుదేలు: వినోద్‌కుమార్

అధికారం చేపట్టి పదినెలలైనా రేవంత్ సర్కారు రాష్ట్ర ఆర్థిక రంగం బలోపేతానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అందుకే ఆయన పాలనలో రాష్ట్రం ఆర్థికంగా కుదేలైందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సోమవారం విమర్శించారు. "రాష్ట్రంలో ఆర్థిక అంశాలపై ఆర్థిక శాఖపై సమీక్షలో ఒకరకంగా.. ఇటీవల ఐఎస్‌బీ కార్యక్రమంలో మరోరకంగా సీఎం మాట్లాడారు. మద్యం మినహా అన్నింటిలో ఆదాయం తగ్గింది. హైడ్రా కూల్చివేతల ప్రభావం రియల్ ఎస్టేట్ రంగంపై పడింది. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదు. తెలంగాణ జీఎస్‌డీపీని వన్ ట్రిలియన్ ఎకానమీగా మారుస్తా అని అంటున్నారు. కానీ పాలన తీరు అలా లేదు. రిజర్వేషన్లపై రాజ్యాంగ స్ఫూర్తి కొరవడింది. పాత సంప్రదాయాలకు రాష్ట్ర ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది" అని వినోద్‌కుమార్ విమర్శలు చేశారు.

12 మంది హెచ్‌ఎంల సస్పెన్షన్

- బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం
- ఏడాది తర్వాత చర్యలపై ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో గత సంవత్సరం సెప్టెంబరులో ఉపాధ్యాయ బదిలీల సందర్భంగా స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేశారన్న అభియోగంపై పాఠశాల విద్యాశాఖ 12 మంది ప్రధానోపాధ్యాయులను సస్పెండ్ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 10 మంది హెచ్‌ఎంలు, వనపర్తి, జనగామ జిల్లాల్లో ఒక్కో హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ ఆర్జేడీ విజయలక్ష్మి తాజాగా ఆదేశాలు జారీచేశారు. ఏడాది తర్వాత సస్పెండ్ చేయడంపై కొన్ని ఉపాధ్యాయ సంఘాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. బదిలీ సందర్భంగా భర్త లేదా భార్య తన స్పౌజ్ పనిచేసే పాఠశాలలకు దగ్గరగా ఆప్షన్ ఇచ్చుకోవాలన్నది నిబంధన. ఈ విషయంలో కొందరు స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేశారని విద్యాశాఖ నిర్ణయానికి వచ్చి సస్పెండ్ చేసింది. మహబూబ్‌నగర్‌లో ఒకరు తన స్పౌజ్ పనిచేసే పాఠశాలకు మొదటి ఆప్షన్ ఇచ్చుకోకుండా నాలుగో ఆప్షన్ ఇచ్చుకున్నారు. అయినా తన స్పౌజ్ పనిచేసే బడికే బదిలీ అయ్యారు. అయినా తొలి ఆప్షన్ ఇచ్చుకోకుండా నాలుగో ఐచ్ఛికం ఎందుకు ఇచ్చుకున్నారని సస్పెండ్ చేయడం గమనార్హం. సస్పెన్షన్లపై పునః సమీక్షించి వాటిని ఎత్తివేయాలని గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజభానుచంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్.రాజగంగారెడ్డి కోరారు. సమగ్ర విచారణ చేపట్టి తప్పు చేయనివారిపై సస్పెన్షన్ తొలగించాలని బీసీ ఉపాధ్యాయ సంఘం(బీసీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు ప్రభుత్వాన్ని కోరారు.

చేతబడి అనుమానంతో వ్యక్తి దారుణ హత్య

జూలూరుపాడు, న్యూస్‌టుడే: తల్లి అనారోగ్యానికి చేతబడి కారణమని భావించిన ఓ యువకుడు తనకు వరసకు మామ అయ్యే వ్యక్తితో కలిసి బాబాయిని హత్య చేశాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం రాచబండ్ల కోయగూడెంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... రాచబండ్లకోయగూడేనికి చెందిన కుంజా భిక్షం(42) సోదరుడి కుమారుడు కుంజా ప్రవీణ్, అతనికి వరసకు మామ అయ్యే మలకం గంగయ్య అలియాస్ గంగులు ఆదివారం అదే గ్రామంలో ఓ కర్మకాండల కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రవీణ్ తల్లి కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. దీనికి కారణం తన బాబాయి భిక్షం అని భావించిన ప్రవీణ్ అతడిని హతమార్చేందుకు పథకం పన్నాడు. అదే రోజు సాయంత్రం భిక్షం, ప్రవీణ్, గంగయ్య ముగ్గురు కలిసి గ్రామం సమీపంలోని వేపలవాగు వద్దకు మద్యం తాగేందుకు వెళ్లారు. తాగిన మైకంలో ప్రవీణ్, గంగయ్య కలిసి రాయితో భిక్షం ముఖంపై మోదడంతో చనిపోయాడు. విషయాన్ని హతుడి మరో సోదరుడి కుమారుడు నరేంద్రకు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు చేతబడి అనుమానమా? లేదంటే ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కోతులు తరమడంతో కిందపడి మహిళ దుర్మరణం

ఖానాపూర్, న్యూస్‌టుడే: కోతులు తరమడంతో తప్పించుకొనే క్రమంలో కిందపడి ఓ మహిళ దుర్మరణం పాలైంది. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక విద్యానగర్‌లో బొంగోని లక్ష్మి(58) తన ఇంటి ముందు రేకుల షెడ్డుకింద ఉండగా కోతులమంద వచ్చింది. ఆమె అదిలించగా అవి బెదిరించాయి. వాటి బారి నుంచి తప్పించుకొనేందుకు ఇంట్లోకి పరుగుతీసే క్రమంలో ఆమె జారిపడి సిమెంట్ గచ్చుపై పడిపోయారు. తల వెనుక భాగంలో బలమైన దెబ్బ తగలడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయిన ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారు. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు.

EENADU Vol: 51, Iss: 72 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. 95 & 96, Survey No. 150, Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Hyderabad, Medchal District - 500 037, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223, RNI No. 27656/75, Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



సీఈసీ భేటీలో రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే

కాంగ్రెస్ సీఈసీ భేటీ

దిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థులను ఖరారు చేయడానికి కాంగ్రెస్ పార్టీ 'కేంద్ర ఎన్నికల కమిటీ' (సీఈసీ) సోమవారం ఏఐసీసీ కార్యాలయంలో సమావేశమైంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ తదితరులు దీనికి హాజరయ్యారు.

రేపు ప్రియాంకా గాంధీ నామినేషన్

దిల్లీ: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడానికి బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు హాజరుకానున్నట్లు సమాచారం. ఖర్గేను ప్రియాంక సోమవారం కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు కేరళలోని కల్పెట్ట కొత్త బస్టాండ్ నుంచి ప్రారంభమయ్యే రోడ్‌షోలో రాహుల్, ప్రియాంక పాల్గొంటారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులతో పాటు ప్రముఖ నాయకులు దీనిలో పాల్గొంటారు. రాహుల్ ఖాళీ చేసిన స్థానంలో ప్రియాంక విజయం సాధిస్తే ఎంపీగా తొలిసారి పార్లమెంటులో అడుగు పెడతారు.

210 స్థానాలపై కూటమిలో ఏకాభిప్రాయం: రౌత్

ముంబయి: మహారాష్ట్రలో 210 అసెంబ్లీ స్థానాల్లో మహా వికాస్ అఘాడీ కూటమిలో ఏకాభిప్రాయం కుదిరిందని శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ చెప్పారు. ఇది చెప్పుకోదగ్గ పరిణామమైనా భాజపా మాత్రం దుష్ప్రచారం చేస్తోందని సోమవారం విలేకరుల సమావేశంలో ఆరోపించారు. "మహారాష్ట్రను దోచుకుంటున్న శక్తుల్ని ఓడించడమే మా ధ్యేయం. దీనికోసం ఉమ్మడిగా పోరాడతాం. ఎక్కువ స్థానాలపై ఏకాభిప్రాయానికి రాగలిగాం" అని చెప్పారు. కూటమి నుంచి శివసేన (యూబీటీ) వైదొలగి 288 స్థానాల్లోనూ సొంతంగా పోటీచేసే అవకాశాలున్నాయన్న కథనాలపై ఆయన ఈ మేరకు స్పందించారు. భాజపాతో శివసేన (యూబీటీ) తిరిగి చేతులు కలుపుతుందని, దానిపై ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఫోన్‌ద్వారా మంతనాలు జరుపుతున్నారనే ప్రచారం నేపథ్యంలో రౌత్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. భాజపాతో కలిసే అవకాశమే లేదన్నారు.

'బడ్‌గాం'ను వదులుకున్న ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా బడ్‌గాం అసెంబ్లీ స్థానాన్ని వదులుకుని, గాందర్‌బల్ నియోజకవర్గాన్ని అట్టిపెట్టుకున్నారు. ఇటీవల అక్కడ జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆయన ఈ రెండు స్థానాల్లోనూ గెలుపొందారు. ఒమర్ అబ్దుల్లా 2009-14 వరకు మొదటిసారి సీఎంగా వ్యవహరించిన కాలంలోనూ గాందర్‌బల్ ఎమ్మెల్యేగా ఉన్నారు. అప్పటి నుంచి ఆ స్థానం వారి కుటుంబానికి కంచుకోటగా మారిపోయింది. బడ్‌గాం అసెంబ్లీ స్థానం ఖాళీ అవడంతో.. ఆ పార్టీ బలం 41కి తగ్గింది.

పాక్‌లో పాడుబడ్డ ఆలయం.. 64 ఏళ్ల తర్వాత పునరుద్ధరణ

లాహోర్: పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో నిరాదరణకు గురైన ఓ హిందూ ఆలయాన్ని పునఃనిర్మించడానికి ప్రభుత్వం రూ.30 లక్షలు కేటాయించినట్లు ఆ దేశ మీడియా వెల్లడించింది. రావీ నదీ తీరంలోని జాఫర్‌వాల్ అనే పట్టణంలో ఉన్న బావోలీ సాహిబ్ ఆలయం 64 ఏళ్లుగా నిరాదరణకు గురైంది. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న సుమారు 1,400 మంది హిందువులకు దేవాలయం లేకుండా పోయింది. సుదీర్ఘ కాలం విజ్ఞప్తుల అనంతరం ఇటీవలే ఆలయ పునఃనిర్మాణం ప్రారంభమైంది. 'పాక్ ఏర్పడే నాటికి మా ప్రాంతంలో 45 ఆలయాలు ఉండేవి. క్రమంగా అవన్నీ కనుమరుగైపోయాయి. 20 ఏళ్లుగా బవోలీ సాహిబ్ మందిరం నిర్మించాలని అడుగుతున్నాం' అని పాక్ ధర్మస్థాన్ కమిటీ మాజీ అధ్యక్షుడు రతన్‌లాల్ ఆర్య వెల్లడించారు. ప్రస్తుతం కేటాయించిన నిధులతో ఆలయ తొలి దశ పనులు జరుగుతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

దేశంలో మరో 10 అణు రియాక్టర్ల ఏర్పాటు

- పార్లమెంటరీ స్థాయీ సంఘానికి తెలిపిన కేంద్రం

దిల్లీ: దేశంలో మరో పది అణు రియాక్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గుజరాత్‌లోని కాక్రాపార్‌లో రెండు రియాక్టర్లు విద్యుదుత్పత్తిని మొదలుపెట్టినట్లు పేర్కొంది. శాస్త్ర, సాంకేతిక వ్యవహారాలపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘానికి ప్రభుత్వం ఈ మేరకు సోమవారం తెలిపింది. కొత్త రియాక్టర్లు గుజరాత్, రాజస్థాన్, హరియాణా తదితర రాష్ట్రాల్లో ఏర్పాటవుతాయని అధికార వర్గాలు తెలిపాయి. ఒక్కో రియాక్టర్ సామర్థ్యం 700 మెగావాట్లు ఉంటుందని పేర్కొన్నాయి. గుజరాత్‌లో కాక్రాపార్-3, 4 రియాక్టర్లను గ్రిడ్‌తో అనుసంధానం చేసినట్లు అధికారులు తెలిపారని స్థాయీ సంఘం సభ్యుడు, కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ వెల్లడించారు. వాణిజ్యప్రాతిపదికన అవి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. "ఇది చాలా పెద్ద విజయం. ఈ రియాక్టర్లను దేశీయంగానే డిజైన్ చేశారు. 2007లో వీటికి ఆమోదం లభించింది. 2010లో నిర్మాణం మొదలైంది. ఇలాంటి మరిన్ని రియాక్టర్లు భిన్న ప్రాంతాల్లో ఏర్పాటు కానున్నాయి" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. కాక్రాపార్ రియాక్టర్లకు కాంగ్రెస్ హయాంలోనే ఆమోదం లభించిందని, ఆ వాస్తవాన్ని ప్రధాని మోదీ అంగీకరించడంలేదని ఆయన పరోక్ష విమర్శలు చేశారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతమే ప్రధాన ఎజెండా!

- ఎవరు చక్కదిద్దగలరనే దానిపై ఓటర్లలో సందిగ్ధం
- ఎటూ తేల్చుకోలేకున్న అమెరికన్లు
- ట్రంప్, హారిస్‌లపై కుదరని నమ్మకం
- మిగిలిన అంశాల్లో కమలకే మొగ్గు..

వాషింగ్టన్: బలహీనంగా మారిన ఆర్థిక వ్యవస్థను ఎవరు చక్కదిద్దగలరనే అంశంపై అమెరికా ఓటర్లు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ఆర్థిక సమస్యలను పరిష్కరించడంలో అధ్యక్ష అభ్యర్థులు డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్‌లలో ఎవరు సమర్థులనే విషయంపై వారిలో గందరగోళం నెలకొంది. అయితే పన్నులు, మధ్య తరగతి ప్రజల విషయంలో తాజాగా నిర్వహించిన పోల్‌లో హారిస్‌కే కాస్త మొగ్గు కనిపిస్తోంది. అసోసియేటెడ్ ప్రెస్-ఎన్‌వోఆర్‌సీ సెంటర్ ఫర్ పబ్లిక్ ఎఫైర్స్ నిర్వహించిన ఈ సర్వేలో అధిక శాతం మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఆర్థిక వ్యవస్థ తప్పు మార్గంలో వెళ్తోందని ప్రతి 10 మందిలో ఏడుగురు స్పష్టం చేశారు.

- ■ అబార్షన్ హక్కు, వలస విధానం, నేరాలు, విదేశీ వ్యవహారాల కంటే ఆర్థిక వ్యవస్థే అమెరికా ఎన్నికల్లో ప్రధానాంశంగా ఉన్నా.. ఈ విషయంలో ట్రంప్‌పై గతంలో ఉన్న సానుకూలత ఇప్పుడు లేదు.
- ■ ట్రంప్‌ను నమ్మలేమని, ఆయన ఎలాన్ మస్క్ లాంటి వారికే పన్నులను తగ్గిస్తారని, మధ్య తరగతికి ప్రయోజనం కల్పిస్తారని అనుకోవడం లేదని ఓటర్లు అంటున్నారు.
- ■ ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగాల విషయంలో అటు ట్రంప్ పైగానీ, ఇటు హారిస్‌పైగానీ అంత అనుకూలత లేదని సర్వేలో తేలింది.
- ■ మధ్య తరగతికి పన్నుల ఉపశమనం విషయంలో 46 శాతం మంది హారిస్‌కే మొగ్గు చూపారు. కేవలం 35శాతం మందే ట్రంప్‌ను సమర్థించారు.
- ■ ఇళ్ల ధరల విషయంలో ట్రంప్‌పై హారిస్‌కే స్వల్ప మొగ్గు కనిపించింది.
- ■ నిత్యావసరాలు, పెట్రో ధరల విషయంలో ఇద్దరికీ సమానంగానే మద్దతు లభించింది.
- ■ ఉద్యోగాలు, నిరుద్యోగం విషయంలో ఎవరికీ పెద్దగా సానుకూలత లభించలేదు.
- ■ దిగుమతులపై సుంకాల విషయంలో ట్రంప్‌వైపే కొంత మొగ్గు కనిపించింది.
- ■ యువ ఓటర్లలో ఆరోగ్య రంగం, ఆర్థిక వ్యవస్థల పట్ల అసంతృప్తి ఉంది. ఇది హారిస్‌కు ఇబ్బంది కలిగించేదే. 45 ఏళ్లలోపు వారిలో ఈ అసంతృప్తి అధికంగా ఉంది. 45ఏళ్లు పైబడిన వారిలో హారిస్‌పట్ల అనుకూలత ఉంది.

హారిస్‌వైపే సగం మంది..



ట్రంప్ కంటే హారిస్‌పట్లే ఓటర్ల మొగ్గు కనిపిస్తోంది. గత నెల రోజులుగా హారిస్, ట్రంప్‌ల మద్దతు విషయంలో నిలకడ కనిపిస్తోంది. దాదాపు సగం మంది ఓటర్లు హారిస్‌కు మద్దతు పలుకుతున్నారు. 46శాతం మంది ఆమెను వ్యతిరేకిస్తున్నారు.

- ■ ప్రతి 10 మందిలో నలుగురే ట్రంప్‌నకు మద్దతు పలుకుతున్నారు. ఆరుగురు వ్యతిరేకంగా ఉన్నారు.
- ■ గత కొన్ని నెలలుగా ట్రంప్ అనుకూలత నిలకడగా ఉంది. రెండు సార్లు హత్యాయత్నాలు జరిగిన తర్వాతా ఆయనపట్ల సానుభూతి పవనాలు కురవలేదు.
- ■ ఆఫ్రో అమెరికన్, హిస్పానిక్ ఓటర్లలో గత నెల రోజులుగా పెద్ద మార్పేమీ లేదు. ఆఫ్రో అమెరికన్లలో నాలుగింట మూడొంతుల మంది హారిస్‌కే మొగ్గు చూపుతున్నారు. వారిలో ప్రతి 10 మందిలో ఇద్దరే ట్రంప్‌ను సమర్థిస్తున్నారు.
- ■ ప్రతి 10 మంది హిస్పానిక్ ఓటర్లలో ఆరుగురు హారిస్‌కు, నలుగురు ట్రంప్‌నకు మద్దతు పలుకుతున్నారు.
- ■ మహిళల్లో సగం మంది (50శాతం) హారిస్‌ను సమర్థిస్తున్నారు. మూడో వంతు (33శాతం) మహిళలే ట్రంప్‌నకు ఓటేస్తున్నారు.
- ■ పురుషుల్లో చెరి సగం మద్దతు లభిస్తోంది.

■ నిత్యావసరాలు, పెట్రో ధరలను నియంత్రించడంలో హారిస్‌పట్ల యువ ఓటర్లు సంతృప్తిగా లేరు. అలా అని వారంతా ట్రంప్‌ను సమర్థించడం లేదు. దాదాపు 25 శాతం మంది ఇద్దరిపట్లా సానుకూలంగా లేరు.

ఇతర అంశాల్లో..



- ■ వలస విధానం విషయంలో ట్రంప్‌పై సానుకూలత ఉంది. ఆయన వలస సమస్యలను సమర్థంగా పరిష్కరించగలరని 45శాతం మంది నమ్ముతున్నారు. ఈ విషయంలో ప్రతి 10 మందిలో నలుగురే హారిస్‌ను సమర్థిస్తున్నారు. శ్వేతజాతి ఓటర్లలో సగం మంది ట్రంప్‌నకే మద్దతుగా నిలుస్తున్నారు.
- ■ అబార్షన్ హక్కు అంశంలో హారిస్‌కు భారీ మద్దతు లభిస్తోంది. ఈ విషయంలో ఆమె సమర్థంగా వ్యవహరించగలరని 50శాతం మంది నమ్ముతున్నారు. ట్రంప్‌ను ఈ విషయంలో ప్రతి 10 మందిలో ముగ్గురే సమర్థిస్తున్నారు.
- ■ వాతావరణ సవాళ్ల విషయంలో సగం మంది హారిస్‌కు, 20శాతం మంది ట్రంప్‌నకు మద్దతు పలికారు.
- ■ ఎన్నికల సమగ్రత విషయంలోనూ హారిస్‌కే మొగ్గు కనిపించింది.
- ■ పశ్చిమాసియా విషయంలో ఎవరికీ మొగ్గు కనిపించలేదు.
- ■ నేరాల కట్టడి అంశంలో ఇద్దరూ సమానంగానే మద్దతును సాధించారు.

నిర్ఘాంతపరిచే భద్రత వైఫల్యాలే

ట్రంప్‌పై హత్యాయత్నానికి కారణం

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భద్రతలో నిర్ఘాంతపరిచే వైఫల్యాలు ఉన్నాయని, అందుకే జులైలో పెన్సిల్వేనియాలో ఆయనపై హత్యాయత్నం జరిగిందని చట్టసభల టాస్క్‌ఫోర్స్ నివేదిక పేర్కొంది. భద్రత కట్టుదిట్టంగా ఉన్నట్లయితే ఇది జరిగేదే కాదని తేల్చింది. ఈ నివేదిక సోమవారం విడుదలైంది. అగ్రస్థాయి నేతలకు భద్రత కల్పించడంలో సీక్రెట్ సర్వీస్ ఎందుకు మెరుగ్గా వ్యవహరించలేకపోయిందని ఉభయ సభల సభ్యులు పదేపదే ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఓ భవనం నుంచి భద్రతపరమైన సమస్యలు తలెత్తవచ్చని తెలుసుకున్న తర్వాత కూడా దానిని పట్టించుకోకుండా వదిలేయడం, ఆ భవనం మీదకే నిందితుడు థామస్ మాథ్యూ క్రూక్స్ చేరి కాల్పులు జరపడం గురించి వారు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. సీక్రెట్ సర్వీస్‌కు, రాష్ట్ర, స్థానిక పోలీసులకు మధ్య సమాచారం చేరవేతలో అస్పష్టత ఉందని, దీనికి ప్రధాన బాధ్యత మాత్రం సీక్రెట్ సర్వీస్‌దేనని టాస్క్‌ఫోర్స్ సభ్యులు తేల్చారు. క్రూక్స్ కదలికల్ని గుర్తించగలిగే అవకాశం లభించినా పోలీసులు దానిని వినియోగించుకోలేదని తప్పుబట్టారు. అంతమంది భద్రతాధికారులు ఘటనాస్థలిలో ఉన్నా ఓ భవనం పైకప్పుపైకి నిందితుడు సునాయాసంగా చేరుకుని కాల్పులు జరపడాన్ని వారు ప్రస్తావించారు. సీక్రెట్ సర్వీస్, ఎఫ్‌బీఐ, పోలీసు అధికారుల నుంచి రాబట్టిన సమాచారాన్ని వారు విశ్లేషించారు. నిర్దిష్టంగా ఎవరు బాధ్యులనేది మాత్రం తేల్చలేదు. సీక్రెట్ సర్వీస్ వైఫల్యంపై ఇప్పటికే ఒక స్వతంత్ర కమిషన్ విచారణ పూర్తిచేసింది. ట్రంప్‌పై రెండోసారి జరిగిన హత్యాయత్నంపైనా టాస్క్‌ఫోర్స్ విచారిస్తోంది.

నిరవధిక దీక్ష విరమించిన బెంగాల్ జూనియర్ వైద్యులు

- సీఎం మమతతో భేటీ అనంతరం నిర్ణయం

కోల్‌కతా: ఆసుపత్రుల్లో వైద్యులకు రక్షణ కల్పించడం తదితర డిమాండ్లతో 17 రోజులుగా కొనసాగిస్తున్న నిరవధిక నిరాహార దీక్షను విరమిస్తున్నట్లు పశ్చిమ బెంగాల్ జూనియర్ వైద్యులు సోమవారం ప్రకటించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టదలచిన ఆసుపత్రుల బంద్ కార్యక్రమాన్నీ నిలిపివేసినట్లు తెలిపారు. అంతకుముందు వైద్యుల ప్రతినిధి బృందం రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో భేటీ అయ్యింది. తమ డిమాండ్ల పరిష్కారానికి హామీలు లభించాయని వైద్యుల సంఘం తెలిపింది. సుమారు 2 గంటల పాటు సాగిన సమావేశంలో... ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులకు రక్షణ లేకపోవడంపై ఇరువర్గాలు చర్చలు జరిపాయి. రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శిని విధుల నుంచి తొలగించాలన్న డిమాండ్‌ను మమతా బెనర్జీ తోసిపుచ్చారు. జూనియర్ డాక్టర్లు చేసిన పలు డిమాండ్‌లను నెరవేర్చినందున నిరాహార దీక్ష విరమించాలని మమత విజ్ఞప్తి చేశారు.

మదర్సాల నుంచి విద్యార్థులను తరలించాలన్న

ఎన్సీపీసీఆర్ సిఫార్సులపై సుప్రీంకోర్టు స్టే

దిల్లీ: గుర్తింపు లేని మదర్సాల నుంచి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తరలించాలంటూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ (ఎన్సీపీసీఆర్) జారీ చేసిన సిఫార్సుల అమలును సుప్రీంకోర్టు సోమవారం నిలిపివేసింది. ఎన్సీపీసీఆర్ సూచనలకు అనుగుణంగా రాష్ట్రాలు జారీ చేసిన ఆదేశాలపైనా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర ధర్మాసనం స్టే విధించింది. మదర్సాల్లో విద్యాహక్కు చట్టాన్ని పాటించట్లేదని, అక్కడ బోధించే విద్య.. విద్యార్థులకు పనికిరాదని ఎన్సీపీసీఆర్ ఇటీవల పేర్కొంది. మదర్సా బోర్డులకు నిధులు ఇవ్వొద్దంటూ రాష్ట్రాలకు జూన్ 7, జూన్ 25 తేదీల్లో సూచించింది. దీంతో ఉత్తర్‌ప్రదేశ్, త్రిపుర ప్రభుత్వాలు వీటిని అమలు చేయడానికి ఆదేశాలు జారీ చేశాయి. ఈ చర్యను వ్యతిరేకిస్తూ జమియాత్ ఉలేమా-ఇ-హింద్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది.

మరో కేసులో...: ఉత్తర్‌ప్రదేశ్ మదర్సా విద్యా మండలి చట్టం-2004కు సంబంధించిన కేసులో సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర ధర్మాసనం ముందు విచారణ కొనసాగింది. ఈ చట్టాన్ని అలహాబాద్ హైకోర్టు కొట్టివేయగా 17 లక్షల మంది మదర్సా విద్యార్థులకు సర్వోన్నత న్యాయస్థానం ఏప్రిల్ 5న ఉపశమనం కలిగించింది. ఈ కేసులో వాదనలు చివరి దశకు వచ్చాయి.

విమానాలకు బాంబు బెదిరింపులు చేస్తే కఠిన చర్యలు

- చట్ట సవరణ చేస్తాం
- పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



దిల్లీ: విమానాలకు బాంబు బెదిరింపులు పంపేవారి పట్ల కఠినంగా వ్యవహరించేందుకు వీలుగా చట్టాలను సవరించనున్నట్లు పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడేవారు విమానాల్లో ప్రయాణించే వీల్లేకుండా వారిని 'నో ఫ్లై లిస్ట్'లో చేర్చేలా విమాన భద్రత నిబంధనలనూ కఠినతరం చేస్తామని సోమవారం దిల్లీలో విలేకరులతో పేర్కొన్నారు. ప్రయాణికుల రక్షణ విషయంలో ఎలాంటి రాజీలేకుండా ఈ సమస్యను ఎదుర్కొంటామన్నారు. పౌర విమానయాన భద్రతకు ప్రమాదం కలిగించే చట్టవిరుద్ధ చర్యల అణచివేత చట్టం-1982లో సవరణలకు ప్రతిపాదిస్తున్నట్లు మంత్రి తెలిపారు. తద్వారా విమానం గ్రౌండ్‌లో ఉన్నప్పుడు చేసే ఇలాంటి తప్పులను కోర్టు ఉత్తర్వులు లేకుండానే అరెస్టు చేసే (కాగ్నిజబుల్) నేరాలుగా పరిగణించేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. కఠిన శిక్షలు, జరిమానాకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇటీవల వరుసగా విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చిన నేపథ్యంలో మంత్రి ఈ మేరకు పేర్కొన్నారు. ఒక్క వారంలోనే దాదాపు 100 విమానాలకు బెదిరింపులు వచ్చాయి. బాంబు బెదిరింపులు చాలావరకూ సామాజిక మాధ్యమాల ద్వారానే వస్తున్నాయని మంత్రి చెప్పారు. "నిబంధనల సవరణకు ప్రయత్నిస్తున్నాం. మా లీగల్ బృందం దీనిపై కసరత్తు చేసింది. దీనిపై ఇతర శాఖలతో సంప్రదింపులు జరపాల్సి ఉంది. చట్టంలో మార్పులు తెచ్చేందుకు మేం గట్టిగా ప్రయత్నిస్తాం" అని తెలిపారు. ప్రాంతీయ వైమానిక సంధానతకు ఉద్దేశించిన 'ఉడాన్' పథకాన్ని మరో 10 ఏళ్ల పాటు పొడిగించాలని నిర్ణయించినట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ పథకం వల్ల ప్రాంతీయ విమానయాన సంస్థలు, కొత్త ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు.

నిజ్జర్ హత్యకేసుతో సంబంధం లేదు

- భారత హై కమిషనర్ వర్మ స్పష్టీకరణ

ఇంటర్నెట్ డెస్క్: ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్యోదంతంలో తన పాత్ర లేదని కెనడాలో భారత హై కమిషనర్ సంజయ్ కుమార్ వర్మ స్పష్టం చేశారు. ఈ కేసులో తనపై కెనడా సర్కారు ఆరోపణలు చేస్తున్నప్పటికీ దానికి ఎలాంటి ఆధారాలు సమర్పించలేదని చెప్పారు. ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఓ ప్రముఖ మీడియాతో ముఖాముఖిలో తెలిపారు. కెనడాలో సిక్కు వేర్పాటువాదులను భారత ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని ట్రూడో సర్కారు చేసిన ఆరోపణల్ని ఆయన తోసిపుచ్చారు. సిక్కు వేర్పాటువాదుల సమాచారాన్ని రాయబారులు భారత్‌కు అందిస్తే నేరగాళ్ల ముఠాల ద్వారా భారత్ వారిని చంపేస్తోందని కెనడా చేసిన ఆరోపణల్ని ఖండించారు. కెనడాలో భారత హై కమిషనర్‌గా తాను ఎప్పుడూ అలాంటి పనులు చేయలేదన్నారు. భారత్ ఏ తరహా చర్య తీసుకున్నా అది బహిరంగంగానే జరిగిందని స్పష్టం చేశారు.

బీబీసీ డాక్యుమెంటరీ నిలిపివేతపై ఒరిజినల్ రికార్డులను సమర్పించండి

- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: గుజరాత్ అల్లర్లపై 2023లో బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీని నిలిపివేస్తూ ఇచ్చిన ఆదేశాలకు సంబంధించిన ఒరిజినల్ రికార్డులను 3 వారాల్లోగా సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతోపాటు ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సీనియర్ జర్నలిస్టు ఎన్.రామ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా, ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, న్యాయవాది ఎంఎల్ శర్మ దాఖలు చేసిన పిటిషన్లపై సమాధానం దాఖలు చేయాలని సూచించింది. తుది విచారణను వచ్చే ఏడాది జనవరిలో చేపడతామని న్యాయస్థానం పేర్కొంది. ఈ అంశంపై విచారణ జరపాల్సిందేనని, 10 నిమిషాల్లో తేల్చాల్సింది కాదని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది.

ఉగ్రవాదుల ఆచూకీకి బలగాల జల్లెడ

- కశ్మీర్‌లో ఆధారాలు సేకరిస్తున్న ఎన్ఐఏ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని సోన్‌మార్గ్ వద్ద సొరంగ నిర్మాణ ప్రదేశం వద్ద ఉగ్రవాదులు దాడి జరిపిన ప్రాంతాన్ని భద్రత బలగాలు జల్లెడ పడుతున్నాయి. స్థానికేతర కూలీలు, వైద్యుడితో పాటు ఏడుగురిని ఆదివారం రాత్రి బలిగొన్న ఘటనను బలగాలు తీవ్రంగా పరిగణించి.. ఉగ్రవాదుల ఆచూకీ కోసం తీవ్రంగా అన్వేషిస్తున్నాయి. 'జాతీయ దర్యాప్తు సంస్థ' (ఎన్ఐఏ) అధికారులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దాడి చేసినవారు పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులేనని, వారు ఆ ప్రాంతాన్ని ముందుగానే క్షుణ్నంగా పరిశీలించారని భావిస్తున్నారు. లేదంటే స్థానికులెవరైనా వారికి సహకరించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. సీసీటీవీ దృశ్యాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. లష్కరే తయ్యిబా ఉగ్రవాద సంస్థకు చెందిన 'రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ దాడిని తామే చేసినట్లు ప్రకటించుకుంది. కశ్మీర్ గత మూడు దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నా ఈ ప్రాంతంలో ఇలాంటి హింసాత్మక ఘటన జరగడం ఇదే తొలిసారి. ఘటనకు పాకిస్థానే కారణమని, భారత్‌తో సత్సంబంధాలను ఆ దేశం కోరుకుంటున్నట్లయితే ఇలాంటి దుశ్చర్యలకు అడ్డుకట్ట వేయాలని వివిధ పార్టీల నేతలు పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు తీస్తూ చర్చల్ని పాక్ కోరుకోవడంలో అర్థం లేదని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. కశ్మీర్ ఎప్పటికీ పాకిస్థాన్‌లో భాగం కాదన్నారు.

ఉద్విగ్నభరిత వాతావరణంలో తుది వీడ్కోలు

ముష్కరుల దాడిలో బలైపోయిన డాక్టర్ షానవాజ్ మిర్‌కు ఉద్విగ్నభరిత వాతావరణంలో సోమవారం తుది వీడ్కోలు పలికారు. రెండువారాల క్రితమే కుమార్తె వివాహ వేడుకను వైభవంగా జరిపించిన వైద్యుడు.. నిర్జీవంగా కనిపించడంతో బంధుమిత్రుల కళ్లు చెమర్చాయి. గ్రామస్థులంతా తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. స్థానికంగా మంచిపేరున్న అలాంటి వ్యక్తిని పొట్టనపెట్టుకోవడాన్ని ఖండించారు. హింసకు అడ్డుకట్ట పడాలని నినాదాలిచ్చారు. ఉగ్రదాడిని ఖండిస్తూ పుల్వామా సహా పలుచోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. తన భర్త శ్రేయస్సును కోరి ఉపవాసం చేసిన ఓ మహిళ.. చంద్రోదయం తర్వాత దీక్ష విరమణకు సిద్ధమవుతున్న తరుణంలో దుర్వార్త వినాల్సి రావడంతో పెద్దపెట్టున విలపించారు.



జమ్మూకశ్మీర్‌లోని గాందర్‌బల్ జిల్లాలో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో సోమవారం గాలింపు చేపట్టిన జవాన్లు

ప్రజాప్రాతినిధ్య చట్ట నిబంధనలపై పిటిషన్

- కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

దిల్లీ: ఎన్నికల బరిలో ఒకేఒక అభ్యర్థి మిగిలి ఉన్న సందర్భంలో ఓటర్లకు నోటా ఐచ్ఛికాన్ని వినియోగించే అవకాశాన్ని ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని నిబంధనలు అడ్డుకుంటున్నాయని పిటిషనర్ ఆరోపించారు. ఇదే చట్టంలోని సెక్షన్ 53, 53(2)లను కూడా సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై స్పందనను తెలియజేయాలంటూ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం సోమవారం కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాని(ఈసీ)కి నోటీసులు జారీ చేసింది.

సీజేఐపై సమాజ్‌వాదీ నేత వివాదాస్పద వ్యాఖ్యలు

మొయిన్‌పురి: భారత ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలను తప్పుబడుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సమాజ్‌వాదీ ప్రధాన కార్యదర్శి రాంగోపాల్ యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని భాజపా డిమాండు చేసింది. అయితే తాను సీజేఐని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయలేదని, దర్యాప్తు జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని రాంగోపాల్ కోరారు. అయోధ్య సమస్యకు పరిష్కారం చూపాలని తాను దేవుడిని ప్రార్థించానని, ఎవరైనా విశ్వాసం ఉంచితే దేవుడే దారిచూపుతాడని అర్థమైందని పుణెలో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించాలని రాంగోపాల్ యాదవ్‌ను మీడియా కోరగా.. తాను స్పందించబోనని అంటూనే చనిపోయిన వ్యక్తిని వెనక్కి తీసుకొస్తే దయ్యంగా మారతారని, వెంటపడతారని పేర్కొన్నారు. మరో ప్రశ్నకు స్పందించే సమయంలో యాదవ్ నోటి వెంట రాకూడని పదం వచ్చింది. ఈ వ్యాఖ్యల వీడియో వైరల్ కావడంతో యాదవ్ స్పందించారు. సీజేఐపై తాను ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదని, దర్యాప్తు జరిపి నిజాలు నిగ్గు తేల్చాల్సిందిగా జిల్లా కలెక్టర్, ఎస్పీలను కోరానని ఆయన తెలిపారు.

రష్యా కార్గో విమానం సూడాన్‌లో కూల్చివేత

దుబాయ్: రష్యాకు చెందిన సరకు రవాణా విమానాన్ని సూడాన్ పారామిలిటరీ దళాలు డార్ఫర్‌లో కూల్చివేశాయి. ఛాద్‌తో ఉన్న సరిహద్దుకు చేరువగా మల్హా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఆన్‌లైన్ మాధ్యమాల్లో వీడియోలు చక్కర్లు కొట్టాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు రష్యా తెలిపింది. ఈ విమానంలో కొందరు రష్యావాసులు ఉండి ఉంటారని ఖార్తూమ్‌లోని రష్యా దౌత్య కార్యాలయం తెలిపింది.

అసంఘటిత కార్మికుల కోసం 'ఇ-శ్రమ్' పోర్టల్ ప్రారంభం

దిల్లీ: అసంఘటిత రంగ కార్మికులకు వివిధ సామాజిక సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చే లక్ష్యంతో రూపొందించిన 'ఇ-శ్రమ్...వన్ స్టాప్ సొల్యూషన్' పోర్టల్‌ను సోమవారం కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి రోజు 60 వేల నుంచి 90వేల మంది వరకు కార్మికులు ఈ-శ్రమ్ వేదికలో పేర్లను నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ చొరవపై వారు కనబరుస్తున్న విశ్వాసానికి ఇది నిదర్శనమన్నారు.

ఐదుగురు బందీలను విడుదల చేస్తే 2 వారాల కాల్పుల విరమణ

- ఇజ్రాయెల్ కొత్త ప్రతిపాదన

జెరూసలెం: హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ మరణం నేపథ్యంలో గాజా కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి కొత్త ప్రతిపాదనలను ఇజ్రాయెల్ తెరపైకి తీసుకొస్తోంది. హమాస్ చెరలోని ఐదుగురు బందీలను విడుదల చేస్తే, రెండు వారాల కాల్పుల విరమణకు తాము సిద్ధమని చెబుతోంది. దీంతో పాటు మిగతా బందీల విడుదల.. యుద్ధం ముగింపునకు సంబంధించిన ప్రతిపాదనలపైనా ఆదివారం జరిగిన ఇజ్రాయెల్ భద్రతా క్యాబినెట్‌లో తీవ్రస్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. సిన్వర్ మృతి చెందినా.. హమాస్ మాత్రం తమ డిమాండ్లపై వెనక్కి తగ్గడం లేదని తెలుస్తోంది. గతంలో అమెరికా ప్రతిపాదించిన ఒప్పందమే అమలు జరపాలని పట్టుబడుతోంది. కొత్త ప్రతిపాదనలకు ఆ సంస్థ సిద్ధంగా లేదని చర్చలకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న కీలక వ్యక్తులు చెబుతున్నారు. మరోవైపు లెబనాన్‌పై దాడులను ఆపేందుకు తాము సిద్ధమన్న సందేశాన్ని అమెరికాకు ఇజ్రాయెల్ పంపింది. అయితే అందుకు కొన్ని షరతులు పెట్టినట్లు తెలుస్తోంది. లెబనాన్ గగనతలాన్ని తమకు అప్పగించాలని.. అంతేకాకుండా ఐడీఎఫ్ దళాల ప్రవేశానికీ అనుమతి ఇవ్వాలని కోరుతోంది. ఈ ప్రతిపాదనలను గతవారమే అమెరికాకు టెల్ అవీవ్ పంపినట్లు ఓ పత్రిక పేర్కొంది. మరోవైపు లెబనాన్‌కు ఇజ్రాయెల్ క్షమాపణ చెప్పింది. ఆదివారం ఇజ్రాయెల్ చేసిన దాడిలో ముగ్గురు లెబనాన్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. సైనికులు ఉన్న వాహనం హెజ్‌బొల్లా గ్రూపుదిగా భావించి పొరపాటున దాడి చేశామని పేర్కొంది. తమ లక్ష్యం.. లెబనాన్ సైన్యం కాదని వివరణ ఇచ్చింది. ఇరాన్ తరఫున గూఢచర్యం చేస్తున్నారన్న ఆరోపణలతో ఏడుగురు పౌరులను సోమవారం ఇజ్రాయెల్ అరెస్ట్ చేసింది. ఆ ఏడుగురికి భారీ మొత్తంలో ఇరాన్ నగదు ముట్టజెప్పినట్లు పేర్కొంది.



ఇజ్రాయెల్ వైమానిక దాడులతో లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఎగసిపడుతున్న మంటలు



ముంబయిలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశం సందర్భంగా మొదటి రన్నరప్(ఎడమ) రేఖా పాండే, రెండో రన్నరప్ ఆయుశీ ఢోలకియా(కుడి)లతో ఫెమీనా మిస్ ఇండియా నిఖితా పోర్వాల్

ఈనాడు సినిమా

కూలీ.. యాక్షన్ మొదలు


రజనీకాంత్

రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కూలీ'. సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. నాగార్జున, ఉపేంద్ర, శ్రుతిహాసన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్ర కొత్త షెడ్యూల్ చెన్నైలో సిద్ధం చేసిన భారీ సెట్‌లో ప్రారంభమైనట్లు సమాచారం. శస్త్రచికిత్స కారణంగా వైద్యుల సలహా మేరకు కొన్ని రోజులుగా విశ్రాంతి తీసుకుంటున్న రజనీ ఈ షెడ్యూల్‌తో తిరిగి సెట్లోకి అడుగు పెడుతున్నారు. ఈ షెడ్యూల్‌లో భాగంగా రజనీతో పాటు ప్రధాన తారాగణంపై యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించనున్నట్లు తెలిసింది. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న యాక్షన్ కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. దీంట్లో బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ అతిథి పాత్రలో తళుక్కున మెరవనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాకి సంగీతం: అనిరుధ్, ఛాయాగ్రహణం: గిరీశ్ గంగాధరన్.

'గదర్ 2' దర్శకుడి వనవాస్

గతేడాది సన్నీడేవోల్ ప్రధాన పాత్రలో 'గదర్ 2'తో బాలీవుడ్‌కు ఓ మంచి విజయాన్ని అందించారు దర్శకుడు అనిల్ శర్మ. ఇప్పుడు 'జీవితంలో ఎవరినైతే మనవాళ్లు అనుకుంటామో.. వాళ్లే మనల్ని బహిష్కరించాల్సి వస్తుందం'టూ తన కొత్త చిత్రం 'వనవాస్'ను ప్రకటించారు. ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఉత్కర్ష్ శర్మ, నానా పటేకర్, రాజ్‌పాల్ యాదవ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా డిసెంబరు 20న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుపుతూ సామాజిక మాధ్యమాల వేదికగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఉత్కర్ష్, నానా పటేకర్ ఇందులో చిరునవ్వులు చిందిస్తూ.. వారిద్దరి మధ్య ఉన్న బంధాన్ని తెలియజేస్తుందీ పోస్టర్. తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఉన్న అనుబంధాల ఆధారంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు.


నానా పటేకర్, ఉత్కర్ష్ శర్మ

స్టైలిష్ రాజాసాబ్

ప్రభాస్ కొత్త తరహా కథలో నటిస్తుండడం ఓ విశేషమైతే... ఇందులో ఆయన కొత్త స్టైల్‌తో సందడి చేయనుండడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని 'రాజాసాబ్' బృందం చెబుతోంది. ప్రభాస్ కథానాయకుడిగా, మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రాజాసాబ్'. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ కథానాయికలు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ నెల 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకి సంబంధించిన ఓ కీలక అప్‌డేట్‌ని ప్రకటించనున్నట్టు సినీ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. ప్రభాస్ తన కెరీర్‌లో చేస్తున్న తొలి రొమాంటిక్ హారర్ చిత్రమిదే. ఆయన లుక్ ఇందులో చాలా కొత్తగా ఉంటుందని, అంచనాలకి తగ్గట్టుగానే ఓ మైలురాయిగా నిలిచిపోయే చిత్రమిదని నిర్మాణ వర్గాలు తెలిపాయి. భారీ హంగులతో రూపొందుతున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: కార్తీక్ పళని, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, ప్రొడక్షన్ డిజైన్: రాజీవన్.


ప్రభాస్

అన్యాయాలపై ఝూన్సీ పోరాటం


లక్ష్మీరాయ్

లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రధారిగా గురుప్రసాద్ తెరకెక్కించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. తమిళం, కన్నడ భాషల్లో విడుదలైన ఈ చిత్రాన్ని తెలుగులో ఆర్.కె.ఫిలింస్ పతాకంపై ప్రతాని రామకృష్ణ గౌడ్ విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ నటుడు సుమన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ "సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడే ఓ యోధురాలి కథ ఇది. నవంబరు రెండో వారంలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నామ"న్నారు.

సంద్రంలో జీవనసమరం


రమాకాంత్, అవంతిక

చేపల వేటకి వెళ్లినప్పుడు జాలర్లకు ఎదురయ్యే కష్టాల్ని చూపిస్తూనే.. వాణిజ్యాంశాలతో కూడిన ఓ మంచి కథని చెప్పే ప్రయత్నం చేశామన్నారు నగేష్ నారదాసి. ఆయన తెరకెక్కించిన చిత్రం 'సముద్రుడు'. రమాకాంత్, అవంతిక, భానుశ్రీ ప్రధాన పాత్రల్లో నటించారు. బధావత్ కిషన్ నిర్మాత. సీనియర్ నటుడు సుమన్ ఓ ముఖ్య పాత్రని పోషించారు. ఈ చిత్రం ఈ నెల 25న రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. వి.సముద్ర, టి.ప్రసన్నకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మత్స్యకారుల జీవితాల్ని కళ్లకు కట్టే ప్రయత్నమే ఈ చిత్రమని చెప్పారు దర్శకుడు.

శ్రీచక్రం.. ఓ రహస్యం!

"ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న సైన్స్ ఫిక్షన్ చిత్రం 'రహస్యం ఇదం జగత్'. శ్రీచక్రం గురించి చర్చిస్తూ ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందిస్తుంది" అన్నారు దర్శకుడు కోమల్ ఆర్.భరద్వాజ్. ఆయన దర్శకత్వంలో రాకేశ్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానస వీణ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాని పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల సంయుక్తంగా నిర్మించారు. భార్గవ్ గోపీనాథం, కార్తీక్ కందాల తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా నవంబరు 8న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు కోమల్ మాట్లాడుతూ.. "సైన్స్ ఫిక్షన్‌కు ఆధ్యాత్మిక అంశాల్ని జోడించి ఈతరం ప్రేక్షకులు మెచ్చేలా ఈ చిత్రాన్ని రూపొందించాం. దీని ద్వారా మన పురాణాలు, మూలాల గురించి ఓ కొత్త విషయాన్ని చెప్పనున్నాం. తప్పకుండా ఇది ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో మానస, స్రవంతి, రాంబాబు గోసాల, గ్యానీ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


స్రవంతి, మానస

డబ్బు కోసం ఏం చేశాడు?


సూర్యదేవర నాగవంశీ, మీనాక్షి, దుల్కర్ సల్మాన్

నేను చెడ్డవాడిని కాదు, ధనవంతుడిని అంటున్నాడు భాస్కర్ కుమార్. వస్తువు కావాలంటే డబ్బుతో కొనాలి, గౌరవం కావాలంటే డబ్బు మన ఒంటిపై కనిపించాలనే విషయం తెలుసుకున్న అతను డబ్బు కోసం ఏం చేశాడో తెలియాలంటే 'లక్కీభాస్కర్' చూడాల్సిందే. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా, వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. మీనాక్షి చౌదరి కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ఈ చిత్రం దీపావళి సందర్భంగా ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ "ఇది నాకు చాలా ప్రత్యేకమైన చిత్రం. హాస్యం, భావోద్వేగాలతోపాటు, కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలన్నీ ఉంటాయి. నా నుంచి చాలా విరామం తర్వాత వస్తున్న ఈ సినిమా అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నా" అన్నారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ ''ఇప్పటివరకూ నేను చేసిన పాత్రల్లో నాకు బాగా ఇష్టమైనది ఇందులోని సుమతి. నా మనసుకు బాగా దగ్గరైన చిత్రం కూడా ఇదే" అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "బ్యాంకింగ్ నేపథ్యంలో కుటుంబ భావోద్వేగాలతో నడిచే ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది" అన్నారు.

పేరు మోసిన గ్యాంగ్‌స్టర్‌గా షాహిద్?


షాహిద్ కపూర్

బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్, దర్శకుడు విశాల్ భరద్వాజ్ కలయికలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. డిసెంబరులో చిత్రీకరణ మొదలుకానున్న ఈ సినిమా గురించి ఇప్పుడో ఆసక్తికర విషయం బయటికొచ్చింది. ఈ చిత్రంలో షాహిద్ పాత్ర ముంబయిలో పేరుమోసిన హుస్సేన్ ఉస్తారా అనే గ్యాంగ్‌స్టర్ తరహాలో ఉండనున్నట్లు తెలుస్తోంది. "షాహిద్, విశాల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న నాల్గో చిత్రమిది. ఇందులో ఉస్తారా అనే గ్యాంగ్‌స్టర్ తరహాలో కనిపించనున్న షాహిద్.. ఇప్పటికే ఆయన పాత్రకు సంబంధించిన కసరత్తులను ప్రారంభించాడు. గ్యాంగ్‌స్టర్‌గా ఆయన రూపురేఖల్ని మార్చుకోవడానికి ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. స్క్రిప్ట్ పనులు ముగింపు దశలో ఉన్న ఈ చిత్రంలో మునుపెన్నడూ చూడని భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను తీర్చిదిద్దుతున్నార"ని షాహిద్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన 'దేవా'తో బిజీగా ఉన్నారు.

1980ల్లో జగిత్యాలలో ఏం జరిగింది?


రాకేశ్

'ఉయ్యాల జంపాలా', 'మజ్ను' చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించారు దర్శకుడు విరించి వర్మ. ఇప్పుడాయన నుంచి వస్తున్న కొత్త సినిమా 'జితేందర్ రెడ్డి'. రాకేశ్ వర్రే టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించారు. వైశాలి రాజ్, రియా సుమన్, సుబ్బరాజు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా నవంబరు 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. "1980ల కాలంలో జగిత్యాల చుట్టు పక్కల జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కించాం. నిర్మాణానంతర పనులు ముగింపు దశలో ఉన్నాయి" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: గోపీ సుందర్, ఛాయాగ్రహణం: వి.ఎస్.జ్ఞానశేఖర్.

ఇకపై బుజ్జమ్మ అనన్య అని పిలుస్తారు


అనన్య నాగళ్ల

"సందేశాన్ని.. తెలంగాణ సంస్కృతిని.. వాణిజ్యాంశాల్ని మిళితం చేసి తెరకెక్కించిన చిత్రం 'పొట్టేల్'. ఇలాంటి సినిమా ఈ మధ్య కాలంలో తెలుగులో రాలేదు" అంటోంది నటి అనన్య నాగళ్ల. 'మల్లేశం', 'వకీల్‌సాబ్' చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన తెలుగందం అనన్య. ఇప్పుడామె.. యువ చంద్ర కృష్ణ జంటగా నటించిన చిత్రమే 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి తెరకెక్కించిన ఈ సినిమా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది అనన్య.

◆ "ఓ పాప చదువు చుట్టూ అల్లుకున్న కథ ఇది. ఇందులో ట్రైలర్‌లో కనిపించని చాలా కోణాలు దాగి ఉంటాయి. అందుకే స్క్రిప్ట్ విన్నాక కచ్చితంగా దీంట్లో భాగం కావాలని అనుకున్నా. ఈ సినిమాలో నేను బుజ్జమ్మగా కనిపిస్తా. ఆ పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ట్రైలర్‌లో ఎక్కువ చూపించలేదు కానీ, సినిమాలో నా పాత్రను చూసి అందరూ ఆశ్చర్యపోతారు. ఇప్పటి వరకు నన్ను 'మల్లేశం' అనన్య, 'వకీల్‌సాబ్' అనన్య అనే పిలుస్తుంటారు. కానీ, ఈ చిత్రం తర్వాత బుజ్జమ్మ అనన్య అని పిలుస్తారు. ఈ పాత్ర కచ్చితంగా ఆ స్థాయిలో ప్రభావం చూపిస్తుంది".

◆ "పొట్టేల్ లేకపోతే ఈ కథ లేదు. పొట్టేల్ పరిగెత్తుతూ వెళ్తున్నప్పుడు కొండ అడ్డం వచ్చినా ఢీ కొడుతుంది తప్ప వెనక్కి తగ్గదు. అది దాని సహజ గుణం. ఈ సినిమాలో మా హీరో పాత్ర కూడా అలాగే ఉంటుంది. తనకెంతటి సమస్య ఎదురైనా తెగించి ముందుకు దూకుతాడే తప్ప వెనక్కి వచ్చే సమస్యే లేదు. అలా రెండు విధాలుగా ఈ చిత్ర టైటిల్‌కు న్యాయం జరిగింది. దీంట్లో యువ చంద్ర, పాపకు మధ్య వచ్చే సీన్స్ నేపథ్య సంగీతం వల్ల చాలా భావోద్వేగభరితంగా ఉంటాయి. కళ్లల్లో నీళ్లు తెప్పిస్తాయి".

◆ "నేను చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టినప్పుడు కొన్ని ప్రేమ కథలు చేయాలి.. క్యూట్ పాత్రలు పోషించాలి అనుకునే దాన్ని. నాకు అప్పటికి పాత్రల ఎంపిక విషయంలో అంత అవగాహన లేదు. 'మల్లేశం' వచ్చిన తర్వాత ప్రేక్షకులు నన్ను ఓ విభిన్నమైన లుక్‌లో చూశారు. పరిణతితో నిండిన పాత్రలు చేస్తున్నాను కాబట్టి ఈతరహా పాత్రలే ఇవ్వాలనుకున్నారు. ఈ విషయంలో నేను సంతోషంగానే ఉన్నా. దీని వల్ల నేను ఒక డిఫరెంట్ సెట్ ప్రేక్షకులకు చేరువయ్యాను. ప్రస్తుతం నటనా ప్రాధాన్యమున్న ఇలాంటి భిన్నమైన పాత్రలు చేయాలంటే తెలుగు అమ్మాయిల్లో ఉన్న ఇద్దరు ముగ్గురిలో నా పేరూ వినిపిస్తోంది. అందుకే 'పొట్టేల్' నా దగ్గరకొచ్చిందని నమ్ముతా. ఈ సినిమా చూసి మా అమ్మ గర్వపడుతుంది".

◆ "ప్రస్తుతం నేను చేసిన 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' విడుదలకు సిద్ధంగా ఉంది. సతీశ్ వేగేశ్న 'కథకళి' చిత్రం చేస్తున్నా. అలాగే 'లేచింది మహిళా లోకం' అనే సినిమాలో నటిస్తున్నా".

'తస్కరించుట' మొదలైంది


సన్నీ

సన్నీ హీరోగా శివప్రసాద్ చలువాది తెరకెక్కిస్తున్న చిత్రం 'తస్కరించుట'. షేక్ అఫ్రీన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి బెల్లంకొండ సురేశ్ క్లాప్ కొట్టగా.. ఆకాశ్ పూరి కెమెరా స్విచ్ఛాన్ చేసి చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందించారు. ఈ సందర్భంగా దర్శకుడు శివప్రసాద్ మాట్లాడుతూ.. "కొత్తదనం నిండిన క్రైమ్ థ్రిల్లర్ ఇది. వచ్చే నెల 15నుంచి చిత్రీకరణ ప్రారంభిస్తాం" అన్నారు. ఈ సినిమాకి సంగీతం: రోహిత్, ఛాయాగ్రహణం: అజయ్ ఎర్రగుంట్ల.

ఒకానొక దశలో నాకు నటన రాదేమో అనుకున్నా!

"రాత్రికి రాత్రే స్టార్ అయిపోయిన నటీనటులు చిత్రపరిశ్రమలో చాలా మందే ఉన్నారు. కానీ నా జీవితంలో ఆ స్టార్ అనే పదం వెనక నా ఎనిమిదేళ్ల కష్టం ఉంద"ని అంటోంది బాలీవుడ్ తార త్రిప్తి దిమ్రీ. 'యానిమల్'తో సినీప్రియుల్ని మురిపించిన ఈమే.. ప్రస్తుతం వరుస అవకాశాలతో జోరు చూపిస్తుంది. మరికొద్ది రోజుల్లో 'భూల్ భులయ్యా 3'తో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతున్న ఈ భామ.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం, విమర్శల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. ''చాలా మంది నన్ను ఒక్క సినిమాతోనే రాత్రికి రాత్రే స్టార్ అయిపోయిందని అంటున్నారు. కానీ దీని వెనక నా ఎనిమిదేళ్ల కృషి ఉంది. ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నాను. ఈ చిత్రసీమలో చాలాసార్లు తిరస్కరణకు గురైన నటిని నేను. వెళ్లే ప్రతి ఆడిషన్‌లో నన్ను తిరస్కరించారు. వచ్చే అవకాశాల కన్నా తిరస్కరణలే ఎక్కువయ్యాయి. దీంతో నాకు నటన రాదా? అనే అనుమానం కూడా కలిగింది. నా కెరీర్‌లో పనిలేకుండా ఉన్న రోజులే ఎక్కువే. ఏం జరుగుతుందో అర్థంకాక కొన్ని సార్లు ప్రశాంతతను కోల్పోయి ఎన్నో గందరగోళ పరిస్థితుల్ని ఎదుర్కొన్నాను. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంది. కానీ.. ప్రస్తుతం నా జీవితంలో ఉన్న గందరగోళాన్ని చాలా ఇష్టపడుతున్నాను. నేను పడిన కష్టాలకు, అవమానాలకు ఫలితాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నాను. ప్రస్తుతం వస్తోన్న వరుస అవకాశాల వల్ల కనీసం నాకు తినడానికి సమయం ఉండటం లేద"ని చెప్పుకొచ్చింది త్రిప్తి.


త్రిప్తి దిమ్రీ

ఈనాడు బిజినెస్

కీలక రేట్ల పెంపు వల్లే ద్రవ్యోల్బణం 1.6% తగ్గింది

ముంబయి: కీలక రేట్లను 2022 మే తరవాత 2.5% పెంచడం వల్లే, ద్రవ్యోల్బణం 1.6% మేర అదుపులోకి వచ్చిందని ఆర్‌బీఐ పత్రం వెల్లడించింది. ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్లు మైఖేల్ పాత్ర, ఇంద్రనీల్ భట్టాచార్య, జాయిస్ జాన్, అవ్నీశ్ కుమార్ ఈ పత్రాన్ని రూపొందించారు. 'విధాన రేట్ల పెంపు ద్రవ్యోల్బణ నియంత్రణకు తోడ్పడింది. గిరాకీ తగ్గేందుకు దోహదం చేయడంతో పాటు ప్రతిద్రవ్యోల్బణ పరిస్థితిని సృష్టించింద'ని ఆర్‌బీఐ పత్రం వివరించింది. పరపతి విధాన నిర్ణయాల్లో మార్పులు స్వల్పకాలిక రేట్లపైనే ప్రభావం చూపిస్తాయని తెలిపింది. పరపతి విధాన నిర్ణయాలు గిరాకీ, ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించాయి. 2022 మే నుంచి కీలక రేట్లను 2.5% పెంచడం.. వివిధ మార్గాల్లో విధాన నిర్ణయాల బదిలీ వల్ల 2024-25 రెండో త్రైమాసికం నాటికి ద్రవ్యోల్బణం 160 బేసిస్ పాయింట్లు తగ్గేందుకు దారితీసిందని ఆర్‌బీఐ పత్రం తెలిపింది. ఇందులోని అభిప్రాయాలు రిజర్వ్ బ్యాంక్‌వి కాదని స్పష్టం చేసింది.

పాలసీదారుల సమాచారం లీక్

- రెండు బీమా సంస్థల ఐటీ సిస్టమ్స్ ఆడిట్
- ఐఆర్‌డీఏఐ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: పాలసీదారుల సమాచారం బయటకు లీక్ అయ్యిందంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో, ఐటీ వ్యవస్థల్లో ఆడిట్ నిర్వహించాలని రెండు బీమా సంస్థలను భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఆదేశించింది. ఆ బీమా సంస్థల పేర్లను మాత్రం వెల్లడించలేదు. ఈ అంశంపై ఆయా బీమా సంస్థల యాజమాన్యాలతో సంప్రదింపులు నిర్వహించినట్లు తెలిపింది. పాలసీదారుల సమాచారం బయటకు రావడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. ఈ విషయాన్ని లోతుగా పరిశీలిస్తున్నామని తెలిపింది. సంబంధిత బీమా సంస్థలు తమ ఐటీ వ్యవస్థలను పరిశీలించేందుకు, ఆడిట్ నిర్వహించేందుకు ఒక స్వతంత్ర ఆడిటర్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే బీమా సంస్థలు ఈ విషయమై కేసులు పెట్టాయని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశాయనీ పేర్కొంది. పాలసీదారుల సమాచారం భద్రంగా ఉండేలా చూడాలని, ఒకసారి ఐటీ వ్యవస్థలను తనిఖీ చేసుకోవాలని సూచనలు చేసింది.

వెనీలా సాఫ్టీ ఐస్‌క్రీం మిక్స్‌కు 18% జీఎస్‌టీ

దిల్లీ: వెనీలా ఫ్లేవర్‌లోని సాఫ్టీ ఐస్ క్రీం మిక్స్.. పాల ఉత్పత్తి (డెయిరీ ప్రోడక్ట్) కిందకు రాదని, అందువల్ల 18% జీఎస్‌టీ వర్తిస్తుందని అథారిటీ ఆఫ్ అడ్వాన్స్ రూలింగ్ (ఏఏఆర్) రాజస్థాన్ బెంచ్ స్పష్టం చేసింది. 'ఐస్‌క్రీం సాఫ్ట్, స్మూత్‌గా మార్చడంలో ప్రతి ఒక్క పదార్థానిదీ ప్రత్యేక పాత్ర. ఉత్పత్తిలో వాడే పదార్థాలే కాకుండా.. సాఫ్ట్ సర్వ్ మెషీన్‌లో జరిగే ప్రాసెసింగ్ ప్రక్రియ కూడా ముఖ్యమేనని మేం గుర్తించామ'ని ఏఏఆర్ స్పష్టం చేసింది. జీఎస్‌టీ చట్టం ప్రకారం మానవ వినియోగం కోసం మరింత ప్రాసెసింగ్ చేయాల్సిన అవసరం ఉండే ఆహార పదార్థాల తయారీ ప్రక్రియకు 18% పన్ను వర్తిస్తుంది. అందువల్ల వెనీలా ఫ్లేవర్‌లోని సాఫ్టీ ఐస్ క్రీం మిక్స్‌కు 18% జీఎస్‌టీ వర్తిస్తుందని ఏఏఆర్ ఆదేశాలు జారీ చేసింది.

కోడి గుడ్లు

22న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	505
వరంగల్	507
విజయవాడ	530
గోదావరి	525
విశాఖపట్నం	530
చిత్తూరు	558

కిలో వెండి రూ.1,00,000




ఈనాడు వాణిజ్య విభాగం: అంతర్జాతీయ విపణిలో పెట్టుబడులు తరలి రావడంతో, బంగారం - వెండి ధరలు సోమవారం సరికొత్త గరిష్ఠాలకు చేరాయి. హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.80,500కు చేరగా, కిలో వెండి ధర తొలిసారిగా రూ.లక్షను అధిగమించింది. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి బంగారం ధర 2739 డాలర్లకు, వెండి ధర 34.05 డాలర్లకు చేరడం, అమెరికా డాలర్ విలువ రూ.84.07 పలుకుతున్నందున.. దేశీయంగా ఈ లోహాల ధరలు మరింత భగ్గుమన్నాయి.

యుద్ధ భయాలు.. అనిశ్చితుల వల్లే

అంతర్జాతీయంగా కొవిడ్ పరిణామాల తరవాత రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం.. తదుపరి మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్- పాలస్తీనా, ఇజ్రాయెల్- హెజ్‌బొల్లా (లెబనాన్) మధ్య యుద్ధ పరిస్థితులు ప్రపంచాన్ని కలవరపెడుతున్నాయి. దీనికి అదనంగా ఇరాన్‌పైనా అమెరికా సహా కొన్ని దేశాలు ఆంక్షలు విధించాలని చూస్తుండటం, చైనా-తైవాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో భవిష్యత్తులోనూ అనిశ్చితి పరిస్థితులు కొనసాగుతాయని భావిస్తున్నారు. నవంబరులో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో, గెలుపొందే నేత కూడా అంతర్జాతీయ ఉద్రిక్తతలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే దేశీయ ఆర్థిక పరిస్థితులు బాగున్నా, ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో అత్యంత వేగవంత వృద్ధి మన దగ్గరే నమోదవుతున్నా కూడా ఈక్విటీ మార్కెట్లలో అమ్మకాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా విదేశీ పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐ, ఎఫ్ఐఐ) భారీగా విక్రయాలకు దిగుతూ, పెట్టుబడులు ఉపసంహరిస్తున్నారు. ఫలితంగా మన దగ్గర రూపాయి కొంత బలహీన పడుతూ డాలర్ విలువ రూ.84ను మించింది. అయితే అమెరికాలో వడ్డీరేట్లు తగ్గిస్తున్నందున, బాండ్లపై కంటే పెట్టుబడులను విలువైన లోహాలపైకి అధికులు మళ్లించడమే ప్రస్తుత పరిస్థితికి కారణంగా విశ్లేషిస్తున్నారు.

ఏడాదిలో 801 డాలర్లు పెరిగింది

గతేడాది అక్టోబరులో అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి బంగారం ధర 1938 డాలర్ల వద్ద ఉండగా, ఈ ఏడాది జనవరిలోనూ 2000 డాలర్లుగా ఉంది. ఇప్పుడు 2739 డాలర్లకు మించింది. అంటే ఏడాది వ్యవధిలోనే 801 డాలర్లు అధికమైంది. అంటే గ్రాము ధర ఏడాది వ్యవధిలో 25.72 డాలర్ల మేర అంతర్జాతీయంగా పెరిగింది. దేశీయంగా చూసుకుంటే, ప్రస్తుత డాలర్ విలువ రూ.84.07 కావడంతో, గ్రాముకు రూ.2179 మేర పెరిగింది. దేశీయంగా ఈ ఏడాది జులై ముందు వరకు పసిడి-వెండిపై 18% పన్ను భారం పడేది. అందువల్ల అంతర్జాతీయంగా ధర తక్కువగా ఉన్నా, ఇక్కడ అధికంగా ఉండేది. బడ్జెట్‌లో సుంకాన్ని 9% తగ్గించినా, అంతర్జాతీయంగా ధరలు పెరగడంతో.. ఇక్కడి కొనుగోలుదార్లకు ఎటువంటి ఊరట లభించడం లేదు.



సోమవారం రాత్రి 11.30 గంటలకు ట్రేడింగ్ ముగిసే సరికి అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం 2721 డాలర్లకు, వెండి 33.80 డాలర్లకు తగ్గాయి. హైదరాబాద్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం రూ.80,300, కిలో వెండి ధర రూ.99,600 వద్ద స్థిరపడ్డాయి.

అల్ట్రాటెక్ లాభం రూ.825 కోట్లు

దిల్లీ: అల్ట్రాటెక్ సిమెంట్, జులై-సెప్టెంబరు త్రైమాసికానికి ఏకీకృత ప్రాతిపదికన రూ.825.18 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసింది. 2023-24 ఇదే త్రైమాసిక లాభం రూ.1,280.38 కోట్లు కావడం గమనార్హం. కార్యకలాపాల ఆదాయం రూ.16,012.13 కోట్ల నుంచి రూ.15,634.73 కోట్లకు తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం వ్యయాలు రూ.14,837.44 కోట్లుగా నమోదయ్యాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన రస్ అల్ ఖైమా కంపెనీ ఫర్ వైట్ సిమెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ పీఎస్‌సీ (ఆర్ఏకేడబ్ల్యూ)లో అదనపు వాటా కొనుగోలు చేయడం వల్ల, 2023-24 జులై- సెప్టెంబరు ఫలితాలతో తాజా ఫలితాలను పోల్చలేమని అల్ట్రాటెక్ సిమెంట్ తెలిపింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో ఇతర ఆదాయంతో కలిపి మొత్తం ఆదాయం రూ.15,855.46 కోట్లుగా నమోదైంది. మౌలిక రంగంపై ప్రభుత్వ వ్యయాలు, పట్టణ గృహ రంగంలో గిరాకీ వల్ల సిమెంట్ అమ్మకాలు 7-8% పెరిగే అవకాశం ఉందని సంస్థ పేర్కొంది.

యూనియన్ బ్యాంక్ లాభంలో 34% వృద్ధి


దిల్లీ: యూనియన్ బ్యాంక్ సెప్టెంబరు త్రైమాసికంలో రూ.4,720 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదే కాల లాభం రూ.3,511 కోట్లతో పోలిస్తే ఇది 34% అధికం. మొత్తం ఆదాయం రూ.28,282 కోట్ల నుంచి రూ.32,036 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.24,587 కోట్ల నుంచి రూ.26,708 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 0.87% తగ్గి రూ.9,047 కోట్లకు పరిమితమైంది. సెప్టెంబరు చివరకు నికర వడ్డీ మార్జిన్ 3.18% నుంచి 2.9 శాతానికి చేరింది. స్థూల నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏలు) 6.38% నుంచి 4.36 శాతానికి, నికర నిరర్థక ఆస్తులు 1.30% నుంచి 0.98 శాతానికి తగ్గాయి.

దేశంలో తొలి బొగ్గు ఎక్స్ఛేంజీ: మంత్రి కిషన్ రెడ్డి



దిల్లీ: దేశంలోనే తొలి బొగ్గు ఎక్స్ఛేంజీని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మరింత మంది విక్రయదార్లు, కొనుగోలుదార్లు బొగ్గును కమొడిటీగా ట్రేడ్ చేసేందుకు ఈ ఎక్స్ఛేంజీ దోహదం చేయనుంది. ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా బొగ్గును విక్రయించేందుకు, విపణిలో బొగ్గు లభ్యతను పెంచేందుకు బొగ్గు ట్రేడింగ్ ఎక్స్ఛేంజీని ఏర్పాటు చేయనున్నారు. కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ పర్యవేక్షణలో ఇది పని చేయనుంది. దేశీయ అవసరాల కోసం అవసరమైతే బొగ్గును రష్యా నుంచి దిగుమతి చేసుకోనున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు.

శాటిలైట్ సేవలతో అందరికీ ఇంటర్నెట్



సునీల్ భారతీ మిత్తల్

దిల్లీ: మారుమూల ప్రాంతాలకూ శాటిలైట్ కమ్యూనికేషన్స్ అనే 'మ్యాజిక్ బులెట్' ద్వారా ఇంటర్నెట్ వెలుగులు అందించవచ్చని భారతీ ఛైర్మన్ సునీల్ భారతీ మిత్తల్ పేర్కొన్నారు. టెలికాం కంపెనీలకు ఈ రూపేణ గొప్ప అవకాశం ముందుందని సోమవారమిక్కడ జరిగిన 'ఎన్‌డీటీవీ వరల్డ్ సమిట్‌'లో పేర్కొన్నారు. 'ప్రపంచంలో దాదాపు 200 కోట్ల మంది ప్రజలు ఇంటర్నెట్‌తో ఇంకా అనుసంధానం కాలేదు. మన దేశంలోనూ పలు ప్రాంతాలు ఇలా ఉన్నాయి. ఎడారులు, అడవులు, తీర ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ కానీ, ఫైబర్ సేవలు కానీ అందించలేం. ఈ ప్రాంతాలకు శాటిలైట్ కమ్యూనికేషన్స్ అవసరం. దేశంలో 5% మంది జనాభాకు ఇంకా ఇంటర్నెట్ చేరాల్సి ఉంది. వీరు దేశంలోని 25% భూభాగంలో నివసిస్తున్నారు. అంటే అధిక విస్తీర్ణం.. తక్కువ జనాభా అన్నమాట. కాబట్టి వీరికి శాటిలైట్ ద్వారానే ఇంటర్నెట్‌ను అందించగలమ'న్నారు. భారత్‌లో శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపు పద్ధతి విషయంలో అమెరికా కుబేరుడు ఎలాన్ మస్క్‌తో దేశీయ టెలికాం సంస్థల అధిపతులు ముకేశ్ అంబానీ, మిత్తల్ విభేదిస్తున్న తరుణంలో మిత్తల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

విమానాల డిజైనింగ్, తయారీ దిశగా భారత్

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



దిల్లీ: దేశీయంగా విమానాల డిజైనింగ్, తయారీ దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఎన్‌డీటీవీ వరల్డ్ సమిట్‌లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. విమానాల డిజైన్, తయారీని నియంత్రించేలా భారతీయ వాయుయాన్ విధేయక్ బిల్-2024లో నిబంధనలను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. 'మేం భారత్‌లో విమానాలను తయారు చేయాలనుకుంటున్నాం. అందుకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ (హెచ్ఏఎల్), నేషనల్ ఏరోస్పేస్ లేబొరేటరీస్(ఎన్ఏఎల్)తో పాటు ఇతర కంపెనీల సహాయం తీసుకుంటున్నాం. భవిష్యత్తులో దేశీయ గిరాకీకి తగ్గట్లుగానే కాదు.. మొత్తం ప్రపంచానికి విమానాలందించే స్థాయికి చేరతాం. ఆ దిశగా అడుగులు వేస్తున్నామ'ని పేర్కొన్నారు. ప్రస్తుతం భారతీయ కంపెనీలు 1200 కొత్త విమానాలకు ఆర్డరు పెట్టిన సంగతి తెలిసిందే.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో రతన్ టాటా పేరిట ప్రతిష్ఠాత్మక భవనం



దిల్లీ: టాటా గ్రూప్, ఇంగ్లండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన సోమర్‌విలే కాలేజ్ కలిసి రతన్ టాటా గౌరవార్థం ఒక ప్రతిష్ఠాత్మక భవనాన్ని నిర్మించనున్నాయి. 'రతన్ టాటా బిల్డింగ్‌'గా దీనికి పేరు పెడతారు. దీని నిర్మాణం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని కొత్త రాడ్‌క్లిఫ్ అబ్సర్వేటరీ క్వార్టర్‌లో వచ్చే ఏడాది ప్రారంభంలో చేపడతారు. 'సోమర్‌విలే కాలేజ్‌తో మా భాగస్వామ్యం టాటా విలువలకు ఒక నివాళి. ఈ భవనం పరిశోధనలకు నిలయమవుతుంది. భారత్‌కు ఇది తక్షణావసరం' అని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ పేర్కొన్నారు.

సైయెంట్ డీఎల్ఎంకు రూ.15.5 కోట్ల నికరలాభం

ఈనాడు, హైదరాబాద్: ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు ప్రధానంగా ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులను తయారు చేసే సైయెంట్ డీఎల్ఎం లిమిటెడ్, సెప్టెంబరు త్రైమాసికానికి రూ.389.4 కోట్ల ఆదాయం, రూ.15.5 కోట్ల నికర లాభం ఆర్జించింది. కంపెనీ చేతిలో రూ.197.9 కోట్ల ఆర్డర్లు ఉన్నాయి. 2023-24 ఇదే కాలంతో పోలిస్తే ఈసారి ఆదాయం 33.4%, నికరలాభం 5.4% పెరిగాయి. సమీక్షా త్రైమాసికంలో అధిక ఆదాయం ఏరోస్పేస్ క్లయింట్ల నుంచే లభించింది. తర్వాత స్థానంలో ఉన్న రక్షణ రంగ పరిశ్రమల నుంచి ఆర్డర్లు పెరుగుతున్నట్లు కంపెనీ వెల్లడించింది.

ఆర్థిక సేవల రంగంలో పెరగనున్న ఉద్యోగాలు



ఈనాడు, హైదరాబాద్: పండగల నేపథ్యంలో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగాల్లో ఉద్యోగాలు పెరిగేందుకు అవకాశాలు ఉన్నాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ నివేదిక తెలిపింది. ఈ రంగాల్లో కార్యకలాపాలు పెరగడంతో, లావాదేవీలు నిర్వహించేందుకు అవసరమైన నిపుణుల కోసం ఆర్థిక సంస్థలు అన్వేషిస్తున్నాయని పేర్కొంది. రిటైల్ రుణాలు, సూక్ష్మ రుణ సంస్థలు, చెల్లింపుల సేవలను అందించే సంస్థల్లో ఉద్యోగాల కల్పన పెరిగే అవకాశం ఉందని తెలిపింది. వాహన, వ్యక్తిగత రుణాలకు గత నాలుగు నెలల్లో 12% గిరాకీ పెరిగిందని, రానున్న రోజుల్లో ఇది మరింత వృద్ధి చెందే అవకాశం ఉందని పేర్కొంది. రిటైల్, సూక్ష్మ రుణాల సంస్థల్లో 25%, చెల్లింపుల సేవల్లో 41% వరకు నియామకాలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. 'వినియోగదారులకు మెరుగైన సేవలను అందించేందుకు, నైపుణ్యం ఉన్న వారిని నియమించుకునేందుకు సంస్థలు ప్రయత్నిస్తున్నాయి' అని టీమ్‌లీజ్ సర్వీసెస్ బిజినెస్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ కృష్ణేందు ఛటర్జీ తెలిపారు.

కంపెనీపై అనురక్తి వల్లే 500 కోట్ల డాలర్లకు జెప్టో

సోమవారం దిల్లీలో జరిగిన 'ఎన్‌డీటీవీ వరల్డ్ సమిట్‌'లో వివిధ సంస్థల నిపుణులు ఏమన్నారంటే..



జెప్టో సీఈఓ ఆదిత్ పలిచా

సంపద సృష్టిపై దృష్టి పెట్టకుండా.. ఒక విప్లవాత్మక కంపెనీని నిర్మించాలన్న అనురక్తి వల్లే మా కంపెనీ 500 కోట్ల డాలర్ల స్థాయికి చేరింది. మేం మా పనిని పిచ్చిపట్టినట్లు చేశాం. వ్యక్తిగత సంపదపై ఎపుడూ దృష్టి పెట్టలేదు. వారానికి 80-100 గంటలు పనిచేశాం. అందులో సగం ఒత్తిడితోనే చేశాం. ఒకానొక దశలో డబ్బులు అసందర్భమైనవిగా అనిపించాయి. కస్టమర్ సపోర్ట్ విషయంలో జనరేటివ్ ఏఐ సొల్యూషన్‌ను తీసుకురావడంపై మేం పనిచేస్తున్నాం.

ఆధార్‌తో ప్రభుత్వ ప్రయోజనాలు వేగంగా..

ప్రపంచంలోనే అత్యంత ప్రముఖ సాంకేతిక వ్యవస్థ ఆధార్. దీని ద్వారా ప్రభుత్వ ప్రయోజనాలను వేగంగా అందించగలుగుతున్నారు. అమెరికాలో ఇదే తరహా ప్లాట్‌ఫాంను విజయవంతంగా ఏర్పాటు చేయలేకపోయారు. ఎందుకంటే అక్కడ ప్రైవేటు రంగ గుత్తాధిపత్యం ఉంది. యూపీఐ, డీబీటీ వంటివాటిలో ఆధార్‌ను వినియోగిస్తూ ప్రజలకు ప్రయోజనం కలిగిస్తున్నారు. సుప్రీంలో ఆధార్ పథకానికి వ్యతిరేకంగా చాలా కేసులు వచ్చినా, ప్రభుత్వం కేవలం ప్రజల కోసమే దీనిని ముందుకు తీసుకెళ్లింది.

– నోబెల్ గ్రహీత పాల్ రోమర్

తయారీ రంగంలో వినూత్నతే కీలకం

తయారీ రంగంలో విశేష వృద్ధిని సాధించడానికి వినూత్నతే కీలకం. తయారీ రంగానికి ఊతమిచ్చే సాంకేతికతలను స్థానికంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. పాశ్చాత్య దేశాలు మనల్ని చూసి కాపీ కొట్టేంతలా ఉత్పత్తులను తయారు చేయాలి. ఇందుకు వినూత్నత చాలా ముఖ్యం. మీ కోసం.. దేశం కోసం.. ఈ పనిని చేయాలి.

– భారత్ ఫోర్జ్ ఛైర్మన్ ఎండీ బాబా కల్యాణి

భారత పౌరవిమానయానంలో భారీ వృద్ధి అవకాశాలు

భారత పౌర విమానయాన రంగంలో భారీ వృద్ధి అవకాశాలు ఉన్నాయి. విమానయాన రంగానికి భారత్ ఎంతో చేయగలదు. ఇక్కడ భారీ అవకాశాలు ఉన్నాయి. (ప్రస్తుతం ఎయిరిండియా విమానాలకు ఈ కంపెనీ ఇంజిన్‌లను సరఫరా చేస్తోంది.)

– జీఈ ఏరోస్పేస్ సౌతేషియా సీఈఓ విక్రమ్ రాయ్

వాల్ట్ డిస్నీ కొత్త ఛైర్మన్‌గా గోర్మన్

వాషింగ్టన్: వాల్ట్ డిస్నీ కొత్త ఛైర్మన్‌గా జేమ్స్ గోర్మన్ 2025 జనవరి 2న బాధ్యతలు చేపట్టనున్నారు. డిస్నీ బోర్డులో తొమ్మిదేళ్ల పాటు సేవలు అందించిన మార్క్ పార్కర్ ఛైర్మన్ బాధ్యతల నుంచి వైదొలగుతుండటంతో, ఆయన స్థానంలో గోర్మన్ రానున్నారు. 2026 ప్రారంభంలో కొత్త సీఈఓ (ముఖ్య కార్యనిర్వహణ అధికారి) పేరును కూడా ప్రకటించే అవకాశం ఉందని వాల్ట్ డిస్నీ తెలిపింది. మోర్గాన్ స్టాన్లీకి 2010 నుంచి 2023 వరకు సీఈఓగా, 2012 నుంచి 2023 వరకు ఛైర్మన్‌గా గోర్మన్ బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం డిస్నీకి సక్సెషన్ ప్లానింగ్ కమిటీకి ఛైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

సనోఫిలో 26% వాటాకు సీడీ అండ్ ఆర్ ఓపెన్ ఆఫర్

దిల్లీ: సనోఫి కన్జూమర్ హెల్త్‌కేర్ ఇండియాలో 26% వాటా కొనుగోలు చేయడం కోసం అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ సీడీ అండ్ ఆర్ రూ.2,983 కోట్లతో ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. సనోఫి, సీడీ అండ్ ఆర్ మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా సనోఫి కన్జూమర్ హెల్త్‌కేర్ ఇండియాలో 60.4% వాటా ఉన్న ఒపెల్లాలో మెజారిటీ వాటా కొనుగోలు చేయడానికి సీడీ అండ్ ఆర్ అంగీకరించింది. ఈ నేపథ్యంలోనే తాజా ఓపెన్ ఆఫర్ చోటు చేసుకుంది. ఒక్కో షేరును రూ.4,982.05 చొప్పున, 26% వాటాకు రూ.2,983.23 కోట్ల ఓపెన్ ఆఫర్‌ను కంపెనీ ప్రకటించింది.

కొత్త విభాగంలోకి జొమాటో వెళ్లదు

- 'కంటిన్యూ'పై కంపెనీ స్పష్టీకరణ
- తన వ్యక్తిగత వెంచర్ అన్న దీపిందర్ గోయల్

దిల్లీ: తాము ఎటువంటి కొత్త విభాగంలోకీ ప్రవేశించడం లేదని ఆహార డెలివరీ ప్లాట్‌ఫాం జొమాటో స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న నాలుగు వ్యాపారాలపైనే దృష్టి సారిస్తున్నట్లు తెలిపింది. కంపెనీ కొత్త ఆరోగ్య, వెల్‌నెస్ సంస్థ 'కంటిన్యూ'ను వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ రిజిస్టర్ చేస్తున్నారన్న వార్తల నేపథ్యంలో, సంస్థ పై విధంగా స్పందించింది. 'కంటిన్యూ అనేది నా వ్యక్తిగత వెంచర్. పూర్తిగా నేనే నిధులు సమకూరుస్తాను' అని దీపిందర్ పేర్కొన్నారు.

మిత్తల్ గొంతుతో ఆయన ఉద్యోగికే టోకరాయత్నం!

దిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతతో, వేరే వారి లాగా మాట్లాడటం (క్లోనింగ్) ద్వారా వ్యక్తులను మోసం చేసి డబ్బులు గుంజడం చూస్తున్నాం. ఎయిర్‌టెల్ అధినేత సునీల్ భారతీ మిత్తల్ గొంతునే క్లోన్ చేసి.. దుబాయ్‌లో ఉన్న ఆయన ఉన్నతోద్యోగినే మోసం చేయాలని చూసిన విషయాన్ని స్వయంగా మిత్తల్ పంచుకున్నారు. 'ఏఐ వంటి కొత్త తరం సాంకేతికతను దుర్వినియోగం చేస్తున్నారు. నా గొంతుతో దుబాయ్‌లోని మా ఎగ్జిక్యూటివ్‌కు ఫోన్ చేశారు. భారీ మొత్తంలో తక్షణం నగదు బదిలీ చేయమని చెప్పారు. నేను అలా అడగనని తెలిసిందునే, ఇది మోసపూరిత కాల్‌గా అతను గుర్తించాడు. ఆ వాయిస్ రికార్డ్ వింటే, కచ్చితంగా నా గొంతులాగే అనిపించింది. కాబట్టి ప్రజలు సదా అప్రమత్తంగా ఉంటేనే ఇటువంటి మోసాల బారిన పడకుండా ఉంటారు. జూమ్ వీడియో కాల్‌లోనూ మొహాలను కాపీ చేయడం, డిజిటల్ సంతకాలను దుర్వినియోగం చేయడం వంటివీ చేయొచ్చు' అని వివరించారు.

జులై- సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2024-25	నికర లాభం/(నష్టం) 2023-24	మొత్తం ఆదాయం 2024-25	మొత్తం ఆదాయం 2023-24
బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్	546.00	451.00	2410.00	1912.00
సీజీ పవర్	220.00	244.00	2413.00	2002.00
హెచ్ఎఫ్‌సీఎల్	73.00	-----	1094.00	-----
ఆరమ్ ప్రాప్‌టెక్	(9.55)	(20.10)	67.61	57.53

ఆరంభ లాభాలు ఆవిరి

సెన్సెక్స్ ▼ 73 81151

నిఫ్టీ ▼ 73 24781

ఎఫ్ఐఐల విక్రయాలు రూ.2,261.83 కోట్లు

డీఐఐల కొనుగోళ్లు రూ.3,225.91 కోట్లు

- కోటక్ బ్యాంక్ షేరుకు విక్రయాల ఒత్తిడి
- కొనసాగుతున్న విదేశీ మదుపర్ల అమ్మకాలు

కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరుకు విక్రయాల ఒత్తిడి తలెత్తడం, విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగడంతో సోమవారం దేశీయ సూచీలు ఆరంభ లాభాలను నిలబెట్టుకోలేకపోయాయి. సెన్సెక్స్ - నిఫ్టీ చెరి 73 పాయింట్ల మేర నష్టపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 959 పాయింట్ల మేర ఊగిసలాడింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 1.04% పెరిగి 73.82 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ మార్పు లేకుండా 84.07 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో టోక్యో, హాంకాంగ్ సూచీలు పడ్డాయి. సియోల్, షాంఘై సానుకూలంగా ముగిశాయి. ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా కదలాడాయి.

సెన్సెక్స్ ఉదయం 81,770.02 వద్ద 545 పాయింట్ల లాభంతో (క్రితం ముగింపు 81,224.75 పాయింట్లు) ప్రారంభమైంది. ఆ తర్వాత విక్రయాల ఒత్తిడితో ఒక దశలో 80,811.23 పాయింట్ల వద్ద కనిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 73.48 పాయింట్ల నష్టంతో 81,151.27 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 72.95 పాయింట్లు నష్టపోయి 24,781.10 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 21 నష్టపోయాయి. కోటక్ బ్యాంక్ 4.29%, బజాజ్ ఫిన్‌సర్వ్ 3.35%, ఇండస్ఇండ్ బ్యాంక్ 2.86%, అదానీ పోర్ట్స్ 2.15%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.73%, బజాజ్ ఫైనాన్స్ 1.63%, ఇన్ఫోసిస్ 1.40%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.11%, టీసీఎస్ 1.06% చొప్పున పడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.83%, ఏషియన్ పెయింట్స్ 1.94%, ఎం అండ్ ఎం 1.12% చొప్పున పెరిగాయి.

వచ్చే ఏడాది టాటా సన్స్ లిస్టింగ్

టాటా సన్స్ షేరు 2025 సెప్టెంబరులోపు స్టాక్ మార్కెట్‌లో నమోదు కావడం తప్పనిసరి అన్న సమాచారంతో, **టాటా కెమికల్స్** షేరు బీఎస్ఈలో 9.24% పెరిగి రూ.1,188.45 వద్ద ముగిసింది. స్టాక్ లిస్టింగ్ నుంచి టాటా సన్స్‌ను మినహాయించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ను టాటా గ్రూప్ అభ్యర్థించినా, ఫలితం లభించలేదు.

ఐపీఓ సమాచారం



- ఆరోగ్య బీమా సంస్థ **నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్** కంపెనీ, 'పరాస్ హెల్త్' బ్రాండ్‌పై హాస్పిటల్స్‌ను నిర్వహిస్తున్న **పరాస్ హెల్త్‌కేర్ లిమిటెడ్**‌ల ఐపీఓ ప్రతిపాదనలకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ సోమవారం ఆమోదం తెలిపింది. నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్ రూ.3,000 కోట్లు, పరాస్ హెల్త్‌కేర్ రూ.400 కోట్లు సమీకరించనున్నాయి.
- **అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్** ఐపీఓ ధరల శ్రేణిని రూ.440-446గా కంపెనీ నిర్ణయించింది. ఈ నెల 25-29 తేదీల్లో ఇష్యూ ఉండనుంది. రూ.5,430 కోట్ల నిధుల్ని సంస్థ సమీకరించబోతోంది.
- **వారీ ఎనర్జీస్** ఐపీఓ తొలి రోజున 3.29 రెట్ల స్పందన లభించింది. 2,10,79,384 షేర్లను కంపెనీ ఆఫర్ చేయగా, 6,92,83,467 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ మదుపర్ల విభాగంలో 3.16 రెట్ల స్పందన లభించింది.
- **దీపక్ బిల్డర్స్** ఐపీఓకు తొలి రోజున 4.12 రెట్ల స్పందన లభించింది. 89,67,061 షేర్లను ఆఫర్ చేయగా, 3,69,59,389 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.
- యూపీఎస్ఆర్‌టీసీ నుంచి 1,000 డీజిల్ బస్ ఛాసిస్‌ల సరఫరా ఆర్డర్‌ను పొందినట్లు **టాటా మోటార్స్** వెల్లడించింది.
- హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న **బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్** షేర్లను విభజించేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. రూ.2 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరును రూ.1 ముఖ విలువ కలిగిన 2 షేర్లుగా విభజించనుంది. దీంతో ఒక షేరు ఉన్న వారికి మరో షేరు లభించనుంది.

సెప్టెంబరు త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో

- **హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్** షేరు బీఎస్ఈలో 2.83% లాభపడి రూ.1,728.80 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 3.98% పెరిగి రూ.1,748.20కి చేరింది కూడా. చివరకు బ్యాంక్ మార్కెట్ విలువ రూ.36,360.66 కోట్లు పెరిగి రూ.13,19,208.95 కోట్లుగా నమోదైంది.
- **టెక్ మహీంద్రా** షేరు బీఎస్ఈలో ఒక దశలో 4.34% పెరిగి రూ.1,761.30 వద్ద 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 0.78% లాభంతో రూ.1701.10 వద్ద ముగిసింది.
- **కోటక్ మహీంద్రా బ్యాంక్** షేరు బీఎస్ఈలో 4.29% నష్టపోయి రూ.1,789.55 వద్ద ముగిసింది. బ్యాంక్ మార్కెట్ విలువ రూ.15,954.65 కోట్లు తగ్గి రూ.3,55,784.02 కోట్లకు పరిమితమైంది.
- **ఆర్‌బీఎల్ బ్యాంక్** షేరు బీఎస్ఈలో 14.21% క్షీణించి రూ.176.25 వద్ద ముగిసింది. ఒక దశలో 14.77% తగ్గి రూ.175.10 వద్ద 52 వారాల కనిష్ఠ స్థాయిని తాకింది.

నేటి బోర్డు సమావేశాలు

బజాజ్ ఫైనాన్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ, జొమాటో, ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, సిగ్నిటీ టెక్నాలజీస్ వరుణ్ బేవరేజెస్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఇండస్ టవర్స్, పర్సిస్టెంట్స్ సిస్టమ్స్, పేటీఎం, కోఫోర్జ్, మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్, మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆదిత్య బిర్లా రియల్ ఎస్టేట్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్, క్యాన్ ఫిన్ హోమ్స్, జీఎండీసీ, షాపర్స్ స్టాప్

కరణ్ జోహార్ సంస్థలో 50% వాటా అదర్ పూనావాలాకు!

దిల్లీ: ప్రముఖ దర్శక నిర్మాత కరణ్ జోహార్‌కు చెందిన, బాలీవుడ్ దిగ్గజ నిర్మాణ సంస్థ **ధర్మ ప్రొడక్షన్స్, ధర్మాటిక్ ఎంటర్‌టైన్‌మెంట్‌**లో 50% వాటాను విక్రయిస్తున్నారు. ఈ వాటాను తాము రూ.1,000 కోట్లతో కొనుగోలు చేస్తున్నట్లు వాక్సిన్ల తయారీ సంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఐ) సీఈఓ అదర్ పూనావాలాకు చెందిన సెరేన్ ప్రొడక్షన్స్ తెలిపింది. సినీ నిర్మాణ సంస్థలో 50% వాటా కరణ్ దగ్గరే ఉంటుందని, ఆయనే కంపెనీకి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉంటూ క్రియేటివ్ వ్యవహారాలను పర్యవేక్షిస్తారని వెల్లడించింది. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉండే అపూర్వ మెహ్తా కార్యకలాపాలు, వ్యూహాలను పర్యవేక్షిస్తారు.

sukhi@eenadu.in

సుఖీభవ

ఈనాడు

18 హైదరాబాద్, మంగళవారం అక్టోబరు 22, 2024

పదివేల అడుగులు నడవొచ్చా?

డాక్టర్ సలహా

సమస్య: నాకు 65 ఏళ్లు. విశ్రాంత ఉద్యోగిని. బరువు 72.5 కిలోలు. బీపీ 140/96, గ్లూకోజు 120 ఎంజీ (భోజనం తర్వాత) ఉన్నాయి. నేను పెడో మీటర్ ధరించి ఉదయం పూట ఇంట్లోనే 8 వేల అడుగులు.. సాయంత్రం డాబా మీద మరో 2 వేల అడుగులు నడుస్తాను. మొత్తంగా 10 వేల నుంచి 12 వేల అడుగులు నడుస్తాను. నా వయసు రీత్యా ఇంత దూరం నడవొచ్చా? – ఎ.చిట్టిబాబు, శ్రీకాకుళం

సలహా: అధిక రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాల సమస్యలు అదుపులో



ఉండటానికి నడక ఎంతో మేలు చేస్తుంది. శరీరం తూలకుండా ఉండటానికి, మానసిక ఆరోగ్యం మెరుగు పడటానికీ తోడ్పడు తుంది. ఇందులో సందేహమేమీ లేదు. అయితే మీ వయసు రీత్యా అంత ఎక్కువగా నడవాల్సిన అవసరం లేదు. సాధారణంగా చిన్న వయసువారికి కనీసం 10 వేల అడుగులైనా నడవాలని సూచిస్తాం. అదే వయోధికులైతే 4 వేల నుంచి 5 వేల అడుగులు నడిస్తే చాలు. మీరు మరీ ఎక్కువగా నడిస్తే కీళ్ల నొప్పులు రావొచ్చు. కాబట్టి ఒక్క నడవటమే కాకుండా ఇతర రకాల వ్యాయామాలు చేస్తే మంచిది. ఉదయం పూటో, సాయంత్రం వేళనో సైకిల్ తొక్కటం, ఈత కొట్టటం వంటివి చేయొచ్చు. వీటితో కీళ్ల మీద అంత ఎక్కువగా భారం పడదు. మోకాళ్ల ఆరోగ్యమూ మెరుగవుతుంది. ఇంకా ఎక్కువ కాలం నడవటానికీ వీలుంటుంది. అలాగే రోజుకు 20 నిమిషాల సేపు యోగా, ధ్యానం చేయటమూ మంచిదే. ఇవి శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఆరోగ్యానికీ దోహదం చేస్తాయి. మొత్తమ్మీద వ్యాయామం విషయంలో అన్నిరకాలు సమ్మిళితమయ్యేలా చూసుకోవటం ముఖ్యం.



– డా॥ ఎ.వి. ఆంజనేయులు, సీనియర్ కార్డియాలజిస్ట్

మీ ఆరోగ్య సమస్యలను, సందేహాలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

వాటర్ పిల్స్‌తో బరువు తగ్గుతుందా?

కొందరు త్వరగా బరువు తగ్గటానికి మూత్రం ఎక్కువగా వచ్చేలా చేసే మాత్రలు (వాటర్ పిల్స్) వేసుకుంటుంటారు. నిజానికి ఒంట్లోంచి నీరు సరిగా వెళ్లని సందర్భాల్లోనే డాక్టర్లు వీటిని సూచిస్తుంటారు. ఈ మాత్రలతో కేవలం నీరు మాత్రమే బయటకు పోతుంది. ఆ మేరకు బరువు తగ్గినట్టు అనిపిస్తుంది అంతే. ఒంట్లో కొవ్వేమీ తగ్గదు. నీరు తాగిన వెంటనే తిరిగి బరువు పెరుగుతుంది. అంతేకాదు, మూత్రంతో పాటు సోడియం, పొటాషియం వంటి ఖనిజ లవణాలూ పోతాయి. దీంతో ఎలక్ట్రోలైట్ల సమతుల్యత లోపిస్తుంది. కండరాలు పట్టేయటం, బలహీనత, గుండె లయ దెబ్బతినటం వంటి సమస్యలకూ దారితీస్తుంది.

గట్టి సమస్యే!



అంగ స్తంభన లోపం తరచూ చూసేదే. ఎప్పుడో అప్పుడు ఇలాంటి పరిస్థితి ఎదురైతే అంతగా చింతించాల్సిన అవసరం లేదు. కానీ అదేపనిగా ఇబ్బంది పెడుతుంటే మాత్రం పట్టించుకోవాల్సిందే. ఒకప్పుడు దీన్ని కేవలం మానసిక సమస్యగానే భావించేవారు. చాలామందిలో శారీరక.. ముఖ్యంగా అంగానికి రక్త ప్రసరణతో ముడిపడిన సమస్యలే దీనికి కారణమవుతున్నాయని ఇప్పుడు తెలుసుకున్నారు. చిన్న వయసు వారిలో ప్రధానంగా ఇది మానసికమే అయినప్పటికీ వయసు మీద పడుతున్నకొద్దీ తలెత్తే రకరకాల జబ్బులూ స్తంభన లోపానికి దారితీస్తున్నాయి. దీని మూలంగా ఎంతోమంది తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. స్తంభనను తిరిగి సాధించటానికి, సామర్థ్యాన్ని చూపటానికి ప్రయత్నిస్తుంటారు. ఇదీ ఫలించకపోతే ఆందోళన, కుంగుబాటుకు లోనవుతుంటారు. చివరికిది నిజంగానే మానసిక సమస్యగా పరిణమిస్తుంటుంది. కాబట్టి సంకోచం, బిడియం, బింకం వదిలేసి చికిత్స తీసుకోవటం మంచిది.



డా॥ కె.సుబ్రహ్మణ్యం
యూరాలజిస్ట్
అపోలో హాస్పిటల్స్
జూబిలీహిల్స్
హైదరాబాద్

బయటకు చెప్పుకోవటానికి నామోషీ. అలాగని దాచుకోనూలేరు. భాగస్వామి ముందు తేలిపోతూనే ఉంటారు. మునుపటిలా శృంగారాన్ని ఆస్వాదించలేక చతికిల పడుతుంటారు. అసలేమైంది? అప్పుడే చేవ తగ్గిందా? అని మథన పడుతుంటారు. అంగ స్తంభన లోపం (ఎరక్టైల్ డిస్‌ఫంక్షన్) ఇలాగే కుంగదీస్తుంది. పురుషులంతా జీవితంలో ఎప్పుడో అప్పుడు ఎదుర్కొనే గట్టి సమస్యే ఇది. అంగం సరిగా స్తంభించక, గట్టిపడినా ఎక్కువసేపు కొనసాగక మనసును అతలాకుతలం చేసేస్తుంది. ఒకప్పుడు దీన్ని వయసుతో పాటు వచ్చేదేనని, ఏమీ చేయలేమని అనుకునేవారు. ఇప్పుడు మంచి మందులు, చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. తిరిగి కొత్త సామర్థ్యాన్ని కలిగిస్తున్నాయి.

చిన్నవయసులో మానసికమే

సాధారణంగా స్తంభన లోపం పెద్దవయసులోనే ఎక్కువ. అలాగని చిన్నవయసులో రాకూడదనేమీ లేదు. 35, 40 ఏళ్ల వారిలోనూ చూస్తుంటాం. ఇటీవల పెళ్లి అయినవారిలోనూ కనిపించొచ్చు. వీరిలో ప్రధాన కారణం మానసిక భావనే. ప్రధానంగా శృంగారం మీద అవగాహన లేకపోవటం, నీలి చిత్రాల వంటివి చూసి లేనిపోని అపోహలు పెంచుకోవటం వంటివి దోహదం చేస్తుంటాయి. ఎక్కువ సేపు శృంగారం చేస్తామంటూ ఇతరులు చెప్పే అవాస్తవాలను నమ్మి, తాము అంతసేపు చేయలేకపోతున్నామనీ ఆవేదన పడుతుంటారు. దీంతో కుంగుబాటుకు లోనయ్యి, సంభోగ సమయంలో అంగం స్తంభించక సతమతమవుతుంటారు. ఏదో ఒత్తిడిలో ఒకసారి సరిగా శృంగారంలో పాల్గొనకపోతే భాగస్వామి చేసే వ్యాఖ్యలకూ కుంగిపోతారు. ఇది ముమ్మందూ కొనసాగుతూ రావొచ్చు. 'ఇంతకుముందు సరిగా చేయలేదు కదా, ఇప్పుడూ అలాగే అవుతుందేమో' అనే భయంతో ముందే జావగారతారు. మూడోసారి, నాలుగోసారి.. ఇలా క్రమంగా తీవ్ర ఒత్తిడికి గురవుతారు. స్తంభన లోపంతో కుంగుబాటు రావటమే కాదు.. కుంగుబాటు సైతం స్తంభన లోపానికి దారితీయొచ్చు.

చికిత్స: వీరికి కౌన్సెలింగ్ బాగా ఉపయోగపడుతుంది. దీంతోనే చాలామంది మామూలుగా అవుతారు. అవసరమైతే వయాగ్రాలాంటి మాత్రలు వేసుకోవాల్సి రావొచ్చు. వీటితో ఒకట్రెండు సార్లు సరిగా శృంగారంలో పాల్గొనేలా చేయగలిగితే.. ఆ తర్వాత సహజంగానే శృంగారంలో పాల్గొంటారు. బాల్యంలో వృషణాలు క్షీణించటం వల్ల కొందరికి టెస్టోస్టిరాన్ మోతాదులు తగ్గొచ్చు. దీంతో శృంగారం మీద ఆసక్తి సన్నగిల్లుతుంది. ఆసక్తి ఉన్నా అంగం గట్టిపడదు. ఇలాంటివారికి టెస్టోస్టిరాన్ మాత్రలు, ఇంజెక్షన్లు, మలాములు ఉపయోగపడతాయి. పిట్యుటరీ గ్రంథి నుంచి విడుదలయ్యే ప్రొలాక్టిన్ మోతాదులు ఎక్కువగా ఉన్నవారికి బ్రోమ్15 మాత్రలు మేలు చేస్తాయి. రక్త ప్రసరణలో సమస్యలున్నట్టు అనుమానిస్తే పినైల్ డాప్లర్ పరీక్ష చేయాల్సి ఉంటుంది.

ఏంటీ సమస్య?

అంగ స్తంభన ప్రక్రియను ఒకరకంగా బెలూన్‌తో పోల్చుకోవచ్చు. గాలి ఊదితే బెలూన్ పెద్దగా అవుతుంది. ముడివేస్తే గాలి అలాగే ఉంటుంది. సరిగ్గా ఇలాగే లోపలికి రక్తం చేరుకోవటం వల్ల అంగం స్తంభిస్తుంది. ఇందులో గట్టి కండేమీ ఉండదు. స్పాంజి మాదిరిగా ఖాళీలతో కూడిన మెత్తటి కండరం (కార్పొరా కావెర్నోసా) ఉంటుంది. అంగ స్తంభనలో ఇదే కీలకం. నిజానికి ఈ ప్రక్రియ జ్ఞానేంద్రియ, మానసిక ప్రేరణలతో మెదడులోనే మొదలవుతుంది. ముందుగా నాడుల ద్వారా మెదడు నుంచి అంగానికి సందేశాలు చేరతాయి. అప్పుడు కార్పొరా కావెర్నోసా వదులై, దానిలోని రక్తనాళాలు విప్పారతాయి. ఉన్నట్టుండి లోపలికి రక్తం చేరుకుంటుంది. కవాట పీడన ప్రభావంతో రక్తం అక్కడే చిక్కుకొని, అంగం స్తంభిస్తుంది. అదే సమయంలో కార్పొరా కావెర్నోసా చుట్టూ ఉండే పొర రక్తాన్ని బయటకు వెళ్లకుండా నిరోధించటం వల్ల గట్టిగా అలాగే ఉంటుంది. ఈ ప్రక్రియ ఎక్కడ అస్తవ్యస్తమైనా స్తంభన లోపానికి దారితీస్తుంది.

లక్షణాలు ఇవీ..

- అంగం గట్టి పడకపోవటం
- గట్టిపడినా తగినంత దృఢంగా ఉండకపోవటం.
- సంభోగ సమయంలో మెత్తబడటం.
- శృంగారం మీదా ఆసక్తి సన్నగిల్లటం.

పెద్ద వయసులో రకరకాల సమస్యలతో

వయసు మీద పడుతున్నకొద్దీ తలెత్తే ఇతరత్రా సమస్యలూ స్తంభన లోపానికి దారితీస్తుంటాయి.

మధుమేహం: పెద్ద వయసులో స్తంభన లోపానికి ప్రధాన కారణం మధుమేహం. రక్తంలో గ్లూకోజు దీర్ఘకాలంగా ఎక్కువగా ఉంటే అంగానికి రక్త సరఫరా చేసే రక్తనాళాల లోపలి మార్గం సన్నబడొచ్చు. మరోవైపు నాడులు క్షీణించటం వల్ల మెదడు నుంచి అందే సంకేతాలు చివరి వరకూ చేరలేవు. ఇవన్నీ స్తంభన లోపానికి దారితీస్తాయి. గట్టిపడినా ఎక్కువసేపు నిలవదు.

రక్తనాళాలు గట్టిపడటం: వయసు పెరిగేకొద్దీ రక్తనాళాలు సాగే గుణం తగ్గుతూ వస్తుంటుంది (అథెరోస్క్లిరోసిస్). దీంతో రక్తనాళాలు విప్పారటం, రక్త ప్రసరణ తగ్గుతాయి. చివరికిది స్తంభన లోపానికి దారితీస్తుంది.

హార్మోన్ల మార్పులు: టెస్టోస్టిరాన్, థైరాయిడ్ హార్మోన్లు తగ్గటం.. ప్రొలాక్టిన్ పెరగటం కూడా స్తంభనను ప్రభావితం చేయొచ్చు.

మందులు: పెద్దవయసులో చాలామంది అధిక రక్తపోటు, గుండెజబ్బులు, అధిక కొలెస్ట్రాల్, వంటి సమస్యలకు మందులు వాడుతుంటారు. కొందరు కుంగుబాటు, ఆందోళన వంటి మానసిక సమస్యలకూ మందులు వేసుకుంటుంటారు. ఇవీ స్తంభనను దెబ్బతీయొచ్చు.

దురలవాట్లు: మద్యం, పొగ తాగటం, మాదక ద్రవ్యాల వాడకం వంటివి పటుత్వాన్ని దెబ్బతీస్తాయి.

చికిత్స.. స్తంభన మాత్రలు ప్రధానం

పెద్ద వయసులో స్తంభన లోపానికి పీడీఈ5 ఇన్‌హిబిటార్స్ రకం మందులు ఉపయోగపడతాయి. వీటిల్లో సిల్డినాఫిల్ (వయాగ్రా) ఒకటి. ఇది నాలుగు గంటల సేపు పని చేస్తుంది. అదే టెడలాఫిల్ మందు అయితే 18 గంటల సేపు పని చేస్తుంది. దీనర్థం అంతసేపూ అంగం స్తంభిస్తుందని కాదు. ఆ సమయంలో శృంగారంలో పాల్గొంటే అంగం బాగా గట్టిపడుతుందన్న మాట. శృంగారం ఆపగానే మామూలు స్థితికి వస్తుంది.

ఇప్పుడు కొత్తగా మరో రెండు, మూడు రకాల మందులూ అందుబాటులో ఉన్నాయి. మాత్రలను ఎప్పుడు అవసరమైతే అప్పుడు వేసుకోవచ్చు. ఇవి సమస్య ఉన్నవారికే ఇవి పనికొస్తాయి. స్తంభన లోపం లేనివారు వేసుకుంటే అంగం మరింత గట్టిపడి, ఎక్కువసేపు శృంగారంలో పాల్గొనేలా చేస్తుందని అనుకోవద్దు. వీటితో శృంగార సామర్థ్యం పుంజుకోదు. రక్తనాళాలు విప్పారేలా చేసి, రక్తం ఎక్కువగా ప్రవహించేలా చేస్తాయి. దీంతో అంగం గట్టిపడుతుంది. ఎక్కువసేపు నిలిచి ఉంటుంది.

ఇంప్లాంట్స్ కూడా

మాత్రలు, ఇంజెక్షన్ల వంటి వాటితో ఫలితం లేకపోతే పినైల్ ఇంప్లాంట్ ప్రయత్నించొచ్చు. దీన్ని సర్జరీ చేసి, అంగం లోపల ప్రవేశ పెడతారు. ఇందులో రెండు రకాలున్నాయి. ఒకటి సెమీ రిజిడ్. దీంతో అంగం ఎప్పుడూ స్తంభించే ఉంటుంది. చేత్తో పైకెత్తితే పైకి, దించితే కిందికి వంగుతుంది. ఇది తేలికైంది.

- **ఉబ్బే ఇంప్లాంట్:** ఇది పంపుతో కూడి ఉంటుంది. దీన్ని వృషణం మీద చిన్న సంచీని ఏర్పాటు చేసి, చర్మం కింద అమర్చుతారు. ఇది బుడిపె మాదిరిగా తగులు తుంటుంది. చేత్తో మూడు నాలుగు సార్లు నొక్కితే నీళ్లలాంటి ద్రవం ప్రసరించి, అంగం గట్టిపడుతుంది. బటన్‌ను నొక్కితే తిరిగి మామూలు స్థితికి వస్తుంది. సహజమైన తృప్తి కలుగుతుంది.

ఇతర పద్ధతులు

మాత్రలతో ఫలితం కనిపించనివారికి, మాత్రలు ఇష్టం లేనివారికి అంగానికి పెపావరిన్ ఇంజెక్షన్ తీసుకోవటం మేలు చేస్తుంది. దీన్ని ఇన్సులిన్ మాదిరిగా ఎవరికివారే తీసుకోవచ్చు. ఇది రక్తనాళాలను విప్పార్చి, రక్త ప్రసరణను పెంచుతుంది. దీంతో అంగం గట్టిపడుతుంది. దీంతో ఒక సమస్య ఏంటంటే- మందు ప్రభావం ఉన్నంతసేపూ స్తంభించి ఉండటం. మరీ ఎక్కువసేపు అలాగే ఉంటే విరుగుడు మందు అవసరం. గంటలకొద్దీ రక్తం అలాగే ఉండిపోతే లోపల మచ్చ ఏర్పడి, ఆ తర్వాత అంగం స్తంభించటం తగ్గుతుంది. కొందరికి ప్రోస్టాగ్లాండిన్ ఇంజెక్షన్ ఉపయోగపడుతుంది. మాత్రలు వద్దనుకునేవారికి వాక్యూమ్ ఎరక్షన్ డివైజ్ మరో ప్రత్యామ్నాయం. ప్లాస్టిక్ గొట్టం మాదిరిగా ఉండే దీన్ని అంగం మీద పెట్టి పంపు కొడితే లోపల శూన్యం ఏర్పడుతుంది. అది గాలిని పీల్చుకోవటం వల్ల అంగంలోకి రక్తం ప్రసరిస్తుంది. పరికరం రింగును బిగిస్తే రక్తం అక్కడే ఉండిపోతుంది. అయితే ఇలాంటి పద్ధతులకు మనదగ్గర చాలామంది అంగీకరించరు.

యువ గుండెకు మద్యం హాని



విందులు, వినోదాల పేరుతో యువత అతిగా మద్యం తాగటం ఇటీవల ఎక్కువైంది. ఇది గుండెకు చాలా హాని చేస్తోందని ఎల్ఎంయూ యూనివర్సిటీ తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. ఎక్కువగా మద్యం తాగటం వల్ల గుండె వేగం పెరుగుతున్నట్టు, సమస్యగా గుర్తించేంత స్థాయిలో గుండెలయ అస్తవ్యస్తం అవుతున్నట్టు తేలింది. ఇంతకు ముందు గుండె సమస్యలేవీ లేనివారిలోనూ ఇలాంటి ధోరణి కనిపిస్తుండటం ఆందోళనకరం. మద్యం తాగితే శ్వాసలో దాని ఆనవాళ్లు కనిపిస్తుంటాయి. బ్రెత్ అనలైజర్ పరికరంతో రక్తంలో ఎంత మద్యం ఉందనేది బయటపడుతుంది. దీని ఆధారంగానే తాజా అధ్యయనం నిర్వహించారు. శ్వాసలో మద్యం మోతాదు (బీఏసీ) ఎక్కువగా ఉండటానికీ గుండె వేగంగా కొట్టుకోవటానికీ మధ్య గణనీయమైన సంబంధం ఉంటున్నట్టు ఇంతకు ముందూ బయటపడింది. అయితే కొన్ని సందేహాలు అలాగే ఉండిపోయాయి. వీటిని నివృత్తి చేసుకోవటానికే తాజాగా ప్రయత్నించారు. గుండెజబ్బులు లేని యువతీ యువకులను ఎంచుకొని, శ్వాసలో మద్యం మోతాదులు కనీసం ప్రతి కిలోకు 1.2 గ్రాములకు చేరుకునేలా స్వచ్ఛందంగా మద్యం తాగమని సూచించారు. దాదాపు 8 గంటల వరకూ ప్రతి గంటకూ శ్వాస పరీక్ష చేశారు. అలాగే చేతికి హోల్టర్ పరికరాన్ని అమర్చి, తాగటం మొదలెట్టినప్పటి నుంచి పూర్తిగా మత్తు నుంచి బయట పడేంత వరకూ గుండె వేగాన్ని పరిశీలించారు. ఇతరత్రా అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉన్నప్పటికీ అతిగా మద్యం తాగిన ప్రతి ఐదుగురిలో ఒకరిలో సమస్యగా నిర్ధరించేంత స్థాయిలో గుండెలయ దెబ్బతినటం గమనార్హం. ముఖ్యంగా తాగటం ఆరంభించినప్పటి నుంచి 6-19 గంటల సమయంలో ఇది మరింత ఎక్కువగానూ ఉంటోంది. తాగటం మొదలెట్టినప్పటి నుంచి 1-5 గంటల మధ్యలోనే గుండె నిమిషానికి 100 కన్నా ఎక్కువ సార్లు కొట్టుకుంటున్నట్టు బయటపడింది. గుండెలోని స్వయంచాలిత నియంత్రణ ప్రక్రియల మీద మద్యం గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నట్టు ఈ అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి.

గులిమి మంచిదే

చెవిలో గులిమి తీయటం తరచూ చూసేదే. దూది పుల్లలతోనే కాదు.. పిన్నీసులు, అగ్గి పుల్లలు, పెన్సిళ్ల వంటి వాటినీ లోపల పెట్టి తిప్పుతుంటారు. ఇలాంటి చిన్న చిన్న వస్తువులతో కర్ణభేరికి చిల్లుపడే ప్రమాదముంది. నొప్పి, ఇన్‌ఫెక్షన్ తలెత్తొచ్చు. దీర్ఘకాలంలో వినికిడీ తగ్గొచ్చు. గులిమిని తీస్తే చెవి శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంటుందని చాలామంది భావిస్తుంటారు. ఇది నిజం కాదు. వినికిడి బాగున్నంతవరకూ దీన్ని తీయటానికి ప్రయత్నించొద్దు.



అలాగే వదిలేసినా ఏమీ కాదు. చాలావరకూ ఇబ్బందేమీ కలిగించదు. నిజానికి మేలు చేస్తుంది కూడా. చెవులు తమకు తామే శుభ్రపడటానికి తోడ్పడుతుంది. కొంతవరకు సూక్ష్మక్రిముల నుంచీ కాపాడుతుంది. దుమ్ము, హానికర వస్తువుల వంటివి లోనికి వెళ్లకుండా అడ్డుకుంటుంది. పుల్లల వంటివి చెవిలో పెడితే గులిమి బయటకు రావటం అటుంచి, మరింత లోపలికి పోతుంది. అది అక్కడే చిక్కుకొని అసౌకర్యం కలిగించొచ్చు, కర్ణభేరిని దెబ్బతీయొచ్చు. గులిమిని లోపలికి నెట్టటం వల్ల తలెత్తే ఇన్‌ఫెక్షన్, గాయం మూలంగా కర్ణభేరికి చిల్లుపడిన ఉదంతాలు ఎన్నో. కొందరికి మాత్రం తరచూ చెవిని శుభ్రం చేయాల్సిన అవసరముండొచ్చు. అదీ డాక్టర్ల పర్యవేక్షణలోనే చేయాలి.

నాసి శుక్రకణాలతో గుర్రపువాతం ముప్పు

ఐవీఎఫ్ పద్ధతిలో నాసిరకం శుక్రకణాలతో గర్భం ధరించిన మహిళలకు అధిక రక్తపోటుకు దారితీసే గుర్రపువాతం (ప్రిఎక్లాంప్సియా) వచ్చే అవకాశం రెట్టింపవుతున్నట్టు తాజా అధ్యయనంలో బయటపడింది. రోజురోజుకీ సంతానలేమి సమస్య ఎక్కువవుతున్న నేపథ్యంలో ఐవీఎఫ్ వంటి కృత్రిమ గర్భధారణ పద్ధతులకు ఆదరణ పెరుగుతోంది. అయితే ఇలాంటి ప్రక్రియలతో గర్భిణులకు గుర్రపువాతం, గర్భస్రావం, నెలలు నిండక ముందే కాన్పు కావటం వంటి సమస్యలు వచ్చే అవకాశమున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందుకు మగవారి శుక్రకణాల డీఎన్ఏలో చీలికలూ దోహదం చేస్తున్నట్టు తాజాగా బయటపడింది. ఐవీఎఫ్ సాయంతో పుట్టిన 20-30 % మంది పిల్లల తండ్రుల శుక్రకణాల డీఎన్ఏలో చీలికలు ఉంటున్నట్టు స్వీడన్‌కు చెందిన లుండ్ యూనివర్సిటీ అధ్యయనంలో బయటపడింది. నిజానికి వీర్య కణాల డీఎన్ఏలో చీలికలు ఉన్నప్పటికీ సంతానం కలుగుతుంది. కాకపోతే ఫలదీకరణ చెందే అవకాశం తక్కువ. సాధారణంగా ఐవీఎఫ్ కోసం ప్రయత్నించటానికి ముందు మగవారి వీర్యం నమూనాను పరీక్షిస్తారు. శుక్రకణాల సంఖ్య, కదలికల వంటివి పరిశీలిస్తారు. కానీ వీర్యం మామూలుగా ఉన్నా కొందరికి సంతానం కలగకపోవటం గమనార్హం. మాయ డీఎన్ఏలో సగం వరకూ తండ్రి నుంచి సంక్రమించేదే. అందువల్ల గుర్రపు వాతంలో మాయ అభివృద్ధి, పనితీరులో ఈ డీఎన్ఏ కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే వీర్య కణాల డీఎన్ఏలో చీలికలు ఎక్కువగా ఉండటం వల్ల గుర్రపు వాతం ముప్పు పెరుగుతోందా? లేదా? అని పరిశీలించారు. డీఎన్ఏ చీలికల సూచీ (డీఎఫ్ఐ) స్కోరు 20 % కన్నా ఎక్కువగా ఉండటం వల్ల గుర్రపు వాతం ముప్పు రెండు రెట్లు ఎక్కువవుతున్నట్టు తేలింది. అలాగే పిల్లలు నెలలు నిండకముందే పుట్టే ముప్పూ ఎక్కువవుతున్నట్టు బయటపడింది.



మెనోపాజ్‌కు ముందు

నెలసరి నిలవటం (మెనోపాజ్) జబ్బేమీ కాదు. మహిళల జీవితంలో ఇదొక భాగం. సహజమే అయినా ఈ దశలోకి చేరుకునే క్రమంలో కొన్ని ఇబ్బందులు కలిగిస్తుంది. వేడి ఆవిర్లు, నిద్ర పట్టకపోవటం, హఠాత్తుగా మూడ్ మారటం, సంభోగ సమయంలో నొప్పి, తరచూ మూత్ర విసర్జన వంటివి వేధిస్తుంటాయి. వీటి నుంచి బయట పడటానికి ఒకప్పటి కన్నా ఇప్పుడు మంచి అవకాశాలున్నాయి.

అమ్మాయి పుట్టినప్పుడే అండాశయాల్లో నిర్ణీత సంఖ్యలో అండాలుంటాయి. రజస్వల అనంతరం నెలసరి నిలిచేంతవరకూ ఇవి నెలా నెలా విడుదలవుతూ వస్తుంటాయి. ఈ ప్రక్రియలో మార్పులు తలెత్తటం, ఈస్ట్రోజెన్ వంటి హార్మోన్ల ఉత్పత్తి తగ్గటం మొదలైనప్పటి నుంచీ నెలసరి నిలిచే ముందు దశ (పెరిమెనోపాజ్) ఆరంభమవుతుంది. ఇది సాధారణంగా 40ల చివర్లో మొదలవుతుంది. కొందరికి ముందూ, వెనకా ఆరంభం కావొచ్చు కూడా. ఈ సమయంలో నెలసరిలో మార్పులు, వేడి ఆవిర్ల వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. ఏడాది దాటినా ముట్లు రాకపోతే నెలసరి నిలిచిందని భావిస్తారు. అయితే ఇది అందరిలోనూ ఇంత స్పష్టంగా ఏమీ ఉండదు. ఏడాది వరకూ నెలసరి రాకపోతే రక్త పరీక్ష ద్వారా మెనోపాజ్‌ను ధ్రువీకరించొచ్చు. కానీ ఈ దశలోకి అడుగుపెట్టటం ఎప్పుడు మొదలైందో తెలిపే పరీక్షలేవీ లేవు. దీనికి సంబంధించిన లక్షణాలు కనిపించినప్పుడు ఇతరత్రా సమస్యలేవైనా కారణమవుతున్నాయో తెలుసుకోవటానికి డాక్టర్లు కొన్ని పరీక్షలు చేయిస్తారు. పెరిమెనోపాజ్ దశ సాధారణంగా ఏడేళ్లు కొనసాగుతుంది. కొందరిలో ఇది ఎక్కువ, తక్కువ కావొచ్చు. అందువల్ల గర్భం ధరించొద్దని అనుకునే మహిళలు చివరి నెలసరి వచ్చాక కనీసం 12 నెలల వరకైనా గర్భ నిరోధక పద్ధతులు పాటించటం మంచిది.

స్వల్పం, తీవ్రం

నెలసరి నిలిచిపోయే ముందు దశలో చాలామందికి లక్షణాలు స్వల్పంగానే ఉంటాయి. కొందరికి మాత్రం తీవ్రంగా ఉండొచ్చు. రోజువారీ పనులకూ ఆటంకం కలిగించొచ్చు. ఎక్కువగా కనిపించేవి వేడి ఆవిర్లు, రాత్రిపూట చెమట్లు పట్టటం. పెరిమెనోపాజ్ లక్షణాలు ఒకదాంతో మరోటి ముడిపడీ ఉంటాయి. వేడి ఆవిర్లతో నిద్ర సరిగా పట్టకపోవచ్చు. నిద్రలేమి కారణంగా ఆరోగ్యమూ దెబ్బతినొచ్చు. వేడి ఆవిర్లు మామూలుగా ఉంటే జీవనశైలి మార్పులతో నియంత్రించుకోవచ్చు. నూలు దుస్తులు ధరించటం, వెంట విసనకర్ర లేదా



చేత్తో పట్టుకొనే చిన్న ఫ్యాన్ తీసుకెళ్లటం, మద్యం, కెఫీన్‌కు దూరంగా ఉండటం వంటివి మేలు చేస్తాయి. ఇబ్బందులు మరీ ఎక్కువగా ఉంటే హార్మోన్ చికిత్స మేలు చేస్తుంది. దీంతో రొమ్ముక్యాన్సర్, గుండె జబ్బు, పక్షవాతం, రక్తంలో గడ్డల ఏర్పడటం వంటి ముప్పులు పెరిగే అవకాశముందని ఒకప్పుడు భావించే వారు. వయోధిక మహిళల్లో దీర్ఘకాల జబ్బుల నివారణకు హార్మోన్ చికిత్స మీద నిర్వహించిన అధ్యయనం ఇలాంటి ఆందోళనలకు కారణమైంది. హార్మోన్ చికిత్స తీసుకున్న కొందరికి దీర్ఘకాల సమస్యల ముప్పు ఎక్కువని అందులో తేలింది. తాజా అధ్యయనాలూ దీన్ని ధ్రువీకరిస్తున్నాయి. కానీ ఆరోగ్యంగా ఉన్నవారికి, చిన్నవయసు వారికి వయోధిక మహిళల మాదిరి స్థాయిలో ముప్పు ఉండటం లేదనీ తేల్చాయి. అందుకే హార్మోన్ చికిత్స విషయంలో లాభనష్టాలను బేరీజు వేసుకొని ఒక నిర్ణయం తీసుకోవటం మంచిదన్నది వైద్య నిపుణుల సూచన. ముప్పు కారకాల పేరుతోనో, ఇష్టం లేకనో.. కారణమేదైనా కొందరు హార్మోన్ చికిత్సలు తీసుకోవటానికి వెనకాడుతుంటారు. అయితే ఇదొక్కటే కాదు, ఇతరత్రా ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోలేదు. కుంగుబాటును తగ్గించే ఎసిటలోప్రామ్ అనే మందు కొందరు మహిళల్లో వేడి ఆవిర్ల సంఖ్య, తీవ్రతను తగ్గిస్తున్నట్టు కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇటీవల అమెరికా ఎఫ్‌డీఏ ఫెజిలినిటాంట్ అనే కొత్త మందుకు ఆమోదం తెలిపింది. ఇది మెదడులో ఉష్ణోగ్రతలను నియంత్రించే భాగాన్ని నియంత్రించటం ద్వారా వేడి ఆవిర్లను తగ్గిస్తుంది.

ఇతర లక్షణాలకైతే..

మెనోపాజ్‌లోకి చేరుకునే దశలో చాలా మంది నిద్ర పట్టక సతమతమవుతుంటారు. ఇలాంటివారికి మాటలతో భరోసా కల్పించే కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ ఉపయోగపడుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

- శారీరక శ్రమ, వ్యాయామం, యోగా, ధ్యానం వంటివీ మేలు చేస్తాయి. ఇవి పరోక్షంగా వేడి ఆవిర్లు తగ్గటానికి తోడ్పడతాయి. మరింత హాయిగా, దృఢంగా ఉన్నామనే భావన కలిగించటం ద్వారా ఇబ్బందులను ఎదుర్కొనేలా చేస్తాయి.
- కొందరు మహిళలు జననాంగం పొడిబారటం, సంభోగ సమయంలో నొప్పి, శృంగారసక్తి తగ్గటం వంటి సమస్యలనూ ఎదుర్కొంటూ ఉంటారు. కొందరికి నెలసరి ముందూ వెనకలుగా రావొచ్చు, కొందరికి రుతుస్రావం చాలా ఎక్కువగా అవ్వొచ్చు. ఈ సమస్యల్లో చాలావాటికి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. కానీ చాలామందికి వీటి గురించి తెలియదు. శృంగార సమస్యల గురించి మాట్లాడటానికి బిడియ పడుతుంటారు.

జీవనశైలి మీద కన్ను

మధ్యవయసులో, ఆ తర్వాత జీవనశైలిని మార్చుకోవటం ఎంతో మేలు చేస్తుంది. నెలసరి నిలవటమో, ఆరోగ్యం తీరో.. ఏదేమైనా నెలసరి నిలిచిన తర్వాత గుండె సమస్యలు, ఎముకలు పెళుసు బారటం, మధుమేహం వంటి కొన్ని జబ్బుల ముప్పు పెరుగుతుంది. అందువల్ల మంచి పోషకాహారం తినటం, కంటి నిండా నిద్ర పోవటం, ఒత్తిడిని నియంత్రించుకోవటం, శారీరకంగా చురుకుగా ఉండటం వంటి జాగ్రత్తలతో వీటిని నివారించుకోవచ్చు. వీటిల్లో కొన్ని పెరిమెనోపాజ్ లక్షణాలు తగ్గటానికే కాకుండా మొత్తగా ఆరోగ్యం మెరుగవటానికీ తోడ్పడతాయి.

కొత్త కొలువుల ప్యాకేజింగ్!

ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎఫ్ఎంసీజీ, హెల్త్ కేర్ రంగాలు రేసుగుర్రాల్లా పరుగెత్తుతున్న నేపథ్యంలో ప్యాకేజింగ్‌కు బంగారు భవిష్యత్తు ఉంది. ఈ రంగంపై దృష్టిపెట్టి, తగిన కోర్సులు చేస్తే.. యువతకు ఉజ్వలమైన కెరియర్ అవకాశాలు సిద్ధంగా ఉన్నాయి!



ముచ్చటపడి బ్లూటూత్ ఇయర్ బడ్స్ కొనుక్కున్నాం. పదివేల రూపాయిలకు కార్డు స్వైప్ చేస్తే... చిన్న బాక్స్ చేతిలో పెట్టారు. ఇంత డబ్బు పెట్టి కొంటున్నామనే అపరాధ భావనను అణచిపెట్టి క్యారీబ్యాగ్ నుంచి బయటకు తీస్తే దృఢమైన చిన్న కార్టన్ బాక్స్. పైన బ్రాండ్ పేరుతోపాటు కంటికి ఇంపైన రంగు. తెరచి లోపల చూస్తే కళ్లు జిగేల్. రెండు చిన్న అరల్లో ధవళ వర్ణంలో ముచ్చట గొలిపే రెండు ఇయర్ బడ్స్.. చెవులకు ఇష్టమైన సంగీతాన్ని వినమని ఆహ్వానిస్తున్న అనుభూతి. విలువైన ఇయర్‌బడ్స్ చెక్కు చెదరకుండా. అరల చుట్టూ స్పాంజ్ సపోర్ట్. లోపల వాటిని ఎలా వినియోగించాలో ప్రొడక్ట్ మాన్యువల్ మడిచి పెట్టివుంది. పదివేలు వెచ్చించామన్న హృదయభారం స్థానంలో ఎంత గొప్ప ప్రొడక్ట్ తెచ్చుకున్నామన్న గర్వం ప్రవేశిస్తుంది!

మరో సందర్భంలో పుట్టిన రోజు వేడుకలకు బ్రాండెడ్ చెయిన్ బేకరీ నుంచి నాలుగు కిలోల కేక్ ఆర్డర్ చేశాం. నేరుగా పార్టీ హాలుకే పంపమని లొకేషన్ పెట్టాం. అతిథులంతా వచ్చి కేక్ కట్ చేసే సమయం వచ్చింది. సరిగ్గా సమయానికి డెలివరీ బోయ్ ఒక బ్యాగ్ అందించాడు. చూడటానికి పేపర్ క్యారీబ్యాగే. చూడముచ్చటగా ఉండటంతో ఆహూతులంతా ఆసక్తిగా చూస్తున్నారు. బ్యాగ్ నుంచి కేక్‌తో ఉన్న కార్టన్ బాక్స్‌ను బయటకు తీశాం. దానిపై నయనానందకరమైన రంగులతో బర్త్ డే విషెస్. ఎటునుంచి ఓపెన్ చేయాలో సూచించే సంకేతం. తెరచి చూస్తే లోపల మరో కార్టన్ బోర్డుపై అలంకరించిన కేక్. రవాణాలో ఏమాత్రం చెదరకుండా తగిన జాగ్రత్తలతో ప్యాకేజింగ్. అతిథులంతా అబ్బురంగా చూస్తుంటే ఆనందంగా అనిపిస్తుంది.

ఈ రెండు సందర్భాల్లోనూ మనల్ని ఆకట్టుకున్నది... వస్తువు కంటే ముందు ప్యాకేజింగ్. ఇంకా చెప్పాలంటే ప్రజెంటేషన్. రూ.16 లక్షల కోట్ల మార్కెట్ ఇది. ఐదేళ్ల కిందట రూ.4 లక్షల కోట్ల మార్కెట్. ఏటా 26.7% వృద్ధిరేటుతో శరవేగంగా దూసుకుపోతోంది. అందుకు తగ్గ ఉద్యోగాలను కురిపిస్తోంది. రూపాయి చాక్లెట్ రేపర్ ప్యాకింగ్ నుంచి రాకెట్ విడిభాగాల రవాణా ప్యాకేజింగ్ వరకు ఏ వస్తువూ ఒంటరిగా ప్రయాణించలేదు. ప్యాకింగ్/ ప్యాకేజింగ్‌తో కలిసి జంటగా వినియోగదారుణ్ని చేరుతుంది.

ఏమిటి తేడా?

ప్యాకింగ్‌కూ, ప్యాకేజింగ్‌కూ మధ్య ప్రధాన వ్యత్యాసం ఉంది.

✦ ప్యాకింగ్ అంటే ఒక వస్తువును పాడవకుండా ఒక చోటు నుంచి మరోచోటుకు చేర్చడం. అవసరమైతే నిల్వ ఉంచడం. రవాణా చేసే వస్తువు ఎక్కడా దెబ్బతినకుండా బబుల్ ర్యాప్, ఫోమ్ ప్యాకింగ్‌లను వినియోగిస్తారు. ఇక్కడ వస్తువు సురక్షితంగా చేరడమొక్కటే లక్ష్యం.

✦ ప్యాకేజింగ్ ఈ పరిధిని దాటిపోయిన నైపుణ్యం. వస్తువును భద్రంగా చేర్చడమే కాదు, వినియోగదారుడిని ఆకట్టుకునేలా సింగారించుకుంటుంది. అవసరమైతే గ్లాస్, ప్లాస్టిక్, పేపర్ బోర్డ్, మెటల్‌ను ఉపయోగించి ఆకట్టుకుంటుంది. డిజైన్, బ్రాండింగ్, ప్రభుత్వ నియంత్రణలను పాటిస్తూ వినియోగదారునిపై నేరుగా ప్రభావం చూపుతుంది. అనుభూతిని కలిగిస్తుంది. అందుకే ప్యాకేజింగ్ భారీ పరిశ్రమగా అవతరించింది. లక్షల ఉద్యోగాలు తీసుకొచ్చింది. ఈ రంగానికి ముందుముందు ఎదురే లేదనడానికి కొన్ని సంకేతాలు చూపుతున్నారు.

ఐదో ఆదాయ రంగం: దేశానికి ఆదాయం కల్పించే రంగాల్లో ప్యాకేజింగ్ ఐదో స్థానంలో నిలిచింది. దేశ పరిశ్రమల్లో స్థిరమైన వృద్ధిరేటుతో దూసుకెళుతున్న రంగంగా గుర్తించారు.

ఉపాధి పథం
నైపుణ్య సాధనం

ప్రతి ఉత్పత్తికీ అనివార్యం: దేశంలోని అన్ని రంగాలూ, అన్ని వస్తువులకు అవసరమైన రంగంగా ప్యాకేజింగ్ పరిశ్రమ నిలుస్తోంది. ఐదు రూపాయల స్నాక్ ఫుడ్ నుంచి భారీ ఓడల్లో, విమానాల్లో, రైల్వే వ్యాగన్లలో పంపే సరకు వరకు ప్యాకింగ్, ప్యాకేజింగ్ అవసరం ఉంది. ఎందుకంటే ఏ వస్తువునూ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయినవి అయినట్టు నేరుగా మార్కెట్‌కు పంపలేరు.

ఇతర రంగాలతో విడదీయరాని బంధం: చాలా రంగాల ఉత్పత్తులకు ప్యాకేజింగ్ లేనిదే మనుగడ లేదు. ప్యాకేజింగ్ లేని వాటి ఉనికిని ఊహించలేం. ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్.ఎం.సి.జి), ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్-రెడీమేడ్ గార్మెంట్స్, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీలను ప్యాకేజింగ్‌తో విడదీసి చూడలేం.

ఇతర రంగాల నుంచీ డిమాండ్: ప్రస్తుతం ప్యాకేజింగ్ పరిధిలో లేని రంగాలనుంచి డిమాండ్ వస్తుండటంతో ప్యాకేజింగ్ పరిశ్రమ బహుముఖంగా వృద్ధి చెందే అవకాశం ఉందని న్యూదిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ డైరెక్టర్ అంచనా వేశారు. ఉదాహరణకు ఉత్పత్తిదారులు తాము అమ్మే ప్రతి స్వీటుతోనూ తమ బ్రాండ్, డిజైన్, తమ ప్రత్యేకత, ఆ స్వీట్ ప్రత్యేక విశేషాలు కస్టమర్‌కు చేరాలని కోరుకోవడంతో ఈ రంగంలో కూడా ప్యాకేజింగ్ ప్రవేశించింది. ఇలా కొత్త రంగాలకు విస్తరిస్తున్నకొద్దీ సహజంగానే ప్యాకేజింగ్ సంస్థలకూ, నిపుణులకూ డిమాండ్ ఏర్పడుతోంది.

పెరుగుతున్న మార్కెట్- నిపుణుల కొరత

దేశంలో ప్యాకేజింగ్ పరిశ్రమ రివ్వున దూసుకెళుతోంది. అవకాశాలు అనంతంగా కనిపిస్తుండగా ఈ రంగంలోని కంపెనీలు విస్తరణ ప్రణాళికల్లో ఉన్నాయి. మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో ప్రపంచంలోనే ముందంజలో ఉన్న చైనా.. ప్యాకేజింగ్‌లోనూ అగ్రగామిగా నిలిచింది. పేపర్ బోర్డ్ వినియోగం ఆధారంగా చైనా 8 కోట్ల మెట్రిక్ టన్నుల వాడకంతో తొలి స్థానంలోనూ, అమెరికా ద్వితీయ స్థానంలోనూ ఉన్నాయి. దేశంలో పెరుగుతున్న జనాభా, చిన్న పట్టణాలకు సైతం విస్తరిస్తున్న వినియోగ సంస్కృతి, సరళీకృత ఆర్థిక విధానాలతో... విదేశీ వాణిజ్య సంస్థల రాకతో భారత్ వచ్చే ఐదేళ్ల కాలంలో చైనాకు గట్టి పోటీ ఇవ్వనుంది. ఇందుకు ప్యాకేజింగ్ పరిశ్రమ రంగంలో నిపుణుల అవసరం ఉంది.

ముఖ్యంగా ఫుడ్ అండ్ బేవరేజెస్, పారిశ్రామిక ఉత్పత్తులు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, హెల్త్ కేర్, ఆటోమోటివ్ రంగాలు ప్యాకింగ్ నుంచి ప్యాకేజింగ్‌కు ఎదుగుతున్న నేపథ్యంలో శిక్షణ పొందిన సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది.

దేశంలో పేరెన్నికగన్న టాప్ ప్యాకేజింగ్ ముడిసరుకు ఉత్పత్తిలో ఉన్న ఎస్సెల్ ప్రో-ప్యాక్ లిమిటెడ్, ఈస్టర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, బాల్మర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్, కాస్మో ఫిల్ లిమిటెడ్, జిందాల్ పాలీఫిలిమ్స్ లిమిటెడ్, యుఫ్లెక్స్ లిమిటెడ్, షిప్ రాకెట్ ప్యాకేజింగ్ తదితర కంపెనీలు నిపుణులకు మంచి అవకాశాలు కల్పిస్తున్నాయి.



- యస్.వి. సురేష్, సంపాదకుడు, ఉద్యోగ సోపానం

ఆ సర్టిఫికెట్లు పనికొస్తాయా?

కొన్ని ప్రైవేటు యూనివర్సిటీలు వెనక తేదీల్లో డిగ్రీ పాస్ అయినట్లు సర్టిఫికెట్లు జారీచేస్తున్నాయి. ఆ సర్టిఫికెట్లు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు ఉపయోగపడతాయంటున్నారు ఏజెంట్లు. అలా కొనుక్కున్నవి పనికొస్తాయా?

- కృష్ణకుమార్ రెడ్డి



■ మీ ప్రశ్న చూసి ఆశ్చర్యపడాలో, భయపడాలో అర్థం కావడం లేదు. ఏ యూనివర్సిటీ అయినా ఒక అకడమిక్ ప్రోగ్రాంలో ప్రవేశం పొందకుండా, చదవకుండా, పరీక్షలు రాయకుండా వెనక తేదీల్లో డిగ్రీ పాస్ అయినట్లు సర్టిఫికెట్ జారీ చేయడం శిక్షార్హమైన నేరం. అలాంటి సర్టిఫికెట్ జారీ చేసినవాళ్లు, జారీ చేయడంలో సహకరించిన ఏజెంట్లు, కొన్నవారు.. అందరూ నేరం చేసినట్లే! ఉదాహరణకు... ఒక వ్యక్తి వైద్య కళాశాలలో ప్రవేశం పొందకుండా, మోసపూరితంగా సంపాదించిన డిగ్రీ సర్టిఫికెట్‌తో మెడికల్ ప్రాక్టీస్ పెడితే, అతని దగ్గర వైద్యం పొందడం ఎంత ప్రమాదం! నకిలీ డిగ్రీలు పొందినవారు బోధన వృత్తిలో ప్రవేశిస్తే అలాంటివారి దగ్గర నేర్చుకునే విద్యార్థుల భవిష్యత్తు ఎలా ఉంటుంది!

బాగా చదివి, విజ్ఞానం పెంపొందించుకొని డిగ్రీ సర్టిఫికెట్లు సంపాదించుకోవాలి కానీ విద్యాపరమైన సర్టిఫికెట్లను మార్కెట్లో కొనే ప్రయత్నం చేయకూడదు. అలా కొనుక్కొన్నవి ఎక్కడా పనికి రావు కూడా!

ఒకవేళ ఏదైనా ఉద్యోగం పొందడంలో తాత్కాలికంగా అవి ఉపయోగపడ్డా, భవిష్యత్తులో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాలి.

తప్పుడు పద్ధతిలో సర్టిఫికెట్ పొందిన అపరాధ భావన, తప్పు చేసినట్లు రుజువు అయితే ఉద్యోగం పోవడంతో పాటు నేరం చేసినందుకు శిక్ష కూడా అనుభవించాల్సి వస్తుందన్న భయం జీవిత పర్యంతం ఉంటుంది. దురదృష్టవశాత్తు చాలామంది డిగ్రీలను మార్కెట్లో కొనుక్కొని మోసపోతూనే ఉన్నారు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందడం అసాధ్యం. ఒకవేళ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో సాధ్యమైనా అలా ఉద్యోగం పొందినవారు ఎంతోకాలం అందులో కొనసాగలేరు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేస్తున్నారా?

యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2024 బడ్జెట్‌లో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని ప్రకటించింది.

అర్హతలు: ● ఐటీఐ, డిప్లొమా, బీఏ, బీఎస్సీ, బీకామ్, బీసీఏ, బీబీఏ, బీఫార్మసీలలో ఏదో ఒక కోర్సుతో పాటు ఆన్‌లైన్/ దూరవిద్య ప్రోగ్రామ్‌లలో నమోదు చేసుకోవాలి.

● కుటుంబ ఆదాయం రూ.8 లక్షలు దాటకూడదు.

● తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులైతే వారికి అవకాశం లేదు.

వయసు: 21-24 ఏళ్ల మధ్య ఉండాలి.

స్టైపెండ్: నెలకు రూ.5,000. **శిక్షణ కాలం:** 12 నెలలు.

శిక్షణ కేంద్రాలు: ప్రభుత్వ రంగ సంస్థలైన ఓఎన్‌జీసీ, ఎన్టీపీసీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, హెచ్‌పీసీఎల్, బెల్, ప్రైవేటు సంస్థలు రెడ్డీస్, దివీస్ ల్యాబొరేటరీస్, టెక్ మహీంద్రా తదితర సంస్థలు.

ఎంపిక: ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు, ఇతర ప్రత్యేక కోర్సులు చేస్తే వాటికి సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25-10-2024.

దరఖాస్తుదారుల జాబితా విడుదల: 26-10-2024.

ఎంపిక ప్రారంభం: అక్టోబరు 27 నుంచి నవంబరు 7 వరకు.

అభ్యర్థుల అంగీకారానికి గడువు: నవంబరు 15.

ఇంటర్న్‌షిప్ ప్రారంభం: 02-12-2024.

వెబ్‌సైట్: https://pminternship.mca.gov.in/login/

మంగళగిరి ఎయిమ్స్ ఆహ్వానం



గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆల్ ఇండియా మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన.. 93 గ్రూప్-ఏబీసీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. గ్రూప్-ఎ పోస్టులకు ఆఫ్‌లైన్‌లో, గ్రూప్-బి, సి పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

గ్రూప్-ఎ పోస్టులకు ఇంటర్వ్యూ, గ్రూప్-బి, సి పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.

● సీబీటీలో ప్రతిభ చూపిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల అనంతరం.. తుది ఎంపిక చేస్తారు. కొన్ని పోస్టులకు సీబీటీ తర్వాత స్కిల్ టెస్టు నిర్వహిస్తారు.

● సిలబస్, పరీక్ష వివరాలను త్వరలోనే వెబ్‌సైట్‌లో ఉంచుతారు.

గ్రూప్–ఎ పోస్టులు: మెడికల్ ఆఫీసర్-2, మెడికల్ ఫిజిసిస్ట్-2, సైకాలజిస్ట్-2.

గ్రూప్–బి పోస్టులు: ప్రోగ్రామర్-1, స్టోర్ కీపర్-1, జూనియర్ ఇంజినీర్-1, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్-1, మెడికల్ సోషల్ సర్వీస్-2, పెర్ఫ్యూషనిస్ట్-1, అసిస్టెంట్ డైటీషియన్-2, టెక్నీషియన్-24, ఎంబ్రియాలజిస్ట్-1, అసిస్టెంట్-2.

గ్రూప్–సి పోస్టులు: న్యూక్లియర్ మెడికల్ టెక్నాలజిస్ట్-1, ఎల్‌డీసీ-5, అటెండెంట్-4, హాస్పిటల్ అటెండెంట్ (గ్రేడ్-3)-40, స్టెనోగ్రాఫర్-1.

ఆయుష్, రేడియేషన్ థెరపీ/అంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, క్లినికల్/ఛైల్డ్, ఏసీ/ రిఫ్రిజిరేటర్, ల్యాబొరేటరీ, హైజీనిస్ట్, మార్చురీ, ఎగ్జిక్యూటివ్/పర్సనల్.. మొదలైన విభాగాల్లో ఉద్యోగాలు ఉన్నాయి.

ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న పోస్టుల విద్యార్హతలు, అనుభవాల వివరాలు...

1. టెక్నీషియన్–24: బీఎస్సీ (మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ)/ తత్సమాన పరీక్ష పాసై.. ఐదేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. లేదా మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ డిప్లొమా/ తత్సమాన పరీక్ష పాసై... ఎనిమిదేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. వయసు 25 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి.

2. ఎల్‌డీసీ–5: ఇంటర్మీడియట్/తత్సమాన అర్హత ఉండాలి. కంప్యూటర్‌పైన ఇంగ్లిష్‌లో నిమిషానికి 35 పదాలు, హిందీలో 30 పదాలు టైప్ చేయగలగాలి. ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. వయసు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి.

3. అటెండెంట్–4: సైన్స్ గ్రూప్‌తో ఇంటర్మీడియట్, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ డిప్లొమా పూర్తిచేయాలి. సంబంధిత రంగంలో రెండేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. వయసు 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి.

4. హాస్పిటల్ అటెండెంట్ (గ్రేడ్–3)–40: మెట్రిక్యులేషన్, హాస్పిటల్ సర్వీసెస్‌లో సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేయాలి. ఆస్పత్రిలో పనిచేసిన అనుభవం ఉండాలి. వయసు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి.

గ్రూప్–ఎ బీ సీ పోస్టులు

వయసు: పోస్టును బట్టి వయసులో తేడాలు ఉంటాయి. గరిష్ఠ వయసులో ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు, కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లు, మాజీ సైనికోద్యోగులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.1500. ఎస్సీ, ఎస్టీలకు రూ.1000. దివ్యాంగులకు ఫీజు లేదు.

సీబీటీ పరీక్ష కేంద్రాలు: దేశవ్యాప్తంగా 15 కేంద్రాల్లో సీబీటీని నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో విజయవాడ, హైదరాబాద్. దరఖాస్తు నింపే సమయంలోనే అభ్యర్థులు పరీక్ష కేంద్రాన్ని ఎంపిక చేసుకోవాలి.

● గ్రూప్-ఎ పోస్టులకు దరఖాస్తులను.. 'రిక్రూట్‌మెంట్ సెల్, రూమ్ నంబర్:205, రెండో అంతస్తు, లైబ్రరీ అండ్ అడ్మిన్ బిల్డింగ్, ఎయిమ్స్ మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్- 522 503 చిరునామాకు పంపాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ప్రకటన వెలువడిన తేదీ (08.10.2024) నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేయాలి.

వెబ్‌సైట్: https://www.aiimsmangalagiri.edu.in/

నోటీస్ బోర్డు
ఉద్యోగాలు

ఏపీఎస్‌డీపీఎస్‌లో కన్సల్టెంట్లు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (ఏపీఎస్‌డీపీఎస్)- ప్లానింగ్ డిపార్ట్‌మెంట్.. స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రాజెక్ట్ కోసం ఒప్పంద ప్రాతిపదికన 13 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

● ప్రోగ్రామ్/ ప్రాజెక్ట్ మేనేజర్/ సీనియర్ అనలిస్ట్/ సీనియర్ అడ్వైజర్: 04

● కన్సల్టెంట్/ రిసెర్చ్ అసోసియేట్స్: 08

● డేటాబేస్ డెవలపర్: 01

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్/ బీఎస్సీ (కంప్యూటర్స్), పీజీ లేదా డాక్టరేట్ (పబ్లిక్ పాలసీ/ ఎకనామిక్స్/ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/ ఇంజినీరింగ్/ డెవలప్‌మెంట్ స్టడీస్)తో పాటు పని అనుభవం.

వేతనం: ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టులకు నెలకు రూ.2,00,000- రూ.2.5 లక్షలు; కన్సల్టెంట్ పోస్టులకు రూ.75,000 - రూ.1,50,000; డేటాబేస్ డెవలపర్ పోస్టులకు రూ.45,000 - రూ.75,000.

వయసు: 01-01-2025 నాటికి ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టులకు 55 ఏళ్లు; కన్సల్టెంట్ పోస్టులకు 45 ఏళ్లు; డేటాబేస్ డెవలపర్ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు. **పని ప్రదేశం:** విజయవాడ

ఎంపిక: విద్యార్హత, స్క్రీనింగ్ టెస్ట్, టెక్నికల్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 29-10-2024.

వెబ్‌సైట్: www.apsdps.ap.gov.in/

ట్రెయినీ ఇంజినీర్ ఖాళీలు

మహారత్న కంపెనీ పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. 47 ట్రెయినీ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీతో పాటు గేట్ స్కోరు తప్పనిసరి.

వయసు: 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు; పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

వేతనం: నెలకు రూ.30,000.

దరఖాస్తు ఫీజు: రూ.500; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ/ ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఫీజు మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 6-11-2024.

వెబ్‌సైట్: www.powergrid.in/

పవర్‌గ్రిడ్‌లో పోస్టులు!

గురుగ్రామ్‌లోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) 70 ట్రెయినీ సూపర్‌వైజర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. కంప్యూటర్ ఆధారిత పరీక్ష, వైద్య పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారు.



మొత్తం పోస్టుల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 30, ఈడబ్ల్యూఎస్‌లకు 7, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు 18, ఎస్సీలకు 10, ఎస్టీలకు 5 కేటాయించారు.

మూడేళ్ల ఫుల్‌టైమ్ రెగ్యులర్ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ (పవర్)/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ పవర్ సిస్టమ్స్ ఇంజినీరింగ్/ పవర్ ఇంజినీరింగ్ (ఎలక్ట్రికల్) డిప్లొమా 70 శాతం మార్కులతో పాసవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు డిప్లొమా పాసైతే సరిపోతుంది.

❖ బీటెక్/ బీఈ/ ఎంటెక్/ ఎంఈ చేసినవారూ, దూరవిద్యలో చదివినవారూ దరఖాస్తుకు అనర్హులు.

వయసు: 27 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, మాజీ సైనికోద్యోగులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది. దివ్యాంగులకు కేటగిరీని బట్టి పది సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.300; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.

పరీక్షలో...

కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. వ్యవధి రెండు గంటలు.

❖ పార్ట్-1లోని టెక్నికల్ నాలెడ్జ్ టెస్టులో (టీకేటీ) 120 ప్రశ్నలు ఉంటాయి. సంబంధిత సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఇస్తారు.

❖ పార్ట్-2లో 50 ప్రశ్నలు (ఆప్టిట్యూడ్ టెస్ట్-ఏఐ) ఉంటుంది. ఒకాబ్యులరీ, వెర్బల్ కాంప్రహెన్షన్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, డేటా సఫిషియన్సీ అండ్ ఇంటర్‌ప్రెటేషన్, న్యూమరికల్ ఎబిలిటీకి సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.

❖ ప్రశ్నపత్రంలోని మొత్తం 170 ప్రశ్నలకూ 170 మార్కులు. తప్పు సమాధానం, ఒకటికంటే ఎక్కువ సమాధానాలను గుర్తించినా పావు మార్కు తగ్గిస్తారు.

❖ ప్రతి పార్ట్‌లోనూ 30 శాతం చొప్పున, మొత్తానికి 40 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. ప్రత్యేక కేటగిరీలకు చెందిన అభ్యర్థులు ప్రతీపార్ట్‌లోనూ 25 శాతం చొప్పున, మొత్తానికి 30 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.

❖ సీబీటీలో అర్హత సాధించినవారికి వైద్య పరీక్షలు నిర్వహించి కేటగిరీలవారీగా తుది ఎంపిక చేస్తారు.

❖ **పరీక్ష కేంద్రాలు:** దిల్లీ, కోల్‌కతా, గువాహతి, భువనేశ్వర్, హైదరాబాద్, ముంబయి, నాగ్‌పుర్, భోపాల్, బెంగళూరు, చెన్నైలలో సీబీటీ నిర్వహిస్తారు. వీటిలో నుంచి ఒక కేంద్రాన్ని అభ్యర్థులు ఎంపిక చేసుకోవాలి.

సన్నద్ధత

సబ్జెక్టు సంబంధిత అంశాలపై పట్టు సాధిస్తే ఎక్కువ మార్కులు సంపాదించే అవకాశం ఉంటుంది.

❖ పార్ట్-2లోని ఆప్టిట్యూడ్ ప్రశ్నలకు పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాలను సాధన చేయొచ్చు.

❖ మాక్ టెస్టులు రాయడం వల్ల నిర్ణీత సమయం లోపల ప్రశ్నపత్రాన్ని పూర్తిచేయడం అలవాటు అవుతుంది.

❖ నైపుణ్యాలను సమీక్షించుకుని వెనకబడిన అంశాలకు అదనపు కేటాయించాలి. ఇందుకోసం ప్రణాళిక వేసుకుని కచ్చితంగా అమలు చేయగలగాలి. **దరఖాస్తుకు చివరి తేదీ: 06.11.2024**

వెబ్‌సైట్: www.powergrid.in

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్
స్టరింగ్ మైండ్స్‌లో

1. ఫైనాన్స్ స్పెషలిస్ట్

నైపుణ్యాలు: ఫైనాన్షియల్ లిటరసీ, ట్యాలీ స్టైపెండ్: రూ.20,000

☛ internshala.com/i/f3db42

2. హ్యూమన్ రిసోర్సెస్

నైపుణ్యం: హెచ్‌ఆర్ అనలిటిక్స్

స్టైపెండ్: రూ.6,000

☛ internshala.com/i/540132

3. ట్యాక్సేషన్ స్పెషలిస్ట్

నైపుణ్యం: ట్యాలీ

స్టైపెండ్: రూ.5,000

☛ internshala.com/i/a3e05a

బ్రాండ్ మేనేజ్‌మెంట్

సంస్థ: న్యాక్ టెక్నాలజీ

నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఈమెయిల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, లీడ్ జనరేషన్, మార్కెటింగ్

స్టైపెండ్: రూ.10,000-15,000

☛ internshala.com/i/fce7cf

ఇంగ్లిష్ కంటెంట్ డెవలప్‌మెంట్

సంస్థ: మెసావీ

నైపుణ్యాలు: కంటెంట్ మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్

స్టైపెండ్: రూ.5,000

☛ internshala.com/i/b308ca

క్రౌడ్ ఫండింగ్

సంస్థ: పాజ్ నైపుణ్యం: క్రౌడ్ ఫండింగ్ స్టైపెండ్: రూ.1,500-10,000 (ఒకేసారి)

☛ internshala.com/i/06857a

విద్యాశాలలో

1. ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్

నైపుణ్యాలు: బ్రిటిష్ ఇంగ్లిష్, డిజిటల్ అడ్వర్‌టైజింగ్, ఈమెయిల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం

స్టైపెండ్: రూ.3,000

☛ internshala.com/i/8560e0

2. వాట్సప్ క్యాంపైన్

నైపుణ్యం: వాట్సప్ క్యాంపైన్

స్టైపెండ్: రూ.2,000

☛ internshala.com/i/53b029

సేల్స్ కన్సల్టెంట్

సంస్థ: మీట్‌మినిట్స్

నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-పవర్‌పాయింట్, సేల్స్, సేల్స్ పిచ్

స్టైపెండ్: రూ.15,000

☛ internshala.com/i/00989a


వీటన్నిటికీ దరఖాస్తు గడువు: నవంబరు 16

ఈనాడు ప్రతిభ
హైదరాబాద్, మంగళవారం, అక్టోబరు 22, 2024
20 pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

■ గ్లోబల్ యాన్యువల్ టు డెకాడల్ క్లైమేట్ అప్‌డేట్ (2024–2028) నివేదికను ఇటీవల ఏ సంస్థ విడుదల చేసింది?
జ: ప్రపంచ వాతావరణ సంస్థ



■ ఇటీవల వార్తల్లోకి వచ్చిన అరుణ్–3 హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ ఏ దేశంలో ఉంది?
జ: నేపాల్

■ ఇటీవల వార్తల్లోకి వచ్చిన 'రివర్స్ ట్రాన్స్‌క్రిప్టేజ్ ఎంజైమ్' సాధారణంగా ఏ రకమైన వైరస్‌తో సంబంధం కలిగి ఉంటుంది?
జ: రెట్రో వైరస్

■ పెట్టుబడిదారుల కోసం ఇటీవల ఏ సంస్థ 'సారథి 2.0' మొబైల్ యాప్‌ను విడుదల చేసింది?
జ: సెబీ (SEBI)

■ 'ఛైల్డ్ న్యూట్రిషన్ రిపోర్ట్–2024'ను ఇటీవల ఏ సంస్థ విడుదల చేసింది?
జ: యునిసెఫ్

■ ఇటీవల వార్తల్లోకి వచ్చిన 'త్రిష్ణా మిషన్' ప్రాథమిక లక్ష్యం ఏమిటి?
జ: ప్రాంతీయం నుంచి ప్రపంచ స్థాయి వరకు ఉపరితల ఉష్ణోగ్రత, నీటి నిర్వహణను పర్యవేక్షించడం.

■ 2025, జనవరి 1 నుంచి 2026, డిసెంబరు 31 వరకు రెండేళ్ల కాలానికి ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తాత్కాలిక సభ్య దేశాలుగా ఏ ఐదు దేశాలు ఎన్నికయ్యాయి?
జ: పాకిస్థాన్, సోమాలియా, డెన్మార్క్, గ్రీస్, పనామా

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

అప్పుడప్పుడు స్నేహితులతో కలిసి బృందంగా ఏర్పడి ప్రిపేర్ కావాలి. అందులో భాగంగా క్లిష్టమైన పాఠాలపై చర్చలు జరపాలి. కలిసిమెలిసి సమస్యలను పరిష్కరించడం నేర్చుకోవాలి. దీని వల్ల మౌలికాంశాలపై త్వరగా పట్టు పెరుగుతుంది.

డీఎస్సీ - 2024
ఫిజికల్ సైన్స్ మెథడాలజీ

అదిగో అక్కడే నిశాచర మేఘాలు!

పరిసరాలు ఒకసారి వేడిగా ఉంటాయి. మరోసారి చల్లగా మారిపోతాయి. ఇంకోసారి వర్షాలతో నిండిపోతాయి. ఈ పరిస్థితుల సగటును ఆ ప్రదేశంలోని వాతావరణం అంటారు. భౌగోళిక స్థానం ఎత్తు, సముద్రమట్టం నుంచి అది ఉండే దూరాన్ని అనుసరించి ఉష్ణోగ్రత, తేమ, గాలి, వర్షపాతం ఉంటాయి. భూమి చుట్టూ వివిధ వాయువుల సమూహంతో కూడిన పొరలు ఆవరించి ఉన్నాయి. వర్షపాతం, వాతావరణ భేదాలకు అవే కారణం. సాంద్రత, ఉష్ణోగ్రతలు, వాయువుల నిష్పత్తి పరంగా ఎన్నో వైవిధ్యాలతో ఉండే ఈ పొరల అమరిక, వాటిలోని ప్రత్యేక పరిస్థితుల గురించి పోటీ పరీక్షార్థులకు ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. రకరకాల ఎత్తుల్లో ఉండే వాయువుల పొరలు, వాటి పరిధులను తెలుసుకోవాలి.


సూర్యోదయం సమయంలో నిశాచర మేఘాలు


జనరల్ స్టడీస్
ప్రపంచ భూగోళ శాస్త్రం

వాతావరణం

భూమి చుట్టూ ఆవరించి ఉన్న వాయు పొరను వాతావరణం అంటారు. వాతావరణంలో ఘన, ద్రవ, వాయు పదార్థాలు ఉంటాయి. వాతావరణంలోని 90% ద్రవ్యరాశి 32 కిలోమీటర్లకు దిగువనే విస్తరించి ఉంటుంది. వాతావరణాన్ని సాంద్రత, ఉష్ణోగ్రతల ఆధారంగా అయిదు పొరలుగా విభజించవచ్చు.

1) ట్రోపో ఆవరణం: ట్రోపో ఆవరణం అంటే మిశ్రమ ఆవరణం అని అర్థం. భూమధ్యరేఖ వద్ద 18 కి.మీ., ధ్రువాల వద్ద 8 కి.మీ. ఎత్తు ఉంటుంది (సగటు ఎత్తు 13 కి.మీ). భూమధ్యరేఖ వద్ద అధిక ఎత్తు ఉండటానికి కారణం ఉష్ణ సంవహన ప్రవాహాలు. ఈ ఆవరణాన్ని 'ఘర్షణ పొర' అని కూడా అంటారు. ఇందులో సాధారణ క్షీణతా క్రమం సంభవిస్తుంది. ట్రోపో పాస్ ఆవరణంలో భూమధ్యరేఖ వద్ద -80° సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత, ధ్రువాల వద్ద -45° సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదవుతుంది. మొత్తం వాతావరణంలో 75% ఇక్కడే కేంద్రీకృతమై ఉంటుంది. పైకి వెళ్లేకొద్దీ ఘర్షణ బలం, వాతావరణ అణువుల సంఖ్య, పీడనం, సాంద్రత తగ్గిపోతాయి. ఈ ఆవరణంలోనే ద్రవీభవనం, భాష్పీభవనం, అవపాతం, సైక్లోన్లు లాంటి అన్నిరకాల వాతావరణ మార్పులు సంభవిస్తాయి. ఈ ఆవరణ పైభాగంలో అత్యంత వేగంతో వీచే వాయురాశులైన జెట్ స్ట్రీమ్స్ ఉంటాయి.

2) స్ట్రాటో ఆవరణం: 50 కి.మీ. ఎత్తు వరకు ఉంటుంది. బలమైన మేఘాల ప్రవాహం లేకపోవడంతో ఇక్కడ జెట్ విమానాలు ఎగురుతాయి. ఈ ఆవరణంలో సాధారణ క్షీణతాక్రమం జరగదు. ఓజోన్ పొర విస్తరించి ఉండటం వల్ల ఇక్కడ ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఈ ఆవరణంలో వర్షాన్ని ఇవ్వని ప్రత్యేక మేఘం ఉంటుంది. దాన్ని 'ముత్యాల తల్లుల మేఘం' (Mother of Pearl) అంటారు. దీనికి 'నాక్రియస్' అని కూడా పేరు.



3) మీసో ఆవరణం: 80 కి.మీ.ల ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. మీసో ఆవరణం అంటే మధ్య ఆవరణం అని అర్థం. ఈ ఆవరణంలో తిరిగి సాధారణ క్షీణతా క్రమం జరుగుతుంది. అందుకే ఈ ఆవరణాన్ని 'బాహ్య ట్రోపో ఆవరణం' అంటారు. ఈ ఆవరణంలోకి అంతరిక్ష పదార్థాలు ఏవైనా ప్రవేశించగానే కాలిపోతాయి. ఈ ఆవరణంలో నిశాచర మేఘాలు (Noctilucent Clouds) ఉంటాయి.

4) థర్మో ఆవరణం: 80-400 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. ఈ ఆవరణాన్ని కెన్నెల్లీ, హీవిసైడ్ శాస్త్రవేత్తలు కనుక్కున్నారు. దీన్ని 'ఐనో ఆవరణం' అని కూడా అంటారు. ఇక్కడ రేడియో తరంగాల పరావర్తనం జరుగుతుంది. ఆ ఎత్తు పెరిగేకొద్దీ ఈ ఆవరణంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. కారణం ఇక్కడున్న ఆక్సిజన్ అణువులు అతినీలలోహిత కిరణాలను (Ultraviolet Rays) సంగ్రహించడమే. ఈ ఆవరణాన్ని తిరిగి D, E, స్పొరాడిక్ E1, E2, F1, G ఆవరణాలుగా విభజిస్తారు. ధ్రువకాంతులైన అరోరా బొరియాలిస్, అరోరా ఆస్ట్రాలిస్‌లు ఇక్కడ ఏర్పడతాయి.

5) ఎక్సో ఆవరణం: 400 కి.మీ.ల ఎత్తు పైన ఉన్న మొత్తం ఆవరణను ఎక్సో ఆవరణం అంటారు. ఇక్కడ కూడా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఈ ఆవరణానికి సంబంధించి అతి తక్కువ సమాచారం మాత్రమే అందుబాటులో ఉంది.

వాతావరణంలోని వివిధ పదార్థాల ఉనికి ఆధారంగా వాతావరణాన్ని రెండు పొరలుగా విభజించారు.


I) సమరూప ఆవరణం (Homosphere): 0-90 కి.మీ. వరకు విస్తరించిన ఈ పొరలో ట్రోపో, స్ట్రాటో, మీసో ఆవరణాలు ఉంటాయి. నత్రజని, ఆక్సిజన్, ఆర్గాన్, కార్బన్ డై ఆక్సైడ్ లాంటి వాయువుల నిష్పత్తి అంతటా ఒకేలా ఉంటుంది.

2) బహురూప ఆవరణం (Heterosphere): 90 కి.మీ. పైన ఉన్న వాతావరణం. ఇందులో వాయువుల నిష్పత్తి వేర్వేరుగా ఉంటుంది. థర్మో, ఎక్సో ఆవరణాలు ఇందులో ఉంటాయి. ఈ పొరను వాయువుల ఉనికి ఆధారంగా పలు విధాలుగా విభజించారు.

i) నత్రజని పొర: 90 - 200 కి.మీ. ఎత్తు వరకు
ii) ఆక్సిజన్ పొర: 200 - 1125 కి.మీ.
iii) హీలియం పొర: 1125 - 3540 కి.మీ.
iv) హైడ్రోజన్ పొర: 3540 - 9060 కి.మీ.

వాతావరణ పొరల సరిహద్దులు

పొర సరిహద్దు	ఏయే పొరల మధ్య
ట్రోపోపాస్	ట్రోపోస్ఫియర్, స్ట్రాటోస్ఫియర్
స్ట్రాటోపాస్	స్ట్రాటోస్ఫియర్, మీసోస్ఫియర్
మీసోపాస్	మీసోస్ఫియర్, థర్మోస్ఫియర్
థర్మోపాస్	థర్మోస్ఫియర్, ఎక్సోస్ఫియర్


రచయిత: సక్కరి జయకర్

సీనియర్ ఇంటర్
వృక్ష శాస్త్రం
ప్రశ్నలు జవాబులు

అణువులను దాటవేసే తూములు

వృక్ష శరీర ధర్మశాస్త్రం



మొక్కల్లో రవాణా (2 మార్కులు)

1) పోరిన్‌లు అంటే ఏమిటి? విసరణ చర్యలో వాటి పాత్ర ఏమిటి?
జ: త్వచంలోని కొన్ని ప్రొటీన్లు 'అణువులను దాటవేసే తూములు'గా ఏర్పడతాయి. వీటినే 'పోరిన్‌లు' అంటారు. ప్లాస్టిడ్లు, మైటోకాండ్రియా, కొన్ని బాక్టీరియమ్‌ల వెలుపలి త్వచంలో ఉండే పోరిన్‌లు అనే ప్రొటీన్లు.. పెద్దసైజు రంధ్రాలను ఏర్పరచి, చిన్న సైజు ప్రొటీన్ల పరిమాణంతో దాదాపు సమానంగా ఉన్న అణువులను ప్రయాణించడానికి అనుమతిస్తాయి.

2) నీటి శక్మాన్ని నిర్వచించండి. శుద్ధమైన నీటికి ఉండే నీటి శక్మం విలువ ఎంత?
జ: నీటి రసాయన శక్మాన్ని 'నీటి శక్మం' అంటారు. ఇది నీటి చలనాన్ని తెలుసుకోవడానికి మౌలికం. శుద్ధమైన నీటికి ఉండే నీటి శక్మం విలువ = 0 (సున్నా)

3) అపోప్లాస్ట్, సింప్లాస్ట్ అంటే ఏమిటి?
జ: మొక్క దేహం నిండా పక్కపక్కన ఆనుకుని ఉండే కణ కవచాలు అవిచ్ఛిన్నంగా ఏర్పడి ఉండే స్థితిని 'అపోప్లాస్ట్' అంటారు. దీనిలో నీటి చలనం కేవలం కణాంతరావకాశాలు, కణ కవచాల ద్వారా మాత్రమే జరుగుతుంది. దీనిలో నీరు కణత్వచాన్ని దాటదు. ఇది చురుకుగా జరుగుతుంది. మొక్క దేహంలో కణం, కణానికి మధ్య ఏర్పడిన ప్రోటోప్లాస్ట్‌ల అంతర్జాల వ్యవస్థను 'సింప్లాస్ట్' అంటారు. ఈ విధానంలో నీరు కణాల్లోని కణద్రవ్య బంధాల ద్వారా ప్రయాణిస్తుంది. సింప్లాస్ట్ చలనం సాపేక్షంగా మంద గమనంగా ఉంటుంది.

4) విసరణ, ద్రవాభిసరణకు మధ్య భేదం ఏమిటి?
జ: విసరణ: అధిక గాఢత ఉండే ప్రదేశం నుంచి అల్పగాఢత ఉండే ప్రదేశంలోకి వాయువులు/అణువుల చలనం.
ద్రవాభిసరణ: అల్ప గాఢత ఉండే ప్రదేశం నుంచి అధిక గాఢత ఉండే ప్రదేశంలోకి భేదక పారగమ్యత్వచం ద్వారా నీరు రవాణా చెందడం.

- డి. రాకేష్

ముఖ్యమైనవి మరికొన్ని..

1) బఠాణీ, గోధుమ గింజలకు ఉండే నిపాన సామర్థ్యాలను పోల్చండి. **(2 మా.)**
2) నీటి శక్మాన్ని నిర్వచించి, వివరించండి. **(4 మా.)**
3) కణద్రవ్య సంకోచం అంటే ఏమిటి? నిజ జీవితంలో దాని ఉపయోగం ఏమిటి? **(4 మా.)**

జవాబుల కోసం

వేగంలో బ్రహ్మోస్.. దూరంలో అగ్ని!

సైన్స్ అండ్ టెక్నాలజీ

రక్షణ రంగంలో అత్యంత ముఖ్యమైన ఆయుధాలు క్షిపణులు. శత్రుదేశ లక్ష్యాలపై దాడి చేయడానికి కీలకమైనవి. క్షిపణి సాంకేతికతలో భారతదేశం ఎంతో అభివృద్ధి సాధించింది. గాలి, నీరు, నేల నుంచి వాటిని ప్రయోగించే సత్తా దేశానికి ఉంది. పోటీ పరీక్షల్లో ప్రశ్నలు అడగడానికి అవకాశం ఉన్న అంశాల్లో క్షిపణి సాంకేతికత ఒకటి. అభ్యర్థులు దీనిపై ప్రాథమిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. భారత్ వద్ద ప్రస్తుతం ఉన్న క్షిపణులు, పరిధి, సామర్థ్యం, ప్రత్యేకతలు, వాటి అభివృద్ధిలో భాగస్వాములైన కీలక వ్యక్తులు, తయారీ సంస్థలతో పాటు పలు దశల్లో ఉన్న వివిధ ప్రాజెక్టుల వివరాలు తెలుసుకోవాలి.


బ్రహ్మోస్ క్షిపణి


అగ్ని–3 క్షిపణి

యుద్ధరంగంలో శక్తిమంతమైన ఆయుధాలు - క్షిపణులు

1. క్షిపణులకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
ఎ) వీటిని నేలపై నుంచి ప్రయోగించి శత్రుదేశాల నేలపై, గాలిలోని లక్ష్యాలను ఛేదించడానికి ఉపయోగిస్తారు.
బి) క్షిపణులను యుద్ధవిమానాలు, హెలికాప్టర్ల నుంచి ప్రయోగించవచ్చు.
సి) జలాంతర్గాముల నుంచి క్షిపణులను ప్రయోగించి నేలపై లక్ష్యాలను ఛేదించవచ్చు.
డి) నేలపై నుంచి ప్రయోగించే క్షిపణులతో శత్రుదేశాల సైనిక, వైమానిక స్థావరాలను ధ్వంసం చేయవచ్చు.
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

2. కిందివాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
ఎ) క్షిపణుల్లో ఘనఇంధనాన్ని వాడి నిల్వ చేయవచ్చు.
బి) ద్రవఇంధనం ఉన్న క్షిపణులను నిల్వ చేయడం కష్టతరం.
సి) క్షిపణులు ద్రవ హైడ్రోజన్‌ను ఇంధనంగా వాడుకుంటాయి.
డి) గాలి నుంచి ఆక్సిజన్‌ను తీసుకునే ఇంజిన్లను రామ్ జెట్ ఇంజిన్లు అంటారు.
1) ఎ 2) బి 3) సి 4) డి

3. క్షిపణులు ప్రయాణించే దూరం ఆధారంగా కింది వాటిని జతపరచండి.
ఎ) ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్ (ఐసీబీఎం) — 1) 2000 కి.మీ.
బి) ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ మిస్సైల్ (ఐఆర్‌బీఎం) — 2) 5500 కి.మీ.
సి) మీడియం రేంజ్ బాలిస్టిక్ మిస్సైల్ (ఎంఆర్‌బీఎం) — 3) 900 కి.మీ.
డి) షార్ట్‌రేంజ్ బాలిస్టిక్ మిస్సైల్ (ఎస్‌ఆర్‌బీఎం) — 4) 3000 కి.మీ.
1) ఎ-2, బి-3, సి-4, డి-1
2) ఎ-4, బి-2, సి-3, 4-ఎ
3) ఎ-2, బి-4, సి-1, డి-3,
4) ఎ-3, బి-2, సి-1, డి-4

4. భారతదేశంలో క్షిపణుల అభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించి, కిందివాటిని పరిశీలించి, సరైన సమాధానాన్ని ఎంచుకోండి.
ఎ) ప్రాజెక్ట్ డెవిల్‌లో భాగంగా నేల నుంచి నేల పైకి ప్రయోగించే క్షిపణులను అభివృద్ధి చేయాలని భావించారు.
బి) ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా 5 క్షిపణులను అభివృద్ధి చేశారు.
1) ఎ, బి 2) ఎ 3) బి 4) ఏదీకాదు

5. కిందివాటిలో సరైన వాటిని గుర్తించండి.
ఎ) అబ్దుల్ కలాంను భారతదేశ క్షిపణి పితామహుడు అంటారు.
బి) ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఐజీఎండీపీ) హైదరాబాద్‌లోని డీఆర్‌డీఎల్‌లో ప్రారంభించారు.
సి) టెస్సీథామస్‌ను 'అగ్నిపుత్రి' లేదా 'మిస్సైల్ ఉమన్' అని పిలుస్తారు.
డి) అగ్ని, పృథ్వి, ఆకాష్, త్రిశూల్, నాగ్ క్షిపణులను ఐజీఎండీపీలో అభివృద్ధి చేశారు.
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

6. అగ్ని క్షిపణికి సంబంధించి కిందివాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) అగ్ని క్షిపణి మోసుకెళ్లే బరువు 1000 కిలోలు.
బి) ఇది ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణి.
సి) అగ్ని-1 క్షిపణి పరిధి 700 - 1250 కి.మీ., ఒకే దశలో ఉన్న ఘనరూప ఇంధనాన్ని కలిగి ఉంటుంది.
డి) అగ్ని-2 క్షిపణి పరిధి 2000 - 3000 కి.మీ. ఇది రెండు దశల్లో ఉన్న ఘనరూప ఇంధనాన్ని కలిగి ఉంటుంది.
1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి

7. కిందివాటిలో సరికాని వాటిని గుర్తించండి.
ఎ) పృథ్వి క్షిపణి స్వల్పదూర బాలిస్టిక్ క్షిపణి.
బి) పృథ్వి క్షిపణి పరిధి 5,500 కి.మీ.
సి) పృథ్వి-3 క్షిపణి నావికాదళ రకాన్ని 'ధనుష్' అనే పేరుతో పిలుస్తున్నారు.
1) ఎ 2) బి 3) సి 4) ఏదీకాదు

8. కిందివాటిని సరైన క్రమంలో జతపరచండి.
1) అగ్ని-1 పరిధి — ఎ) 5000 కి.మీ. పైన
2) అగ్ని-2 పరిధి — బి) 3500 కి.మీ.
3) అగ్ని-3 పరిధి — సి) 4000 కి.మీ.
4) అగ్ని-4 పరిధి — డి) 1000 కి.మీ.
5) అగ్ని-5 పరిధి — ఇ) 1500 కి.మీ.
1) 1-ఎ, 2-సి, సి-బి, 4-డి, 5-ఇ
2) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ, 5-ఇ
3) 1-డి, 2-ఇ, 3-బి, 4-సి, 5-ఎ
4) 1-ఇ, 2-డి, 3-సి, 4-బి, 5-ఎ

9. కిందివాటిలో సరైన వాటిని గుర్తించండి.
ఎ) అగ్ని ప్రైమ్ క్షిపణి అణ్వస్త్రాలను మోసుకెళ్లే ఖండాంతర క్షిపణి.
బి) భారతదేశం ఇటీవల రాత్రి పూట అగ్ని క్షిపణి-5 ని పరీక్షించింది.
సి) అగ్ని-6 క్షిపణి పరిధి 8,000 నుంచి 10,000 కి.మీ.
1) ఎ, బి 2) ఎ, బి, సి 3) ఎ, సి 4) బి, సి

10. ఆకాష్ క్షిపణికి సంబంధించి కిందివాటిలో సరైన వాటిని గుర్తించండి.
ఎ) ఇది ఉపరితలం నుంచి గాలిలోకి ప్రయోగించే క్షిపణి.
బి) దీని పరిధి 25-30 కి.మీ., 60 కిలోల పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు.
సి) దీన్ని ఇంటర్‌సెప్టార్ (అడ్డగించే) క్షిపణిగా ఉపయోగిస్తారు.
డి) ఇది 2.5 మాక్ వేగంతో ప్రయాణిస్తుంది.
1) ఎ, బి, సి 2) బి, సి, డి 3) ఎ, బి, సి, డి 4) బి, డి

11. త్రిశూల్ క్షిపణికి సంబంధించి కిందివాటిలో సరికాని వాటిని గుర్తించండి.
ఎ) దీని పరిధి 5000 కి.మీ.
బి) ఇది ఉపరితలం నుంచి గాలిలో ప్రయోగించే క్షిపణి.
సి) ఇది క్విక్ రియాక్షన్ మిస్సైల్.
డి) ఇది 2000 కిలోల బరువును మోసుకెళుతుంది.
1) ఎ, డి 2) బి, సి 3) సి, డి 4) ఎ, బి

12. యాంటీ ట్యాంక్ క్షిపణుల గురించి కిందివాటిలో సరైన వాటిని గుర్తించండి.
1) నాగ్ — ఎ) హెలికాప్టర్ నుంచి ప్రయోగించవచ్చు.
2) అమోఘ — బి) 3వ తరం, ఎయిర్ ఫోర్స్ రకం.
3) హెలీనా — సి) 2వ తరం ట్యాంకు విధ్వంసక క్షిపణి.
4) ధ్రువాస్త్ర — డి) దీన్ని 'నమికా' అనే వాహనం నుంచి ప్రయోగిస్తారు.
1) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
2) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
3) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
4) 1-ఎ, 2-డి, 3-సి, 4-బి

13. ప్రళయ్ క్షిపణి గురించి కిందివాటిలో సరైన వాటిని గుర్తించండి.
ఎ) ఇది భారతదేశ మొదటి క్వాసి బాలిస్టిక్ క్షిపణి.
బి) ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణి.
సి) దీని పరిధి 150 - 500 కి.మీ.
డి) మొబైల్ లాంచర్ నుంచి ప్రయోగించవచ్చు
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, డి 4) ఎ, బి, సి, డి

14. కిందివాటిలో హెలీనా క్షిపణి గురించి సరికాని వాటిని గుర్తించండి.
ఎ) ఇది సుదూర ఖండాంతర క్షిపణి.
బి) దీన్ని హెలికాప్టర్ నుంచి ప్రయోగించవచ్చు.
సి) దీని పరిధి 5,500 కి.మీ.
డి) 3వ తరం యాంటీ ట్యాంక్ క్షిపణి.
1) ఎ, సి 2) బి, సి 3) సి, డి 4) ఎ, బి

15. శౌర్య క్షిపణి గురించి కిందివాటిలో సరైన వాటిని గుర్తించండి.
ఎ) ఇది హైపర్ సోనిక్ క్షిపణి
బి) ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణి.
సి) దీని పరిధి 750 - 1800 కి.మీ.
డి) దీన్ని కె-15 క్షిపణి ల్యాండ్ వర్షన్‌గా చెప్పవచ్చు
ఇ) ఇది 2 దశల ఘన ఇంధనాన్ని కలిగి ఉంటుంది.
1) ఎ, బి, సి 2) బి, సి, డి 3) సి, డి, ఇ 4) ఎ, బి, సి, డి

16. ఇచ్చినవాటిని సరైన క్రమంలో జతపరచండి.
1) శౌర్య — ఎ) మల్టీబారెల్ రాకెట్ లాంచర్
2) అస్త్ర — బి) దూరశ్రేణి క్రూయిజ్ క్షిపణి
3) ప్రహార్ — సి) హైపర్ సోనిక్ క్షిపణి
4) నిర్భయ్ — డి) ప్రగతి పేరుతో ఎగుమతి చేస్తున్నారు
5) పినాక — ఇ) బియాండ్ విజువల్ రేంజ్ క్షిపణి
1) 1-సి, 2-ఇ, 3-డి, 4-బి, 5-ఎ
2) 1-బి, 2-సి, 3-డి, 4-ఇ, 5-ఎ
3) 1-ఇ, 2-బి, 3-సి, 4-డి, 5-ఎ
4) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి, 5-ఇ

17. నిర్భయ్ క్షిపణి గురించి కిందివాటిలో సరైన వాటిని గుర్తించండి.
ఎ) ఇది దూరశ్రేణి క్రూయిజ్ క్షిపణి.
బి) ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణి
సి) దీని పరిధి 800 నుంచి 1000 కి.మీ.
డి) దీన్ని బెంగళూరులోని ఎయిరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీవారు అభివృద్ధి చేశారు.
ఇ) దీని వేగం 0.7 మాక్
1) ఎ, బి, సి 2) బి, సి, డి 3) ఎ, బి, సి, డి, ఇ 4) సి, డి, ఇ

18. కిందివాటిలో సరికాని వాటిని గుర్తించండి.
ఎ) పినాకా అనేది మల్టీబారెల్ రాకెట్ లాంచర్
బి) బారాక్ క్షిపణి వ్యవస్థను భారత్ ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకుంది.
సి) బ్రహ్మోస్ క్షిపణిని అమెరికా, ఇండియా కలిసి అభివృద్ధి చేశాయి.
డి) బారాక్ క్షిపణులను ఎయిర్ డిఫెన్స్‌కు వాడతారు.
1) బి, సి 2) ఎ, డి 3) సి, డి 4) ఎ, సి

19. బ్రహ్మోస్ క్షిపణి గురించి కిందివాటిలో సరైన వాటిని గుర్తించండి.
ఎ) బ్రహ్మపుత్ర, మాస్కోవా నదుల పేర్లు మీదుగా క్షిపణికి పేరు పెట్టారు.
బి) ప్రపంచంలోనే వేగవంతమైన క్రూయిజ్ క్షిపణి.
సి) 2.8 మాక్ వేగంతో వెళుతుంది.
డి) రామ్‌జెట్ ఇంజిన్‌ను కలిగి ఉంటుంది.
ఇ) దీన్ని ఇండియా, రష్యా కలిసి అభివృద్ధి చేశాయి.
1) ఎ, బి, సి, డి
2) బి, సి, డి
3) సి, డి, ఇ
4) ఎ, బి, సి, డి, ఇ


రచయిత: డాక్టర్ బి. నరేశ్

సమాధానాలు

1-4; 2-3; 3-3; 4-1; 5-4; 6-1; 7-2; 8-3; 9-2; 10-3; 11-1; 12-3; 13-4; 14-1; 15-4; 16-1; 17-3, 18-1; 19-4.

ఎస్సీ, ఎస్టీ కమిషన్లు

దేశంలో కొన్ని వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా వెనకబడి ఉన్నాయి. తరాలుగా కొనసాగుతున్న కులవ్యవస్థ కారణంగా కొన్ని వర్గాలు అంటరానితనానికి గురయ్యాయి. వీరిలో షెడ్యూల్డ్ కులాల వారు ఒక వర్గం, షెడ్యూల్డ్ తెగల వారు మరో వర్గం. వీరిపై సమాజం అనేక ఆంక్షలు విధించడంతో అభివృద్ధికి దూరంగా ఉండిపోయారు. వీరి హక్కులను పరిరక్షించడానికి, ఆయా వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా కమిషన్లను ఏర్పాటు చేశాయి.



వారి హక్కుల పరిరక్షణ, అభివృద్ధే ఆ కమిషన్ల బాధ్యత

టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

జాతీయ షెడ్యూల్డ్ కులాలు, తెగల కమిషన్

షెడ్యూల్డ్ కులాలు, తెగల కమిషన్‌ను రాజ్యాంగంలోని 338 ఆర్టికల్ ప్రకారం 1978లో ఏర్పాటు చేశారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, వారి ప్రయోజనాల రక్షణలో భాగంగా దీన్ని మొరార్జీ దేశాయ్ ప్రభుత్వ కాలంలో బోలా పాశ్వాన్ శాస్త్రి అధ్యక్షతన (మొదటి ఛైర్మన్) ఏర్పాటు చేశారు.

- ❖ 1987లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ఈ కమిషన్‌ను ధ్రువీకరించింది.
- ❖ 1990లో విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ (వీపీ సింగ్) ప్రధానిగా ఉన్న కాలంలో 65వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా దీనికి రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. 1992 మార్చి 12 నుంచి ఈ కమిషన్ అమల్లోకి వచ్చింది.
- ❖ 2003లో 89వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఎస్సీ, ఎస్టీ కమిషన్లను వేర్వేరుగా ఏర్పాటు చేశారు.
- ◆ ఆర్టికల్ 338 ప్రకారం జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్‌ను ఏర్పాటు చేశారు.
- ◆ 338 (ఎ) ప్రకారం జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్‌ను ఏర్పాటు చేశారు.
- ◆ 2004 ఫిబ్రవరి నుంచి ఈ కమిషన్లు ఇవి అమల్లోకి వచ్చాయి.

జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషనర్లు (ఉమ్మడిగా ఉన్నప్పుడు)

☛ ఎస్. హెచ్. రామ్‌ధన్	1992 - 95
☛ హెచ్. హనుమంతప్ప	1995 - 98
☛ దిలీప్ సింగ్ భూరియా	1998 - 2002
☛ డా.విజయ శంకర్ శాస్త్రి	2002 - 04

జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్

ఎస్సీ కమిషన్ రాజ్యాంగపరమైన స్వతంత్ర సంస్థ.

- ▮ ఆర్టికల్ 338 (1) ప్రకారం ఎస్సీ కమిషన్‌లో ఒక ఛైర్మన్, ఒక వైస్ ఛైర్మన్, ముగ్గురు ఇతర సభ్యులుంటారు. వీరి పదవీ కాలం మూడేళ్లు.
- ▮ వీరిలో ఒక మహిళా సభ్యురాలు తప్పక ఉండాలి.
- ▮ వీరందరిని రాష్ట్రపతి స్వయంగా సంతకం చేసిన అధికార పత్రం ద్వారా నియమిస్తారు. వీరిని నియమించే, తొలగించే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది.
- ▮ వీరు తమ రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతికి సమర్పిస్తారు.
- ▮ హోదారీత్యా ఈ కమిషన్ ఛైర్మన్ ఎన్‌హెచ్‌ఆర్‌సీలో సభ్యుడిగా వ్యవహరిస్తారు.
- ▮ జాతీయ షెడ్యూల్డ్ కులాల ప్రధాన కార్యాలయం న్యూదిల్లీలో ఉంది.

అధికారాలు – విధులు:

ఎస్సీ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తిని కలిగి ఉంటుంది. తన పని విధానాన్ని తానే నియంత్రించుకుంటుంది.

- ■ ఎస్సీల హక్కులను పరిరక్షిస్తుంది, పరిశీలిస్తుంది.
- ■ షెడ్యూల్డ్ కులాల హక్కులకు భంగం కలిగితే ఫిర్యాదులు స్వీకరిస్తుంది. విచారణ జరుపుతుంది.
- ■ సామాజిక అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర కార్యక్రమాల్లో పాల్గొని, తగిన సలహాలు ఇస్తుంది.
- ■ ఎస్సీ రక్షణకు ఏర్పాట్లు, పనితీరు సమీక్షించడం చేస్తుంది.
- ■ ఎస్సీ కులాల పురోగతి, అభివృద్ధి, సంక్షేమం తదితర అంశాల నిర్వహణ.
- ■ షెడ్యూల్డ్ కులాల పరిరక్షణకు సంబంధించి రాష్ట్రపతికి వార్షిక నివేదిక అందించడం. (కమిషన్ ఇచ్చిన నివేదికలను రాష్ట్రపతి పార్లమెంట్ ఉభయసభలకు పంపుతారు)
- ■ ఫిర్యాదులపై విచారణ జరిపే సమయంలో కమిషన్‌కు సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు ఉంటాయి. దీని ప్రకారం సంబంధిత వ్యక్తికి సమన్లు అందించి, అతడిని పిలిపించి, విచారణ జరుపుతుంది.
- ■ ఏ అధికారినైనా తమకు డాక్యుమెంట్లు సమర్పించాల్సిందిగా ఆదేశించవచ్చు, అఫిడవిట్ల ద్వారా సాక్ష్యాల సేకరణ, ఏదైనా న్యాయస్థానం లేదా ఆఫీస్ నుంచి పబ్లిక్ రికార్డులు తెప్పించుకుని పరిశీలించవచ్చు.
- ■ ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అంశాల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కమిషన్‌తో సంప్రదించాలి.
- ■ 341(3) ప్రకారం కొన్ని కులాలను ఒకే గ్రూప్ కిందికి చేర్చే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఏదైనా ఒక కులాన్ని ఎస్సీ జాబితా నుంచి తొలగిస్తూ/చేర్చుతూ రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయంపై న్యాయసమీక్ష చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.
- ■ ఈ కమిషన్ 1976 నాటి పౌర హక్కుల పరిరక్షణ చట్టం, 1989 నాటి ఎస్సీ, ఎస్టీ అకృత్యాల నిరోధక చట్టం అమలును పర్యవేక్షిస్తుంది.

జీతభత్యాలు

ఈ కమిషన్ ఛైర్మన్ కేంద్ర కేబినెట్ మంత్రి హోదా, వైస్ ఛైర్మన్ రాష్ట్ర మంత్రి హోదా, సభ్యులు డిప్యూటీ మంత్రి హోదా కలిగి ఉంటారు. వీరి జీతభత్యాలు ఆయా హోదాలను బట్టి ఉంటాయి.



రచయిత
ఎం. ఈశ్వర వెంకటరావు
విషయ నిపుణులు

జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్లు

సూరజ్‌భాన్ (తొలి ఛైర్మన్)	2004 - 07
భూటాసింగ్	2007 - 10
పి.ఎల్. పూనియా (రెండుసార్లు)	2010 - 13, 2013 - 17
రామ్‌శంకర్ కఠారియా	2017 - 2020
విజయ్ సాంప్ల	2021 - 23
కిశోర్ మక్వానా	2024 - ప్రస్తుతం

జాతీయ షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) కమిషన్

ఆర్టికల్ 338 (ఎ) ప్రకారం, 89వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ 2004 ఫిబ్రవరిలో ఏర్పాటైంది. 2003లో దిలీప్‌సింగ్ భూరియా కమిటీ సిఫార్సుల మేరకు ఈ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.

- ◆ ఈ కమిషన్ రాజ్యాంగబద్ధ సంస్థ.
- ◆ దీని ప్రధాన కార్యాలయం న్యూదిల్లీలో ఉంది.
- ◆ ఈ కమిషన్‌లో ఒక ఛైర్మన్, ఒక వైస్ ఛైర్మన్, ముగ్గురు ఇతర సభ్యులు ఉంటారు. వీరిలో ఒక మహిళా సభ్యురాలు తప్పనిసరిగా ఉండాలి.
- ◆ వీరి పదవీ కాలం మూడేళ్లు. వీరిని నియమించే, తొలగించే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది.
- ◆ ఈ కమిషన్ ఛైర్మన్‌కి కేబినెట్ మంత్రి హోదా, వైస్ ఛైర్మన్‌కి రాష్ట్ర మంత్రి హోదా, సభ్యులకు డిప్యూటీ మంత్రి హోదాను కల్పిస్తారు. వీరికి ఆయా హోదాను బట్టి జీతభత్యాలు ఉంటాయి.
- ◆ వీరు తమ రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతికి అందజేస్తారు.
- ◆ ఈ కమిషన్ ఛైర్మన్ హోదారీత్యా ఎన్‌హెచ్‌ఆర్‌సీలో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా వ్యవహరిస్తారు.

అధికారాలు – విధులు

- ☛ రాజ్యాంగపరంగా, చట్టాల ద్వారా షెడ్యూల్డ్ తెగల వారికి కల్పించిన రక్షణలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో పర్యవేక్షించడం, విచారించడం.
- ☛ ఎస్టీ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించడం, విచారించడం
- ☛ షెడ్యూల్డ్ తెగల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించడం, వాటికి తగిన సలహాలు ఇవ్వడం.
- ☛ రాష్ట్రపతికి వార్షిక నివేదికలు అందించడం.
- ☛ ఎస్టీ సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన సలహాలు ఇవ్వడం.
- ☛ అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసీలకు, అడవుల్లో లభించే ఉత్పత్తులపై హక్కు కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవడం.
- ☛ చట్టరీత్యా ఆదివాసీలకు ఖనిజ, జలవనరులపై తగిన హక్కులు కల్పించడం. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా నిర్వాసితులైన ఆదివాసీలకు పునరావాసం కల్పించడం.
- ☛ ఆదివాసీలకు చెందిన భూమి అన్యాక్రాంతం కాకుండా నివారించడం, అడవులను పరిరక్షించడంలో ఆదివాసీల సహకారాన్ని పెంపొందించడం.
- ☛ పంచాయతీరాజ్ చట్టం ఎస్టీ ప్రాంతాలకు వర్తింపజేసేలా కృషి చేయడం.
- ☛ ఆదివాసీలు అనాదిగా అనుసరిస్తున్న పోడు వ్యవసాయ పద్ధతిని నివారించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా చేయడం.
- ☛ అఫిడవిట్లు స్వీకరించడం, సంబంధిత పత్రాలు సమర్పించమని ఉత్తర్వులు జారీ చేయడం
- ☛ న్యాయస్థానం, ప్రభుత్వ కార్యాలయం నుంచి అవసరమైన సమాచారాన్ని పొందవచ్చు.
- ☛ సాక్షుల విచారణ, అధికార పత్రాల పరిశీలన కోసం సమన్లు జారీ చేయవచ్చు.
- ☛ ఈ కమిషన్‌కు సివిల్‌కోర్టుకు ఉండే అధికారాలు ఉంటాయి.

జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్లు

కున్వర్‌సింగ్ (తొలి ఛైర్మన్)	2004 - 07
ఊర్మిళా సింగ్	2007 - 10
రామేశ్వర్ ఓరాన్ (రెండుసార్లు)	2010 - 13, 2013 - 16

❖ ప్రస్తుత జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ అంతర్ సింగ్ ఆర్య.

447 Word of the Day

Voluminous

Telugu meaning: భారీ, పెద్ద

English meaning: The word voluminous is an adjective that describes something large in volume or size, or something that is extensive in length or quantity.

Synonyms: Massive, Prolific

Antonyms: Small, Compact

Usage: **1.** She carried a voluminous bag filled with everything she might need for the trip.

2. The lawyer submitted a voluminous report, detailing every aspect of the case.

Latest Updates

Operator Posts

Center for Materials for Electronics Technology (C-MET), Hyderabad is conducting interview for the 31 Operator posts on contract basis. The interview dates are 24, 25 October 2024.

Dabolim Airport, Goa

AI Airport Services Limited invites applications for the recruitment to the Duty Manager, Supervisor, Customer Service Executive, Handyman ETC posts on Contract basis at Dabolim Airport, Goa. The total no. of posts is 429. The application fee is Rs.500. Eligible candidates can appear interviews on 24, 25, 26, 27, 28 October 2024.

Group A, B, C Posts

All India Institute of Medical Sciences (AIIMS), Mangalagiri is inviting applications for filling up the Group A, B, C posts on direct basis. The total number of posts is 93. The application fee is Rs.1500. The last date for offline application is 29 October 2024.

Did You Apply..?

Today (October 22) is the last date for the following Jobs/ Apprentice posts/ Admissions

- ✦ Assistant Professor posts in IIITDM, Kurnool. ***Qualification:*** UG, PG, Ph.D. in relevant discipline with experience.
- ✦ 5,066 Trade Apprentice posts in RRC Western Railway, Mumbai. ***Qualification:*** 10th,, ITI in relevant trades.
- ✦ Common Law Admission Test (CLAT) 2025.
- ✦ Trust & Safety New Assosiate posts in Accenture. ***Qualification:*** Any Graduate.

For more information and other notifications - scan QR code



డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో ముఖ్యమైన అంశాల్లో విపత్తులు - రకాలు ఒకటి. ఏర్పడే విధానం, వేగం ఆధారంగా విపత్తులను వర్గీకరించారు.

☛ ఈ వీడియోలో ప్రపంచవ్యాప్తంగా సంభవించే విపత్తులు, వాటి రకాలు; దీనికి సంబంధించిన ఉదాహరణలు; గత పరీక్షల్లో ఈ అంశం నుంచి ఏ విధమైన ప్రశ్నలు అడిగారు; విపత్తుల భౌతిక లక్షణాలు మొదలైన అంశాలను వివరించారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వీడియో పాఠం చూడండి.. మేమందించే వీడియోలు ఎప్పటికప్పుడు మిస్ కాకుండా చూసేందుకు ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేయండి!

Current Affairs



Vijaya Kishore Rahatkar was appointed 9th National Commission for Women (NCW) chairperson on 19 October 2024. She will hold this position for three years or until she reaches the age of 65, whichever comes first.

✦ Rahatkar hails from the Aurangabad district of Maharashtra. She was Chairperson of the Maharashtra State Commission for Women from 2016 to 2021.



New Zealand clinched the Women's T20 World Cup 2024 title on 20 October 2024. They defeated South Africa by 32 runs in the final held at the Dubai International Cricket Stadium, Dubai. It was New Zealand's maiden T20 World Cup title, men's and women's both.

Bhutan's Energy and Natural Resources Minister, Lyonpo Gem Tshering met with Power Minister Manohar Lal in New Delhi on 18 October 2024. The meeting focused on strengthening the long-standing cooperation between the two nations in the hydropower sector. Both sides discussed enhancing their collaboration to further boost energy production from the Puna-1 Hydroelectric Power (HEP) Project.

Abhyuday Jindal, the Managing Director of Jindal Stainless was appointed as President of industry body Indian Chamber of Commerce. Jindal succeeded Ameya Prabhu, the Managing Director of NAFA Capital.

For more Current Affairs: Scan QR code

Bank Exams
Quantitative Aptitude

Ratio & Proportion

1. A sum of money is to be distributed among A, B, C, D in the proportion of 5 : 2 : 4 : 3. If C gets Rs.1000 more than D, what is B's share?
A) Rs.500 B) Rs.1500
C) Rs.2000 D) Rs.3000
E) None of these

2. A and B together have Rs.1210. If $\frac{4}{15}$ of A's amount is equal to $\frac{2}{5}$ of B's amount, how much amount does B have?
A) Rs.460 B) Rs.484
C) Rs.550 D) Rs.664
E) None of these

3. A and B earn in the ratio 3 : 4. They spend in the ratio 4 : 3 and save in the ratio 2:5. If the total monthly savings of both A and B are Rs.7,000, the yearly income of A is...
A) Rs.6000 B) Rs.4000
C) Rs.72000 D) Rs.48000
E) None of these

4. The sum of three numbers is 98. If the ratio of the first to second is 2 : 3 and that of the second to the third is 5 : 8, then the second number is...
A) 20 B) 30 C) 48
D) 58 E) None of these

5. If Rs.782 be divided into three parts, proportional to $\frac{1}{2}:\frac{2}{3}:\frac{3}{4}$, then the first part is....
A) Rs.182 B) Rs.190
C) Rs.196 D) Rs.204
E) None of these

6. Rs.4830 is divided among Abhishek, Dishant and Prashant such that if Abhishek's share diminishes by Rs.5, Dishant's share diminishes by Rs.10 and Prashant's share diminishes by Rs.15, their shares will be in the ratio 5 : 4 : 3. Find the Dishant's original share.
A) Rs.1610 B) Rs.2010
C) Rs.2410 D) Rs.1590
E) None of these

7. On a certain day, the ratio of the passenger in the first class and the second class travelling by train is 1 : 3. The ratio of the fares collected from each first class and second class passengers is 30 : 1. If the total amount collected from all the passengers is Rs.1,320. Find the amount (in Rs.) collected from the second class passengers?
A) 240 B) 360 C) 480
D) 120 E) None of these

8. By mistake, instead of dividing Rs.117 among three persons P, Q and R in the ratio $\frac{1}{2}:\frac{1}{3}:\frac{1}{4}$, it was divided in the ratio 2 : 3 : 4. Who gains the most and how much?
A) P, Rs.28 B) Q, Rs.35
C) R, Rs.25 D) R, Rs.27
E) None of these

9. Salaries of Ravi and Sumit are in the ratio 2 : 3. If the salary of each is increased by Rs.4000, the new ratio becomes 40 : 57. What is Sumit's present salary?
A) Rs.17,000 B) Rs.20,000
C) Rs.25,500 D) Rs.38,000
E) None of these

10. A box has 1310 coins of denominations one rupee, fifty paise and twenty five paise. The ratio of their respective values is 35 : 26 : 11. The number of twenty five paise coins is....
A) 110 B) 350 C) 520
D) 440 E) None of these

11. A sum of Rs.44.25 is made up of 201 coins those are 20 paise coins and 25 paise coins. The number of 25 paise coins is...
A) 120 B) 81 C) 20
D) 115 E) None of these

12. A box contains 50 paise. 20 paise and 25 paise coins in the ratio 60 : 37 : 21. If the total amount of money in the box is Rs.217.25, the number of 20-paise coins. (approx.)
A) 21 B) 300 C) 185
D) 105 E) None of these

13. The fourth proportional to 5, 8, 15 is..
A) 18 B) 24 C) 19
D) 20 E) None of these

14. If sum of three numbers is 65 and the ratio of the first to second number is 5 : 3 while that of the second and third number is 7 : 3, then what is the second number?
A) 9 B) 15 C) 21
D) 35 E) None of these

15. If income of A and B is 17 : 19 and sum of their income is Rs.7200 find B's income.
A) 3600 B) 3400
C) 3800 D) 1900
E) None of these

Scan the QR code for Key

*These model questions were prepared by subject experts of **RACE Institute** Hyderabad*

విభజన హామీల పురోగతిపై 24న హోంశాఖ సమావేశం

ఈనాడు, దిల్లీ: విభజన చట్టం ప్రకారం తెలంగాణలో అమలుచేస్తున్న హామీల పురోగతిపై కేంద్ర హోంశాఖ ఈ నెల 24న సమీక్ష సమావేశం ఏర్పాటుచేసింది. కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశంలో విభజన చట్టంలోని 13వ షెడ్యూల్‌ను అనుసరించి రాష్ట్రంలో ఏర్పాటుచేసిన విద్యాసంస్థలు, మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిపై చర్చిస్తారు. సమావేశానికి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు కేంద్ర ఉన్నత విద్యాశాఖ, వ్యవసాయ, ఉక్కు, బొగ్గు, విద్యుత్తు, రహదారులు, రవాణా శాఖల కార్యదర్శులు, రైల్వే బోర్డు ఛైర్మన్లను అధికారులు ఆహ్వానించారు. ఈ సమావేశంలో గిరిజన, ఉద్యాన విశ్వవిద్యాలయాల పురోగతి, ఖమ్మం జిల్లాలో సమీకృత ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలు, 4 వేల మెగావాట్ల ఎన్టీపీసీ థర్మల్ విద్యుత్తు కేంద్రం, రైలు కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించనున్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రి అమిత్‌షాలను కలిసి విభజన సమస్యలు పరిష్కరించాలని కోరిన నేపథ్యంలో హోంశాఖ ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

పాత్రికేయులపై దాడులు అరికట్టాలి

● తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో పాత్రికేయులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్షుడు మామిడి సోమయ్య ఆధ్వర్యంలోని బృందం సోమవారం హైదరాబాద్‌లో శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్‌కు వినతిపత్రం సమర్పించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తమ ఫెడరేషన్ సభ్యుడిపై చందుర్తి పోలీసులు అక్రమ కేసు బనాయించి అరెస్టు చేశారని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో పాత్రికేయుడు సుదర్శన్‌పై దుండగులు దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారని పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించినవారిలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనంద్, పిల్లి రాంచందర్ తదితరులు ఉన్నారు.



దిల్లీలో ఇండియన్ సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేశ్

ఆంధ్రాలో పెట్టుబడులు పెట్టండి

● ఐసియా ప్రతినిధులకు ఏపీ మంత్రి లోకేశ్ ఆహ్వానం
● ఏపీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ ఏర్పాటు చేయండి
● కేంద్ర మంత్రి జయంత్ చౌధరికి వినతి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక విధానాన్ని అమల్లోకి తెచ్చి, అన్ని రకాల పరిశ్రమలకు అనువైన వాతావరణం నెలకొల్పుతున్నామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి సంస్థలను సాధించేందుకు సోమవారం ఆయన దిల్లీలో ఇండియన్ సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రతినిధులు, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌధరిలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. తొలుత ఐసీఈఏ ఛైర్మన్ పంకజ్ మహీంద్ర అధ్యక్షతన జరిగిన సెల్యులర్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో పాల్గొని ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చడానికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. తాము ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశంలోని రాష్ట్రాలతో మాత్రమే కాకుండా దిగ్గజ దేశాలతో పోటీపడుతున్నట్లు తెలిపారు. పేరొందిన పారిశ్రామికవేత్తలతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి పరిశ్రమల స్థాపనలో ఎదురవుతున్న విధానపరమైన సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల కోసం అనువైన విధానాన్ని రూపొందించి ప్రోత్సాహకాలు అందించబోతున్నామని.. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. విశాఖపట్నాన్ని ఐటీ పవర్‌హౌస్‌గా, అంతర్జాతీయ ఏఐ రాజధానిగా తీర్చిదిద్దాలని, తిరుపతిని ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మారాల్చన్న లక్ష్యసాధనకు సహకరించాలని సెల్యులర్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ప్రతినిధులను కోరారు.



కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌధరితో ఏపీ మంత్రి లోకేశ్

ఏపీలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయండి

ఆంధ్రప్రదేశ్ యువత నైపుణ్యాభివృద్ధి కోసం అమరావతి, విశాఖపట్నంలలో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలు ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేశ్ కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌధరిని కోరారు. ఆయన సోమవారం దిల్లీలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలిసి జయంత్‌చౌధరితో సమావేశమయ్యారు. 'ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో అమరావతిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్, స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్లను నెలకొల్పండి. విశాఖపట్నంలో కేటాయించిన ఏడెకరాల్లో జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయండి. మంగళగిరిలో జెమ్స్ అండ్ జువెలరీ, అమరావతిలో నిర్మాణ రంగం, కర్నూలులో పునరుత్పాదక ఇంధనం, చేనేత-హస్తకళలు, విశాఖపట్నంలో ఫార్మా ల్యాబ్స్, నెల్లూరు, తిరుపతిల్లో ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు చెందిన ఎక్సలెన్స్ సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర స్కిల్ కౌన్సిల్ నుంచి సహకారం అందించండి. గిరిజన ప్రభావిత ప్రాంతాల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు నిధులివ్వించండి' అని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏపీని ముంచిన వైకాపా సర్కారు

● వారు చేసిన అప్పుపై ఏటా కట్టాల్సిన వడ్డీయే రూ.75 వేల కోట్లు
● కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఆ రాష్ట్ర మంత్రి సత్యకుమార్ వివరణ



అమిత్ షాతో సమావేశమైన సత్యకుమార్ యాదవ్

ఈనాడు, దిల్లీ: ఏపీని జగన్ రూ.11 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిపోయారని.. ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం వాటిపై వడ్డీల రూపంలోనే ఏటా రూ.75 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వివరించారు. జగన్ ప్రభుత్వం చేసిన పాపాలను కూటమి ప్రభుత్వం కడగాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అమిత్ షాతో సోమవారం ఆయన సుమారు 20 నిమిషాలపాటు సమావేశమయ్యారు. మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, మంత్రిగా తాను చేసిన పనులను తెలిపారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను పక్కదారి పట్టించి, యూసీలు కూడా ఇవ్వలేదని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం యూసీలను సకాలంలో కేంద్రానికి పంపుతున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల వినియోగంపై వివరాలు అందజేశారు. ఆయుష్మాన్‌భారత్ అమలు తీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనివిధానంపై అమిత్ షా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

యాదాద్రి ప్రతిష్ఠకు భంగం కలిగేలా ఫొటోలు, వీడియోలు దిగొద్దు

● ఆలయ ఈవో భాస్కరరావు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగేలా, భక్తుల మనోభావాలు దెబ్బతినేలా, వ్యక్తిగత ప్రాబల్యం పెంచుకునే రీతిలో ఫొటోలు, వీడియోలు తీసుకోవడం సరికాదని దేవస్థానం ఈవో భాస్కరరావు సోమవారం ఒక ప్రకటన తెలిపారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రీల్స్ చేయడంపై మీడియాలో కథనాలు రావడంతో ఆయన స్పందించారు. ఇక ముందు ఆలయ పరిసరాల్లో ఫొటోలు, వీడియోల చిత్రీకరణ అంశంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. భక్తుల విశ్వాసం దెబ్బతినే విధంగా ఎవరూ ఫొటో, వీడియో చిత్రీకరణలు చేయొద్దని కోరారు.

121 రైల్వేస్టేషన్ల అభివృద్ధికి రూ.4,605 కోట్లు

● కేంద్రం నిర్ణయం: ద.మ. రైల్వే వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 121 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రూ.4,605 కోట్లు వ్యయంచేసేందుకు కేంద్రం తాజాగా నిర్ణయించిందని దక్షిణ మధ్య రైల్వే సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అమృత్ భారత్ స్టేషన్ స్కీం (ఏబీఎస్ఎస్) కింద ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడం, జనాభాకు అనుగుణంగా స్టేషన్లను అభివృద్ధిచేయడం, ఇప్పుడున్న స్టేషన్లను ఆధునికీకరించేందుకు ఈ నిధులు వినియోగిస్తామని పేర్కొంది. '2023 ఆగస్టు, 2024 ఫిబ్రవరి మధ్య కాలంలో ప్రధాని మోదీ ఈ పథకం కింద 108 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. వాటికి కొనసాగింపుగా మరికొన్ని స్టేషన్లను ఈ పథకం కిందకు తీసుకొచ్చాం. సికింద్రాబాద్, తిరుపతి, నెల్లూరు, రాజమండ్రి రైల్వే స్టేషన్ల అభివృద్ధితోపాటు జంట నగరాల పరిధిలో ఉన్న ఇతర రైల్ టెర్మినల్స్‌లో రద్దీని తగ్గించే చెర్లపల్లి శాటిలైట్ టెర్మినల్‌ను కూడా ఈ పథకం ద్వారానే అభివృద్ధి చేస్తున్నాం. యాత్రికుల రద్దీకి అనుగుణంగా తిరుచానూరు, తిరుపతి రైల్వే స్టేషన్ల మధ్య క్రాసింగ్ స్టేషన్లను అభివృద్ధి చేయనున్నాం' అని ద.మ.రైల్వే వివరించింది.

ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు 'రెడ్ అలర్ట్'

● బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం
● 24లోగా తీవ్ర తుపానుగా రూపాంతరం
● ఉత్తరాంధ్ర జిల్లాలపై ప్రభావం

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో తీవ్ర తుపాను ఏర్పడనున్న నేపథ్యంలో ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) రెడ్ అలర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో సోమవారం ఉదయం ఏర్పడిన అల్పపీడనం సాయంత్రానికి తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది మంగళవారం ఉదయానికి వాయుగుండంగా బలపడనుంది. బుధవారం నాటికి తుపానుగా, గురువారం నాటికి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందొచ్చని ఐఎండీ పేర్కొంది. గురువారం అర్ధరాత్రి లేదా శుక్రవారం తెల్లవారుజామున పూరీ (ఒడిశా), సాగర్ ద్వీపం (పశ్చిమ బెంగాల్) మధ్యలో తీరం దాటొచ్చని అంచనా వేస్తోంది. ఆ సమయంలో గంటకు గరిష్ఠంగా 120 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఇది తుపానుగా బలపడితే ఖతర్ సూచించిన 'దానా' పేరును పెట్టనున్నారు.

ఉత్తరాంధ్రకు భారీ వర్ష సూచన

తుపాను ప్రభావంతో ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలకు అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. శుక్రవారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ శాఖ సూచించింది. సోమవారం అనకాపల్లి, శ్రీసత్యసాయి, ప్రకాశం, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా అనకాపల్లి జిల్లా బలిఘట్టంలో రాత్రి 8 గంటల వరకు 85.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ప్రశ్నిస్తే కేసులు.. ఎదురు తిరిగితే దాడులు

● తండ్రి విశ్వరూప్ అధికారంతో ఏపీలో రెచ్చిపోయిన శ్రీకాంత్
● దళిత యువకుడి హత్య కేసులో సూత్రధారిగా నిర్ధారణ



ఆదివారం రాత్రి మదురైలో పోలీసుల అదుపులో శ్రీకాంత్

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం, పి.గన్నవరం: అధికార బలంతో, తండ్రి మంత్రి పదవిని అడ్డం పెట్టుకొని ఇష్టారాజ్యంగా ప్రవర్తించారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారిని ఇబ్బంది పెట్టడం.. దూషణలకు పాల్పడేవారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఏపీలోని డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ వ్యవహారశైలి ఇది. 2022 జూన్ 6న జరిగిన అయినవిల్లికి చెందిన దళిత యువకుడు, వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో ప్రధాన సూత్రధారి శ్రీకాంత్‌ను తమిళనాడులోని మదురైలో ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతేడాది అంబేడ్కర్ జయంతి సందర్భంగా కొందరు ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తొలగించి అమలాపురంలో ర్యాలీ చేయగా, నాలుగు వాహనాలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. వాటిని తమ వారికి ఇచ్చేయాలని శ్రీకాంత్ డీఎస్పీ మాధవరెడ్డిని కోరారు. ధ్రువపత్రాలతో రావాలని చెప్పడంతో ఆగ్రహంతో వెళ్లిన శ్రీకాంత్ తండ్రి విశ్వరూప్‌తోపాటు అనుచరులను తీసుకొని స్టేషన్‌కు వచ్చారు. 'మీరు అన్‌నెసెసరీ చేస్తున్నారు.. చలో అమలాపురానికి పిలుపునివ్వమంటారా? ఇంతకు వందరెట్లు పోలీసులను తెచ్చుకున్నా సరిపోరు' అంటూ విశ్వరూప్ డీఎస్పీపై ఆగ్రహించారు. పోలీసుల అనుమతి లేకుండానే వాహనాలను పట్టుకుపోయారు. అమలాపురం మండలం కామనగరువులో గతేడాది ఆగస్టు 31న శ్రీకాంత్ 'గడప గడపకు' కార్యక్రమం నిర్వహించారు. కోనసీమ జిల్లా పేరు మార్పు విషయంలో తమను అన్యాయంగా కేసుల్లో ఇరికించారని పలువురు యువకులు ఆయన్ను నిలదీశారు. దీంతో ఆ ముగ్గురు యువకులను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి రాత్రయినా పంపలేదు. స్థానికుల ఆందోళనతో అర్ధరాత్రి విడిచిపెట్టి కేసులు పెట్టారు. తాను కాబోయే ఎమ్మెల్యేనంటూ శ్రీకాంత్ ప్రచారం చేసుకున్నారు. ఉద్యోగుల నియామకాలు, బదిలీల్లో సైతం జోక్యం చేసుకునేవారనే ఆరోపణలున్నాయి.

చట్టం తన పని తాను చేసుకుపోతుంది

● మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడి అరెస్టుపై ఏపీ మంత్రి సుభాష్



రామచంద్రపురం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లికి చెందిన వాలంటీరు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈ కేసులో మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేయడం వెనుక తన ప్రోద్బలం లేదని స్పష్టం చేశారు. విశ్వరూప్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఖండించారు. రామచంద్రపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "విశ్వరూప్ కుమారుడైన పినిపె శ్రీకాంత్‌కు దుర్గాప్రసాద్ ప్రధాన అనుచరుడు. ఆయన హత్య తర్వాత బాధిత కుటుంబానికి శ్రీకాంత్ రూ.లక్ష సాయం చేసి, హతుడి భార్యను ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లారు. రెండు ఎకరాల పొలం ఇస్తామని, కేసు పెట్టవద్దని విశ్వరూప్ బాధిత కుటుంబాన్ని బతిమిలాడారు. మృతుడి భార్య ఇద్దరు పిల్లలతో నా వద్దకు వచ్చారు. చట్టపరంగా న్యాయం చేస్తానని చెప్పి.. ఆమెను ఐజీ, డీఐజీల వద్దకు తీసుకెళ్లా. దుర్గాప్రసాద్‌ను ఫోన్ చేసి పిలిచి, చంపేశారని ఆయన భార్య చెబుతున్నారు. విచారణలో పూర్తి వాస్తవాలు తెలుస్తాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ కేసును ఎందుకు మూసేశారో చెప్పాలి. కోనసీమ అల్లర్లలో నేను ప్రధాన ముద్దాయినంటూ విశ్వరూప్ అసత్యాలు చెబుతున్నారు. ఆ కేసును వైకాపా ప్రభుత్వంలోనే కొట్టేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట ప్రకారం మేము కక్షపూరిత చర్యలకు పాల్పడబోము. న్యాయపరంగానే ముందుకెళ్తాం' అని వివరించారు.

అప్పట్లో ఈ కేసు దర్యాప్తు సక్రమంగా జరగలేదు: మంత్రి లోకేశ్

'రాష్ట్రంలో హింసను గత ప్రభుత్వం పెంచి పోషించింది. అందుకే ఈ హత్యకేసు దర్యాప్తు సక్రమంగా జరగలేదు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మృతుడి కుటుంబసభ్యులు ధైర్యం చేశారు. తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది' అని ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ వివరించారు.

నలుగురు ఐఏఎస్‌లపై బెయిలబుల్ వారెంట్

● కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: నిర్దేశిత సమయంలో కోర్టు ఆదేశాలను అమలు చేయకపోగా, విచారణకు గైర్హాజరైన నలుగురు ఐఏఎస్ అధికారులపై హైకోర్టు బెయిలబుల్ వారెంట్ (బీడబ్ల్యూ) జారీ చేసింది. హైకోర్టు రిజిస్ట్రీ వారెంట్‌ను అమలు చేసేందుకు విచారణను నవంబరు 27కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఉత్తర్వులిచ్చారు. బీడబ్ల్యూ జారీ అయిన వారిలో అప్పటి జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్, కాకినాడ జిల్లా కలెక్టర్ (ఇరిగేషన్ వింగ్) కృతికా శుక్లా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ (ఇరిగేషన్ వింగ్) హిమాన్షు శుక్లా, జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ డీవీ రామ్‌గోపాల్ ఉన్నారు. కాలువ గట్లపై కలుపు మొక్కలు ఇతర వ్యర్థాలను తొలగించినందుకు పీవీఆర్ స్ట్రక్చర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ పి.శ్రీహర్షకి రూ.66.36 లక్షలు చెల్లించాలని అధికారులను ఆదేశిస్తూ గతేడాది డిసెంబరులో హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. వాటిని అమలు చేయకపోవడంతో ఆ సంస్థ ఎండీ హైకోర్టులో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం వేశారు. సెప్టెంబరు 3న విచారణ జరిపిన న్యాయమూర్తి.. అక్టోబరు 15లోపు కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని, విఫలమైతే అధికారులు 15న కోర్టు విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. అక్టోబరు 15న విచారణకు జలవనరుల శాఖ ధవళేశ్వరం ఏఈ జి.శ్రీనివాసరావు హాజరయ్యారు. మిగిలిన ప్రతివాదులు హాజరుకాకపోవడంపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై బీడబ్ల్యూ జారీ చేశారు.

ఏపీలో 1,962 గిరిజన ఆవాసాలకు రోడ్లు

● గిరిజన సంక్షేమశాఖ సమీక్షలో ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు

ఈనాడు, అమరావతి: దశాబ్దాలుగా గిరిజనులను వెంటాడుతున్న డోలీ కష్టాల నుంచి వారికి విముక్తి కలిగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. కొండలు, కోనల మధ్య రాళ్లురప్పలపై నడుస్తూ వారు పడుతున్న అవస్థల్ని దూరం చేసేందుకు రూ.1,200 కోట్లతో 1,962 మారుమూల గిరిజన గ్రామాలకు అనుసంధాన రహదారులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీన్ని అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా తీసుకుని, ఏడాదిలోనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీనికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. తాగునీటి కష్టాలు తీర్చేందుకు గిరిజన ప్రాంతాల్లో ఉన్న రిజర్వాయర్ల నుంచి అన్ని గ్రామాలకు పైప్‌లైన్లు వేసి, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. సిగ్నలింగ్ సమస్య తీరేలా గిరిజన ఆవాస ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన 1,000 మొబైల్ టవర్లను జనవరి నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఐటీడీఏల్లోని వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లోని విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా ఆహారాన్ని అందించాలని నిర్ణయించారు. సచివాలయంలో గిరిజన సంక్షేమశాఖపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మూడు నెలల్లో శాఖాపరంగా సాధించిన పురోగతిపై అధికారులను అభినందించారు.

కాస్మొటిక్స్ వస్తువులను నేరుగా అందించాలి

కాస్మొటిక్ ఛార్జీలను ఇకపై తల్లుల ఖాతాల్లో వేయకుండా.. ఆ మొత్తంతో సబ్బు, దువ్వెన, నూనె, షాంపూ, పౌడర్, ఇతర కాస్మొటిక్స్ వస్తువులను కొని విద్యార్థులకు నేరుగా అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. వీటిని గిరిజన సహకార సంస్థ ద్వారా సరఫరా చేయాలని స్పష్టం చేశారు.

మరో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు

'గిరిజన ప్రాంతాల్లో కాఫీ సాగును మరో లక్ష ఎకరాలకు విస్తరించాలి. పూర్తి సేంద్రియ సాగును ప్రోత్సహించాలి. గిరిజనులకు ప్రభుత్వం అందించే ప్రతి లబ్ధి చేకూరేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలి. బియ్యం కార్డు, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, ఆరోగ్యకార్డు, బ్యాంకు ఖాతా, ఇల్లు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్డి, తదితర సౌకర్యాలన్నీ ఉన్నాయా లేదా అని ఇంటింటి సర్వే నిర్వహించాలి. డిసెంబరు నెలాఖరుకల్లా పూర్తి చేయాలి' అని సీఎం ఆదేశించారు.

నంద్యాల పర్యటన వ్యక్తిగతం

● స్నేహితుడి ఇంటికి వెళ్లడం కోడ్ ఉల్లంఘన కిందకు రాదు
● మాపై అధికారులు నమోదు చేసిన కేసును కొట్టేయండి
● ఏపీ హైకోర్టులో నటుడు అల్లు అర్జున్, మాజీ ఎమ్మెల్యే రవిచంద్ర కిశోర్‌రెడ్డి వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: ఎన్నికల సందర్భంగా అధికారులిచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించారంటూ నంద్యాల రెండో పట్టణ ఠాణా పోలీసులు మే 11న తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ సినీనటుడు అల్లు అర్జున్, మాజీ ఎమ్మెల్యే రవిచంద్ర కిశోర్‌రెడ్డి ఏపీ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ కేసులో తదుపరి చర్యలను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. నంద్యాల రెండో పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్, డిప్యూటీ తహసీల్దార్/2024 సాధారణ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఇన్‌ఛార్జి పి.రామచంద్రరావును ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యం సోమవారం జాబితాలో ఉన్నప్పటికీ.. కోర్టు సమయం ముగియటంతో విచారణకు నోచుకోలేదు. దీంతో బుధవారానికి వాయిదా పడింది. రవిచంద్ర కిశోర్‌రెడ్డి ఇంటికి సినీనటుడు అల్లు అర్జున్ వచ్చారని, దీంతో ఆయన్ను చూసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు చేరారని.. ఇది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమేనని డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రరావు మే 11న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్జున్ నంద్యాల వచ్చేందుకు ముందస్తు అనుమతి తీసుకోలేదని పేర్కొన్నారు. దీంతో అల్లు అర్జున్, అప్పటి వైకాపా నంద్యాల ఎమ్మెల్యే రవిచంద్ర కిశోర్‌రెడ్డిపై పోలీసులు ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు నమోదు చేశారు. తామిద్దరం చాలా ఏళ్లుగా కుటుంబ స్నేహితులమని పిటిషన్లో వారు పేర్కొన్నారు. తాను నంద్యాలలోని కిశోర్‌రెడ్డి ఇంటికి వెళ్లడం వ్యక్తిగత పర్యటన అని.. ఆయన ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున అభినందించేందుకు వెళ్లానని అర్జున్ తెలిపారు. బహిరంగ సభ నిర్వహించే ఉద్దేశం లేదన్నారు. వ్యక్తిగత సందర్శన కోడ్ ఉల్లంఘన కిందకు రాదని, తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరారు.

తండ్రి కారణంగా పెళ్లి కావడం లేదని కడతేర్చిన తనయుడు

● అనారోగ్యంతో చనిపోయినట్లుగా చిత్రీకరణకు యత్నం
● అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా గాయాలను గుర్తించిన బంధువులు



అమృతం

నవీపేట, న్యూస్‌టుడే: తండ్రి తీరుతో తనకు పెళ్లి కావడం లేదన్న కక్షకు తోడు.. ఆస్తి దక్కించుకోవాలన్న దుర్బుద్ధితో కుమారుడు ఆయన్ను కిరాతకంగా హత్య చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం అనంతగిరిలో సోమవారం తెల్లవారుజామున వెలుగు చూసింది. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్‌కుమార్, ఎస్సై వినయ్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గౌరు అమృతం(54) పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేసేవారు. ఆయనకు కుమారులు మహిపాల్, మనోజ్ ఉన్నారు. కుటుంబ కలహాలతో భార్య చాలా ఏళ్ల క్రితమే పిల్లలతో సహా ఇంటి నుంచి వెళ్లిపోయి మాక్లూర్ మండలం గొట్టుముక్కలలో ఉంటున్నారు. కుమారులిద్దరూ బతుకుదెరువు నిమిత్తం కొంతకాలం కిందట దుబాయ్ వెళ్లారు. పెద్దకుమారుడు మహిపాల్ తన తండ్రి చనిపోయాడని దుబాయ్‌లో పని చేస్తున్న చోట అబద్ధం చెప్పి పది రోజుల కిందట అనంతగిరికి వెళ్లి తండ్రి వద్దే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి ఇద్దరూ ఇంట్లోనే మద్యం తాగారు. ఈ క్రమంలో మత్తులో ఉన్న అమృతం మెడకు టవల్ బిగించి హత్య చేశాడు. సోమవారం ఉదయం ఏమీ తెలియనట్లుగా ఓ ఆర్ఎంపీని ఇంటికి రప్పించి ఆరోగ్యం బాగోలేక తన తండ్రి చనిపోయాడని చెప్పాడు. గ్రామస్థులకూ అదే చెప్పి నమ్మించి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశాడు. మృతదేహానికి స్నానం చేయిస్తుండగా మెడకున్న గాయాలను అమృతం సోదరి, బంధువులు గుర్తించి అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు చేరుకుని మహిపాల్‌ను విచారించగా తానే హతమార్చినట్లు అంగీకరించాడు. 'మా అమ్మతో వేరుపడటం, నిత్యం మద్యం తాగుతుండటం కారణంగానే నాకు పెళ్లి కావడం లేదని తండ్రి అమృతంపై కక్ష పెంచుకున్నాను. అలాగే అతని పేరిట ఉన్న ఇల్లు, ప్లాటు విక్రయించి తల్లి పేరిట అనంతగిరిలో ఇల్లు కట్టాలన్న ఉద్దేశంతో హత్య చేశాను' అని చెప్పాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏపీ మాజీ ఎంపీ ఎంవీవీ మెడకు ఈడీ ఉచ్చు

● రూ. 150 కోట్లకుపైగా ఆర్జన
● ఈడీ దర్యాప్తులో వెలుగులోకి

ఈనాడు-విశాఖపట్నం: వైకాపా నేత, విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మెడకు ఈడీ ఉచ్చు బిగుసుకుంటోంది. విశాఖలో వృద్ధులు, అనాథలకు సేవ చేయడానికి కేటాయించిన 'హయగ్రీవ' భూములను వైకాపా నేతలు అన్యాక్రాంతం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజా దర్యాప్తులో తేల్చింది. ఎంవీవీ, ఆయన ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు(జీవీ), మేనేజింగ్ పార్ట్‌నర్ గద్దె బ్రహ్మాజీలు మోసపూరితంగా 'హయగ్రీవ ప్రాజెక్టు'ను స్వాధీనం చేసుకుని తప్పుడు పత్రాలతో బినామీ లావాదేవీలు జరిపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎండాడలోని హయగ్రీవ ప్రాజెక్టుకు సంబంధించిన 12.51ఎకరాల భూమిని తమ నుంచి మోసపూరితంగా లాక్కున్నారంటూ ఈ ఏడాది జూన్ 22న చిలుకూరి జగదీశ్వరుడు, ఆయన భార్య రాధారాణి ఆరిలోవ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం ఉల్లంఘనపై ఈడీ దర్యాప్తును ఈ నెల 19న ఆరంభించింది. దాదాపు 24 గంటలపాటు ఐదు చోట్ల ఎంవీవీ, జీవీల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు చేసి సోదాలు నిర్వహించింది. సోమవారం ఈడీ సబ్‌జోనల్ కార్యాలయం దాడుల వివరాలు వెల్లడించింది. '2008లో హయగ్రీవ ఫామ్స్ డెవలపర్స్ సంస్థకు వృద్ధులు, అనాథల కాటేజీల కోసం ఎండాడలో భూమిని ప్రభుత్వం తక్కువ ధరకు కేటాయించింది. 2010లో 'హయగ్రీవ' రూ.5.63 కోట్లు చెల్లించగా, రిజిస్ట్రేషన్ నాటికి ఆ ఆస్తి విలువ రూ.30.25 కోట్లుగా ఉన్నట్లు గుర్తించాం. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.200 కోట్లపైగా విలువ ఉన్న ఈ భూమిని ఎంవీవీ, జీవీ ఫోర్జరీ సంతకాలు, డాక్యుమెంట్ల ద్వారా స్వాధీనం చేసుకున్నారు. 2021 నుంచి ప్లాట్లుగా విభజించి వివిధ వ్యక్తులకు తప్పుడు పత్రాలతో విక్రయించారు. ఇలా అమ్మిన ప్లాట్లతో నేరపూరితంగా రూ.150 కోట్లకుపైగా ఆర్జించారు' అని పేర్కొంది.

◆ ఈడీ సోదాల్లో 300పైగా స్థిరాస్తుల విక్రయ దస్తావేజులు ఎంవీవీ, జీవీ కుటుంబ సభ్యుల పేరు మీద గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్థిరాస్తుల కొనుగోలు (సేకరణకు సంబంధించి) రూ.50 కోట్ల వరకు నగదు లావాదేవీలు జరిగినట్లు ఈడీ వెల్లడించింది.

◆ ఈ డిజిటల్ పరికరాలతోనే నకిలీ పత్రాలు తయారు చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ సమయంలో స్థిరాస్తి లావాదేవీల కోసమే జీవీ, ఎంవీవీ భార్య, కుమారుడు ఒకచోటకు వచ్చారని, ఆ పంచాయితీ కాస్తా కిడ్నాప్‌గా మారిందన్న విమర్శలకు ఈ డిజిటల్ పరికరాలు, నేరపూరిత పత్రాలు దొరకడం బలం చేకూరుస్తోందనే చర్చ సాగుతోంది.